
పురాణములు

# బ్రహ్మవైవర్త మహాపురాణము-బ్రహ్మాఖండము




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో భాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఊవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!



ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణము

## బ్రహ్మఖండము

"కాయేన మనసా వాచా పరంభక్త్యా దివానిశమ్ ।
భజ సత్యం పరంబ్రహ్మ రాధేశం త్రిగుణాత్పరమ్ ॥"


రచయిత:
"పౌరాణికరత్న"
శ్రీ మట్టుపల్లి శివసుబ్బరాయ గుప్త

పరిష్కర్త:
'పండితకవిప్రియ'
బ్రహ్మశ్రీ చతుర్వేది అమరేశ్వరశాస్త్రి



ప్రకాశకులు:
శ్రీ మట్టుపల్లి జగన్నాథం
గుంటూరు.



సర్వస్వామ్య సంకలితము]



[మేలుప్రతి రూ. 15-00

శ్రీ రస్తు ఓం నమః శుభ మస్తు

శ్రీగణేశ్వరాయ నమః

# ప్రస్తావన

శుద్ధతేజస్స్వరూపం చ భక్తానుగ్రహవిగ్రహం ।
అతీవకమనీయం చ శ్యామరూపం నమామ్యహమ్ ॥
పరిపూర్ణతమం శాన్తం రాధాకాన్తం మనోహరమ్ ।
సత్యం బ్రహ్మస్వరూపం చ నిత్యం కృష్ణం నమామ్యహమ్ ॥

"శుద్ధతేజస్స్వరూపుడు, భక్తానుగ్రహవిగ్రహుడు, అత్యంతసుందరుడు, శ్యామరూపుడు, పరిపూర్ణతముడు, శాంతస్వరూపుడు, శ్రీరాధాకాన్తుడు, మనోహరుడు, సత్యస్వరూపుడు, పరబ్రహ్మము, నిత్యుడు నైన శ్రీకృష్ణునకు నమస్కరించుచున్నాను".

పురాణము లార్యజాతిసర్వస్వములు. ఇవి యార్యసాహిత్యప్రాసాదమున కాధారస్తంభములు. ప్రాచీనేతిహాసమందిరమునకు స్వర్ణకలశములు. వివిధవిజ్ఞానసముద్రములలో సంచరించు నౌకలకు ప్రకాశస్తంభములు, మానవసమాజమునకు సంస్కృతీమార్గమును జూపు దివ్యము లైనవెలుగులు, ఆర్యజాతి యనాదికాలమునుండి కూడబెట్టుకొనిన విద్యలకు దృఢము లైన మంజూషికలు.

నేడు ప్రపంచమున వృద్ధిపొందుసర్వవిద్యలకు మూలము మనపురాణములలో లభించును. కనుకనే నేటికిని హిందూజాతికి పురాణములపై నెంతయో యాదరము కలదు. భారతీయసంస్కృతి యీపురాణములమీదనే యాధారపడియున్న దనిచెప్పకతప్పదు. ఈవిషయమును గమనించియే చారిత్రకవేత్తలు 'పురాణములు లేనిదె ప్రాచీనభారతీయచరిత్రను, సంస్కృతిని దెలిసికొనుట కష్ట' మని కంఠోక్తిగ జెప్పసాగిరి. వైదేశికవిద్వాంసులవలన లభించిన పూర్వ

సంస్కారమువలన నేటికిని పురాణములలోని కొన్ని విషయములను నంగీకరించుటకు భారతీయచారిత్రకులు సందేహముల వెలిబుచ్చుచున్నారు. అన్వేషణప్రవృత్తి వృద్ధియైనకొలది పురాణోక్తము లైనచారిత్రకవిషయముల నైర్మల్యము స్పష్టమగు ననితలంపవచ్చును.

యాజ్ఞవల్క్యుడు మున్నగుమహర్షులు విద్యలను లెక్కించుసమయమున పురాణవిద్యకు ప్రథమస్థాన మొసంగిరి.

"పురాణన్యాయమీమాంసా ధర్మశాస్త్రాంగమిశ్రితాః ।
వేదాః స్థానాని విద్యానాం ధర్మస్య చ చతుర్దశః ॥ "

"అనగా పురాణము, న్యాయము, మీమాంస, ధర్మశాస్త్రము, షడంగములు, చతుర్వేదములు- అనునీపదునాలుగును విద్యలకు, ధర్మమునకు స్థానము లైయున్నవి".

స్మృతులు, సూత్రములు, మహాభాష్యము, న్యాయభాష్యము మున్నగు సర్వప్రాచీనగ్రంథములలోను బురాణచర్చ లభించుచున్నది. ఇంతేకాక వేదములయందలి బ్రాహ్మణభాగములలోను, సంహితాభాగములలోను బురాణనామము లభించుచున్నది. అథర్వవేదసంహితలో రెండుచోట్ల పురాణశబ్దము ప్రయోగింపబడినది.

"ఋచః సామాని ఛన్దాంసి పురాణం యజుషా సహ ।
ఉచ్ఛిష్టాజ్జజ్ఞిరే సర్వే దివిదేవా దివిశ్రితాః ॥"

సర్వము నశించినపిమ్మట మిగిలియుండు పరమాత్మనామము 'ఉచ్ఛిష్టము'. దానినుండియె ఋక్కులు, సామములు, ఛందములు, పురాణములు, యజుర్వేదముతోపాటు ఉత్పన్నములైనవి.

ఇట్లే బృహదారణ్యకమునందును, ఛాందోగ్యమునందును బురాణశబ్దము లభించుచున్నది.

పాద్మ, శివ, వాయుపురాణములలో బురాణశబ్ద మిట్లువివరింపబడినది-

యో విద్యాచ్చతురో వేదాన్ సాంగోపనిషదో ద్విజః ।
న చేత్పురాణం సంవిద్యాత్ నైవ స స్యాద్విచక్షణః ॥
ఇతిహాసపురాణాభ్యాం వేదం సముపబృంహయేత్ ।
బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం ప్రహరిష్యతి ॥

యస్మాత్ పురా హ్యనక్తీదం పురాణం తేన తత్స్మృతమ్ ।
నిరుక్తమస్య యో వేద సర్వపాపైః ప్రముచ్యతే ॥

"అంగములతోను, ఉపనిషత్తులతోనుగూడ నాలుగువేదముల నధ్యయనముచేసియు బురాణము నెఱుగజాలకపోయినచో బ్రాహ్మణుడు విచక్షుడు కాజాలడు. ఏలయన, ఇతిహాసపురాణములవలననే వేదమునకు బుష్టిగలిగింపవలెను. ఇంతేకాదు పురాణజ్ఞానరహితు డగునల్పజ్ఞునివలన వేదములు భయపడుచుండును. ఏలయన, నిట్టివ్యక్తివలననే వేదమున కవమానము కలుగును. అత్యంతప్రాచీనములు, వేదములను స్పష్టముచేయునవి యగుటచేతనే వీనికి పురాణ మనుపేరువచ్చినది. పురాణముయొక్క యీవ్యుత్పత్తిని దెలిసికొనినవాడు సర్వపాపములనుండి ముక్తుడగును".

పురాణములయనాదిత్వమునుగూర్చి ప్రాచీనతనుగూర్చి, వాయు, బ్రహ్మాండ, శివపురాణము లిట్లుప్రవచించినవి-

"ప్రథమం సర్వశాస్త్రాణాం పురాణం బ్రహ్మణాస్మృతమ్ ।
అనంతరం చ వక్త్రేభ్యో వేదాస్తస్య వినిర్గతాః ॥"

"బ్రహ్మదేవుడు శాస్త్రము లన్నింటిలోను మొదట పురాణములనే 'సుప్తప్రతిబుద్ధన్యాయము' ననుసరించి స్మరించెను, పిమ్మట ఆయన నాలుగు ముఖములనుండి నాలుగువేదములు ప్రకటములైనవి".

ద్వాపరయుగమున వేదవ్యాసమహర్షి యితరభారతీయ వాఙ్మయముతో పాటు ఈపురాణసంహితనుగూడ సంపాదించెను. పదునెనిమిదిభాగములుగ నున్న యీపురాణసంహిత పదునెనిమిది పురాణనామములతో బిమ్మట విభజింపబడినది.

సర్వ పురాణములలోను నీక్రింది నైదులక్షణములు సాధారణముగ గనబడును-

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ ।
వంశానుచరితం చైవ పురాణం పంచలక్షణమ్ ॥

సర్గము, సృష్టివిజ్ఞానము, ప్రతిసర్గము, సృష్టివిస్తారము, లయము, మరల సృష్టివంశము అనగా సృష్టియందలి ఆదివంశావళి, మన్వంతరము, కాలక్రమము, వంశానుచరితము అనగా రాజుల వంశావళులు కలది పురాణము.

ప్రస్తుత శ్రీమద్బ్రహ్మవైవర్తమహాపురాణము పదునెనిమిదిపురాణములలో నొకటి. ఇది వైష్ణవపురాణము. దీనిమొదటి యర్థభాగమున మూడుఖండము లున్నవి. 1. బ్రహ్మఖండము (దీనిలో 30 అధ్యాయములున్నవి). 2. ప్రకృతి ఖండము (దీనిలో 67 అధ్యాయములు గలవు). 3. గణపతిఖండము (దీనిలో 46 అధ్యాయములున్నవి). దీనిలోని మిగిలినసగభాగము శ్రీకృష్ణజన్మఖండము. దీనిలో బూర్వార్ధము, ఉత్తరార్ధమునని రెండుభాగములున్నవి. ఈరెండింటిలో వరుసగ 54, 79 అధ్యాయములు గలవు. కొన్ని పురాణములలో నిది సౌర పురాణ మనియుజెప్పబడినది. కాని విషయదృష్టితో నిది సంపూర్ణముగ వైష్ణవపురాణముగనే తెలియబడుచున్నది. స్కందపురాణము ననుసరించి యీ పురాణము సూర్యభగవానుని మహత్త్వమును బ్రతిపాదించుచున్నది. మత్స్య పురాణము ననుసరించి యిది బ్రహ్మయొక్క ప్రాధాన్యమును వెల్లడిచేయు చున్నది.

కృష్ణస్తోత్రములు, గంగాస్తోత్రములు, దానవిధులు, శ్రీకృష్ణుడు నందున కుపదేశించినగీత, యముడు సావిత్రి కుపదేశించినగీత, ఏకాదశీ మాహాత్మ్యము, గణేశకవచము, పరశురామునకు శంకరు డుపదేశించిన విషయ ములు, రాధోద్ధవ సంవాదము మున్నగు చిన్నచిన్న గ్రంథములుగూడ నీబ్రహ్మ వైవర్తపురాణమున నిహితములై యున్నవి.

ప్రస్తుతఖండము బ్రహ్మఖండము. దీనిలో శ్రీకృష్ణుడు పరమాత్మ యనియు, ఆయనయె సమస్తజగత్తునకు గారణమనియు జెప్పబడినాడు. సృష్టి విషయము, నారదజన్మవృత్తాంతము, మాలావతీకృతమహాపురుషస్తోత్రము, బ్రహ్మాండపావన మనుశ్రీకృష్ణకవచము, శ్రీసంసారపావన మనుశివకవచము, శివుడు నారదున కుపదేశించినపరబ్రహ్మ నిరూపణవిషయము, శ్రీనారాయణ ఋషికృత శ్రీభగవత్స్తవరాజము మున్నగు ననేకవిషయములు గలవు.

ఇట్టి యీబ్రహ్మవైవర్తమహాపురాణమును భాషాంతరీకరించుటయన్న సామాన్యవిషయముకాదు. ఈవిషయమున నావంటిసామాన్యవ్యక్తినిగూర్చి యికచెప్పునదేమి ? కాని యీమహాగ్రంథానువాదము కేవలము భగవదను గ్రహముచేతనే సాగినది. ఇచట నా విషయము కొంతప్రస్తావించుట సము చిత మని భావించుచున్నాను.

1976 జనవరి 22వ తేదీనాటి తెల్లవారుజామున స్వప్నములో సచ్చిదానందస్వరూపుడు, అష్టభుజుడు నగు శ్రీకృష్ణభగవానుడు దర్శనమొసంగి తనకు తననామమునకు, రూపమునకు, ధామమునకు, చరితమునకు భేదము లేదనియు, శ్రీమద్బ్రహ్మవైవర్తమే తాననియు, దాని నాంధ్రీకరించి ప్రచార మొనరింపవలసినదనియు నన్నాదేశించెను. అంతేకాక మద్గతచిత్తుడవు, మద్భక్తుడవు, నన్నే పూజించువాడవు, మత్పరాయణుడవు కావలసిన దనియు మేఘగంభీరస్వరముతో బలికి యంతర్ధానముచెందెను. సామాన్యుడ నగునే నెక్కడ ? భగవదభిన్నస్వరూప మైనశ్రీమద్బ్రహ్మపురాణమెక్కడ యని మిన్నకుంటిని. ఈస్వప్నమువచ్చిన సరిగ నెలరోజులతరువాత అనగా ఫిబ్రవరి 22వ తేదీనాడు నాకు స్కూటరు ప్రమాదము సంభవించి కుడిచేయి విరిగి పోయినది. చికిత్సాలయమున 'ఆపరేషన్' నిమిత్తమై చేర్చబడితిని. 24 వ తేదీన ఆపరేషన్ థియేటరులో నాపరిస్థితి విషమించినది. ఉదయము 6 గంటల నుండి మధ్యాహ్నము 2 గంటల వఱకు ప్రముఖులైనపలువురు డాక్టర్లు నా ప్రాణములను రక్షించుటకు మిగుల ప్రయత్నించి నాయందాశలు వదలిరి. అట్టి సమయమున నష్టభుజయుక్తుడైన శ్రీకృష్ణపరమాత్మ మరల సాక్షాత్కరించి వెనుకటి తనయాదేశమును జ్ఞాపకము చేసి, వెంటనే శ్రీమద్బ్రహ్మవైవర్త మహాపురాణము నాంధ్రీకరింపవలసినదిగా నాదేశించి యతర్హితుడయ్యెను.

భగవన్నామస్మరణ మొనరించుచు లేచికూర్చుంటిని. మరణాసన్నుడ నైననేను పునర్జీవితుడనగుట కాంచి వైద్యులతోగూడ బంధుమిత్రు లందఱు హర్షామోదములనందిరి.

పిమ్మట మూలసంస్కృతగ్రంథమును పూనానుండి తెప్పించి అనువా దముచేయసాగితిని. భగవత్కృపవలన నాలుగుమాసములలో తదేకదీక్షతో గ్రంథానువాదమును బరిసమాప్తమొనరించితిని. అనంతరము భగ్నమైననా దక్షిణకరము యథాస్థితి నొందినది.

'మాతృదేవోభవ, పితృదేవోభవ' అను సూక్తుల ననుసరించి భగవ త్సేవాకింత మైననా కీజన్మము నిచ్చిన నాతల్లిదండ్రు లగు శ్రీమతి వేంకట మహాలక్ష్మమ్మ శ్రీజగన్నాథముగార్ల కాజన్మాంతము నేను ఋణపడి యున్నాను. దానశీలురు, జ్ఞానవైరాగ్యసంపన్నులు, పుణ్యమూర్తులు, భగవద్భక్తి

యుతులు నగువారియనుగ్రహవిశేషముచే నా కీమహత్కార్య మొనరించు యదృష్టము లభించిన దనిచెప్పికొనుట కెంతయో గర్వపడుచున్నాను.

ఆధ్యాత్మికచింతనలోను, గ్రంథానువాదములోను నెట్టి యాటంకములు కలుగకుండగ నత్యంతాదరముతో నా కనేకవిధముల సహకరించిన నా శ్రీమతి శ్యామసుందరికి, కుమారు లగు'యదువీర రంగధామ్, శ్రీనివాసశరణ్, నాగమల్లికార్జును'లకు శ్రీకృష్ణభగవాను డాయురారోగ్యైశ్వర్యాదులను బ్రసాదించుగాక!

పుత్రికాసంతానరహితుడ నగునా యనేకజన్మల సుకృతవశమున నేటి కాలమునకు శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణకన్య మాయింట జన్మించినది. ఇట్టియీమెను శేషాచలవాసుడు, విమలరవికోటిసంకాశుడు, సర్వజగన్నివాసుడు, కలితలక్ష్మీశుడు నగుశ్రీవేంకటేశ్వరవిభునకు సమర్పించుకొనుచున్నాను. ఇట్టి దేవాదిదేవుడు నా కల్లుడుగ లభించి నన్ను, నావంశమును చరితార్థ మొనరించినాడు. అట్టి యనంతకల్యాణగుణనిలయు డగుశ్రీవేంకటేశ్వరస్వామి కనన్యభక్తితో సాష్టాంగదండప్రణామము లర్పించుచున్నాడ. బ్రహ్మ కడిగిన నా దేవాదిదేవుని దివ్యచరణారవిందములను కడిగి కన్యాదాన మొనరించిన నా సౌభాగ్యము నేమని చెప్పికొనగలను ?

నాయీ మహత్కార్యమునకు దోడ్పడినమహనీయు లెందఱో గలరు. వారిలో బ్రథములు 'పండితకవిప్రియ'బిరుదాంచితులు, అగ్రహారోపహారేత్యాత్యాదిబహుగ్రంథకర్తలు, బహుగ్రంథపరిష్కర్తలు నగుబ్రహ్మశ్రీ చతుర్వేది అమరేశ్వరశాస్త్రిగారు. వారికృషి బహుధా ప్రశంసనీయము. వారికి నా హృదయపూర్వక నమస్సులు.

లాక్షణికశిరోమణులు, దర్శనాచార్యులు, మహోపాధ్యాయులు, అభినవపండితరాయలు, అభినవభారతి మున్నగుననేకబిరుదాంచితులు; నాట్యవేదము, భావప్రకాశము, ఏకావళి, ప్రతాపరుద్రీయము, నవరసగంగాధరము, నృత్తరత్నావళి మున్నగుబహుగ్రంథకర్తలునగుబ్రహ్మశ్రీ జమ్ములమడక మాధవ రామశర్మగారు నా కీగ్రంథానువాదసమయమున నెన్నియోసలహాల నొసంగిరి. దురూహము లగువిషయముల నెన్నింటినో నాకు వివరించిచెప్పిరి. వారి యీ సాహాయ్యము మరువజాలనిది. వారికి నాహృదయపూర్వకనమస్సులు.

శ్రీశంకరాచార్యులు, నృసింహపురాణము, శైవధర్మము, శ్రీమద్భాగవతము, శ్రీకృష్ణోద్ధవసంవాదము మున్నగు బహుగ్రంథకర్త లగుశ్రీజన్నాభట్ల వాసుదేవశాస్త్రిగారు ఈగ్రంథముద్రణమునందును, భాషావిషయమునందును, ననేకవిధము లగుసలహాలనిచ్చుచు నెంతగనో తోడ్పడిరి. వారికి నాహృదయ పూర్వక ధన్యవాదములు.

నా యనువాదమును సుందరముగను, నిర్దుష్టముగను వ్రాసిన చిరంజీవి ఎల్లాప్రగడ రంగనాయకుల కాయురారోగ్యములను ప్రసాదించుగాక యని శ్రీకృష్ణభగవానుని ప్రార్థించుచున్నాను.

అయాచితముగనే గ్రంథముద్రణమున కార్థికసాహాయ్య మొనరించిన సహృదయుల కందఱకు నా మనఃపూర్వకధన్యవాదములు. వారికి శ్రీకృష్ణ భగవాను డాయురారోగ్యైశ్వర్యాదులను ప్రసాదించుగాక!

ఈమహాగ్రంథమును నిర్దుష్టముగ సకాలములో ముద్రించి యిచ్చిన 'రఘు ప్రింటింగ్ వర్క్సు' అధిపతులకు నా హృదయపూర్వక ధన్యవాదములు.

ఇట్లు,

భక్తజన దాసానుదాసుడు,

**మట్టుపల్లి శివసుబ్బరాయ గుప్త**

గుంటూరు
21–8–78

ఓం

జయ శ్రీలక్ష్మీనృసింహ

# పరిచితి

ఆదిమధ్యాంతరహితము, నగణితానిర్వాచ్యదివ్యగుణపరిపూర్ణము, సృష్టిస్థితిలయమహాశక్తియుక్తము నగుబ్రహ్మమే మహాకాలపదవాచ్యమనియు, దానితత్త్వ మవిజ్ఞేయమనియు శ్రుతిస్మృతిపురాణాదు లుద్ఘోషించుచున్నవి. అపరిచ్ఛిన్న మగునట్టికాలమునకు వ్యవహారోపయోగార్థమై పూర్వికులు పరిచ్ఛిన్నతను గల్పించి, తద్బృహద్విభాగములకుఁ గృతత్రేతాద్వాపరకలియుగములనునాల్గునామముల నిడి యేదో కాలగణనపద్ధతిని నిర్ణయించిరి. ఏయుగమునం దేయెడ హిరణ్యగర్భమనువశిష్ఠాదు లుండిరో యేమో తెలియరాదు గాని వశిష్ఠమహర్షిపుత్త్రుఁడు శక్తిమహర్షియనియుఁ, దత్పుత్త్రుఁడు పరాశరమహర్షియనియుఁ, దత్పుత్త్రుఁడు శ్రీబాదరాయణ (వ్యాస) మహర్షియనియు నొక వంశవృక్షవిస్తృతి బహుకాలమునుండి ప్రచారమున నున్నది.

ద్వాపరయుగమున నవతరించి బహుకాలము వర్ధిల్లినట్లు తెలియఁబడు వ్యాసమహర్షి యఖండవిజ్ఞానరత్నఖని. సర్వజ్ఞమూర్తి. ఆమహామహుఁడే లేకుండిన నేఁటికిని యావత్ప్రపంచ మజ్ఞానాంధకారబంధురమై పడియుండెడిదే. అట్లు గాకుండ నీతపస్విప్రపరిమితప్రజ్ఞాసహస్రకిరణుఁడై ప్రకాశించినందుననే మానవు లీనాఁడు స్వస్వజ్ఞానదృష్టిబలానుగుణముగ సద్వస్తుయాథార్థ్యమును దర్శింపఁగలుగుచున్నారు. ఈబ్రహ్మర్షియెఁ డింతటివాఁ డగుటచేతనే "వ్యాసో నారాయణో హరిః" అనియు, "అచతుర్వదనో బ్రహ్మా ద్విబాహు రపరో హరిః। అఫాలలోచన శ్శంభు ర్భగవాన్ బాదరాయణః" అనియు నెన్నియోవిధములఁ గీర్తింపఁబడుచున్నాఁడు.

ఆదియుగములోని నిశితవిశాలబుద్ధులకుమాత్రమే గ్రహణయోగ్యమైయుండినయనంతవేదరాశి నీమహామేధావి బహుధా పరిశీలించి, ఋగ్యజుస్సామాథర్వణము లనుపేర్ల నాల్గుఖండములుగ విభాగించి, వేదవిభాగకర్తయై (వేదవ్యాసుఁడై) వానిలోనివివిధాంశార్థములను బర్యాలోచించి, మందాల్పబుద్ధుల సంశయవిపర్యయాదినివారణార్థమును, నంతరార్థయాథార్థ్య ప్రదర్శనార్థమును బ్రహ్మసూత్రములను బ్రస్తరించెను. అంతటితోఁ దృప్తినొందక, స్త్రీశూద్రద్విజబంధువుల నెల్ల నతిసులభముగ నుద్ధరింపఁజేయువిశాలసద్భావమునను, వైష్ణవశైవగాణాపత్యసౌరశాక్తేయాదిమతానుయాయులతోఁ దనసామరస్యమును నిరూపించుటకును విష్ణుశివస్కాందభారతభాగవతాదిమహాపురాణముల

బదునెన్మిదింటిని, మఱి యన్ని యుపపురాణములను విరచించెను. వానియం దనేకేతిహాససందర్భానుసారముగఁ గర్మభక్తిజ్ఞానరాజమార్గముల నిష్కంటకముగ నిర్మించెను. మహాభారతమునం దర్జునుని నిమిత్తీకరించుకొని 'భగవద్గీత' లనుపదునెనిమిది యధ్యాయముల గ్రంథభాగమునఁ గర్మయోగకర్మసన్న్యాసయోగాద్వితీయప్రబోధము నొనరించుచు, సర్వోపనిషదర్థమును దేటపఱచెను. అట్లే శాంతిపర్వమున ధర్మరాజాదుల నిమిత్తీకరించుకొని, శాంతనవముఖమున సనాతనానేకధర్మరహస్యముల నిస్సందిగ్ధముగఁ బరిష్కరించెను. వ్యాసభగవత్కృతమహాపురాణాదుల నెల్ల నేఁటిసులభానేకలేఖనోపకరణముల నుపయోగించియు నెంతటిశీఘ్రలేఖకుఁడేని దనయాయుర్దాయము ముగియులోఁగాఁ జూచి వ్రాయుటకైన సమర్థుఁడు కానేరఁ డనిన, నీమహాకవిబ్రహ్మ యన్నిమహాపురాణాదుల నాశువుగ నంతమృదుమధురనిర్దుష్టధారాళశ్లోకకోటిని వెలయించి, యానాఁ డెట్టిలేఖనసాధనములతో నెన్నిబండ్లభూర్జపత్రాదులమీఁద నెందఱుప్రసిద్ధశిష్యప్రశిష్యులచే నెన్నిప్రతులు నిర్దుష్టముగ వ్రాయించి, వాని నక్షతముగ భద్రపఱచు నేర్పాట్లు గావించెనో యూహింపఁజాలము. ఆగ్రంథరాశి ద్వాపరముననేగాక, కలియుగమునఁగూడ వేనవేలుసంవత్సరము లట్లు భద్రపఱుపఁబడి రెండుశతాబ్దులక్రింద ముద్రింపఁబడకున్న నేఁడు మనము పశుప్రాయులమై యుండవలసినదుర్గతి పట్టియుండెడిదేగదా! లోకమున కింతటి మహోపకార మొనర్చినయాబ్రహ్మర్షిపుంగవునిఋణమును మన మెన్నిజన్మములకైనఁ దీర్చుకొనఁగలమా?

మహాపురాణములలోని కొన్నిబృహత్కృతులలో శ్రీమద్ బ్రహ్మవైవర్త మొకటి. ఇది నాల్గుఖండములు గలది. ప్రతిఖండమునందు ననేకాధ్యాయము లున్నవి. వీనియం దేమానవు లేయేకోర్కులు సిద్ధింప నభిలషించుచు నారాటపడుచుందురో యట్టివారియెడ సుప్రీతులై వారియభీష్టముల ననుగ్రహించుననేకదేవతామూర్తులధ్యానావాహనాది షోడశోపచార విధానములేగాక, తత్తద్దేవతాసాక్షాత్కారము నొనర్ప సమర్థము లగుమంత్రములు, కవచములు మున్నగు విశేషము లెన్నియో కలవు. సరససరళసంస్కృతశ్లోకసహస్రపూర్ణ మగునిట్టిమహాపురాణమును దేవబ్రాహ్మణభక్తితత్పరుఁడు, శ్రుతిస్మృతిపురాణార్థవిశ్వాసపూర్ణుఁడు, వినయవిధేయతాదిసద్గుణశోభితుఁడు నగు చిరంజీవి మట్టుపల్లి శివసుబ్బరాయగుప్త తనవలెనే యాంధ్రసోదరప్రజానీక మంతయు భగవద్భక్తితత్పరము గావలయు ననుసద్భావముతో శ్రీమొదలితిశ్రీవఱకుఁ

దనగద్యరచనాపాటవము తేటపడ సామాన్యబుద్ధులకుఁగూడ నర్థమగున ట్లాంధ్రీకరించి మహోపకార మొనర్చెను. వైశ్యకులరత్న మగునీతఁ డాంగ్లభాషామాత్రవిదుఁడై స్వధర్మమగువాణిజ్యమును న్యాయసమ్మతముగఁ గావించుచున్న వాఁడేగాని సంస్కృతాంధ్రాభిజ్ఞుఁడు గాకున్నను బూర్వపుణ్యఫలము పండుట చేతను, దనయిష్టదైవము స్వప్నమందు సాక్షాత్కరించి, పరమానుగ్రహదృష్టితో నేతదాంధ్రీకరణోద్యమమునకుఁ బ్రేరేపించుచు నీతనియం దావేశించి వ్రాయింపఁజేయుటచేతను గృతకృత్యుఁ డయ్యెనేగాని లేకున్నఁ గాఁగలఁడా? ఆహా! యీతని దెంతటియదృష్టము!

ఈయన తా నాంధ్రీకరించినగ్రంథమును గొందఱు సహృదయులకుఁజదివి వినిపించఁగా వా రెంతయో యభినందించిరఁట. అద్దానఁ దనగ్రంథమును ముద్రింపింప నిశ్చయించుకొనెను. కాని తనకు సంస్కృతాంధ్రభాషాజ్ఞానమంతగా లేకుంటచే నీయన తనరచన దోషభూయిష్ఠమగుట శిష్టపండితాదృతి నొందఁబోదని శంకించి, మిత్రులనిర్దేశమున నాకడకు వచ్చి, ప్రణమిల్లి, తనకథనంతయు నివేదించి, తనరచనకుఁ బారిశుద్ధ్యమును గలిగించుట కర్థించెను. అనివార్యానేకావస్థల నలఁగుచు, బుద్ధిస్తిమితము లేనినాయీవార్ధకావస్థలో నిట్టిబృహత్కార్యమును నిర్వహింపఁజాలనని యెంతచెప్పినను వదలక, మీ యోపికకొలఁది నెప్పటికి సంస్కరించి యిచ్చిన నప్పుడే ముద్రింపించెదనని బతిమాలి నిర్బంధించుటచే నీయకొనక తప్పినది గాదు. వ్యాకరణనియమములఁ బాటింపఁజాలక, వ్యావహారికగ్రామ్యభాషాలాలసు లగునేఁటికొందఱు రచయితలవలెఁగాక, యీతఁడు భాషాశుద్ధి నపేక్షించుట కెంతయో సంతసించి, యర్థానుస్వారములమాత్రము వదలి, వ్యాకరణకార్యములనెల్లఁ బాటించుచు, నానేర్చినట్లు దీనిని బరిష్కరించితిని. ముద్రింపించునపుడుమాత్రము నాసవరణముల బహుజాగ్రత్తగా నవగహింపఁగలబుద్ధిమంతులచే నెట్టిలోపములు దొరలకుండఁ జూచుకొనుఁడని హెచ్చరించితిని. అట్లే గావింతునని యీతఁ డీమహాపురాణగ్రంథముద్రణమునకుఁ బూనుకొనుట పరమశ్లాఘ్యము.

ఏమైనను 'ప్రమాదో ధీమతా మపి' యను నార్యోక్తి యనుభవసిద్ధమైనదగుట నిం దెన్నియో ప్రమాదము లుండితీరునుగాన, సహృదయు లగు పాఠకులు దయతో మన్నించుచు, నీరచయిత కితోఽధికభక్తివిజ్ఞానప్రజ్ఞాభ్యుదయము లొదవుఁగాతమని యాశీర్వదింపఁ బ్రార్థితులు.

ఇట్లు విన్నవించు విధేయుఁడు,

బ్రాడీపేట, గుంటూరు,
19—8—1978

'పండిత కవిప్రియ'

**చతుర్వేది అమరేశ్వరశాస్త్రి.**

# విషయ సూచిక


పుటలు

మొదటి అధ్యాయము 1 – 10

నైమిశారణ్యమున కేగుదెంచిన సౌతిని శౌనకుడు ప్రశ్నించుట; ఆయన శౌనకునకు బ్రహ్మవైవర్తమహాపురాణమును బరిచయము చేయుట.

రెండవ అధ్యాయము 10 – 13

ఉజ్జ్వల మగుపరమాత్ముని తేజఃపుంజవర్ణనము; గోలోక వైకుంఠ శివలోక స్థితివర్ణనము; గోలోకమున శ్రీకృష్ణ భగవానుని పరాత్పరస్వరూప నిరూపణము.

మూడవ అధ్యాయము 14 – 23

శ్రీకృష్ణుడు సృష్టిచేయనారంభించుట; నారాయణాది దేవతలు ప్రాదుర్భవించుట; వీరు వేఱువేఱుగ శ్రీకృష్ణుని స్తుతించుట.

నాలుగవ అధ్యాయము 23 – 25

శ్రీకృష్ణభగవానుని వివిధాంగములనుండి సావిత్రి మున్నగు దేవత లావిర్భవించుట.

ఐదవ అధ్యాయము 25 – 29

బ్రహ్మాదికల్ప పరిచయము; శ్రీకృష్ణునినుండి రాధ, గోపులు, గోవులు, బలీవర్దములు, హంసలు, శ్వేతాశ్వములు, సింహములు మున్నగునవి యుత్పన్నమగుట; శ్రీకృష్ణు డైదు రథములను నిర్మించుట.

ఆఱవ అధ్యాయము 29 – 33

శ్రీకృష్ణుడు నారాయణాదులకు లక్ష్మ్యాదులను బత్నులుగా నొసంగుట; మహాదేవుడు వివాహ విముఖుడై నిరంతర

భజనమునకై వరముడుగుట; భగవానుడు నామాదుల
మహిమలను వివరించుట; భవిష్యత్తులో శివతో వివాహ
మాడ మనినాజ్ఞాపించుట; శివాదులకు మంత్రాదుల
నుపదేశించుట.

ఏడవ అధ్యాయము 34 - 35

బ్రహ్మ పృథివ్యాదిలోకములను సృష్టించుట; కల్పిత
జగదనిత్యత్వమును, వైకుంఠశివగోలోకాదుల
నిత్యత్వమును బ్రతిపాదించుట.

ఎనిమిదవ అధ్యాయము 35 - 40

సావిత్రినుండి వేదాదులు సృష్టియగుట; బ్రహ్మనుండి
సనకాదులు, స్వాయంభువమనువు, రుద్రులు, పులస్త్యాది
మునులు, నారదుడు బ్రాదుర్భవించుట; బ్రహ్మనార
దులు పరస్పరము శపించుకొనుట.

తొమ్మిదవ అధ్యాయము 41 - 45

మరీచ్యాదిబ్రహ్మపుత్రుల, దక్షకన్యకల సంతాన
వర్ణనము. దక్షశాపపీడితు డగుచంద్రుడు శివుని
శరణుజొచ్చుట; విష్ణుకృపతో దక్షునకు
జంద్రుడు లభించుట.

పదియవ అధ్యాయము 46 - 48

జాతిసంబంధమును నిరూపించుట.

పదునొకండవ అధ్యాయము 49 - 51

సూర్యుని యనురోధము ననుసరించి సుతపుడు అశ్వినీ
కుమారులను శాపవిముక్తులునుగ జేయుట; సంధ్యా
నిరతు డగువైష్ణవబ్రాహ్మణప్రశంస.

పంద్రెండవ అధ్యాయము 52 - 55

బ్రహ్మయపూజ్యతకు గారణము; గంధర్వరాజు తపస్సునకు సంతుష్టుడై శంకరు డాతనికి బుత్రునిగా జన్మించి ఉపబర్హణు డనునామముతో ప్రసిద్ధిచెందుట.

పదమూడవ అధ్యాయము 55 - 58

బ్రహ్మశాపము ననుసరించి ఉపబర్హణుడు యోగధారణముద్వారా తనశరీరమును ద్యజించుట; మాలావతీ విలాపము; దేవతలకు శాపమీయ నుద్యుక్తురాలగుట; కౌశికీనదీతటమున దేవతలు మాలావతికి దర్శన మొసంగుట.

పదునాల్గవ అధ్యాయము 58 - 62

విష్ణువు బ్రాహ్మణబాలకరూపమున మాలావతితో సంభాషించుట; ఆయన కామె తనదుఃఖమును, ఇచ్ఛను వ్యక్తముచేయుట; విభిన్న దేవతారాధనలవలన లభించుఫలమును, శ్రీకృష్ణ భజన మహిమను వర్ణించుట.

పదునైదవ అధ్యాయము 63 - 65

బ్రాహ్మణుడు తనసామర్థ్యమును బరిచయము చేయుట; మాలావతి పతిమాహాత్మ్యమును జెప్పుట; బ్రాహ్మణుడు కాల యమ మృత్యుకన్యకల బిలిపించి యామెతో మాటలాడించుట; ఆమెను శ్రీకృష్ణచింతనమునకై ప్రేరేపించుట.

పదునారవ అధ్యాయము 66 - 73

మాలావతి యడుగగా బ్రహ్మరూపధారి యగు శ్రీహరి వైద్యకసంహితను, ఆయుర్వేదాచార్య

పరంపరను, జ్వరము మున్నగు నలువదినాలుగు రోగములను, వానికి గారణములను, తన్నివారణోపాయములను వివరించుట.

పదునేడవ అధ్యాయము 74 – 80

బ్రాహ్మణబాలునితో బ్రహ్మ మహాదేవ ధర్మ దేవతలు సంభాషించుట; దేవతలు విష్ణు మ ... బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని యుత ... పాదించుట.

పదునె ... అధ్యాయము 81 – 87

బ్రహ్మ ... ఉపబర్హణుని జీవితునిగ జేయ బ్రయత్నించుట; మాలావతి శ్రీకృష్ణుని స్తుతించుట; శక్తితో భగవంతుడు గంధర్వశరీరమున బ్రవేశింపగా గంధర్వుడు పునర్జీవితుడగుట.

మాలావతీకృత మహాపురుష స్తోత్రమ్.

పందొమ్మిదవ అధ్యాయము 88 – 99

బ్రహ్మాండపావన మనుశ్రీకృష్ణకవచము; సంసారపావన మనుశ్రీశివకవచము; శివరాజస్తవము; వీని మహిమ.

ఇరువదియవ అధ్యాయము 99 – 101

గోపపత్ని యగుగళావతికి ఉపబర్హణుడు శిశు రూపమున జన్మించుట.

ఇరువదియొకటవ అధ్యాయము 102 – 107

శూద్రస్త్రీకి జన్మించినబాలు డగునారదుని దినచర్య; నామవ్యుత్పత్తి; అతడు సత్పురుషులకు సేవచేయుట; సనత్కుమారుల యుపదేశమును బొందుట;

శ్రీహరిస్వరూపమును ధ్యానించుట;
దేహమును త్యజించుట.

ఇరువదిరెండవ అధ్యాయము — 107 - 110

బ్రహ్మపుత్రుల నామముల వ్యుత్పత్తి.

ఇరువదిమూడవ అధ్యాయము — 110 - 112

సృష్టికై బ్రహ్మవలన దారపరిగ్రహప్రేరణను
బొంది భయపడిననారదుడు స్త్రీసంగ్రహణము
దోష మనిచెప్పి తపముచేయ వరమడుగుట.

ఇరువదినాలుగవ అధ్యాయము — 113 - 116

బ్రహ్మ నారదునకు గృహస్థధర్మమహత్త్వమును
జెప్పి వివాహమునకై యొప్పించుట; నారదుడు
తండ్రియాజ్ఞను స్వీకరించి శివలోకమునకు వెడలుట.

ఇరువదియైదవ అధ్యాయము — 117 - 119

నారదునకు బరమేశ్వరుడు దర్శన మిచ్చి వానిని
సత్కరించుట; వాని మనోవాంఛాపూర్తికై
ధైర్యము చెప్పుట.

ఇరువదియాఱవ అధ్యాయము — 119 - 129

బ్రాహ్మణుల యాహ్నికాచార నిరూపణము;
భగవత్పూజావిధి వర్ణనము.

ఇరువదియేడవ అధ్యాయము — 129 - 132

బ్రాహ్మణుల భక్ష్యాభక్ష్య కర్తవ్యాకర్తవ్య
కర్మల నిరూపణము.

ఇరువదియెనిమిదవ అధ్యాయము — 133 - 140

పరబ్రహ్మపరమాత్మ స్వరూపనిరూపణము.

**ఇరువదితొమ్మిదవ అధ్యాయము** 140 - 141

బదరికాశ్రమమున నారాయణుని
నారదుడు ప్రశ్నించుట.

**ముప్పదియవ అధ్యాయము** 142 - 145

శ్రీమన్నారాయణబుషీంద్రుడు పరమపురుషుడు,
పరమాత్మయు నగుశ్రీకృష్ణభగవానుని
మహిమను, ప్రకృతిదేవి మహిమను
వర్ణించుట.

---

## చిత్ర సూచిక

పుటలు

**1.** త్రిభంగభంగిసంయుక్తుడైన శ్రీమురళీకృష్ణపరమాత్మ అట్టమీదిచిత్రము

**2.** కలితలక్ష్మీశుడు, సర్వజగన్నివేశుడు, విమలరవికోటి
సంకాశుడు, శేషాద్రిశేఖరవిభుడు, శ్రీమదాంధ్ర బ్రహ్మ
వైవర్త మహాపురాణకృతిపతియు నగుశ్రీవేంకటేశ్వరస్వామిచిత్రము

**3.** సచ్చిదానందవిగ్రహధారియు, భగవంతుడును, పర
మాత్మయు, మహాపురుషుడు నగుశ్రీకృష్ణపరబ్రహ్మముచిత్రము 81

**4.** ఓంకారస్వరూపుడు, జ్ఞానానందమయుడునగు
శ్రీమహాదేవుని (శంకరుని) చిత్రము 121

శ్రీహరిః ఓం తత్ సత్

# కృతిపతి

శ్రీ మదాంధ్రబ్రహ్మవైవర్త మహాపురాణము

త్వదీయం వస్తు గోవిన్ద
తుభ్యమేవ సమర్పయే !

కృతికర్త
శ్రీ మట్టుపల్లి శివసుబ్బరాయ గుప్త

శ్రీ రస్తు ఓం నమః శుభ మస్తు

శ్రీ గణేశ్వరాయ నమః

# శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణము

## బ్రహ్మఖండము

### మొదటి అధ్యాయము

**నైమిశారణ్యమున కేగుదెంచిన సౌతిని శౌనకుడు ప్రశ్నించుటః ఆయన శౌనకునకు బ్రహ్మవైవర్తమహాపురాణమును బరిచయము చేయుట.**

మంగళాచరణము

శ్రీ గణేశబ్రహ్మేశసురేశశేషాః సురాశ్చ సర్వే మనవో మునీన్ద్రాః ।
సరస్వతీ శ్రీగిరిజాదికాశ్చ నమన్తి దేవ్యః ప్రణమామి తం విభుమ్॥

శ్రీగణేశుడు, బ్రహ్మ, మహాదేవుడు, దేవపతి యగునింద్రుడు, ఆదిశేషుడు, సకలదేవతలు, మనువులు, మహర్షులు, సరస్వతి, లక్ష్మి, పార్వతి మొదలుగా గలదేవత లందఱు నేపరమాత్మకు నమస్కరించెదరో, ఆ విభునకు బ్రణామము లర్పించెదను.

శ్లో॥ స్థూలా స్తనూ ర్విదధతం త్రిగుణం విరాజం
విశ్వాని లోమవివరేషు మహాన్త మాద్యమ్ ।
సృష్ట్యున్ముఖః స్వకలయాఽపి ససర్జ సూక్ష్మం
నిత్యం సమేత్య హృది య స్త మజం భజామి ॥

సకలచరాచరసృష్టి కున్ముఖుడై గుణత్రయమును స్వీకరించి బ్రహ్మవిష్ణుశివాత్మకము లైనమూడుదివ్యస్థూలశరీరములను ధరించినవాడు, విరాట్పురుషుడై తనరోమకూపములయందు సమస్తవిశ్వమును నిలుపుకొనినవాడు, తన కళాద్వారమునగూడసృష్టిచేసినవాడు, సూక్ష్మరూపముతో నెల్లప్రుడు హృదయమున విరాజిల్లువాడు, ఆదిపురుషుడు, జన్మరహితుడు నగునాపరమేశ్వరుని నేను సేవించుచున్నాను.

శ్లో॥ ధ్యాయన్తే ధ్యానవిష్ఠాః సురనరమనవో యోగినో యోగరూఢాః
సన్తః స్వప్నేఽపి సన్తం కతికతిజనిభి ర్యం న పశ్యన్తి తప్త్వా ।
ధ్యాయే స్వేచ్ఛామయం తం త్రిగుణపరమహో నిర్వికారం నిరీహం
భక్త్యై ధ్యానైకహేతో ర్నిరుపమరుచిరశ్యామరూపం దధానమ్ ॥

ధ్యానపరాయణు లగుదేవతలు, మనుష్యులు, స్వాయంభువాది మనువులు ఎవనిని ధ్యానించెదరో, యోగసిద్ధు లైనమహాయోగు లెవని నెల్లప్రు డారాధించెదరో, జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థలయం దంతట విద్యమానుడై యున్న నెవనిని సాధకు లనేకజన్మములయందు దపము నాచరించియు గానలేకున్నారో యట్టి త్రిగుణాతీతుడు, స్వేచ్ఛామయుడు, నిర్వికారుడు నగు పరమాత్మ కేవలము త న్నాశ్రయించినయనన్యభక్తజనులకొఱకు, వారికి స్వధామమును బ్రసాదించుటకొఱకు, నిరీహమైన, పరమమనోహరమైన, శ్యామసుందరరూపమును ధరించెనో యట్టి శ్రీకృష్ణుని నేను ధ్యానించెదను.

శ్లో॥ వన్దే కృష్ణం గుణాతీతం పరం బ్రహ్మాచ్యుతం యతః ।
ఆవిర్బభూవుః ప్రకృతిబ్రహ్మవిష్ణు శివాదయః ॥

ఎవనినుండి ప్రకృతి, బ్రహ్మ, విష్ణువు, శివాదు లావిర్భవించిరో, యట్టి త్రిగుణాతీతుడు, పరబ్రహ్మము, పరమాత్ముడు, అచ్యుతుడు నగుశ్రీకృష్ణునకు నేనునమస్కరించెదను.

ఓం నమో భగవతే వాసుదేవాయ ।
ఓం నమః సర్వలోకవిఘ్నవినాయకాయ ।
ఓం నమో బ్రహ్మణే ఓం నమః శివాయ ।
ఓం నమో గణపతయే ఓం నమో నారదాయ ।
ఓం నమో వ్యాసాయ ఓం నమః ప్రకృత్యై ।

ఓం నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్ ॥

పరమపురుషు డైననారాయణునకు, నరశ్రేష్ఠు డైననరునకు, వీరి లీలల నెల్లపుడు ప్రకటించు సరస్వతీదేవికి, నా దివ్యలీలలను గానమొనరించు వ్యాసదేవునకు నమస్కరించెదను. పిమ్మట జయము నుచ్చరింపవలెను.

జీవులారా ! శ్రీకృష్ణద్వైపాయనవ్యాసదేవుడు వేదములను గోవత్సములుగ నొనర్చి, భారతీరూపిణి యగుకామధేనువునుండి యపూర్వములు, అమృతోపమానములు, సర్వోత్తమములు, అక్షయ్యములు, ప్రియాతిప్రియములు, మధురాతిమధురములు నగుశ్రీకృష్ణకథాక్షీరములను పిండుచున్నాడు; శ్రోతలారా! మీరు మీ శ్రవణపుటములద్వారమున నమృతోపమయము లైనయాహారికథాక్షీరములను పానముచేసి భవసాగరమును దరించి భగవద్ధామమును జేరెదరుగాక.

జంబూద్వీపమునం దున్నపవిత్రభారతవర్షములో నైమిశారణ్యమనుపుణ్యక్షేత్రము కలదు. ఆప్రదేశమందు నివసించుచున్న శౌనకాదిమహర్షులొకదినమున ప్రాతఃకాలముననే నిత్యనైమిత్తికకర్మముల నాచరించి సుఖులై కుశాసనస్థులై సభ దీర్చియుండగా, సూతమహర్షి పుత్రు డైనయుగ్రశ్రవోమానిపుంగవు డకస్మాత్తుగా నాప్రదేశమున కరుదెంచెను. ఆమౌనివర్యుడు వినమ్రభావముతో సభయం దున్నసకలమహర్షిగణములచరణకమలములకు ప్రణమిల్లెను. ఉగ్రశ్రవసునిరాకను గాంచి మహర్షులు సాదరముగ నాయన నాహ్వానించి, యుచితాసన మొసంగిరి. ఋషులలో నగ్రగణ్యు డైనశౌనకమహర్షి భక్తిభావముతో హఠాదాగతు డైనయతిథికి స్వాగతము పలికి, పూజించి ప్రసన్నతాపూర్వకముగ కుశలసమాచారములను ప్రశ్నించెను.

శౌనకమహర్షి శమదమాదిగుణసంపన్నుడు. పౌరాణికు డైన సూతమహర్షి శాంతప్రసన్నచిత్తు డైనమౌనిపుంగవుడు. ఉగ్రశ్రవసునిముఖారవిందమందు మందహాసములు చిందులాడుచున్నవి. ఆయన సకలపురాణసారములను గ్రహించిన విద్వాంసుడు. మహర్షు లందఱు సూతున కగ్రాసనము సమర్పించి, వినీతభావముతో నాసీను లైయుండగా, దారకలలో జంద్రునివలె భాసించుచున్నశౌనకమహర్షి సూతుని, బరమోత్తమము, శ్రీకృష్ణదివ్యకథాయుక్తము, శ్రవణానందదాయకము, మంగళమయము, మంగళయోగ్యము, మంగళధామము, కళ్యాణప్రదాయకము, సంపూర్ణానందబీజయుక్తము, నమంగళనాశకము, హరిభక్తిప్రదము, సమస్తవిభూతిప్రదము, అత్యంత

శ్రేష్ఠము, పరమానందదము, మోక్షదాయకము, పరిశుద్ధజ్ఞానప్రభవము నైన మహాపురాణమునుగుఱించి ప్రశ్నించెను.

**శౌనకమహర్షి యిట్లు పలికెను :**

సూతమహర్షీ! మీ రేప్రదేశమునుండి, యెక్కడకు బ్రస్థానముచేయు చున్నారు? మీకు గళ్యాణ మగుగాక. ఈదినము మీదర్శనమాత్రముచే బుణ్యమయమైనది. మే మందఱ మీకలియుగములో శ్రేష్ఠములైన భక్తిజ్ఞానములు లభింపక భయగ్రస్తులమై యున్నాము. సంసారసాగరమధ్యమున మునిగి పోవుచున్నాము.

ఈ సంసారసాగరమునుండి మమ్ములను దరింపజేయుటకే మీ రీ ప్రదేశమునకు విచ్చేసినారని మా నిశ్చయము. మీరు మహాభాగ్యశాలురు, సాధుపురుషులు, పురాణవేత్తలు, సర్వపురాణశాస్త్రములందు నిష్ణాతులు, నత్యంతకృపానిధానులు.

శ్లో॥ శ్రీకృష్ణే నిశ్చలా భక్తి ర్యతో భవతి శాశ్వతీ ।
తత్కథ్యతాం మహాభాగ ! పురాణం జ్ఞానవర్ధనమ్ ॥
గరీయసీ యా మోక్షెచ్చ కర్మమూలనికృన్తనీ ।
సంసారసంనిబద్ధానాం నిగడచ్ఛేదకర్తరీ ॥
భవదావాగ్నిదగ్ధానాం పీయూషవృష్టివర్షిణీ ।
సుఖదాఽఽనన్దదా సౌతే ! శశ్వచ్చేతసి జీవినామ్ ॥
యత్రాఽఽదౌ సర్వబీజం చ పరం బ్రహ్మనిరూపణమ్ ।
తస్య సృష్ట్యున్ముఖస్యాపి సృష్టేరుత్కీర్తనం పరమ్ ॥

మహాభాగా ! దేనిశ్రవణమాత్రముననే, పఠనమాత్రముననే భగవంతు డైనశ్రీకృష్ణునియం దవిచలమైనభక్తి కలుగునో, యేది భక్తిజ్ఞాన వైరాగ్యములను బెంపొందింపజేయునో, యట్టిపురాణమును గానముచేయవలసి నదిగా బ్రార్థించుచున్నాము. ఏపురాణము మోక్షముకంటె నున్నతమైనదో, కర్మబంధనములను ఛేదింపగలదో, యీసంసారకారాగారమందు బంధితులైన జీవులబంధనములను త్రెంపగలదో, శ్రీకృష్ణభక్తిపూరితమైనదో యట్టి మహాపురాణమును గాన మొనరించి యీజగద్దావానలమున దగ్ధు లగుచున్న జీవులపై శ్రీకృష్ణకథామృతరసవృష్టిని గురిపించి రక్షింపుడు. ఆ మధుర సుధాహారికథాగానమే సర్వజీవధారులహృదయములలో బరమసుఖమును, బర

మానందమును ప్రసాదించును. సూతనందనా! ఏదివ్యపురాణమం దాదిబీజ కారణతత్త్వప్రతిపాదన మున్నదో, పరబ్రహ్మస్వరూపనిరూపణము కలదో, సృష్టికొఱకు సంకల్పించినపరమాత్మను గుఱించి, హరిమయ మైనసృష్టిని గుఱించి పరమోత్కృష్టవర్ణనములు కలవో, యటువంటి మహాపురాణ సంహితను నుపదేశ మొనరించి మమ్ము ధన్యుల గావింపుడు.

పరమాత్మస్వరూపము నిరాకారమా లేక సాకారమా? ఆ పర బ్రహ్మముయొక్క దివ్యరూప మెట్లుండును? భగవంతు నేప్రకారముగ ధ్యానింప వలెను? ఏ విధముగ మననము చేసికొనవలయును? పరమభక్తు లెవనిని దమహృదయారవిందములలో ధ్యానించెదరు? శాంతమనస్కు లైనపరమ యోగులు సర్వకాలసర్వావస్థలయందు నెవని నుపాసించెదరు? వేదములలో, శాస్త్రములలో, పురాణాదులలో నెవనియాదేశములు నిరూపణము గావింప బడెను.

ఏపురాణమందు ప్రకృతియథార్థస్వరూపప్రతిపాదనము గావింపబడి నదో, గుణములలక్షణములు, మహత్తత్త్వాదితత్త్వములవర్ణనములు గావింప బడెనో, దేనియందు గోలోకము, వైకుంఠము, శివలోకము, స్వర్గాదీతరదివ్య లోకములవర్ణనములు గావింపబడెనో, దేనిలో నంశములనుగుఱించి, కాలము లను గుఱించి నిరూపణము గలదో, యటువంటి మహాపురాణమును మాకు శ్రవణము చేయింపవలసినదిగ బ్రార్థించుచున్నాము.

సూతనందనా! ప్రకృతిపదార్థ మనగా నేమి? ప్రకృతి యనగా నేమి? ప్రకృతి కతీతులై యున్నయాత్మపరమాత్మలస్వరూపము లెట్లుండును? ఏ యే దేవతలు, దేవకాంతలు, నీ భూతలముపై గూఢరూపములతో నవతరించిరో, వారి దివ్యచరితములను వర్ణింపవలసినదిగా గోరుచున్నాము. సముద్రముల, పర్వతముల, నదుల, ప్రాదుర్భావప్రసంగములను వివరింపుడు. ప్రకృతియంశము లెవరు? ఆ యంశముల కళలను, బూజనములను, ధ్యానస్తోత్రకవచమంత్రాదు లను నుపదేశింపుడు. ఏ మహాపురాణములో దుర్గ, సరస్వతి, లక్ష్మి, సావిత్రి, తులసి మొదలుగా గలదేవతలవర్ణనము కలదో, దేనిలో శ్రీరాధామాత యొక్క యత్యంతాపూర్వామృతోపమదివ్యాఖ్యానము కలదో, దేనిలో జీవులకర్మవిపాకముల ప్రతిపాదనము కలదో, యే పురాణములో నరకవర్ణనము, కర్మబంధనములఖండనము, ఆ కర్మములనుండి విముక్తు లగుట కుపాయముల

వర్ణనము కలదో, యట్టి పవిత్రమహాపురాణము నుపదేశింపుడు. జీవులకు స్వకర్మములవలన నే యే యోనులయందు జన్మములు గలుగును? ఆజీవులకు గర్మానుసారముగా నే యే శుభాశుభలోకములు ప్రాప్తించును? ఆదేహధారులు స్వకర్మాచరణమువలన నే యే దుఃఖముల ననుభవించెదరు? వారే పవిత్రకర్మానుష్ఠానములవలన నట్టిదుఃఖములనుండి విముక్తులు కాగలరు? ఈ విషయముల నన్నింటిని వర్ణింపవలసినదిగా బ్రార్థించుచున్నాము.

మహర్షీ! ఏ పురాణమందు మానస, తులసి, కాళి, గంగ, వసుంధర మొదలగు దేవతలమంగళమయాఖ్యానములు గలవో, దేనియందు బవిత్రసాల గ్రామమునుగుఱించి, దానములమాహాత్మ్యములనుగుఱించి వర్ణింపబడెనో, యేపురాణములో శ్రీగణేశ్వరునిదివ్యశుభచరితము, జన్మము, కర్మములు, ఆయనగూఢోపదేశములు, స్తోత్రములు, మంత్రములు, కవచములు, వర్ణింపబడినవో, యేపురాణ మత్యంతాద్భుతమో, యపూర్వమో, లోగడ నెవ రెపుడు వినియుండనిదో యట్టి మహాపురాణసంహిత నుపదేశింపవలసినదిగా మిమ్ములను బ్రార్థించుచున్నాము.

పరమాత్మ మైనశ్రీకృష్ణభగవానుడు సర్వత్ర పరిపూర్ణుడు. ఈపరమ పవిత్రపుణ్యమయభారతవర్షమం దాజగన్నాథు డవతరించి యెట్టి యనేకాద్భుతదివ్యలీలావిహారములు గావించెను? మునీశ్వరా! ఏ పురాణమం దా లీలామానుషవిగ్రహునిపరిపూర్ణవర్ణనము గలదో, యా దివ్యపురాణమునే గానమొనరింపవలసినదిగా గోరుచున్నాము. ఆ లోకైకరత్నమణి యే పుణ్యాత్మునిగృహమున నవతరించెను? ధన్యయు మాన్యయు నైనయేపుణ్యవతి యా పరమపురుషునకు జనని కాగల్గెను? ఆ తల్లిగృహమును వీడి భగవంతు డేకారణమువలన నే ప్రదేశముల కరిగెను? ఏ యేదివ్యకర్మముల నొనరించెను? తదనంతరము స్వస్థలమున కేవిధముగా దయచేసెను? ఎవరిప్రార్థనల నాలకించి శ్రీకృష్ణ పరమాత్మ యీపృథ్వీభారమును దొలగించెను? ఇత్యాదివిషయములతో బరిపూర్ణ మైనదివ్యహరికథాసుధావృష్టి గావించి మమ్ముల నీ భవమహాదావాగ్ని నుండి రక్షింపజేయ బ్రార్థించుచున్నాము.

అనేకవిధపవిత్రాఖ్యానములతో బరిపూర్ణమై శ్రుతులకు, మహాజ్ఞానులైనమహాఋషులకుగూడ దుర్లభమై మనస్సును నిర్మల మొనరించుకొనుటకు నుత్తమోత్తమసాధనమై నేను నాకు గలజ్ఞానముచే నే యే ప్రశ్నలను బ్రశ్నిం

చితినో, వాని కన్నిటికి సమాధానయుక్తమై కేవలము శ్రవణమాత్రముననే శ్రీహరియెడల ననన్యభక్తిని, మహోజ్జ్ఞానమును, వైరాగ్యమును నుత్పన్నమొనర్పఁ జేయగల దివ్యపురాణము నుపదేశింపుడు.

శ్లో॥ శిష్యపృష్ట మపృష్టం వా వ్యాఖ్యానం కురుతే చ యః ।
స సద్గురుః సతాం శ్రేష్ఠో యోగ్యాయోగ్యే చ యః సమః ॥

ఏ గురువు శిష్యు లడిగినను నడుగకున్నను బరిపూర్ణజ్ఞానమును బ్రసాదించునో, యోగ్యులయెడల, నయోగ్యులయెడల సమభావము కలిగి వర్తించునో యా గురువే శ్రేష్ఠుఁడైనసద్గురు డని శ్రుతివచనము కలదుగదా.

**సౌతి పలికెను:**

ఓం నమః. మహర్షులారా! మీ చరణారవిందములదర్శనసౌభాగ్యము కల్గుటవలన నా కంతయు కుశలమే, మంగళదాయకమే. నేను సిద్ధక్షేత్రము నుండి బయలుదేరి నారాయణక్షేత్రమునకు బయనించుచున్నాను. ఈ పవిత్ర ప్రదేశమున నిందఱు మహాత్ము లేకత్రస్థులై యుండుట గాంచి ప్రణామము లర్పించుటకే యరుదెంచితిని. పవిత్రభారతవర్షములో నున్నయీనైమిశారణ్యక్షేత్రము పుణ్యప్రద మైనదివ్యతీర్థము. ఈ క్షేత్రదర్శనాపేక్షయే నా శుభాగమనమునకు గారణము.

శ్లో॥ దేవం విప్రం గురుం దృష్ట్వా న నమే ద్యస్తు సంభ్రమాత్ ।
స కాలసూత్రం వ్రజతి యావచ్చన్ద్రదివాకరౌ ॥

ఎవరు దేవతలను, బ్రాహ్మణులను, గురువులను, సద్భక్తులను గాంచినవెంటనే వేగముగ శిరమును వంచి నమస్కరింపరో, వారు సూర్యచంద్రు లున్నంతవఱకు గాలసూత్ర మనునరక మనుభవింపగలరు.

మునివర్యులారా! సాక్షాత్తుగ శ్రీహరియే సద్భక్తులైనబ్రాహ్మణులరూపములలో నీ భారతవర్షమందు భ్రమణ మొనరించుచుండును. శ్రీహరిస్వరూపులైనయట్టియనన్యభక్తులను బుణ్యాత్ములైనవారే దర్శించి నమస్కరింపగలరు.

మహాత్ములారా! మీ రే యే ప్రశ్నముల నడిగి యే యే విషయములను దెలియగోరుచున్నారో, యవి యన్నియు మీకు విదితములే. ఐనను మీ యాజ్ఞను శిరసావహించి నేను గొన్నివిషయములను నా కవగత

మైయున్నంతవఱకు మీదివ్యసముఖమున నివేదింపగలను. కేవలము పామర జనులను దరింపజేయుటకే వారి కర్మబంధములను ఖండించుటకే మీ రీ పవిత్ర ప్రశ్నలను ప్రశ్నించితిరి. సకలజీవులను శ్రీహరిదివ్యపరంధామమునకే యాకర్షించుట మీ ప్రధానాశయము.

పవిత్రపురాణముల సారసంగ్రహమే శ్రీమద్బ్రహ్మ వైవర్త మహాపురాణము. ఈ దివ్యపురాణ శ్రవణము పరమాత్ముఁ డైనశ్రీకృష్ణభగవానునియం దనన్యభక్తిని, దాస్యభావమును బ్రసాదించును. కామితార్థ ఫలప్రదాయక మైనయీపురాణశ్రవణము శ్రోతలసంపూర్ణతత్త్వముల జ్ఞానమును వృద్ధిచేయును. ముక్తిని గాక్షించువారికి ముక్తిని, భక్తులకు శ్రీకృష్ణానన్యభక్తిని బ్రసాదించుటలోను, సకలాశ్రితులకోర్కెలను బరిపూర్ణ మొనరించుటలోను శ్రీమద్బ్రహ్మవైవర్తమహాపురాణము సాక్షాత్తుగ గల్పవృక్షస్వరూపమే. ఎవనిని బరమయోగులు, మహాత్ములు, భక్తులు, వైష్ణవులు, సదా ధ్యానించుచు నారాధించెదరో, యెవరు పరాత్పరపరబ్రహ్మస్వరూపమో, సర్వబీజస్వరూపమో, యట్టి పరమేశ్వరు డైనపరాత్పరపరబ్రహ్మము నీపురాణము నందు గలబ్రహ్మఖండము స్పష్టముగ నిరూపించినది.

శౌనకాదిమహర్షులారా! వైష్ణవులు, భక్తులు, మహాత్ములు, యోగులు, పరస్పరము భిన్నులుకారు. దేహధారి యైనజీవుడు తనభక్తిజ్ఞాన పరిణామస్వరూపముతో గ్రమముగ యోగియు, మహాత్ముడు, భక్తుడు, పరమ వైష్ణవుడు కాగలడు. సత్సాంగత్యమువలననే మనుష్యులు మహాత్ములు కాగలరు. యోగులసాంగత్యమువలన యోగులు, భక్తులసాంగత్యమువలన భక్తులు కాగలరు. వీరే క్రమముగా ననన్యభక్తియోగసాధనవలన బరమ వైష్ణవులు కాగలరు. బ్రహ్మఖండానంతరము ప్రకృతిఖండము వర్ణింపబడెను. ఈ ఖండములో దేవతల, దేవాంగనల, సంపూర్ణజీవుల యుత్పత్తిప్రకరణము కలదు. జీవుల కర్మవిపాకములు, సాలగ్రామమాహాత్మ్యము నిరూపింపబడెను. ఈ ఖండమందు దేవతల కవచములు, స్తోత్రములు, మంత్రములు, పూజావిధానములు ప్రతిపాదింపబడినవి. ప్రకృతి ఖండమం దాద్యప్రకృతి సంపూర్ణలక్షణములు వర్ణింపబడినవి. ప్రకృత్యంశలనుగుఱించి, కాలములను గుఱించి నిరూపణ మొనరింపబడెను. పుణ్యాత్ములకు బాపాత్ములకు నే యే శుభాశుభలోకములు ప్రాప్తించునో యాలోకముల వర్ణన మీ ఖండమందు

కలదు. పాపకర్మలకు లభించు నరకములు, రోగములు, వాని నివారణోపాయములు నీఖండమందు వర్ణింపబడెను.

ప్రకృతిఖండానంతరము శ్రీగణేశఖండములో శ్రీగణేశ్వరు నావిర్భావవర్ణనము కలదు. శ్రీగణేశభృగురామసంవాదములో సంపూర్ణ తత్త్వజ్ఞాననిరూపణము గలదు. దీనియందు శ్రీగణేశ్వరుని కవచములు, స్తోత్రములు, మంత్రములు వర్ణింపబడెను.

శ్రీగణేశఖండానంతరము శ్రీకృష్ణజన్మఖండకీర్తన మొనరింపబడెను. భారతపుణ్యభూమిపై శ్రీకృష్ణు డొనరించిన దివ్యావతారలీల లీఖండమందు వర్ణింపబడినవి. దీనిలో జగన్నాథుడు పృథ్వీభారము నశింపజేయు ప్రసంగము కూడ బ్రవచింపబడెను. సత్పురుషుల కే యేధర్మము లాచరణయోగ్యములో వాని నిరూపణ మీా ఖండమందు వర్ణింపబడెను.

విప్రశ్రేష్ఠులారా! శౌనకాదిమహర్షులారా! ఈప్రకారముగ నేను బరమోత్తమ మైనపురాణములకు శిరోమణి యైనశ్రీమద్బ్రహ్మవైవర్త మహాపురాణపరిచయ మొనరించితిని. ఈమహాపురాణము బ్రహ్మఖండము, ప్రకృతిఖండము, శ్రీగణేశఖండము, శ్రీకృష్ణజన్మఖండ మనునాల్గుఖండములుగా బ్రవచింపబడెను. దీనియందు ధర్మముల సంపూర్ణనిరూపణ మొనర్పబడెను. సకలపురాణసార మైనయీాసంహిత మానవులకు సర్వాభీష్టములను సంపూర్ణముగ బ్రసాదింపగలదు. వేదవిదు లైనవిద్వాంసు లీపురాణమును వేదసమముగా బరిగణించిరి. ఈపవిత్రసంహితయందు భగవంతు డైనశ్రీకృష్ణపరమాత్మ తన సంపూర్ణపరబ్రహ్మభావమును బ్రకటించియున్నాడు. ఈ కారణమువలనే పురాణవేత్త లైనప్రాచీనమహర్షు లీపురాణమునకు శ్రీమద్బ్రహ్మవైవర్తమని నామకరణ మొనరించిరి.

ఆదికాలమందు నిరామయ మైనదివ్యగోలోకపరంధామములో బరబ్రహ్మ మైనశ్రీకృష్ణభగవాను డీసంహితను బ్రహ్మదేవునకు, మహాదేవునకునుపదేశించెను. తదనంతరము బ్రహ్మ మహత్తర మైనపుష్కరతీర్థమందు దీనినే ధర్మదేవత కుపదేశించెను. ధర్మదేవత శ్రీమద్బ్రహ్మవైవర్తమహాపురాణమును దనకుమారు డైనశ్రీనారాయణఋషిపుంగవునకు బ్రవచించెను. శ్రీనారాయణఋషి దీనిని నారదునకును, నారదమహర్షి పవిత్రగంగానదీతీరమున దీనినే శ్రీకృష్ణద్వైపాయన వ్యాసునకు నుపదేశించెను. వ్యాసమహర్షి యీా పురాణ

మును విస్తార మొనరించి పుణ్యప్రదాయకమైన సిద్ధక్షేత్రములో నా కుపదేశించెను. శ్రీకృష్ణద్వైపాయన వ్యాసమహర్షి శ్రీమద్బ్రహ్మ వైవర్త మహాపురాణమును బదునెనిమిదివేల శ్లోకములతో లిపిబద్ధ మొనరించెను. విప్రశ్రేష్ఠులారా! ఈ పురాణ మత్యంత మనోహరము, హరికథామధురామృతభరితము; శ్రవణ మాత్రముననే సకలజీవుల నుద్ధరింపగల ఈదివ్యచరితమును మీ సమక్షమున నేను గానమొనరించి చరితార్థుడనయ్యెదను. మీరు సావధానచిత్తులై యాకర్ణించెదరు గాక! సర్వపురాణముల శ్రవణమువలన గలుగు ఫలమంతయు నీపురాణమందలి యొకయధ్యాయ శ్రవణ మాత్రముననే నిశ్చయముగ లభింప గలదు.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండమున సౌతి శౌనకునకు జేసిన
బ్రహ్మవైవర్త మహాపురాణపరిచయ
మను మొదటి అధ్యాయము
సంపూర్ణము

—o—

# రెండవ అధ్యాయము

## ఉజ్జ్వల మగుబరమాత్ముని తేజఃపుంజవర్ణనము; గోలోక వైకుంఠ శివలోక స్థితివర్ణనము; గోలోకమున శ్రీకృష్ణభగవానుని బరాత్పర స్వరూప నిరూపణము.

**శౌనకాది మహర్షు లీవిధముగా బ్రశ్నించిరి :**

సూతనందనా! మీరు వ్యాసభగవానుని దివ్యముఖారవిందమునుండి యాకర్ణించిన యద్భుతము, నపూర్వము, నభీష్టఫలప్రదాయకము నైన బ్రహ్మవైవర్తమహాపురాణమును సవిస్తరముగా వర్ణింపుడని ప్రార్థించుచున్నాము. ప్రథమమున నుత్తమ బ్రహ్మఖండకథాగానము చేయవలసినదిగా గోరుచున్నాము.

అంత నుగ్రశ్రవోమహర్షి యీరీతిగా గథాప్రారంభ మొనరించెను.

బ్రాహ్మణోత్తములారా! నేను బ్రప్రథమమున నమితతేజస్వియైన నా గురుదేవులచరణకమలములకు బ్రణమిల్లి తదనంతరము శ్రీహరికి, సంపూర్ణ దేవతలకు, హరిభక్తులకు, బ్రాహ్మణులకు ననేకప్రణామము లాచరించి, యీ సనాతనమైనదివ్యపురాణగాథ నారంభించెదను. హరిభక్తులారా! నేను వ్యాస భగవానుని ముఖమునుండి యేసర్వోత్తమమైన 'బ్రహ్మఖండము' ను గ్రహించితినో యయ్యది యజ్ఞానాంధకారవినాశకము, జ్ఞానమార్గప్రకాశకము.

సనాతనమహాప్రళయకాలమం దనంతజ్యోతిఃపుంజము ప్రకాశించెను. అయ్యది కోటానుకోట్లసూర్యులకాంతికంటె మించి ప్రకాశించుచుండెను. ఆనిత్యమహాజ్యోతిర్మండలమే యసంఖ్యాకవిశ్వములకు గారణము. ఆ ప్రకాశమే స్వేచ్ఛారూపధారి, సర్వవ్యాపియైనపరమాత్మయొక్క సముజ్జ్వలతేజము. ఆ తేజో మండలములో బరమమనోహరమైనమూడుదివ్యలోకములు విరాజిల్లుచున్నవి. వానియందు శ్రేష్ఠస్థానమున గోలోకధామము కలదు. ఆ పవిత్రదివ్యగోలోక ధామము పరబ్రహ్మము వలె నిత్యమైనది. ఈధామము మండలాకారముగా మూడుకోట్లయోజనములు విస్తరించియుండెను. పరమమహోజ్జ్వల తేజమే యాలోకస్వరూపము. ఆ దివ్యలోకముయొక్క భూమి చిన్మయరత్న నిర్మితము. యోగులకేని స్వప్నమందుగూడ నాదివ్యలోకదర్శన మత్యంత దుర్లభము. కాని పరమవైష్ణవభక్తులు భగవంతుని యనన్యకరుణవలన నా పరంధామమును దర్శింపగలరు, చేరగలరు. ఆ పరమవ్యోమమందు (అప్రాకృతాకాశమందు) స్థిరమైయున్నదివ్యగోలోకపరంధామమును, బరమాత్మ తన యోగశక్తిచే ధారణచేసియుండును. ఆదివ్యలోకములో వ్యాధులకు, వృద్ధత్వమునకు, జన్మమృత్యుశోకములకు, భయము మొదలుగాగలవిపత్తులకు బ్రవేశము లేదు. అత్యుత్తమములైనదివ్యరత్నములతో నిర్మింపబడినయసంఖ్యాక చిన్మయభవనములు, గల్పవృక్షవనములు నన్నివైపుల నచట శోభించుచున్నవి. మహాప్రళయసమయమున కేవలము శ్రీకృష్ణపరమాత్మయే శేషించును. సృష్టి సమయమందు శ్రీకృష్ణుడు పరమభక్తులైనగోపీగోపజనపరివేష్టితుడై యాధామ మందు విరాజిల్లును. గోలోకధామమున కధోభాగమున నేబదికోట్లయోజనములదూరములో దక్షిణభాగమందు వైకుంఠము, వామభాగమందు శివలోకము విరాజిల్లుచున్నవి. ఈ రెండులోకములుకూడ గోలోకధామమువలె నిత్యములు, పరమమనోహరములు. మండలాకారమైనవైకుంఠలోకవిస్తార మొకకోటి

యోజనములు. ఆదివ్యధామమున శ్రీమహాలక్ష్మీసహితుడై భగవానుడగు నారాయణుడు సర్వదా విరాజిల్లుచుండును. వారితో జతుర్భుజులైనవిష్ణుపార్షదులు నివసించెదరు. వైకుంఠము జన్మజరామృత్యువిపత్తులు లేనిది.

శివలోకవిస్తార మొకకోటియోజనములు. ఆదివ్యలోకమం దుమాసహితుడగుసదాశివభగవానుడు పార్షదపరివేష్టితుడై నిత్యము విరాజిల్లుచుండును.

గోలోకమధ్యమున నత్యంతమనోహర మైనదివ్యజ్యోతి ప్రకాశించుచుండును. ఆప్రకాశము పరమాహ్లాదజనకము, నిత్యపరమానందప్రాప్తికారణము. మహాత్ములు భక్తితో, యోగముతో, జ్ఞానముతో సదా తద్దివ్యతేజమునే ధ్యానింతురు. ఆజ్యోతియే పరమానందప్రదాయకము, నిరాకారపరాత్పర పరబ్రహ్మము. ఆబ్రహ్మజ్యోతినడుమనత్యంతసుందరాకారుడు, సుమనోహరుడు, సచ్చిదానందస్వరూపుడు సుశోభితుడునై ప్రకాశించుచున్నాడు. ఈ యనంత తేజఃపుంజ మంతయు నాసచ్చిదానందవిగ్రహునిప్రకాశమే. ఆదివ్యమూర్తి నూతన జలధరమువలె శ్యామలవర్ణుడు. ఆయననేత్రములు శరత్కాలమందువికసించు కమలములవలె సువిశాలములు. ముఖమండలము నిర్మలమై శరత్పూర్ణిమనాటి యసంఖ్యాకచంద్రులశోభనుగూడమించిప్రకాశించుచున్నది. ఆయనరూపలావణ్యములయెదుట గోటానుకోట్లమన్మథులసౌందర్యముకూడ సరిరాదు. ఆసుమనోహరచిన్మయరూప మనంతదివ్యలీలలకు బరంధామము. ఆపరబ్రహ్మము ద్విభుజుడై, హస్తములయందు 'మురళి'ని ధరించి శోభించుచున్నాడు. నగుమోముపై జిఱునవ్వులు చిందులాడుచున్నవి. ఆదివ్యపీతాంబరధారిసర్వాంగములకుసుందరరత్నమయభూషణము లలంకారములైయున్నవి. ఆదేవాదిదేవుడు భక్తులయెడననన్యవాత్సల్యముకలిగియుండుకరుణామయుడు. ఆయనదివ్యాంగములన్నియు జందనముచే, గస్తూరీకుంకుమములచే నలంకృతములై యలరారుచున్నవి. శ్రీవత్సాలంకృతమైనయాయనవక్షస్థలమందలంకృతమై దివ్యకౌస్తుభము ప్రకాశించుచున్నది. శిరముపై నుత్తమరత్ననిర్మిత మైనమకుటము నెమలిపింఛములతో నలంకరింపబడి జాజ్వల్యమానముగా బ్రకాశించుచున్నది. ఆశ్యామసుందరుడైనపురుషోత్తముడు రత్ననిర్మితసింహాసనము నధిష్ఠించియున్నాడు. గళమునం దాజానులంబి యైనవనమాల పరమశోభను జేకూర్చుచున్నది. ఆభగవంతుడే స్వేచ్ఛామయుడని, యాదికారణుడని, సర్వాధారుడని, పరాత్పరుడని, పరమాత్మయని, పరబ్రహ్మమని, పురుషోత్తముడని భక్తజనులు

సదాకీర్తించెదరు. ఆభగవానుడు సదాకిశోరవయస్కుడై గోపవేషముధరించి యుండును. కోటానుకోట్లపూర్ణచంద్రులప్రభకంటె నత్యంతశోభాసంపన్నుడై విరాజిల్లు నయ్యాదిపురుషుడు తనయనన్యభక్తుల ననుగ్రహించుటకొఱకు సదా యాతురతకల్గియుండును. ఆయనయే నిరీహుడు, నిర్వికారుడు, పరిపూర్ణుడు. సర్వవ్యాపియై పరమేశ్వరుడై రాసమండలములో విరాజమానుడై, శాంతచిత్తముతో, బరమమనోహరమైనదివ్యరూపముతో రాసేశ్వరుడై ప్రకాశించుపరమాత్మ, పరమానందమునకు బీజస్వరూపము. ఆసచ్చిదానంద స్వరూపుడే సత్యము, నక్షరము, నిత్యము, నవినాశియునై సదా ప్రకాశించును. ఆయనయే సమస్త సిద్ధులకు స్వామియై, సర్వసిద్ధిస్వరూపుడై, సర్వసిద్ధిప్రదాతయై, ప్రకృతి కతీతుడై, యీశ్వరుడై, నిర్గుణుడై, నిత్యసాకార దివ్యవిగ్రహుడై, యాదిపురుషుడై, యవ్యక్తుడై యుండును. అనంతదివ్య నామములతో సద్భక్తులు సర్వదా యాసర్వేశ్వరునే గీర్తించెదరు. ఎందఱో పరమపురుషులు వివిధస్తోత్రములద్వారమున నాయననే ప్రార్థింతురు. ఆయన సత్యము, సర్వస్వతంత్రము, కేవలము పరబ్రహ్మమైనపరమాత్మస్వరూపము. సకలజీవులకు నాశ్రయుడు, పరమశాంతుడునైనయాశ్రీకృష్ణపరమాత్మనే పరమ భక్తవైష్ణవజనులు సదా ధ్యానించి, యారాధింతురు. ఉత్కృష్టదివ్యరూపధారి మైన (ఆయేకైకభగవంతుడు) శ్రీకృష్ణపరమాత్మ మహాప్రళయకాలమందు సర్వదిక్కులు, మహాకాశము, సర్వవిశ్వములు, శూన్యములై యుండుట గాంచెను.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణములోని
బ్రహ్మఖండమందలి 'శ్రీకృష్ణభగవానుని పరాత్పర
స్వరూపనిరూపణ' మను రెండవ అధ్యాయము
సంపూర్ణము.

—♦—

# మూడవ అధ్యాయము

## శ్రీకృష్ణుడు సృష్టిచేయనారంభించుట; నారాయణాది దేవతలు ప్రాదుర్భవించుట; వీరు వేఱువేఱుగ శ్రీకృష్ణుని స్తుతించుట.

**సౌతి పలికెను:**

విశ్వము లన్నియు సర్వశూన్యములై యుండగా భగవంతుడు వీక్షించెను. ఎక్కడను జీవసంచారము లేదు, జలము లేదు. ఆకాశ మంతయు నంధకార బంధురమై యుండెను. సృష్టిరహితములై యున్న కారణమున విశ్వము లన్నియు వికృతములుగా గన్పడుచుండెను. శూన్యములైనసర్వజగములనుగాంచి స్వేచ్ఛామయ్యైకైకప్రభువు సృష్టిరచనకొఱకు సంకల్పించెను. ప్రప్రథమమున నాపరమ పురుషుని దక్షిణపార్శ్వమునుండి జగములకు మూలకారణరూపములైన సత్త్వ, రజ, స్తమోనామకగుణము లుద్భవించినవి. ఆ గుణములనుండి మహత్తత్త్వము, అహంకారము, పంచభూతములు, శబ్ద, స్పర్శ, రూప, రస, గంధపంచగుణములు క్రమముగా నుద్భవించినవి. తదనంతరము శ్రీకృష్ణునినుండి సాక్షాత్తుగభగ వంతు డైనశ్రీమన్నారాయణు డుద్భవించెను. ఆయన యంగములకాంతి శ్యామలవర్ణము. శ్రీహరి నిత్యకిశోరు డైనపీతాంబరధారి. వనమాలావిభూషితు డై యున్నహరి తనచతుర్భుజములయందు శంఖచక్రగదాపద్మములను ధరించి, చిఱునవ్వులు విరాజిల్లుముఖారవిందముతో శోభించుచుండెను. ఆయన వివిధ రత్నమయభూషణములచే విభూషితుడై ధనుర్బాణములను ధరించి చందన చర్చితదేహముతో ప్రకాశించుచుండెను. కౌస్తుభమణియాయనవక్షస్స్థలముపై శోభించుచుండెను. శ్రీవత్సభూషితమైనయాయన వక్షస్స్థలములో సాక్షాచ్ఛ్రీ మహాలక్ష్మి నివసించియుండెను. ఆశ్రీనిధి శరత్కాలములో బ్రకాశించు ననేక పూర్ణిమాచంద్రులకాంతి నధిగమించగలతేజముతో బ్రకాశించుచుండెను. ఆయనరూపలావణ్యసౌందర్యము లసంఖ్యాక మన్మథులసౌందర్యములను మించి యుండెను. ఆశ్రీమన్నారాయణుడు శ్రీకృష్ణపరమాత్మయెదుట నిలువబడి ముకుళితహస్తుడై యీవిధముగా స్తుతింపనారంభించెను.

వరం వరేణ్యం వరదం వరార్హం వరకారణమ్ ।
కారణం కారణానాం చ కర్మ తత్కర్మకారణమ్ ॥
తప స్తత్ఫలదం శశ్వత్ తపస్వీనాం చ తాపసమ్ ।

వన్దే నవఘనశ్యామం స్వాత్మారామం మనోహరమ్ ॥
నిష్కామం కామరూపం చ కామఘ్నం కామకారణమ్ ।
సర్వం సర్వేశ్వరం సర్వబీజరూప మనుత్తమమ్ ॥
వేదరూపం వేదబీజం వేదోక్తఫలదం ఫలమ్ ।
వేదజ్ఞం తద్విధానం చ సర్వవేదవిదాం వరమ్ ॥

"శ్రేష్ఠుడు, సత్పురుషులచేబూజింపబడువాడు, వరముల నిచ్చువాడు, వరప్రాప్తికారణుడు, సకలకారణుడు, కర్మస్వరూపుడు, సకలకర్మకారణుడు, తపస్స్వరూపుడు, నిత్యనిరంతరతపఃఫలప్రదాయకుడు, తేజోమయపురుషులయందు సర్వోత్తము డైనపరమపురుషుడు, నూతన జలధర సదృశ శ్యామలవర్ణ కాంతి యుక్తుడు, స్వాత్మారాముడు, మనోహరుడు, నిష్కాముడు, కామరూపుడు, కోరికలను నశింపజేయగలవాడు, మన్మథోత్పత్తికి గారణభూతుడు, సర్వతపస్స్వరూపుడు, సర్వబీజస్వరూపుడు, సర్వేశ్వరుడు, వేదములకుబీజమైనవాడు, వేదోక్త ఫలప్రదాత, ఫలస్వరూపుడు, సర్వవేదజ్ఞానస్వరూపుడు, వేదజ్ఞానసంపన్నుడు నగు నా శ్రీకృష్ణునకు నేను ప్రణామముల నర్పించుచున్నాను".

ఈవిధముగా శ్రీకృష్ణుని స్తుతించి శ్రీమన్నారాయణుడు పరమాత్మ నాజ్ఞతో రమణీయరత్నమయసింహాసనము నలంకరించెను. ఎవరు ప్రతిదిన మేకాగ్రచిత్తముతో త్రిసంధ్యలయందు నారాయణప్రోక్త శ్రీకృష్ణస్తోత్రమును బఠించెదరో లేక శ్రవణమొనరింతురో, వారు నిష్పాపులు కాగలరు. పుత్రులు లేనివారికి బుత్రులు, భార్యలేనివానికి భార్య, రాజ్యభ్రష్టులకు రాజ్యము, ధనవంచితులకు ధనము ఈస్తోత్రపఠనమాత్రముననే లభించును. కారాగారబద్ధులైనవా రీస్తోత్రమును బఠించిన నిశ్చయముగా బంధవిముక్తులు కాగలరు. ఒకసంవత్సర మీస్తోత్రమును బ్రతిదినము పఠించిన రోగులు రోగవిముక్తులు కాగలరు.

శౌనకాదిమహర్షులారా! తదనంతరము శ్రీకృష్ణపరమాత్మవామపార్శ్వము నుండి సదాశివభగవాను డావిర్భవించెను. ఆయనదివ్యాంగములకాంతి స్ఫటిక మణివలె నిర్మలమై, యుజ్జ్వలమై ప్రకాశించుచుండెను. పంచముఖములుకల్గిన శంకరునకు దిశలే వస్త్రములు. హరుడు మస్తకముపై సువర్ణకాంతియుక్త మైనజటాజూటమును ధరించి చిఱునవ్వులు చిందులుత్రొక్కు నగుమోముతో బ్రకాశించుచుండెను. త్రినేత్రధారి యైనశంకరుడు శిరములపై చంద్రాకార కిరీటములు ధరించియుండెను. పరమేశ్వరుడు హస్తములయందు త్రిశూలము,

డమరుకము, పట్టిశము, జపమాల ధరించియుండెను. శివుడు పరిపూర్ణసిద్ధుడు, సకలసిద్ధేశ్వరుడు, పరమయోగు లైనవారిగురువులకే గురువు, మృత్యువునకే మృత్యువు,మృత్యుంజయుడు, మృత్యుస్వరూపుడు, భక్తిజ్ఞానానందమయుడు, మహాజ్ఞాని, మహాజ్ఞానప్రదాత మైనసర్వశ్రేష్ఠుడు. పూర్ణచంద్ర ప్రభాసదృశమై ప్రకాశించు గౌరవర్ణు డైనసదాశివునిదర్శనము సర్వదా శుభప్రదాయకము. శంకరుని సుందరదివ్యాకృతి మనమునే మోహింపజేయగలదు. పరమమనోహర పరబ్రహ్మ తేజముతో జాజ్వల్యమానముగా బ్రకాశించుపరమశివుడు వైష్ణవుల యందు శిరోమణి. ఈశ్వరుడు హస్తములను ముకుళించి యనన్యభక్తిభావముతో బులకితశరీరుడై యానందాశ్రుధారాయుక్తనేత్రుడై, గద్గదస్వరముతో శ్రీకృష్ణ పరమాత్మను స్తుతింపదొడంగెను.

జయస్వరూపం జయదం జయేశం జయకారణమ్ ।
ప్రవరం జయదానాం చ వన్దే త మపరాజితమ్ ॥
విశ్వం విశ్వేశ్వరేశం చ విశ్వేశం విశ్వకారణమ్ ।
విశ్వాధారం చ విశ్వస్థం విశ్వకారణకారణమ్ ॥
విశ్వరక్షాకారణం చ విశ్వఘ్నం విశ్వజం పరమ్ ।
ఫలబీజం ఫలాధారం ఫలం చ తత్ఫలప్రదమ్ ॥
తేజఃస్వరూపం తేజోదం సర్వతేజస్వినాం వరమ్ ॥

జయస్వరూపుడు, జయప్రదాత, సర్వసమర్థుడు, జయప్రాప్తికారణుడు, విజయప్రదాతలయందుసర్వశ్రేష్ఠుడు, అపరాజితు డైనవాడునగుశ్రీకృష్ణునకు నా నమస్కారము. సంపూర్ణ విశ్వస్వరూపుడు, విశ్వేశ్వరేశ్వరుడు, విశ్వకారణ కారణుడు, విశ్వాధారుడు, విశ్వవిశ్వాసభాజనుడు నగు శ్రీకృష్ణున కివే నా వందనములు. జగద్రక్షకుడు, జగత్సంహారకుడు, జగత్సృష్టికారకుడు, పరమేశ్వరుడు, ఫలబీజస్వరూపుడు, సర్వఫలప్రదాతయు, సర్వఫలాధారుడు, ఫలస్వరూపుడు నగుశ్రీకృష్ణపరమాత్మ కివే నావందనములు. తేజస్స్వరూపుడు, తేజఃప్రదాతయు సంపూర్ణ తేజస్వులయందు శ్రేష్ఠుడు నగుగోవిందున కివే నా వందనములు.

ఈవిధముగా స్తుతించి వినీతభావముతో ననేకప్రణామము లర్పించి శంకరుడు పరమాత్మాజ్ఞానువర్తియై రత్నమయసింహాసనము నలంకరించెను. ఎవరు మహాదేవుడు స్తుతించినఈ స్తోత్రమును సంయమచిత్తులై పఠించెదరో వారికి సంపూర్ణసిద్ధులు ప్రాప్తింపగలవు. వారికి మిత్రులు, ధనము, ఐశ్వర్యముసదా వృద్ధిచెందగలవు. దుఃఖములు, పాపములు, శత్రుసమూహములు నశింపగలవు.

తదనంతరము శ్రీకృష్ణపరమాత్మనాభికమలమునుండి మహాతపస్వియైన యాదిబ్రహ్మ ప్రాదుర్భవించెను. ఆబ్రహ్మదేవుడు చతుర్ముఖుడై తనహస్తముల యందు గమండలమును, జపమాలనుధరించియుండెను. ఆయన వస్త్రములు, దంతములు, కేశములు శ్వేతవర్ణములై యున్నవి. బ్రహ్మ యోగుల కీశ్వరుడు, శిల్పులకు స్వామి, సర్వదేహధారులకు జన్మదాత, గురువు. ఆయన తపఃఫలదాత, సంపూర్ణసంపత్ప్రదాత. ఆయనయే జగత్స్రష్టయగువిధాత, సమస్త కర్మలకు గర్త, భర్త, సంహర్త. ఆయన సకలవేదజ్ఞాన సంపన్నుడు, వేదపతి, వేదములను ప్రకటించినవాడు. ఆయన శీలస్వభావము లత్యంత సుందరములు. శాంతచిత్తుడైనబ్రహ్మ సరస్వతీకాంతుడు, కృపానిధి. ఆయన శ్రీకృష్ణునెదుట నిలువబడి నతమస్తకుడై, హస్తములను ముకుళించి పులకిత గాత్రుడై నయనములనుండి యానందబాష్పములు రాలుచుండగా భక్తిభావముతో నిట్లు స్తుతింపదొడంగెను.

కృష్ణం వన్దే గుణాతీతం గోవిన్ద మేక మక్షరమ్ ।
అవ్యక్త మవ్యయం వ్యక్తం గోపవేషవిధాయినమ్ ॥
కిశోరవయసం శాన్తం గోపీకాన్తం మనోహరమ్ ।
నవీననీరదశ్యామం కోటికన్దర్పసున్దరమ్ ॥
బృన్దావనవనాభ్యర్ణే రాసమణ్డలసంస్థితమ్ ।
రాసేశ్వరం రాసవాసం రాసోల్లాససముత్సుకమ్ ॥

"త్రిగుణాతీతుడు, ఏకమాత్రుడు, అవినాశియు, బరమేశ్వరుడు, నెట్టివికారములులేనివాడు, వ్యక్తావ్యక్తరూపుడు, గోపవేషధారియు నగుశ్రీకృష్ణునకివే నావందనములు. నిత్యనూతనయౌవనుడు, శాంతస్వభావుడు, కోటానుకోట్ల మన్మథులసౌందర్యముకంటె నధికసౌందర్యముగలవాడు, నూతన జలధరమువలె శ్యామవర్ణముకలిగియున్నవాడు, పరమమనోహరుడైనవాడు నగుగోపీవల్లభునకు నేను బ్రణమిల్లెదను. బృందావనములో రాసమండలమధ్యమున విరాజిల్లువాడు, రాసలీలలలో సదా రమించుచుండువాడు నగురాసేశ్వరునకు నానమస్కారములు."

ఈవిధముగా స్తోత్రముచేసి బ్రహ్మ శ్రీకృష్ణాజ్ఞానుసారముగా రత్నమయ సింహాసనము నధిష్ఠించెను. ఎవరు ప్రాతఃకాలమందు బ్రహ్మదేవునిచే గీర్తింపబడిన ఈస్తోత్రమును స్తుతించెదరో వారిసర్వపాపములు నశింపగలవు. వారికి హరియెడల

ననన్యభక్తి పెంపొందగలదు. ఈ స్తోత్రపఠనమువలన మానవుల కపకీర్తితొలగి సత్కీర్తి ప్రాప్తింపగలదు.

తదనంతరము శ్రీకృష్ణపరమాత్మవక్షస్స్థలమునుండి ధర్మదేవతయుద్భవించెను. చిఱునవ్వులు విరాజిల్లుచున్న ముఖారవిందము గలధర్మదేవుని కాంతి శ్వేతవర్ణము. జటాజూటధారి యైనయాధర్మదేవతయే సర్వసాక్షి, సర్వజ్ఞుడు, సర్వకర్మద్రష్ట, సకలజీవులయందు సమభావముకలిగినవాడు. ఆయనహృదయమందు సకల ప్రాణులయెడ దయారసము కలదు. ధర్మదేవత హింసాక్రోధగుణరహితుడై, ధర్మజ్ఞుడై, ధర్మస్వరూపుడై, ధర్మిష్ఠుడై, ధర్మప్రధానుడై యుండును. ఆయన సకలధర్మాత్ములయందు 'ధర్మ' మనునామముతో విఖ్యాతుడు. శ్రీకృష్ణుని యోగాత్మమాయచే సృజింపబడినధర్మదేవత, మనోభీష్టములను ప్రసాదించుకల్ప వృక్షస్వరూపు డైన శ్రీకృష్ణుని వినమ్రభావముతో ప్రస్తుతింపదొడంగెను.

కృష్ణం విష్ణుం వాసుదేవం పరమాత్మాన మీశ్వరమ్ ।
గోవిన్దం పరమానన్ద మేక మక్షర మచ్యుతమ్ ॥
గోపేశ్వరం చ గోపీశం గోపం గోరక్షకం విభుమ్ ।
గవా మీశం చ గోష్ఠస్థం గోవత్సపుచ్ఛధారిణమ్ ॥
గోగోపగోపీమధ్యస్థం ప్రధానం పురుషోత్తమమ్ ॥
వన్దే నవఘనశ్యామం రాసవాసం మనోహరమ్ ॥
ఇత్యుచ్చార్య సముత్తిష్ఠన్ రత్నసింహాసనే వరే ।
బ్రహ్మవిష్ణుమహేశాం స్తాన్ సమ్భాష్య స ఉవాస హ ॥
చతుర్వింశతినామాని ధర్మవక్త్రోద్గతాని చ ।
యః పఠేత్ ప్రాత రుత్థాయ స సుఖీ సర్వతో జయీ ॥
మృత్యుకాలే హరే ర్నామ తస్య సాధ్యం భవేద్ ధ్రువమ్ ।
స యా త్యన్తే హరేః స్థానం హరిదాస్యం లభే ద్ధ్రువమ్ ॥
నిత్యం ధర్మ స్తం ఘటతే నాధర్మే తద్రతి ర్భవేత్ ।
చతుర్వర్గఫలం తస్య శశ్వత్ కరగతం భవేత్ ॥
తం దృష్ట్వా సర్వపాపాని పలాయన్తే భయేన చ ।
భయాని చైవ దుఃఖాని వైనతేయ మి వోరగాః ॥

"సర్వజీవులను దనవైపున కాకర్షించుకొను సచ్చిదానంద స్వరూపుడగుట వలన 'కృష్ణుడ'నియు, సర్వవ్యాపియగుటవలన 'విష్ణు'వనియు, సర్వజీవులలోను నివసించియుండుటవలన 'వాసుదేవు' డనియు నా భగవంతుడు చెప్పబడు చున్నాడు. ఆయనయె పరమాత్మ, ఈశ్వరుడు, గోవిందుడు, పరమానందుడు,

ఏకైకేశ్వరుడు, అక్షరుడు, అచ్యుతుడు, గోపేశ్వరుడు, గోపీశ్వరుడు, గోపవేషధారి, గోగణరక్షకుడు, విభుడు, గోపాలకుడు, గోష్ఠనివాసి, గోవత్సపుచ్ఛధారి, గోపగోపీ సమూహామధ్యమున విరాజిల్లుపురుషోత్తముడు, నవఘనశ్యాముడు, రాసవాసుడు, మనోహరుడు మొదలగు దివ్యనామములను ధరించిన శ్రీకృష్ణ భగవానున కివే నావందనములు.

ప్రాతఃకాలమందు ధర్మముచే స్తుతింపబడిన యీ దివ్యనామములను పఠించువారు సర్వదా సుఖులై విజయులుకాగలరు. అవసానసమయమున నిశ్చయముగ వారిముఖమునుండి హరినామోచ్చారణము జరుగును. దేహమును త్యజించి వారు శ్రీకృష్ణపరంధామమునకు జేరగలరు. వారికి శ్రీహరియం దచల మైనదాస్యభక్తి కలుగగలదు. ధర్మార్థకామమోక్షములు వారికి హస్తగతములు కాగలవు. గరుత్మంతుని గాంచిన సర్పములవలె వారిదర్శన మాత్రముననే భయములు, పాపములు, దుఃఖములు తొలగిపోగలవు.”

తదనంతరము ధర్మదేవునివామపార్శ్వమునుండి తేజస్స్వరూపిణి యైన సుందరాంగి ప్రాదుర్భవించెను. ఆమె రెండవలక్ష్మివలె ప్రకాశించుచుండెను. ధర్మపత్ని యైనయామెనామధేయమే‘మూర్తి’. ధర్మము, మూర్తిరత్నసింహాసనముల నలంకరించిరి. తరువాత శ్రీకృష్ణునిముఖమునుండి శ్వేతవర్ణముతో ప్రకాశించు దేవి యావిర్భవించెను. ఆమె వీణాపుస్తకధారిణియై, యసంఖ్యాక చంద్రశోభాసంపన్న యై ప్రకాశించుచుండెను. ఆమెనేత్రములు శరత్కాలమందు వికసించినకమలములవలె విశాలములు. అగ్నియందు శుద్ధిచేయబడిన దివ్యాంబరములను ధరించి యాదేవి రత్నమయభూషణములతో విభూషితయై యుండెను. ఆమె సుందరీమణులలో శ్రేష్ఠ యైనషోడశవర్షములకన్య. శ్రుతులకు, శాస్త్రములకు, విద్యలకు నామెయే జనని. ఆమెయే వీణాది సంగీతోపకరణముల కధిష్ఠాత్రి, కవులకు నిష్టదేవి, శుద్ధసత్త్వస్వరూపిణి. శాంతస్వరూపిణి యైనసరస్వతి గోవిందునియెదుట నిలిచి వీణావాదన మొనరించుచు, హరిదివ్యగుణనామకీర్తనముల గానముచేసెను. శ్రీకృష్ణుడు వివిధకల్పములయందు, యుగములయందు, నేయేదివ్యలీల లొనరించెనో వానిని శ్రావ్యముగా గానము చేసి యాదేవి శ్రీకృష్ణు నీవిధముగా స్తుతించెను.

రాసమణ్డలమధ్యస్థం రాసోల్లాససముత్సుకమ్ ।
రత్నసింహాసనస్థం చ రత్నభూషణభూషితమ్ ।

రాసేశ్వరం రాసకరం వరం రాసేశ్వరీశ్వరమ్ ।
రాసాధిష్ఠాతృదేవం చ వన్దే రాసవినోదినమ్ ॥
రాసాయాసపరిశ్రాన్తం రాసరాసవిహారిణమ్ ।
రాసోత్సుకానాం గోపీనాం కాన్తం శాన్తం మనోహరమ్ ॥
ప్రణమ్య త మిత్యుక్త్వా ప్రహృష్టవదనా సతీ ।
ఉవాస సా సకామా చ రత్నసింహాసనే వరే ॥
ఇతి వాణీకృతం స్తోత్రం ప్రాత రుత్థాయ యః పఠేత్ ।
బుద్ధిమాన్ ధనవాన్ సోఽపి విద్యావాన్ పుత్రవాన్ సదా ॥

"రాసమండలమధ్యభాగమున విరాజిల్లుచున్నవాడు, రాసోల్లాసమున కెల్లప్పు డుత్సుకత జెందువాడు, రత్నసింహాసనమున నాసీనుడై యున్నవాడు, రత్నమయా భూషణములచే విభూషితు డైనవాడు, రాసేశ్వరుడు, రాసకర్తయు, రాసేశ్వరి యగురాధకు బ్రాణవల్లభుడు, రాస కధిష్ఠానదేవతయు, రాసలీలద్వారా మనస్సునకు వినోదము గలిగించువాడు నగునాగోవిందభగవానునకు నమస్కరించుచున్నాను. రాసలీలవలన గలిగిన శ్రమచే నలసినవాడు, ప్రతిరాసమునందు విహరించువాడు, రాసమున కుత్కంఠిత లగుగోపికలకు బ్రాణవల్లభుడు, శాంతుడు, మనోహరుడు నగునాశ్రీకృష్ణునకు బ్రణమిల్లుచున్నాను. ప్రాతఃకాలమున సరస్వతీకృతహరి స్తోత్రమును బఠించువారు బుద్ధిమంతులు, విద్యావంతులు, ధనవంతులు, బుత్రవంతులు కాగలరు".

తదనంతరము శ్రీకృష్ణునిమనమునుండి అరుణవర్ణముతో బ్రకాశించుచు శ్రీమహాలక్ష్మి ప్రాదుర్భవించెను. ఆదేవిరత్నమయాలంకారములతో నలంకృతయై పీతాంబరములను ధరించి మందహాసములు చిందులాడుప్రసన్నవదనముతో శోభిల్లుచుండెను. నవయువతియైనయామె సంపూర్ణైశ్వర్యముల కధిష్ఠాత్రి. ఆమెయే ఫలరూపముగా సకలసంపదలను బ్రసాదింపగలదు. స్వర్గమం దామె స్వర్గలక్ష్మి, రాజులగృహములం దామెరాజ్యలక్ష్మి, శ్రీమహాలక్ష్మి శ్రీకృష్ణుని యెదుట నిలువబడి హస్తములను ముకుళించి, శిరస్సును వంచి యా పరమాత్మ నీవిధముగా స్తుతించెను :

సత్యస్వరూపం సత్యేశం సత్యబీజం సనాతనమ్ ।
సత్యాధారం చ సత్యజ్ఞం సత్యమూలం నమా మ్యహమ్ ॥

"సత్యస్వరూపుడు, సత్యేశ్వరుడు, సత్యబీజరూపుడు, సత్యాధారుడు,

సత్యజ్ఞాతయు, సత్యమూలుడు, సనాతనుడు నగుశ్రీకృష్ణున కివేనావందనములు".
ఈవిధముగా శ్రీకృష్ణుని స్తుతించి దశదిశలను బ్రకాశించుచున్న సువర్ణ కాంతులతో విరాజిల్లుశ్రీమహాలక్ష్మి రత్నసింహాసన మలంకరించెను.

తదనంతరము శ్రీకృష్ణునిబుద్ధినుండి, సర్వమునకధిష్ఠాత్రియైనమూలప్రకృతి 'ఈశ్వరి'ప్రాదుర్భవించెను. తప్తకాంచనప్రభతో విరాజిల్లునా దేవిదివ్యప్రకాశము కోటానుకోట్ల సూర్యులకాంతిని మించి యుండెను. చిఱునవ్వులు విరాజిల్లునెమ్మోముతో, శరత్కాలమందువికసించినకమలములవంటి విశాలాక్షములతో నాశ్రీదేవియరుణవర్ణాంబరము ధరించి రత్నభూషణవిభూషితయై ప్రకాశించెను. నిద్ర, తృష్ణ, క్షుధ, పిపాస, దయ, శ్రద్ధ, క్షమ, మొదలగుదేవతలకు, వారితో గూడినసమస్తశక్తులకు నీమెయే యధిష్ఠాత్రి యైనఈశ్వరి. వేయిభుజములు కలిగి దర్శనమాత్రముననే భయము కల్గించు నామెయే దుర్గతినాశని దుర్గాదేవి. ఆమె పరమాత్మయగుశ్రీకృష్ణుని శక్తిస్వరూపిణి, మూడు లోకములకు పరాజనని. త్రిశూలము, శక్తి, ధనుర్బాణములు, ఖడ్గము, శంఖము, చక్రము, గద, పద్మము, అక్షమాల, కమండలము, వజ్రము, పాశము, అంకుశము, బుసుండి, దండము, తోమరము, నారాయణాస్త్రము, బ్రహ్మాస్త్రము, రౌద్రాస్త్రము, పాశుపతాస్త్రము, పర్జన్యాస్త్రము, వారుణాస్త్రము, ఆగ్నేయాస్త్రము, గాంధర్వాస్త్రము మొదలగుదివ్యాయుధములను దనసహస్రహస్తములందు ధరించి మూలప్రకృతి యీశ్వరి యగుదుర్గ ప్రసన్నతాపూర్వకముగా శ్రీకృష్ణునియెదుట నిలువబడి యనన్యభక్తితో నీవిధముగా ధ్యానింపదొడగెను.

అహం ప్రకృతి రీశానీ సర్వేశా సర్వరూపిణీ ।
సర్వశక్తిస్వరూపా చ మయా చ శక్తిమజ్జగత్ ॥
త్వయా సృష్టా న స్వతన్త్రా త్వమేవ జగతాం పతిః ।
గతిశ్చ పాతా స్రష్టా చ సంహర్తా చ పున ర్విధిః ॥
పరమానన్దరూపం త్వాం వన్దే చానన్దపూర్వకమ్ ।
చక్షుర్నిమేషకాలే చ బ్రహ్మణః పతనం భవేత్ ॥
తస్య ప్రభావ మతులం వర్ణితుం కః క్షమో విభో ।
భ్రూభఙ్గలీలామాత్రేణ విష్ణుకోటిం సృజేత్తు యః ॥
చరాచరాంశ్చ విశ్వేషు దేవాన్ బ్రహ్మపురోగమాన్ ।
మద్విధాః కతి వా దేవీః స్రష్టుం శక్తశ్చ లీలయా ॥
పరిపూర్ణతమం స్వేడ్యం వన్దే చానన్దపూర్వకమ్ ।

మహాన్ విరాడ్ యత్కలాంశో విశ్వాసంఖ్యాశ్రయో విభో ॥
వన్దే చానన్దపూర్వం తం పరమాత్మాన మీశ్వరమ్ ॥
యం చ స్తోతు మశక్తాశ్చ బ్రహ్మవిష్ణుశివాదయః ।
వేదా అహం చ వాణీ చ వన్దే తం ప్రకృతేః పరమ్ ॥
వేదాశ్చ విదుషాం శ్రేష్ఠాః స్తోతుం శక్తా న లక్షతః ।
నిర్లక్ష్యం కః క్షమః స్తోతుం తం నిరీహం నమా మ్యహమ్ ॥
ఇత్యేవ ముక్త్వా సా దుర్గా రత్నసింహాసనే వరే ।
ఉవాస నత్వా శ్రీకృష్ణం తుష్టువు స్తాం సురేశ్వరాః ॥
ఇతి దుర్గాకృతం స్తోత్రం కృష్ణస్య పరమాత్మనః ।
యః పఠే దర్చనాకాలే స జయీ సర్వతః సుఖీ ॥
దుర్గా తస్య గృహం త్యక్త్వా నైవ యాతి కదాచన ।
భవాబ్ధౌ యశసా భాతి యాత్యన్తే శ్రీహరేః పురమ్ ॥

"భగవానుడా! నేను మూలప్రకృతినైనను, సర్వేశ్వరినైనను, సర్వ రూపిణినైనను, సర్వశక్తిస్వరూపిణినైనను, నాశక్తివలన సమస్తజగములు శక్తిమంతములైనను నేను స్వతంత్రురాలను గాను. నీవే నన్ను సృష్టించినపురుషోత్తముడవు. నీవే సర్వత్రిలోకములకు గతివి, పతివి, స్రష్టవు, పాలకుడవు, సంహారకుడవు, సృష్టికర్తవు. పరమానందమే నీదివ్యస్వరూపము. నే నానంద భరితహృదయాంతరంగనై నీకు బ్రణామము లర్పించుచున్నాను. నీసంకల్పమువలన నొక్కక్షణమాత్రమున నే యనేకబ్రహ్మలు నశింపగలరు. నీవు లీలామాత్రముగా గోటానుకోట్లవిష్ణువులను సృష్టింపగలవు. అటువంటి నీయనుపమ ప్రభావములను వర్ణించుట యెవరితరము? నీవు త్రిలోకములను, సకలచరాచర జీవులను, బ్రహ్మాదిదేవతలను, నావంటిమహెందఱనోశక్తులను త్రుటికాలములో సృష్టింపగలవు. నీవే పరిపూర్ణ పరబ్రహ్మ మైనపరమాత్మవు. అసంఖ్యాకవిశ్వముల కాశ్రయభూతు డైనవిరాట్పురుషుడు నీ షోడశకలాంశమాత్రుడు. పరమాత్మా! శ్రీకృష్ణా! నేను నీ కనేకప్రణామము లర్పించుచున్నాను. ప్రకృతికిసహిత మతీతుడ వైనపరమేశ్వరా! నేను, సరస్వతి, బ్రహ్మ, విష్ణువు, శివాదిదేవతలు మొదలగువారందఱు నీదివ్యలీలలను గానముచేయుటలో నసమర్థులే. ఈప్రకారముగా శ్రీకృష్ణు ననేకవిధముల స్తుతించి మూలప్రకృతి యీశ్వరియగుదుర్గయాయనయాజ్ఞ చేరత్నమయసింహాసనమలంకరించెను. ఎవరు దుర్గామాతచే గావింపబడినయీ స్తవరాజమును బఠింతురో వారికి సర్వత్ర

విజయములు, సుఖములు ప్రాప్తించును. దుర్గాదేవి వారిగృహమును వీడదు. వారు దేవీకటాక్షమునకు పాత్రులై భవసాగరమును దరించి యంత్యకాలమున బరంధామమును జేరగలరు."

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని సృష్టినిరూపణ మను
మూడవ అధ్యాయము
సంపూర్ణము

—o—

# నాలుగవ అధ్యాయము

## శ్రీకృష్ణభగవానుని వివిధాంగములనుండి సావిత్రి మున్నగు దేవత లావిర్భవించుట.

**సౌతి పలికెను :**

మహర్షులారా ! తదనంతరము శ్రీకృష్ణునిజిహ్వాగ్రమునుండి శుద్ధస్ఫటిక సమానోజ్జ్వలవర్ణముతో ప్రకాశించుమనోహారిణియైన 'దేవి' ప్రాదుర్భవించెను. శ్వేతవస్త్రధారిణియై, యనేకప్రకారరత్నభూషణములతో విభూషితయై, హస్తమునందు జపమాలను ధరించియుండెను. ఆదేవియే 'సావిత్రి'. సాధ్వియగు నాసావిత్రి చేతులు జోడించి భక్తిభావముతో బరబ్రహ్మమైన శ్రీకృష్ణు నీవిధముగా స్తుతింపదొడగెను.

నమామి సర్వబీజం త్వాం బ్రహ్మజ్యోతిః సనాతనమ్ ।
పరాత్పరతరం శ్యామం నిర్వికారం నిరంజనమ్ ॥

"భగవానుడా! సర్వమునకు బీజస్వరూపుడవు, ఆదికారణుడవు, సనాతన బ్రహ్మజ్యోతివి, పరాత్పరుడవు, నిర్వికారుడవు, నిరంజనుడవు, శ్యామసుందరుడవు నగునీ కివే నావందనములు". వేదమాత యగుసావిత్రి యిట్లు స్తుతించి, శ్రీకృష్ణునకు ప్రణామము లాచరించి, రత్నమయసింహాసనము నలంకరించెను.

తరువాత శ్రీకృష్ణునిమనమునుండి 'మన్మథుడు' ప్రాదుర్భవించెను. అతడు

తప్తసువర్ణకాంతియుక్తుడు, పంచబాణములద్వారమున సమస్తప్రాణులమనము లను మథింపగలవాడు. కావుననే వానిని 'మన్మథు' డందురు. మన్మథునివామ పార్శ్వమునుండి శ్రేష్ఠకామిని యైనపరమసుందరి యగు 'రతీదేవి' ప్రాదుర్భ వించెను. ఆమె సమస్తప్రాణుల మనస్సులను మోహపఱచునట్టిది, మెల్ల మెల్లగ నవ్వు నాసతిని జూచి ప్రాణు లందఱకు నామెయందు రతి గలిగెను. అందువలననే యామెను'రతీదేవి' యందురు. మారణము, స్తంభనము, జృంభ ణము, శోషణము, ఉన్మాదము - అనునీయైదు మన్మథునియొక్క పంచ బాణములు. వానిని బరీక్షించుటకు మన్మథుడు విశ్వముపై బ్రయోగించెను. ఈశ్వరునియిచ్ఛామాత్రమున నందఱు 'కామదేవు'నకు వశులైరి. మహాయోగి యైనబ్రహ్మవీర్యము స్ఖలనమై 'అగ్ని'రూపమున నుద్దీప్తమయ్యెను. అగ్నిదేవుడు జాజ్వల్యమానుడై విశ్వమునందు ప్రజ్వరిల్లదొడంగెను. క్షణక్షణము వృద్ధి నొందుచున్ననగ్నిని గాంచి శ్రీకృష్ణుడు తననిశ్వాసమునుండి యొకజలకణమును బహిర్గతమొనరింపగా నది సంపూర్ణవిశ్వము నాప్లావితమొనర్చెను. అగ్ని శాంతించి పురుషరూపమును దాల్చెను. ఆ జలములనుండి 'వరుణదేవు'డుద్భవిం చెను. అగ్నిదేవునివామపార్శ్వమునుండి యొకదేవి యావిర్భవించినది. ఆమెయే 'స్వాహాదేవి'. వరుణదేవునివామపార్శ్వమునుండి 'వారుణి' ప్రాదుర్భవించినది. 'స్వాహాదేవి'అగ్నిపత్ని యైనది. వారుణీదేవి 'వరుణు'నిపత్ని యైనది. శ్రీకృష్ణ భగవానుని నిశ్వాసమునుండి 'పవనుడు'ప్రాదుర్భవించెను. ఆయనయే సమస్త దేహధారులకు ప్రాణస్వరూపుడు. వాయుదేవునివామపార్శ్వమునుండి వానిపత్ని 'వాయవీదేవి' ప్రాదుర్భవించెను.

శ్రీకృష్ణునివీర్యము జలమునందుబడి యొకసహస్రదైవవర్షములతరువాత 'మహాండరూపము'ను దాల్చెను. ఆ 'యండము' నుండియే 'విరాట్పురుషు'ని యుత్పత్తిసంభవించెను. ఆయనయే సంపూర్ణవిశ్వమున కాధారస్వరూపుడు. ఆవిరాట్పురుషునిరోమకూపములయందు 'బ్రహ్మాండము'లు ధరింపబడియున్నవి. ఆయన మహాస్థూలములలో స్థూలతముడు. ఆవిరాట్పురుషునిమించినవాడు మఱియొకడు లేడు. ఆయన శ్రీకృష్ణునియొక్క పదునాఱవ యంశ మాత్రమే. ఆయన నామధేయము శ్రీమహావిష్ణువు. శ్రీమహావిష్ణువే సర్వస్థావరజంగమవిశ్వసముదాయములకు సనాతనాధారము. జలాశయమునందు 'కమల' మున్నట్లు, మహావిరాట్పురుషుడు మహార్ణవజలములో శయనించి యుండును. శ్రీమహావిష్ణువు శయనించియుండగా ఆయనకర్ణములమలమునుండి

'మధుకైటభు' లనుమహాదైత్యు లుద్భవించిరి. వారు జలములనుండి లేచి బ్రహ్మను గబళించుటకు నుద్యుక్తులు కాగా నారాయణుడు వారిని దనతొడలపై నిద్రింపజేసి, తనచక్రాయుధము ప్రయోగించి సంహరించెను. ఆదానవుల క్రొవ్వునుండియే యీ సమస్త పృథ్వి యుత్పన్నమైనది. అందువలననే భూమికి 'మేదిని'యనుపేరు కల్గెను. దాని మీదనే సమస్తవిశ్వము నిలచియున్నది. భూమియొక్క యధిష్ఠాత్రిదేవినామధేయమే'వసుంధర'.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండములోని వివిధదేవతావిర్భావ
మను నాలుగవ అధ్యాయము
సంపూర్ణము.

## ఐదవ అధ్యాయము

### బ్రహ్మాదికల్ప పరిచయము; శ్రీకృష్ణునినుండి రాధ, గోపులు, గోవులు, బలీవర్దములు, హంసలు, శ్వేతాశ్వములు, సింహములు మున్నగునవి యుత్పన్నమగుట; శ్రీకృష్ణుడై దురథములను నిర్మించుట.

**సౌతి పలికెను :**

బ్రాహ్మణశ్రేష్ఠులారా ! నేను మొదట బ్రహ్మకల్పమునుగురించి వర్ణించితిని. ఇపుడు వరాహ, పద్మకల్పములను వర్ణించెదను. సావధానచిత్తులరై యాకర్ణించెదరుగాక. బ్రాహ్మ,వారాహ,పాద్మనామకములగు మూడుకల్పములు క్రమముగా నావిర్భవించుచు సమయానుసారముగా దిరోగమింపగలవు. సత్య, త్రేతా, ద్వాపర, కలియుగము లట్లు ఈ కల్పములుకూడక్రమముగ ప్రాదుర్భవించును. మూడువందలయఱువదియుగము లొకదివ్యయుగము. డెబ్బదియొక్క దివ్యయుగము లొకమన్వంతర మగును. పదునాల్గుమన్వంతరములు బ్రహ్మకొక దినము. అటువంటి మూడువందలయఱువదిదినములు బ్రహ్మకొక సంవత్సరము.

ఈప్రకారముగా నూటయెనిమిది సంవత్సరములు బ్రహ్మకుబూర్ణాయుర్దాయము. అట్టిబ్రహ్మయొక్క యాయుర్దాయము శ్రీకృష్ణపరమాత్మ కొక నిమేషకాలము మాత్రమేయగును. కాలవేత్త లయినవిద్వాంసులు బ్రహ్మాయుర్దాయము సరిగా నొకమహాకల్పమని నిశ్చయించిరి. చిన్నచిన్నకల్పములు చాలగలవు. అవి 'సంవర్తము' మొదలగు నామములతో విఖ్యాతములు. 'మార్కండేయ' మహర్షి యాయుర్దాయ మేడుకల్పములని చెప్పబడినది. అటువంటిచిన్నకల్పము బ్రహ్మ కొకదినము. సారాంశ మేమనగా 'మార్కండేయు' నాయుర్దాయ మంతయు బ్రహ్మ కేడుదినములు మాత్రమే. బ్రాహ్మ,వారాహ,పాద్మకల్పములనునవిమూడు మహాకల్పములు. ఈకల్పములందే యేప్రకారముగా సృష్టిజరుగునో వర్ణించెదను, ఆవధరింపుడు. బ్రాహ్మకల్పమందు 'మధుకైటభుల' మేధస్సుతో 'మేదిని'ని సృష్టించి, బ్రహ్మ శ్రీకృష్ణభగవాను ననుగ్రహమున నితరసృష్టిని రచించెను. వారాహకల్పమందు బృథ్వియేకార్ణవజలములందుమునుగగా వరాహరూపధారి యైనమహావిష్ణువత్యంతప్రయత్నపూర్వకముగా బృథ్విని రసాతలమునుండిపునరుద్ధరించెను. తదనంతరము బ్రహ్మ సృష్టిరచించెను. పాద్మకల్పమందుసృష్టికర్తయగు బ్రహ్మ విష్ణువుయొక్క నాభికమలమునుండి ప్రాదుర్భవించి సృష్టి గావించెను. బ్రహ్మ, బ్రహ్మలోకపర్యంతమున్నత్రిలోకములను సృజించెను. బ్రహ్మలోకముపైనప్రాకృతవ్యోమమం దున్న దివ్యనిత్యలోకములు, పై నుదాహరింపబడిన ప్రాకృతాకాశమందున్నత్రిలోకములుకావని గ్రహింపవలెను. ఈసృష్టినిరూపణ ప్రసంగమందు నేను కాలగణనవర్ణనమును గావించితిని. కించిన్మాత్రముగ సృష్టినిగూడ బ్రవచించితిని. తదనంతరము మీ రే విషయములను శ్రవణముచేయగోరెదరో తెలుపవలెను.

**శౌనకమహర్షి ప్రశ్న :**

సూతనందనా ! గోలోకమందు సర్వవ్యాపి యైనపరమాత్మ, శివకేశవాదులను సృజించి మఱియేమిచేసెను ? కృపతో నావిషయములను విస్తరించి వర్ణింపవలసినదిగా గోరుచున్నాము.

**సౌతి పలికెను :**

సకలదేవతలను సృజించి వారిని వెంట నిడుకొని శ్రీకృష్ణపరమాత్మ యత్యంతరమణీయమైన, సురమ్యమైన రాసమండలమధ్యమునకు గొనిపోయెను. రమణీయకల్పవృక్షవనమధ్యభాగమున విరాజిల్లురాసమండల మత్యంతమనోహ

రము. అయ్యది విస్తృతమై, సుందరమై, సమతలముగా నుండెను. చందనము, కస్తూరి, యగరువు, కుంకుమముమున్నగువానితో నలంకరింపబడి నూతనచందన పల్లవతోరణములతో గదళీస్తంభములతో బరివృతమై కోటానుకోట్ల రమణీయదివ్యరత్నమండపములు కల్గి మణిమయదీపములతో నాదివ్య రాసమండలము దేదీప్యమానముగా బ్రకాశించుచుండెను. మహోజ్జ్వల మైన దివ్యరాసమండలమహావైభవమును గాంచి సర్వదేవతలు పరమాశ్చర్యచకితు లైరి. ఆరాసమండలమున శ్రీకృష్ణునివామపార్శ్వమునుండి యొకదివ్యమంగళ సుందరస్వరూపిణి యైనకన్యాకారత్న మావిర్భవించెను. ఆవిర్భవించినవెంటనే యాదేవి దివ్యపారిజాతపుష్పములతో జగన్నాథుని చరణారవిందముల నర్చించెను. ఆమె సకలసుందరీమణులయందు బరమమనోహారిణి యైనదివ్య సుందరి. కిశోరవయస్క యగునాసుందరిదివ్యసౌందర్యము వర్ణనాతీతము. ఆదేవియొక్క ముఖారవిందద్యుతి కోటానుకోట్లశరత్కాలరాకాచంద్రుల కాంతిని మించి ప్రకాశించుచుండెను. శరత్కాలపద్మములవలె సువిశాల నేత్రములతో, దర్పణములవంటిసుందరకపోలములతో, ముత్యములవంటి పలు వరుసతో, ముఖమండలమందు గస్తూరి, కళ్యాణతిలకములనుధరించి, సుదీర్ఘ కేశపాశములయందు దివ్యమాలతీమాలల నలంకరించుకొని, యనేకదివ్యరత్న నిర్మితభూషణములతో విభూషితయై, సురమ్యశబ్ద మొనరించు మణినిర్మిత మంజీరములనుధరించి, సర్వలోకములయందు బరమసౌందర్యవతిగా నా కన్యకారత్నము ప్రకాశించెను. ఆదేవి గోవిందు ననేకవిధముల స్తుతించి రత్నసింహాసన మలంకరించి, తదేకదృష్టితో దనప్రాణవల్లభు డైనశ్రీకృష్ణుని దివ్యముఖారవిందమును వీక్షింపదొడంగెను. ఆదివ్యభామినిరోమములనుండి యాసమయమున లక్షకోట్లసంఖ్య గలగోపికాంత లావిర్భవించిరి. వారు పరమసౌందర్యవతు లైననిత్యయువతులు. వీ రందఱు నాజగదేకసుందరి యైనరాధామాతకు బార్షదకన్య లైరి. ఆసమయముననే శ్రీకృష్ణునిరోమముల నుండి యసంఖ్యాకగోపకుమారు లుద్భవించి, యాయనకు బార్షదులైరి. వారు గుణరూపవేషములయందు శ్రీకృష్ణునే పోలియుందురు.

తదనంతరము పరమాత్మరోమములనుండి యనేకగోగణములుద్భవించినవి. 'సురభి'జాతిగోవులు, సుందర మైనగోవత్సములు, నత్యంతమనోహరకపిల కామధేనువులు వానియందు గలవు. ఆగోగణములందు గలకోటానుకోట్ల సింహబలసంపన్న మైనదివ్యవృషభమును శ్రీకృష్ణుడు సదాశివునకు వాహన

ముగా నొసంగెను. తరువాత భగవంతుని 'నఖము' లనుండి యనేక శ్వేతహంసలు జనించినవి. వానియందు శ్రేష్ఠమైనహంసను బ్రహ్మదేవునకు వాహనముగా బరమాత్మ ప్రసాదించెను. తదుపరి శ్రీకృష్ణునికర్ణములనుండి జన్మించిన శ్వేతాశ్వములయందుత్తమాశ్వము నాదేవాదిదేవుడు 'ధర్మదేవత' కొసంగెను. శ్రీకృష్ణునిదక్షిణకర్ణమునుండి యుద్భవించినసింహసమూహములయందు 'మృగేంద్రు'ని భగవంతుడు ప్రకృతియగు 'దుర్గాదేవి'కి బ్రసాదించెను. తదనంతరము పరమాత్మ తనమాయచే దివ్యరథములనుసృజించి నారాయణాదిదేవతలకు బ్రసాదించెను. అయ్యాదిపురుషుని గుహ్యప్రదేశమునుండి పింగళవర్ణము గలధనాధ్యక్షుడైన'కుబేరుడు' తనయసంఖ్యాకపార్షదులతో నుద్భవించెను. కుబేరునివామపార్శ్వమునుండి యత్యంతమనోహరసౌందర్యవతియైన 'మనోరమ' యనుదివ్యాంగన యుదయించి 'కుబేరున'కు బ్రియపత్ని యయ్యెను. తదుపరి భగవంతునిగుహ్యప్రదేశమునుండియే భూత, ప్రేత, పిశాచ, బ్రహ్మరాక్షస, భేతాళాదిగ్రహములు జనించెను. శ్రీకృష్ణునిముఖమండలమునుండి శంఖచక్రగదాపద్మధారులైనచతుర్భుజపార్షదులావిర్భవించిరి. వారిని శ్రీకృష్ణుడు శ్రీమన్నారాయణున కొసంగెను. దేవాదిదేవుని పాదపద్మములనుండి, జపమాలాధారులై యత్యంతశ్యామలవర్ణయుక్తులైనద్విభుజపార్షదులు శ్రీకృష్ణుని దివ్యనామములను జపించుచు నావిర్భవించిరి. వారే పరమభక్తులైన వైష్ణవులు. వారనన్యభక్తితో బులకితగాత్రులై యానందాశ్రుపూరితనయనములతో సదా శ్రీకృష్ణునే వీక్షించుచు దచ్చరణారవిందములనే ధ్యానించుచుండెదరు.

తదనంతరము పరమేశ్వరునిదక్షిణనేత్రమునుండి భయంకరాకారులైన ప్రమథగణములు త్రిశూలధారులై జనించిరి. వారందఱు త్రినేత్రధారులు., చంద్రమకుటభూషితులు, మహాకాయులు, దిగంబరులు, ప్రచండాగ్నిశిఖాసదృశులైనభైరవులు. వారిలో శివసమానతేజోవంతులైనభైరవు లెనమండుగురు కలరు. 'రురుభైరవ, సంహారభైరవ, కాలభైరవ, అసితభైరవ, క్రోధభైరవ, భీషణభైరవ, మహాభైరవ, ఖట్వాంగభైరవ యనునామధేయములు కల్గినవారే అష్టభైరవులు. తదుపరి శ్రీకృష్ణునివామనేత్రమునుండి యొకభయంకరుడైన మహాపురుషుడు జన్మించెను. త్రిశూలమును, డమరుకమును, గదను, బరశువును హస్తములయందు ధరించి, వ్యాఘ్రచర్మమును వస్త్రముగా నలంకరించుకొని విశాలకాయుడై, త్రినేత్రధారియై ప్రకాశించునామహాపురుషుడే 'ఈశానుడు.'

ఆయనయే దిక్పాలకులకు బ్రభువయ్యెను. తదనంతరము శ్రీకృష్ణునినాసికా పుటములనుండి ఢాకినులు, యోగినులు, నసంఖ్యాకులైన క్షేత్రపాలకు లుద్భవించిరి. ఆమహాపురుషునిపృష్ఠప్రదేశమునుండి మూడుకోట్ల దేవతాగణములు ప్రాదుర్భవించెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని సృష్టినిరూపణ మను
నైదవ అధ్యాయము
సంపూర్ణము

—o—

## ఆఱవ అధ్యాయము

**శ్రీకృష్ణుడు నారాయణాదులకు లక్ష్మ్యాదులను బత్నులుగా నొసంగుట; మహాదేవుడు వివాహవిముఖుడై నిరంతరభజనమునకై వరమడుగుట; భగవానుడు నామాదులమహిమలను వివరించుట; భవిష్యత్తులో శివతో వివాహమాడమని నాజ్ఞాపించుట; శివాదులకుమంత్రాదుల నుపదేశించుట.**

**సౌతి పలికెను :**

శ్రీకృష్ణభగవాను డాదరముతో లక్ష్మీసరస్వతులను శ్రీమన్నారాయణున కర్పించెను. తరువాత బ్రహ్మకు సావిత్రిని, ధర్మదేవతకు మూర్తిని, మన్మథునకు 'రతిని', కుబేరునకు 'మనోరమ'ను బ్రదానముచేసెను. ఏయేస్త్రీ లెవరెవరి నుండి యుద్భవించిరో వారు వారికి బత్నులైరి. తదనంతరము శ్రీకృష్ణుడు యోగులకు గురువైన శంకరుని 'సింహవాహినియైన దుర్గను బత్నిగా గ్రహింపు' డని యాదేశించెను. భగవానుని యీవచనముల నాలకించి శంకరుడు వినీత భావముతో వైరాగ్యయుక్తుడై యీవిధముగా బల్కెను.

**మహాదేవుడు పలికెను :**

"దేవా! నాకు భార్యతోనవసరము లేదు. నాకు నామనోభీష్టములనే ప్రసాదింపుము. సేవకునకేదియిష్టమో ప్రభువు వానికి దానినే ప్రసాదింపవలెను. నేను మీ చరణములయందు భక్తిని బ్రగాఢాభీష్టమును గల్గియున్నాను. ఈకోర్కెయే నాహృదయమునందు వృద్ధిచెందుచున్నది. మీనామజప మెంత యొనరించినను, మీ చరణకమలముల నెంతసేవించినను నాకుదృప్తితీఱకున్నది. నేను సర్వావస్థలయందు, నిరంతరము నాపంచముఖములతో మీనామములను, గుణములను దనివితీర గానముచేయుచున్నాను. నామనస్సు భోగములందు గాక యీభక్తియోగమందే సంలగ్నమైయున్నది. మీసేవ, పూజ, నామసంకీర్తనాదులచే నాకు మహానందము కల్గుచున్నది. సర్వవరప్రదాతా! ఈశ్వరా! నాకు మీగుణస్మరణములను, కీర్తన, శ్రవణ, జపాదులను, మీమనోహరరూపధ్యానమును, మీచరణకమలములసేవను, మీకువందనముచేయ భక్తిని, మీ కాత్మసమర్పణచేయ నాత్మను, మీ దివ్యప్రసాదమును నాకు బ్రసాదింపవలసినదిగా బ్రార్థించుచున్నాను. ప్రభూ! ముక్తులైదువిధములుగదా! సార్ష్టి (మీయైశ్వర్యముతోసమమైనయైశ్వర్యము), సాలోక్యము(మీలోకప్రాప్తి), సారూప్యము(మీస్వరూపప్రాప్తి),సామీప్యము(మీవద్దనివసించుసౌభాగ్యము),సామ్యము(మీతో సమత్వము), లీనత (మీలోలీనమగుట లేక సాయుజ్యము), ఇక నణిమ, లఘిమ, గరిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, మహిమ, ఈశిత్వము, వశిత్వము, సర్వకామవాసాయిత, సర్వజ్ఞత, దూరశ్రవణము, పరకాయప్రవేశము, వాక్సిద్ధి,కల్పవృక్షత్వము, సృష్టిశక్తి, సంహారశక్తి, యమరత్వము, సర్వాగ్రగణ్యత్వము – అనునవి పదునెనిమిది సిద్ధులుగదా! సర్వేశ్వరా! యోగము, తపము, సర్వవిధదానములు, వ్రతములు, యశము, కీర్తి, వాణి, సత్యము, ధర్మము, ఉపవాసము, తీర్థభ్రమణము, స్నానములు, అన్యదేవతా పూజలు, దేవప్రతిమా దర్శనము, భూప్రదక్షిణము, సమస్త సముద్ర స్నానము, సకల స్వర్గదర్శనము, బ్రహ్మపదము, విష్ణుపదము, రుద్రపదము, పరమపదము – ఇవి యన్నియు మీయొక్క భక్తియందొక 'అంశ' మాత్రమేగదా"!

మహాదేవుడీవిధముగా శ్రీకృష్ణునకు స్వాభీష్టము విన్నవించెను. ఆయోగులకు గురువైనమహాదేవునితో సర్వసుఖదాయకుడైనపరమాత్మ మధురవచనములతో నీవిధముగా బల్కెను.

**శ్రీభగవానుడు పలికెను :**

"శివా! సర్వజ్ఞులయందు శ్రేష్ఠుడా! నీవు నూఱుకోట్లకల్పములవఱకు నా భక్తుడవై యుండగలవు. నీవుతపస్వులలో, సిద్ధులలో, యోగులలో, జ్ఞానులలో, బరమవైష్ణవులలో నందఱికంటె శ్రేష్ఠుడవు. శంభూ ! నీవమరుడవై, మృత్యుంజయుడవై శోభిల్లుము. నావరముచేత నీకు సమస్తజ్ఞానము, సర్వజ్ఞత్వ త్వము లభించును. కుమారా! నీవు లీలాపూర్వకముగా నసంఖ్యాకులైనబ్రహ్మ లను వీక్షించెదవు. శివా! నావరప్రభావముచేత నీవు జ్ఞానమునందు, తేజము నందు, బరాక్రమమునందు, యశమునందు నాతోసమానుడవుకమ్ము. నీవే నాకు బ్రాణాధికుడవైనప్రియుడవు. నిన్ను మించినప్రియభక్తుడు నాకు మఱియొకడు లేడు.

తత్పరో నాస్తి మే ప్రేయాం స్త్వం మదీయాత్మనః పరః ॥
యే త్వాం నిన్దన్తి పాపిష్ఠా జ్ఞానహీనా విచేతనాః ।
పచ్యన్తే కాలసూత్రేణ యావచ్చన్ద్రదివాకరౌ ॥

శివా ! నిన్ను మించినయత్యంతప్రియుడు వేఱొకడు నాకు లేడు. నీవు మదాత్మాధికుడవు. ఏపాపాత్ములు, అజ్ఞానులు, చేతనాహీనులైనమనుష్యులు నిన్ను నిందింతురో, వారాచంద్రతారార్కము 'కాలసూత్ర' మను నరకమును బొందగలరు.

శివా! నీవు నూఱుకోట్లకల్పములపిదప బ్రకృతి యైన'దుర్గ'ను బరిణయ మాడగలవు. ఇది నా యాదేశము. దానినిబాలింపగలవు. మహాదేవా! నీవు దుర్గను గ్రహించి, పరిణయమాడి, దివ్యసహస్రవర్షములవఱకు సుఖివై యుండ గలవు. నీవు కేవలము సామాన్యతపస్వివికావు. నాతో సముడవు. నీవు స్వేచ్ఛా మయుడవు, స్వేచ్ఛామయుడైనవాడుసమయానుసారముగా గృహస్థుడు, తపస్వి, యోగికాగలడు. నీవు పత్నీపరిగ్రహణమువలన నేయే దుఃఖములను వర్ణించితివో, యవి కులటాస్త్రీవలన సంభవించును. పతివ్రతలవలన భర్తలకు బరమానంద సుఖములు లభించును. భర్త పతితుడైన, బవిత్రుడైన, దరిద్రుడైన లేక ధన వంతుడైన, గుణీనురాలైనస్త్రీకి నతడే సర్వస్వము, ఆశ్రయము, దైవసమానుడు. ఏస్త్రీ నీచకులసంజాతయో, యేస్త్రీ తలిదండ్రులు దుశ్శీలురో, యేస్త్రీ పతితయో అట్టిస్త్రీమాత్రమే సదాపతినినిందించును. ఏస్త్రీతనభర్తనునాకంటెను, నీకంటెను, నెక్కువగా గౌరవించి, సేవించునో యామెయే సాధ్వి. ఆమెగోలోకమందు ప్ర

భర్తతో నేడుకోట్లకల్పములు సుఖములనుభవింపగలదు. కనుక మహాదేవా! ఈవైష్ణవీప్రకృతి శివప్రియయై నీకొఱకు 'కళ్యాణమయి' కాగలదు. అందువలన లోకకళ్యాణనిమిత్త మీసాధ్వియైన 'దుర్గ' నర్థాంగిగా స్వీకరింపుము.

తదనంతరము శ్రీకృష్ణుడు 'శివలింగ' స్థాపనమును గుఱించి, పూజాఫలమును గుఱించి యీ విధముగా వర్ణించెను.

మహాదేవ మహాదేవ మహాదేవేతి వాదినః ।
పశ్చా ద్యామి మహాస్తోత్ర నామశ్రవణలోభతః ॥
శివేతి మన్త్ర ముచ్చార్య ప్రాణాం స్త్యజతి యోనరః ।
కోటిజన్మార్జితాత్ పాపా న్ముక్తో ముక్తిం ప్రయాతి సః ॥
శివం కళ్యాణవచనం కళ్యాణం ముక్తివాచకమ్ ।
యత స్తత్ప్రభవే త్తేన స శివః పరికీర్తితః ॥

"ఎవ్వరు మహాదేవ, మహాదేవ, మహాదేవ యని స్తుతింతురో తన్నామ శ్రవణాసక్తివలన వారిని నే ననుసరించెదను. ఎవ్వారంత్యకాలమందు 'శివ' యనుశబ్దము నుచ్చరింతురో వారుకోటిజన్మార్జితపాపములనుండి ముక్తినిబొందెదరు. శివశబ్దము కళ్యాణవాచకము. ఆ కళ్యాణమే ముక్తి. ఇందువలననే 'మహాదేవుని' 'శివు' డందురు. ధనవియోగములో భయవిహీనుడై శోకమగ్నుడైనవాడు 'శివ' శబ్దోచ్చారణమాత్రముననే కళ్యాణమును బొందగలడు. 'శి' పాపనాశకము, 'వ' మోక్షదాయకము. కావున శివుడు జీవులకు పాపనాశకుడు; మోక్షదాయకుడు. ఎవనివాణియందు మంగళదాయకమైన 'శివ' శబ్దముండునో నిశ్చయముగా వారికోటిజన్మసముపార్జితపాపపుంజములు నశింపగలవు". 'త్రిశూలపాణి' యైన'మహాదేవు'ని ట్లాదేశించి శ్రీకృష్ణభగవాను డాయునకు గల్పవృక్షమంత్రము, మృత్యుంజయజ్ఞానమును బ్రసాదించెను. తరువాత సింహవాహినియైన'దుర్గ' కిట్లాదేశించెను. "దేవీ! ఈసమయమందు గోలోకములో నీవు నాసమ్ముఖముననే నివసింపగలవు. సమయమాసన్నమైనపుడు కళ్యాణములకాశ్రయభూతుడు, మంగళమయుడునైన శివుని బతిరూపమున బొందగలవు. సుముఖీ! సంపూర్ణదేవతల తేజమునుండి ప్రకటితవై సమస్తదైత్యులను సంహరించి, నీవు సర్వులచే బూజింపబడెదవు. తదనంతరము కల్పవిశేషములో సత్యయుగమందు 'దక్షకన్య'వై సతీరూపముతో శివుని 'గృహిణి'వి కాగలవు. తరువాత దక్షయజ్ఞశాలయందు నీపతినిందలనాలకించి శరీరము త్యజించి, హిమవంతుని పుత్రికవై పార్వతీనామముతో విఖ్యాతిచెందెదవు. ఆసమయమందుసహస్రవర్ష ములు

శివుని సేవించి నీవు పరిపూర్ణముగా నామహాదేవున కర్ధాంగివి కాగలవు. సురేశ్వరీ! ప్రతిసంవత్సరము శరత్కాలమందు, సమస్తలోకములలోని భక్తులు నిన్ను బూజింతురు. గ్రామములయందు, నగరములయందు నీవు గ్రామదేవతవై పూజింపబడెదవు. విభిన్నస్థానములలో నీకు వివిధనామములు కలుగగలవు. నాయాజ్ఞవలన శివరచితములగునానాప్రకారతంత్రములమూలమున నీకు బూజ లాచరింపబడును. నేను నీకొఱకు స్తోత్రములను, గవచములను బ్రసాదించెదను. నీభక్తులు మహాత్ములు, సిద్ధులు కాగలరు, ధర్మార్థకామమోక్షము లనెడిచతుర్విధపురుషార్థములను బొందగలరు. మాతా! ఈపవిత్రభారతవర్షమందు నెవరు నీపూజలను, సేవలనునొనరింతురో వారియశము, కీర్తి, ధర్మము, ఐశ్వర్యము, వృద్ధికాగలవు.

ప్రకృతి నీవిధముగా ననుగ్రహించి భగవంతుడామెకు గామబీజ (క్లీం) సహితమగు నేకదశాక్షరమంత్రము నుపదేశించెను. ఆమంత్రరాజము పరమోత్తమమైనది. భక్తుల ననుగ్రహించుట కామెకు శ్రీ (శ్రీం), మాయ (హ్రీం), కామ (క్లీం) బీజసహిత దశాక్షరమంత్రమును, ఉత్కృష్టతత్త్వజ్ఞానమును బ్రసాదించెను. ఆమెకు 'త్రయోదశాక్షరమంత్రము' నుపదేశించెను. తదనంతరము శివునకు, ధర్మమునకుగూడ బైనుదాహరించిన మంత్రములను, జ్ఞానములను బ్రసాదించెను. విధాతకు, గామదేవునకు, నగ్నికి, వాయుదేవుడు మొదలగు దేవతలకు నుత్తమ మంత్రోపదేశములను గావించెను. సృష్టిప్రారంభముకొఱకు బ్రహ్మను "మహాభాగా! విధాతా! నీవు సహస్రదివ్యవర్షములు నన్ను గుఱించి తపంబాచరించి నానాప్రకారము లైనయుత్తమసృష్టిని రచించుటయందు సమర్థుడవు క"మ్మని యాదేశించి, యొకమనోహరదివ్యజపమాలను బ్రసాదించెను. తదనంతరమాయన గోగోపికలతో గోలోకబృందావనమునకు దరలివెళ్ళెను. శివాదిదేవతలుకూడ బరమాత్మేచ్ఛానుసారముగా నిర్మింపబడినవారివారి లోకములకు విజయముచేసిరి.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండములోని సృష్టినిరూపణ
మను నాఱవ అధ్యాయము
సంపూర్ణము.

# ఏడవ అధ్యాయము

## బ్రహ్మ పృథివ్యాదిలోకములను సృష్టించుట; కల్పిత జగదనిత్యత్వమును, వైకుంఠ శివగోలోకాదుల నిత్యత్వమును ప్రతిపాదించుట.

**సౌతి పలికెను :**

బ్రహ్మ సహస్రదివ్యవర్షములు తపమాచరించి యభీష్టసిద్ధి పొంది ప్రప్రథమమున మధుకైటభులమేదస్సుతో మేదినిని సృష్టించెను. సుమేరువు, కైలాసము, మలయము, హిమాలయము, ఉదయాచలము, అస్తాచలము, సువేలము, గంధమాదనము లనెడియెనిమిదిమహాపర్వతములను, మఱియు నెన్నియో తదితరపర్వతములను సృష్టించెను. తరువాత నేడుసముద్రములను, ననేకానేకనదములను, నసంఖ్యాకనదులను సృష్టించెను. వృక్షములను సృజించి నగరములను నిర్మించెను. లవణ, ఇక్షు, సురా, ఘృత, దధి, క్షీర, సుస్వాదుజలపూర్ణము లగుసప్తసముద్రముల నేర్పఱచెను. మొదటిసముద్రవైశాల్య మొకలక్షయోజనములు. తరువాతిసముద్రము లొకటితరువాతనొకటి ద్విగుణీకృత వైశాల్యము కలవి. బ్రాహ్మణులారా! బ్రహ్మనిర్మితము లైన సప్తద్వీపములనామముల నవధరింపుడు. జంబూద్వీపము, శాకద్వీపము, కుశద్వీపము, ప్లక్షద్వీపము, క్రౌంచద్వీపము, న్యగ్రోధ (శాల్మలీ) ద్వీపము, పౌష్కరద్వీపము. అష్టదిక్పాలకుల కొఱకు బ్రహ్మ మేరుపర్వతమందలి యెనిమిదిశిఖరములపై నెనిమిది మనోహరము లైనపురములను నిర్మించెను. ఆపర్వతమూలభాగమైన పాతాళనగరమం 'దనంతు' (ఆదిశేషు) ని కొఱకు నగరము నిర్మించెను. అదే పర్వతముపై నేడుస్వర్గములను రచించెను. వానిని భూర్లోక, భువర్లోక, స్వర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకము లందురు. మేరువుయొక్క యత్యంతోన్నత శిఖరమందు బ్రహ్మలోకము కలదు. దానిపై 'ధ్రువలోకము' కలదు. తత్పర్వతాధోభాగమం దేడు పాతాళములను నిర్మించెను. అవి – అతల, వితల, సుతల, తలాతల, మహాతల, పాతాళ, రసాతలములు. అన్నిటికంటె నడుగున 'రసాతలము' కలదు. ఈయేడుద్వీపములతో, నేడుస్వర్గములతో, నేడుపాతాళములతో విరాజిల్లు నీసంపూర్ణ బ్రహ్మాండము బ్రహ్మనిర్మితమై బ్రహ్మయొక్క యధికార

మం దుండును. శౌనకాదిమహర్షులారా! పై నుదాహరింపబడిన బ్రహ్మాండము లనేకములు కలవు. ఇవి యన్నియు మహావిష్ణు రోమకూపములయందు సుస్థిరములై యున్నవి. శ్రీకృష్ణ మాయాప్రభావముచే ప్రత్యేకబ్రహ్మాండమందు బ్రహ్మవిష్ణుశివాదులు, దేవతలు, మొదలగు సకలప్రాణులు నివసించుచుందురు. విప్రులారా! ఈకృత్రిమవిశ్వమందు సృష్టింపబడినవన్నియుస్వప్నదృష్ట సమానములు, నశ్వరములు. కేవలము వైకుంఠము, శివలోకము, వీనిపై విరాజిల్లు గోలోకము – ఈ మూడులోకములే నిత్యపరంధామములు. వానిస్థితి కృత్రిమవిశ్వమున కావలనున్నది. ఆత్మ, ఆకాశము, దిశలు, నెట్లునశ్వరములు కావో యట్లే యీ మూడులోకములుకూడ నశ్వరములుకావు.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని బ్రహ్మకృత పృథివ్యాది
విశ్వసృష్టివర్ణన మను నేడవ
అధ్యాయము
సంపూర్ణము

—o—

## ఎనిమిదవ అధ్యాయము

### సావిత్రినుండి వేదాదులు సృష్టియగుట; బ్రహ్మనుండి సనకాదులు, స్వాయంభువ మనువు, రుద్రులు, పులస్త్యాదిమునులు, నారదుడు ప్రాదుర్భవించుట; బ్రహ్మనారదులు పరస్పరము శపించుకొనుట.

**సౌతి పలికెను:**

బ్రహ్మ విశ్వమునునిర్మించి కాముకుడు కాముకియందువలె ఆయన సావిత్రియందు వీర్యాధానముచేసెను. ఆమె దుస్సహామగునాగర్భమును నూఱు వత్సరములుధరించి మనోహరములగు చతుర్వేదములను బ్రసవించినది. న్యాయ వ్యాకరణాదిశాస్త్రములను, ముప్పదియాఱుదివ్యరాగిణులను సృజించెను. నానా

విధతాళయుక్తము లగునాఱుసుందరరాగములను బ్రకటించెను. సత్యయుగమును, త్రేతాయుగమును, ద్వాపరయుగమును, కలహప్రియమగుకలియుగమును, వర్షములను, మాసములను, ఋతువులను, దిథులను, క్షణములను, దినములను, రాత్రులను, వారములను, సంధ్య, ఉష, పుష్టి, మేధ, విజయ, జయలనెడి యాఱుకృత్తికలను, యోగములను, గారణములను, మాతృకలలో బ్రధానురాలైనకార్తికేయుని ప్రియసతియగు 'మహాషష్ఠి' దేవసేనను – వీరి నందఱను సావిత్రియే ప్రాదుర్భవింపజేసెను. బ్రాహ్మ, పాద్మ, వారాహములనునవిమూడు మహాకల్పములు. నిత్య, నైమిత్తిక, ద్విపరార్థ, ప్రాకృతములనునవి నాల్గువిధములు లయిన ప్రళయములు. ఈప్రకారముగా కల్పములను, బ్రళయములను, కాలములను, మృత్యువును, సమస్తవ్యాధులను సావిత్రీదేవి యుత్పన్నముజేసి వృద్ధిజేసెను.

తదనంతరము బ్రహ్మయొక్క పృష్ఠదేశమునుండి 'అధర్మము', దానినుండి 'అలక్ష్మి' యుద్భవించెను. ఆమెయే యధర్మమునకు బత్ని. బ్రహ్మనాభినుండి శిల్పుల కాచార్యుడైన విశ్వకర్మజనించెను. విశ్వకర్మతో నెనమండుగురు 'వసువులు' జన్మించిరి. వారు మహాబలపరాక్రమవంతులు. తరువాత విధాతమనమునుండి నల్వురు కుమారు లావిర్భూతులైరి. వారు పంచవర్ష ప్రాయము కలవారై బ్రహ్మతేజముతో భాసిల్లుచుండిరి. వారిలో బ్రథముడు సనకుడు, రెండవవాడు సనందనుడు, మూడవవాడు సనాతనుడు, నాల్గవవాడు జ్ఞానులయందు శ్రేష్ఠుడైన 'సనత్కుమారుడు'. తదనంతరము బ్రహ్మముఖము నుండి సువర్ణకాంతిమంతుడు, దివ్యరూపధారియు నైనపురుషుడు తనపత్నితో నుద్భవించెను. ఆతడే క్షత్రియులకు బీజస్వరూపుడైన 'స్వాయంభూమనువు'. ఆయన పత్నిపేరు 'శతరూప'. ఆమె యత్యంత రూపవతి, లక్ష్మీసమానురాలైన తేజోవతి. విధాత తన పుత్రులను సృష్టి నారంభము చేయవలసినదిగా నాదేశించెను. కాని సనకసనందనాదులు పరమహరిభక్తులు. వారు విధాత్రాదేశమును సరకుగొనక శ్రీకృష్ణధ్యానమందు నిమగ్నులైరి. అందువలన బ్రహ్మయందు గోప ముద్భవించెను. ఆసమయమందు బ్రహ్మదేవునిలలాటమునుండి 'ఏకాదశరుద్రు'లుద్భవించిరి. వారియందు శ్రేష్ఠుడే సంహారకారియైన 'కాలాగ్నిరుద్రుడు'. ఏకాదశరుద్రులు తామసగుణయుక్తులు. బ్రహ్మ రాజసగుణయుక్తుడు. శివుడు, విష్ణువు సత్వగుణయుక్తులు, లోకనాథుడైన శ్రీకృష్ణపరమాత్మనిర్గుణుడు. ఎందువలెననగా నాయన త్రిగుణాత్మకప్రకృతికతీతుడు. పరమా

జ్ఞానులైనమూర్ఖులుమాత్రమే సదాశివుని 'తామస' గుణసంపన్ను డందురు. కాని శివుడు శుద్ధసత్త్వగుణయుక్తుడు, పరమవైష్ణవశిరోమణి. వేదప్రణీతములైననేకాదశరుద్రులనామధేయములు క్రమముగా మహాన్, మహాత్ముడు, మతిమానుడు, భీషణుడు, భయంకరుడు, ఋతుధ్వజుడు, ఊర్ధ్వకేశుడు, పింగళాక్షుడు, రుచి, శుచి, కాలాగ్నిరుద్రుడునని ప్రసిద్ధిగాంచినవి. బ్రహ్మయొక్క-కుడిచెవినుండి పులస్త్యుడు, ఎడమచెవినుండి 'పులహుడు', దక్షిణనేత్రమునుండి 'అత్రి', వామనేత్రమునుండి 'క్రతువు', నాసికనుండి 'అరణి', ముఖమునుండి 'అంగీరసుడు', 'రుచి', వామభాగమునుండి భృగువు, దక్షిణభాగమునుండి దక్షుడు, ఛాయనుండి 'కర్దముడు', నాభినుండి 'పంచశిఖుడు', వక్షస్థలమునుండి ఓఢుడు, కంఠప్రదేశమునుండి 'నారదుడు', స్కంధప్రదేశమునుండి 'మరీచి', గళమునుండి 'అపాంతరతముడు', జిహ్వనుండి 'వశిష్ఠుడు', పెదవులనుండి 'ప్రచేతసుడు', వామకుక్షినుండి 'హంస', దక్షిణకుక్షినుండి 'యతి' ప్రాదుర్భవించిరి. విధాత యీ పుత్రులను సృష్టి ప్రారంభింపవలసినదిగా నాజ్ఞాపించెను. తండ్రియాజ్ఞ నాలకించి 'నారదు' డీవిధముగా బలికెను.

## నారదుడు పలికెను :

జగత్పతీ! పితామహా! ప్రథమమున సనకసనందనాద్యగ్రజులకు వివాహము గావింపుము. తదనంతరమే మమ్ములనుగూడ వివాహమాడవలసినదిగా నాదేశించిన సమంజసముగా నుండును. మీరు జ్యేష్ఠపుత్రులకు దపము నంగీకరించితిరి. మఱి మమ్మేల యీసంసారబంధనమందు బడద్రోయ దలంచితిరి? తండ్రీ! మీ కింతపక్షపాత మేల? ఒకపుత్రునకు నమరమైనభక్తివైరాగ్యములను బ్రసాదించి, మఱియొకకుమారునకు విషాదకరములైనవిషయభోగములను బ్రసాదించితి రేల? తండ్రీ! భయానకమగుభవసాగరమందు బడినజీవు డనేక కల్పములు గతించినను సముద్ధరింపబడడు.

నిస్తారబీజం సర్వేషాం బీజం చ పురుషోత్తమమ్ ।
సర్వదం భక్తిదం దాస్యప్రదం సత్యం కృపామయమ్ ॥
భక్తైకశరణం భక్తవత్సలం స్వచ్ఛమేవ చ ।
భక్తప్రియం భక్తనాథం భక్తానుగ్రహకారకమ్ ॥
భక్తారాధ్యం భక్తసాధ్యం విహాయ పరమేశ్వరమ్ ।
మనో దధాతి కో మూఢో విషయే నాశకారణే ॥
విహాయ కృష్ణసేవాం చ పీయూషా దధికాం ప్రియామ్ ।

కో మూఢో విష మశ్నాతి విషమం విషయాభిధమ్ ॥
స్వప్నవ న్నశ్వరం తుచ్ఛ మసత్యం నాశకారణమ్ ।

భగవాను డైనపురుషోత్తము డన్నింటికి నాదికారణుడు, నిస్తారబీజుడు, సర్వప్రదాత, భక్తిప్రదాత, దాస్యసుఖప్రదాత. సత్యమయుడు, కృపామయుడు, స్వేచ్ఛుడు, భక్తుల కేకైకశరణ్యుడు, భక్తవత్సలుడు, భక్తానుగ్రహకారకుడు, భక్తప్రియుడు, రక్షకుడు, భక్తారాధ్యుడు, పరమాత్మయునగు శ్రీకృష్ణుని చరణకమలములయందు భక్తిని వదలి యేమూర్ఖుడైనను విషతుల్యములగు ప్రాపంచిక విషయములయందు రమింపగోరునా? అమృతముకంటె నధికప్రియమైనశ్రీకృష్ణ సేవాకీర్తనములనువిడచి యేమూర్ఖుడు విషయముల నాస్వాదింపగలడు? విషమయమైనయీజగత్తు స్వప్నసమానముగా నశించునదే. ఇది మిథ్య, వినాశకరము.

యథా దీపశిఖాగ్రం చ కీటానాం సుమనోహరమ్ ॥
యథా బడిశమాంసం చ మత్స్యాపాతసుఖప్రదమ్ ।
తథా విషయిణాం తాత విషయం మృత్యుకారణమ్ ॥

"తండ్రీ! ప్రజ్వరిల్లుచున్న దీపశిఖయొక్క యగ్రభాగము పతంగములకు బరమమనోహరముగా గోచరించునట్లు, గాలమున కమర్చబడినమాంసఖండము మత్స్యములకు స్వాదిష్టాహారముగా గన్పడునట్లు విషయులైనపురుషుల కావిషయములందే సుఖములు గోచరింపగలవు. కాని యీవిషయసుఖములు మృత్యువునకు గారణములు కాగలవు". బ్రహ్మసముఖమున నిట్లు విన్నవించి, నమస్కరించి, నారదుడు తండ్రియాజ్ఞకై యెదురుచూచుచుండెను. తనయాజ్ఞ తిరస్కరింప బూనుట గాంచి బ్రహ్మదేవుడు కోపావేశభరితు డయ్యెను. ఆయనముఖము కోపాగ్నివలన నరుణవర్ణ మయ్యెను. బ్రహ్మ నారదు నీవిధముగా శపించెను.

## బ్రహ్మ పలికెను :

నారదా! నీ కిదే నాశాపము. నీభక్తిజ్ఞానములులుప్తములగుగాక! నీవు కామినులకు క్రీడామృగమువై 'ఉపబర్హణు'డనుగంధర్వునిగా జన్మింపుము. నీవు కామినులకువశుడవై, ఏబదువంపలగంధర్వకాంతలకు భర్తవై చరించెదవుగాక. దివ్యకాలము (లక్షయుగములు) విషయభోగములను భోగించి, కర్మానుసారముగా దాసీపుత్రుడవై జన్మించి, పరమవైష్ణవసత్సాంగత్యము పొంది, వారిప్రసాదమును భుజించి, పవిత్రుడవై, శ్రీకృష్ణునికృపకు పాత్రుడవై మరల నాపుత్రుడవు కాగలవు. ఆసమయముననే నీకు దివ్యజ్ఞానమును, భక్తిని ప్రసాదింపగలను. ఈసమయమున నాసమ్ముఖమునుండి తొలగిపొమ్ము, పతనము నందుము.

తనతండ్రి పలికినకఠోరవచనముల నాలకించి నారదుడు దుఃఖితుడై వినీత భావముతో నిట్లు నిష్ఠురవచనములను బల్కెను.

**నారదుడు పలికెను :**

"పితృదేవా! జగద్గురూ! మీకోపమును శాంతింపజేయుడు. తపస్వీశా! స్వామీ! నాయందు మీకిట్టియకారణక్రోధ మెట్లు సంభవించెను? విద్వాంసుడైనతండ్రి దుర్మార్గుడైనతనపుత్రుని విడువవచ్చును, శపింపవచ్చును. మీరు మహాజ్ఞానులైకూడ, తపోభిలాషి యైనమీపుత్రుని శపించుట భావ్యమా? తండ్రీ! ఏయేనీచయోనులయందు నాకుజన్మము సంభవించునో, యాయాజన్మములందు నాకు హరిభక్తిని ప్రసాదింపుము. జగత్స్రష్టపుత్రుడైనను, హరిభక్తివిహీనుడైనవాడీభారతభూమిలో సూకరముకంటెను నధముడు కాగలడు.

జాతిస్మరో హరేర్భక్తియుక్తః సూకరయోనిషు ।
జని ర్లభేత్ స ప్రవరో గోలోకం యాతి కర్మణా ॥
గోవిన్దచరణామ్భోజభక్తిమాధ్వీక మీప్సితమ్ ।
పిబతాం వైష్ణవాదీనాం స్పర్శపూతా వసున్ధరా ॥
తీర్థాని స్పర్శ మిచ్ఛన్తి వైష్ణవానాం పితామహ ।
పాపానాం పాపిదత్తానాం ఖలనా యాऽऽత్మనామపి ॥

"ఏజీవుడుపూర్వజన్మస్మరణముకల్గి హరిభక్తియుక్తుడైయుండగలడో, యతడు 'సూకర' యోనియందు జన్మించినను శ్రేష్ఠుడే. ఎందుచేననగా హరిగుణనామ సంకీర్తన మనుదివ్యకర్మాచరణములవలన నాజీవునకు గోలోకప్రాప్తి నిశ్చయముగ లభింపగలదు. గోవింద చరణారవిందములనుండి భక్తిస్వరూప మనెడి మనోవాంఛితమకరందమును సదా పానముచేయు వైష్ణవులస్పర్శమాత్రముననే యీపృథ్వికూడ బవిత్రము కాగలదు. పితామహా! పాపులైనజనులు పుణ్యతీర్థములందు స్నానమాచరించి తమపాపములను బోగొట్టుకొందురు. పాపుల స్పర్శవలన దమకు సంభవించినపాపములను బ్రక్షాళనచేసికొనుట కాతీర్థరాజములు పరమవైష్ణవులయొక్క స్పర్శకొఱ కెదురుచూచుచుండగలవు. అనగా హరిభక్తులస్పర్శమాత్రముననే సర్వపాపములు నశింపగలవు".

ఆహా! భారతవర్షమందు శ్రీహరినామమంత్రోపదేశముచే, స్మరణముచే నెందఱో జీవులు తమయసంఖ్యాకపాపములను నశింపజేసికొని ముక్తులైరిగదా!

హరిమంత్రగ్రహణమాత్రమున మనుష్యుడు సర్వపాపవిముక్తుడై శుద్ధుడు కాగలడు. ఎవరు గురుపుత్రులకు, పత్నులకు, శిష్యులకు, సేవకులకు, నన్నదమ్ములకు, బంధువులకు హరిమంత్రోపదేశముచేసి, వారికి సన్మార్గదర్శనము గావింతురో, యట్టి వారికినిశ్చయముగా గోలోకప్రాప్తి కల్గును. ఏగురువు తనశిష్యుల కధర్మమార్గమును, హరిభక్తివిముఖతను బ్రబోధించునో యతడు సూర్యచంద్రు లున్నంతవఱకు 'కుంభీపాక'నరకము ననుభవించును.

స కిం గురుః స కిం తాతః స కిం స్వామీ స కిం సుతః ।
యః శ్రీకృష్ణపదామ్భోజే భక్తిం దాతు మనీశ్వరః ॥

"పరమాత్మ యైన శ్రీకృష్ణునిచరణారవిందములయందు భక్తిని బోధింపని తండ్రి తండ్రికాడు, గురువు గురువుకాడు, స్వామి స్వామికాడు". చతురాననా! ఎట్టికారణము లేకుండగనే మీరు నాయందు కోపమువహించి నన్ను శపించితిరి. కానీ నేను మిమ్ములను శపించిన నది యనుచితము కాదేమో? నాశాపమున మీస్తోత్రములు, కవచములు, మంత్రములు నీపృథ్వినుండి యంతర్ధానములు కాగలవు. తండ్రీ! ఈమూడుకల్పములకాలమందు, నీమూడు లోకములందు మీరపూజ్యులు కాగలరు. సువ్రతా! వ్రతాదిదివ్యకర్మలందు మీకు బూజలు జరుగవు. మీకుయజ్ఞహవిర్భాగములు లభింపవు. అయినను మీరు సర్వులకు వందనీయులై యుండగలరు". తనకుమారునివచనముల నాలకించి, బ్రహ్మ నిజమును గ్రహించి, యెంతయో హృదయసంతాపము నొందెను. శౌనకాదిఋషులారా! పితృశాపోపహతుడైన నారదుడు 'ఉపబర్హణు' డనుగంధర్వరాజై జన్మించి తదనంతరము దాసీపుత్రుడై వైష్ణవసాంగత్యమువలన బవిత్రుడై తన తండ్రి యనుగ్రహమువలన భక్తిజ్ఞానవైరాగ్యములను గ్రహించి మరల దేవర్షి కాగల్గెను. ఈ ప్రసంగమును తదనంతరము సవిస్తరముగా వివరింపగలను.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండములోని 'బ్రహ్మనారదులు
పరస్పరము శపించుకొనుట' యను
యెనిమిదవ అధ్యాయము
సంపూర్ణము.

# తొమ్మిదవ అధ్యాయము

## మరీచ్యాది బ్రహ్మపుత్రుల, దక్షకన్యకల సంతానవర్ణనము; దక్షశాపపీడితుడగు చంద్రుడు శివునిశరణుజొచ్చుట: విష్ణుకృపతో దక్షునకు జంద్రుడు లభించుట.

**సౌతి పలికెను :**

శౌనకాదివిప్రవరులారా! తదనంతరము బ్రహ్మ తనకుమారులను సృష్టి నారంభింపవలసినదిగా నాదేశించెను. నారదుడుదక్క మిగిలినబ్రహ్మపుత్రులు సృష్టికార్యమునందు సంలగ్నులైరి. మరీచిమనస్సునుండి ప్రజాపతియగు 'కశ్యపుడు' జన్మించెను. అత్రియొక్క నేత్రమలమువలన క్షీరసాగరమునుండి చంద్రుడుదయించెను. ప్రచేతసుని మనస్సునుండి గౌతము డుదయించెను. మైత్రావరుణుడు పౌలస్త్యుని మానసపుత్రుడైనాడు. మనువునుండి శతరూపకు మువ్వురు కన్య లుద్భవించిరి. వా రాకూతి, దేవహూతి, ప్రసూతి. ఈమువ్వురు పరమ పతివ్రతలు. శతరూపయందు మనువున కిరువురు పుత్రులు కల్గిరి. వారు 'ప్రియవ్రతుడు', 'ఉత్తానపాదుడు'. ఉత్తానపాదునికుమారుడే భక్తాగ్రగణ్యుడైనధ్రువ చక్రవర్తి. ఆయన పరమవైష్ణవభక్తశిఖామణిగా బ్రసిద్ధికెక్కెను. మనువు తన కొమార్తెలైన 'ఆకూతి'ని బ్రజాపతియగు రుచికి, 'ప్రసూతి'ని 'దక్షు'నకునిచ్చి వివాహమొనర్చెను. దేవహూతిని గర్దమమహర్షి కర్పించెను. వారికుమారుడే సాక్షాద్భగవంతునియవతారమైన 'కపిలమహర్షి'. దక్షునివలన బ్రసూతిగర్భమం దఱువదికన్యలు జన్మించిరి. దక్షుడు వారిలో నెనమండుగురిని 'ధర్మదేవత' కిచ్చి వివాహమొనరించెను. ఏకాదశకన్యల నేకాదశరుద్రుల కొసంగెను. తనకొమార్తెలయందు శ్రేష్ఠకన్యామణి యైనసతీదేవిని శివున కర్పించి వైభవముగా గళ్యాణమొనరించెను. పదుమువ్వురు కన్యలను గశ్యపునకు, మఱి యిరువది యేడుగురుకొమార్తెలను జంద్రున కర్పించెను.

'విప్రులారా! మీరు ధర్మదేవతయొక్క భార్యల నామధేయముల నవధరింపుడు. శాంతి, పుష్టి, ధృతి, తుష్టి, క్షమ, శ్రద్ధ, మతి, మఱియు స్మృతి. శాంతినుండి సంతోషము, పుష్టినుండి మహాత్ముడు, ధృతినుండి ధైర్యము, తుష్టినుండి హర్షము, దర్పము, క్షమనుండి సహిష్ణుత, శ్రద్ధనుండి ధర్మము, మతి నుండి జ్ఞానము, స్మృతినుండి మహాజ్ఞాతిస్మారకుడు జన్మించిరి. ధర్మముయొక్క

పట్టమహిషి మూర్తీదేవియందు నరనారాయణు లనునిర్వురు మహాత్ములైన మహర్షి పుంగవు లావిర్భవించిరి. శౌనకాదిఋషులారా! ధర్మదేవతకు గల్గిన యీపుత్రులందఱు, మహాత్ములు ధర్మాత్ములు. ఇక మీరు సావధానులై రుద్ర పత్నులనామధేయములను, వారిసంతానక్రమమును నాకర్ణింపుడు. వారు కళ, కళావతి, కాష్ఠ, కాళిక, కలహప్రియ, కన్దలి, భీషణ, రాస్నా, ప్రమోచ, భూషణ, శుఖ యనువారు. వీరికనేకతేజస్వంతులైనపుత్రులు కల్గిరి. వారు పరమశివునకు బార్షదులైరి. దక్షప్రజాపతికొమార్తె యైనసతీదేవి దక్షునియజ్ఞ శాలయందు దనస్వామి యైనశంకరుని గూర్చిచేయబడిన నిందాలాపములను విని సహింపజాలక యోగబలముచే శరీరమును త్యజించి హిమవంతునిపుత్రిక 'పార్వతి' యైయుద్భవించి, పరమశివుని మరల బతిగా బడసెను. ధర్మపరులారా! ఇపుడు కశ్యపప్రజాపతియొక్క ప్రముఖ భార్యలనామధేయములను వచించెదను. దేవమాతఅదితి, దైత్యమాత దితి, సర్పమాత కద్రువు, పక్షులజనని వినత, గోవులకు, మహిషములకు జనని సురభి, సారమేయములు (కుక్కలు) మొదలగు జంతువులకుమాత 'సరమ', దానవజనని 'దను', మఱియు నన్యపత్నులుకూడ నీవిధముగానే యనేకప్రాణులకు దల్లులైరి. ఇంద్రాది ద్వాదశాదిత్యులు, ఉపేంద్రుడు (వామనుడు) మున్నగు దేవతలు 'అదితి'యొక్క సంతాన మనబడిరి. వీరందఱు మహాబలపరాక్రమసంప న్నులు, తేజస్వులు. 'శచీ'దేవిగర్భమునుండి యింద్రునకు 'జయంతు'డను పుత్రుడు కల్గెను. ఆదిత్యునిభార్య, విశ్వకర్మపుత్రిక యగు 'సువర్ణ' గర్భమునుండి 'శనైశ్చ రుడు, యముడు' ననునిర్వురు కుమారులు, గాళిందియనుకన్యక జన్మించిరి. ఉపేంద్రునివలన బృథ్వికి కుజు డనుపుత్రు డుద్భవించెను. తదనంతర ముపేంద్రుని యంశలను, ధారుణీగర్భమునుండి కుజుని జననప్రసంగమును వినిపించి మరల సూతులవా రిట్లు ప్రవచనముచేయదొడంగిరి. కుజునిపత్ని మేథయైనది. ఆమెకు 'మహాఘంటేశ్వరుడు', విష్ణుసమాన తేజస్వి యైన 'వ్రణదాత'యు నుద్భవించిరి. 'దితి'కి మహాబలురైనహిరణ్యాక్ష హిరణ్యకశిపులు, సింహిక యనుకొమార్తె జన్మించిరి. సింహికకుమారుడే రాహువు. సింహికరెండవపేరు 'నిర్బృతి'. అందువలననే 'రాహువు'ను 'నైరృతు' డందురు. హిరణ్యాక్షునకు సంతానము లేదు. యువావస్థలోనే వరాహమూర్తిచే నతడు హతుడయ్యెను. హిరణ్య కశిపుని పుత్రుడే 'భక్తప్రహ్లాదుడు'. ఆయన వైష్ణవులయం దగ్రగణ్యుడు. ఆతనిపుత్రుడు 'విరోచనుడు'. ఆయనకుమారుడే 'బలిచక్రవర్తి'. 'బలి' పుత్రుడే బాణాసురుడు. అతడు మహాయోగి, జ్ఞాని, మహాదేవుని పరమభక్తుడు.

ఇంతవఱకు 'దితి'యొక్క వంశమువర్ణింపబడినది. ఇపుడు 'కద్రువ'వంశవర్ణనము నాలకింపుడు. 'అనంతుడు, వాసుకి, కాళీయుడు, ధనంజయుడు, కర్కోటకుడు, తక్షకుడును; పద్మ, ఐరావత, మహాపద్మ, శంఖు, శంఖ, సంవరణ, ధృతరాష్ట్ర, దుర్ధర్ష, దుర్జయ, దుర్ముఖ, బలి, గోక్ష, గోకాముఖ, విరూపాదులును 'కద్రువ' సంతానము. ఎన్నిసర్పజాతులుకలవో వానికన్నిటికి ప్రధానులైనవారు పైనుద హరింపబడినవారే. లక్ష్మియంశమున జన్మించిన 'మనసా'దేవికూడ 'కద్రువ' కూతురే. ఈమె తపస్వినీస్త్రీలయందు శ్రేష్ఠురాలు, కళ్యాణస్వరూపిణి, మహా తేజస్విని. ఈమెనే'జరత్కారు'యనికూడనందురు. ఈమెభర్త యేమునీశ్వరుడైన 'జరత్కారువు'. ఆయన నారాయణుని కళోద్భవుడు. విష్ణుతుల్య తేజస్వియైన 'ఆస్తీకమహర్షి' ఈమనసాదేవిపుత్రుడే. వీరందఱినామస్మరణమాత్రమున సర్ప భయము తొలగిపోవును. ఇదియే 'కద్రువ' వంశవర్ణనము. ఇపుడు 'వినతా వంశ' వర్ణనము నాలకింపుడు. వినతాదేవికి నిర్వురుకుమారులు కల్గిరి. వారు అరుణుడు, గరుత్మంతుడు. వీరిద్దఱు విష్ణుసమాన పరాక్రమవంతులు. వీరినుండియే సమస్తపక్షిజాతు లుద్భవించినవి. గోవులు, వృషభములు, గేదెలు, దున్నపోతులు మొదలగు చతుష్పాదసంతానములు 'సురభి' వలన జన్మించినవి. మఱియు నాయా ప్రజాపతిపత్నులకు జన్మించినయపారసంతానము లాయావంశములవారైరి. ఇంతవఱకు మీరు 'కశ్యపవంశ' వర్ణనము నాలకిం చితిరి. ఇపుడు చంద్రవంశాఖ్యానము నవధరింపుడు. ప్రథమమున జంద్రుని భార్యల నామధేయములను వివరించి, పురాణములయందు వారి యత్యంతా పూర్వచరిత్రలను వినిపించెదను. అశ్విని, భరణి, కృత్తిక, రోహిణి, మృగశిర, ఆర్ద్ర, పూజనీయురాలైనసాధ్వి పునర్వసు,పుష్య, ఆశ్లేష, మఘ, పూర్వఫల్గుని, ఉత్తరఫల్గుని, హస్త, చిత్ర, స్వాతి, విశాఖ, అనూరాధ, జ్యేష్ఠ,మూల,పూర్వా షాఢ, ఉత్తరాషాఢ, శ్రవణ, ధనిష్ఠ, శతభిష, పూర్వాభాద్రపద, ఉత్తరా భాద్రపద, రేవతి ఈ యిరువదియేడుగురు చంద్రునిభార్యలు. రోహిణియం దత్యంతప్రీతికలిగి చంద్రు డన్యపత్నులను నిరాదరించెను. అపుడు వా రందఱు తండ్రి 'దక్షుని' కడకు వెడలి తమ కష్టములను విన్నవించుకొనిరి. దక్షుడు కోపోద్దీపితుడై 'చంద్రునకు' క్షయరోగము ప్రాప్తించునట్లు శపించెను. చంద్రుడు దుఃఖితుడై శంకరభగవానుని శరణువేడెను. శంకరుడు కరుణించి చంద్రునకు దనజటాజూటమున నాశ్రయము కల్పించెను. ఆసమయముననే శంకరుని జంద్ర శేఖరుడని సర్వులు కీర్తించిరి. సమస్తదేవతలయందు శివునిమించిన శరణాగత వత్సలుడు మఱొకడు లేడు.

తమభర్త వ్యాధిగ్రస్తుడై తమ్ము వీడి కైలాసమున కేగినపిదప దక్ష పుత్రిక లత్యంత దుఃఖితలై రోదించుచు దీనతాపూర్వకముగా తండ్రి నిట్లు ప్రార్థించిరి.

"తండ్రీ ! మేము మాస్వామి ప్రేమను గోరి మా దుఃఖములను మీకు విన్నవించుకొంటిమి. మీశాపవశమున సద్గుణశీలు డైనమాభర్త రోగగ్రస్తుడై మమ్ములను వీడెను. తండ్రీ! నేత్రములున్నను నూకీజగ మంతయు నంధకార బంధుర మైనది. స్త్రీలకు నేత్రములు వాస్తవముగా వారి 'పతి'యే. పతియే స్త్రీలకు గతి. పతియే ప్రాణము. పతియే సౌభాగ్యము, భవసాగరమును దరించుటకు సేతువు, ధర్మార్థకామమోక్షఫలప్రదాత. పతియే స్త్రీలకు నారాయణుడు. పతియే వారికి వ్రతము, ధర్మము. పతివిముఖులైన స్త్రీలయొక్క సకల పుణ్యకర్మములు వ్యర్థములే. తీర్థస్నానములచేత, తపములచేత, వ్రతములచేత, బూజలచేత, యజ్ఞములచేత, నియమములచేత, నుపవాసములు మొదలగు పుణ్య కర్మములచేతసముపార్జితఫలము లన్నియు బతిభక్తియందు బదునారవభాగమున కేనిసరిరావు. సమస్త బంధువులందుస్త్రీతనపుత్రుని ప్రేమించును. ఎందువలెననగా బుత్రుడుతనభర్తయొక్కయంశయే. తననూర్గుకు పుత్రులకంటె స్త్రీకిభర్తయధిక ప్రియుడు. నీచకులసంజాత మైన 'కులట' యగుస్త్రీమాత్రమే తనపతిని ద్వేషించును. పతి యువకుడైనను, వృద్ధుడైనను, రోగియైనను, దుర్మార్గుడైనను, బతివ్రతాస్త్రీలు వానినే సేవించెదరు. భర్తను ద్వేషించి, దూషించుస్త్రీలు కాలసూత్ర మనునరకము ననుభవించి నీచయోనులయందు భ్రమింపగలరు. బ్రహ్మకుమారా! మాకుమాభర్తను బ్రసాదింపుము. ఇందులకు నీవే సమర్థుడవు. నీవు బ్రహ్మసమాన తేజశ్శాలివి".

తనపుత్రికలదీనాలాపముల నాలకించి దక్షుడు చంద్రునికొఱకై కైలాసమునకు వెడలెను. దక్షుని గాంచి శివుడు గౌరవించి యుచితాసన మొసంగెను. దక్షుడు చంద్రుని దనయధీనముచేయవలసినదిగా శివుని గోరెను. అందులకు సదాశివుడు శరణాగతుని విడువజాలనని తెల్పెను. దక్షుడు కుపితుడై శివుని శపించుట కుద్యుక్తుడు కాగా సదాశివుడు నారాయణుని స్మరించెను. నారాయణుడు వృద్ధబ్రాహ్మణరూపమున నరుదెంచి చంద్రుని వీడి దక్షునిశాపమునుండి తప్పుకొనవలసినదిగా శివునిగోరెను. దానికి మహాదేవు డిట్లు పల్కెను– "ప్రభూ! నేను నాతపము, తేజము, సంపూర్ణసిద్ధులు, సంపదలు

త్యజింపగలనుగాని శరణాగతుని త్యాగముచేయజాలను. ఎవరు భయముచేత శరణాగతుని ద్యజించెదరో, వారిని ధర్మదేవత కఠోరముగా శపించును. నేను నాస్వధర్మమును పీడను. ధర్మమును రక్షించువారిని యెల్లప్పుడు ధర్మమే కాపాడును. దేవా! మీరు ధర్మముల దెలిసినవారు. మఱి యెందులకు నన్ను మాయామోహితుని జేయుట కిట్లుపదేశించుచున్నారు? నీవే సర్వమునకు సృష్టవు, పాలకుడవు, అంతరాత్మవు, సంహారకుడవు. ఎవరికి నీపైన సుదృఢభక్తి కలదో వారి నెవరును భయపెట్టలేరు".

శంకరుని యీదివ్యవచనముల నాలకించి శ్రీహరి పరమానందమందెను. అందఱిహృదయభావములను గ్రహింప గల్గినహరి చంద్రునినుండి చంద్రుని విభజించి దక్షునకొసంగెను. అర్ధచంద్రుడు దక్షునివద్ద, అర్ధచంద్రుడు శివునివద్ద నివసించెను. ఈయద్భుతము నారాయణుని యనుగ్రహప్రభావముమాత్రమే. తనజామాతయొక్క (అల్లుని) జాడ్యమును బాపవలసినదిగా శ్రీహరిని దక్షుడు ప్రార్థించెను. పదునైదుదినములలో క్షీణించునట్లు, మరల బదునైదుదినములలో సంపూర్ణుడై పుష్టిని బొందునట్లు శ్రీహరి చంద్రునకు వరమొసంగెను. దక్షుడు చంద్రుని దనకూతులకప్పగించెను. ఆసమయమునుండి చంద్రుడు తనభార్యలను సమముగా బ్రేమించి వారినాదరించెను. ఈవిధముగా సృష్టిక్రమమును మీకు స్వల్పముగా వర్ణించితిని. ఈప్రసంగమును బుష్కరతీర్థమందు మునుల సభా మధ్యమునందు నాగురుదేవులముఖమునుండి గ్రహించితిని.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని ప్రసూతివర్ణన మను
తొమ్మిదవ అధ్యాయము
సంపూర్ణము

—o—

# పదియవ అధ్యాయము

## జాతిసంబంధమును నిరూపించుట

తదనంతరము సూతమహర్షి మునిశ్రేష్ఠులైనవాలఖిల్యాదులగుఱించి, బృహస్పతి, ఉతథ్య, పరాశర, విశ్వశ్రవః, కుబేర, రావణ, కుమ్భకర్ణ, మహాత్మా విభీషణ, వాత్స్య, శాణ్డిల్య, సావర్ణి, కశ్యప భరద్వాజాదులగుఱించి, బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులగుఱించి, అనేకానేకవర్ణసంకరజాతులయుత్పత్తిని గుఱించి వినిపించి యిట్లు ప్రవచనమును గొనసాగింపదొడంగెను.

అశ్వనీకుమారునివరమువలన నొకబ్రాహ్మణికి కుమారుడు కల్గెను. ఆబ్రాహ్మణిపతి యావిషయమును సరిగాగ్రహింపక పుత్రసహితముగా దన భార్యను ద్యజించెను. బ్రాహ్మణస్త్రీ యత్యంతదుఃఖితయై యోగముచే దన శరీరమును ద్యజించి గోదావరీనదిగా మాఱిప్రవహించెను. సూర్యనందనుడైన యశ్వనీకుమారుడు తనకుమారునకు స్వయముగా జికిత్స, శిల్పశాస్త్రములను, మఱియనేకమంత్రములను బ్రసాదించెను. కాని యాబ్రాహ్మణుడు నిరంతరము నక్షత్రములను లెక్కించుచు, గణకుడై వేతనములను సముపార్జించి, వైదికధర్మ భ్రష్టు డయ్యెను. ఈలోభి యైనబ్రాహ్మణుడు గ్రహణసమయములలోను శ్రాద్ధసమయములలోను శూద్రులనుండికూడ నగ్రదానములను గ్రహించి గొప్ప ప్రతిగ్రహీతయయ్యెను. ఒకదివ్యపురుషు డొకబ్రాహ్మణునియజ్ఞకుండమునుండి యుద్భవించెను. ఆధర్మవక్తయే 'సూతు' డనబడెను. అతడే మాకు బూర్వ పురుషుడు. కృపానిధానుడైనబ్రహ్మయే యతనికి బురాణముల నుపదేశించెను. ఈవిధముగా యజ్ఞకుండోద్భవుడైనసూతుడు సర్వపురాణములకు వక్త యయ్యెను. సూతునకు వైశ్యస్త్రీగర్భమునుండి యొకపురుషుడు జన్మించెను. అతనినే లోకములందు 'భట్టు' అనిరి. అందఱును స్తుతించు భటాజుల వంశమున కాతడే యాదిపురుషుడు.

ఇపుడు మీకు నేను గొన్ని జాతులను, వానివిషయములను వచించితిని. వర్ణసంకరదోషమువలనను బెక్కుజాతు లుద్భవించినవి. అన్నిజాతులయందు నెవరెవరి కేయేసంబంధములు కలవో, యాసంబంధములవిషయమై వేదోక్త నామములను వర్ణించెదను గ్రహింపుడు. పూర్వకాలమందు బ్రహ్మ యీసంబంధ ముల నిట్లు వివరించెను.

పితృ, (తండ్రి) జనక, జన్మద ఇత్యాదిశబ్దములు జన్మను ప్రసాదించిన 'తండ్రి' యనునర్థమున నిర్దేశింపబడినవి. అంబా, మాతృ, జననీ, ప్రసూ, ప్రభృతి శబ్దములు గర్భధారిణి యైనతల్లికి నర్థములుగా నిర్దేశింపబడినవి. తండ్రియొక్క తండ్రిని 'పితామహు'డందురు. పితామహునితండ్రిని ప్రపితామహుడందురు. వీరిపూర్వీకులను 'సగోత్రు'లందురు. తల్లియొక్కతండ్రిని మాతామహుడని, యతని తండ్రిని 'ప్రపితామహు' డని, వానితండ్రిని వృద్ధప్రమాతామహు'డని యందురు. తండ్రితల్లిని 'పితామహి' యనియు నామెయత్తను 'ప్రపితామహి', యనియు, నామెయత్తను 'వృద్ధపితామహి' యనియునందురు. వీరందఱు మాతృసమానముగా బూజనీయులు. తల్లియొక్కతల్లిని 'మాతామహి'యందురు. ఆమె మాతృసమానముగా గౌరవార్హ. ప్రమాతామహునిభార్యను 'ప్రమాతామహి' యనిగ్రహింపవలెను. ప్రమాతామహుని తండ్రియొక్కభార్యను 'వృద్ధప్రమాతామహి'యని తెలిసికొనవలెను. తండ్రియొక్కసోదరుని 'పితృవ్యు',డందురు. తల్లియొక్కసోదరుని 'మాతులు' డందురు. తండ్రియొక్క సోదరిని 'పితృష్వస', తల్లియొక్క సోదరిని 'మాతృష్వస' యనవలెను. సూను, తనయ, పుత్ర, దాయాది, ఆత్మజ ముఖ్యశబ్దములు కుమారునియర్థమందు బర్యాయశబ్దములు. తనవలన నుత్పన్నుడైనపురుషునకు వాచకముగా 'ధనభాక్' 'వీర్యజ' శబ్దములు ప్రయుక్తములుకాగలవు. ఆత్మజా, దుహితృ, కన్యాశబ్దములు 'పుత్రిక' (కూతురు) యను నర్థమందు బ్రచలితములు. కుమారునిభార్యను 'వధు' వనియు, కూతురిభర్తను 'జామాత'యనియు గ్రహింపవలెను. పతి, ప్రియ, భర్త, స్వామీత్యాదిశబ్దములు ప్రియతము డైనపతి యనునర్థమున బ్రయుక్తములు. భర్తయొక్క సోదరుని 'దేవరు' డనియు, భర్తయొక్క సోదరిని 'ననాన్ద' యనియు, భర్తయొక్కతండ్రిని 'శ్వశురు',డనియు, భర్తయొక్కతల్లిని 'శ్వశ్రు'వనియునందురు. భార్య, జాయ, ప్రియ, కాంత స్త్రీమున్నగు నామములు పత్ని యనునర్థమున బ్రయోగింపబడినవి. భార్యయొక్క సోదరుని 'శ్యాలకు' డందురు. భార్యయొక్క సోదరిని 'శ్యాలిక'యందురు. భార్యయొక్క తల్లిని 'శ్వశ్రు'వని భార్యయొక్క తండ్రిని 'శ్వశురు' డనియందురు. సొంతఅన్నదమ్ములను సహోదరులని, అక్కసెల్లండ్రను 'సహోదరురాండ్ర'ని యందురు. చెల్లెలి కుమారుని 'భాగినేయు'డని, యన్నదమ్ములకుమారుని 'భాతృజు'డని యందురు. సోదరియొక్క భర్తనుభగినీకాంతుడు' లేక 'భగినీపతి' యందురు. మరదలిభర్త

సోదరసమానుడని గ్రహింపవలెను. ఎందుకనగా వారి కిద్దఱకు గన్యాదాత యొకడేకదా! కన్యాదాత పితృసమానుడు. అన్నదాత, యభయదాత, భార్య తండ్రి, విద్యాదాత, జన్మదాత ఈయైదుగురు పితృసములు. అన్నదాత భార్య, చెల్లెలు, గురుపత్ని, తల్లి, సవతితల్లి, కొమార్తె, కోడలు, నాయనమ్మ, అమ్మమ్మ, యత్త, చెల్లెలు, తండ్రిచెల్లెలు, చిన్నమ్మ, అత్త వీరుపదు నల్వురు మాతృసమలు. పుత్రునిపుత్రుడు పౌత్రుడు', ఆతనిపుత్రుని 'ప్రపౌత్రు' డందురు. 'ప్రపౌత్రు'ని పుత్రులను, వారిసంతతిని 'వంశజు'లు లేక 'కులజు' లందురు. పుత్రికాపుత్రుని 'దౌహిత్రు'డని, వారివంశజులను 'బాంధవు'లని యందురు. సోదరునిపుత్రులను జ్ఞాతు లందురు. గురుపుత్రిలను, వారియన్న దమ్ములను 'పోష్యు'లని, పరమబాంధవు'లని యందురు. గురుపుత్రికలను, అక్క- సెల్లెండ్రనుగూడ 'పోష్య'లందురు. వారిని దల్లితో సమానముగా భావింప వలెను. పుత్రినిగురువును సోదరునిగా భావింపవలెను. ఆగురువును 'పోష్య' 'సుస్నిగ్ధ'బాంధవు డందురు. పుత్రిమామగారినిగూడ సోదరసమానుగా నెంచ వలెను. వానినే నైవాహికబంధువు' అందురు. కొమార్తెయొక్క-మామగారిని గూడ నదేవిధముగ భావింపవలెను. గురువుయొక్క- మామయొక్క-సోదరులుకూడ బాజ్యులే. ఎవరితో సోదరసమానవ్యవహారములు కలవో, వారిని మిత్రి లందురు. ఎవరు మనకు సుఖము లిత్తురో వారినే మిత్రిలుగా బరిగణనచేయ వలెను. మనకెవరుదుఃఖములను గల్గింతురో, వారే శత్రివు లగుదురు. విప్రు లారా! ఈ భూతలమున మనుష్యులయందు విద్యాజనిత, యోనిజనత, ప్రీతి జనిత అనిమూడువిధము లైనసంబంధములు చెప్పబడినవి. పరమమిత్రిలతో సంబంధము కడుప్రీతికరము. అట్టిసన్మిత్రిడు లభించుట పరమదుర్లభము. మిత్రినియొక్క-తల్లి, భార్య, మాతృసమానులు. మిత్రునియొక్క-యన్నదమ్ములు, తండ్రి, మనకు సోదరపితృసమానులు, వారాదరణీయులు.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండములోని జాతిసంబంధనిరూపణ
మను పదియవ అధ్యాయము
సంపూర్ణము.

# పదునొకండవ అధ్యాయము

## సూర్యుని అనురోధము ననుసరించి సుతపుడు ; అశ్వనీకుమారులను శాపవిముక్తులునుగ జేయుట సంధ్యానిరతుడగు వైష్ణవ బ్రాహ్మణ ప్రశంస.

**శౌనకమహర్షి పలికెను :**

మహాభాగా! సూతనందనా! మీరు ప్రథమమున వర్ణించినయాబ్రాహ్మణుడు తనభార్యను ద్యజించినపిమ్మట దనశేషజీవితములో నేయేకార్యము లొనరించెను ?

సూతు డిట్లు సమాధానము చెప్పనారంభించెను : "బ్రాహ్మణులారా! ఆవిప్రవర్యునినామధేయము 'సుతపుఁడు'. ఆయన భరద్వాజవంశమున జన్మించిన ఋషి. అతడు మొదట హిమాలయములపై నివసించి శ్రీకృష్ణునిప్రీతికొఱకు, దీర్ఘకాలము తపమాచరించెను. ఆసమయమున 'సుతప' మునీంద్రుడు బ్రహ్మతేజముతో బ్రకాసించుచుండెను. ఒకదినమున నాయనకాకాశమందు జ్యోతిస్వరూపుఁడైనశ్రీకృష్ణభగవానుఁడు దర్శనమొసంగి వర మర్థింపుమని యనుగ్రహింపగా, "ప్రభూ! నేనాత్మనిష్ఠుడను. నాకు మోక్ష మవసరములేదు. మహానుభావా! నాకు మీచరణకమలములయం దనన్యమైనదాస్యభక్తిని బ్రసాదింపుఁడు"– అని యావిప్రోత్తముఁడు వేడుకొనెను. అపు డాకాశమున దర్శనమొసంగినభక్తానుగ్రహవిగ్రహుఁడు "మునిపుంగవా! మొదట నీవు వివాహమాడుము, తదనంతరము నీభోగ్యసంపత్ప్రారబ్ధములు క్షీణించినపిదప నీకు నాదాస్యభక్తి యవశ్యము లభింపగల"దని యాదేశించెను. తదనంతరము బ్రహ్మ పితృలోకములోని 'మానసి' యనుకన్య నీద్విజునకు భార్యగా నొసంగెను. శౌనకాది ఋషులారా! ఆమెగర్భమునుండి కళ్యాణమిత్రు డనుపుత్రుడుజన్మించెను. ఆబాలకునిస్మరణమాత్రముచే బిడుగుపాటుభయము తొలగిపోవును, బంధుజనప్రాప్తి కల్గును. కళ్యాణమిత్రు డశ్వినీకుమారుల యనుగ్రహమున జన్మించెను. ఆవిషయము జ్ఞానదృష్టిచే 'సుతప'మహర్షి తెలిసికొని, తన భార్యను ద్యజించెను, అశ్వినీకుమారులను వ్యాధిగ్రస్తులుకమ్మని, వారికి యజ్ఞభాగ ముండదనియు శపించెను. తరువాత బుత్రుని దోడ్కొని తనగృహమునకు

వెడలిపోయెను. సూర్యుడు రోగగ్రస్తులైనయశ్వినీకుమారులను దోడ్కొని వారి వ్యాధినివారణకొఱకు 'సుతప'ముని నిట్లు ప్రార్థించెను.

"విష్ణుసమానతేజస్వీ! భరద్వాజకులోద్భవా! బ్రాహ్మణదేవతా! నాకుమారులయపరాధములను క్షమింపుము. సద్బ్రాహ్మణునిరూపమున సాక్షాచ్ఛ్రీహరియే జన్మించెను. సద్బ్రాహ్మణుడు సంతుష్టుడైన, నారాయణుడు తృప్తి పొందగలడు. నారాయణుడు సంతుష్టుడైన సకలదేవతలు తృప్తులు కాగలరు. గంగానదినిమించిన తీర్థములేదు, శ్రీకృష్ణుని మించినదైవము లేదు, శంకరుని మించిన వైష్ణవుడు లేడు, పృథ్విని మించిన సహనశీల లేదు, సత్యమును మించినధర్మము లేదు, పార్వతిని మించినసతి లేదు. దైవసమానుడైనబలవంతుడు లేడు, పుత్రసమానుడైనప్రియతముడు లేడు. రోగమునుమించిన శత్రువు, గురువును మించినపూజనీయుడు, తల్లిని మించినబంధువు, తండ్రిని మించినమిత్రుడు మఱొకరు లేరు".

సూర్యునిప్రార్థన లాలకించి 'యామహర్షి' శాంతచిత్తుడై తనతపోబలముచే సూర్యపుత్రులైనయశ్వినీకుమారులను రోగవిముక్తుల గావించి "దేవేశ్వరా! నీపుత్రులు త్వరలో యజ్ఞభాగమున కర్హులు కాగల"రని పలికి తపస్సుకొఱకై గంగానదీతీరమునకు వెడలిపోయెను. తరువాత సూర్యుడు తనపుత్రులతోగూడ స్వలోకమునకు వెడలిపోయెను.

విద్వాంసుడైనను, విద్యావిహీనుడైనను, బ్రాహ్మణుడు ప్రతిదినము సంధ్యావందన మాచరించిన పవిత్రుడు కాగలడు. అటువంటిబ్రాహ్మణుడే వందనీయుడు. బ్రాహ్మణుడు భగవంతునకు విముఖుడైన నాదరపాత్రుడు కాజాలడు. ఆతడే సదా హరిని నారాధించి యేకాదశీవ్రతము నాచరించిన బరమవైష్ణవు డగును. అతనిచరణోదకముతో బ్లావితమైన నెట్టిప్రదేశమైనను దీర్థము కాగలదు. హరిభక్తుడై శ్రీకృష్ణునకు నివేదించిన ప్రసాదమునే భుజించు నాతడు పవిత్రుడై జీవన్ముక్తుడు కాగలడు. అన్నమును, జలమును భగవదర్పణము కావింపనిచో నాపదార్థములు మల మూత్రసమానములు కాగలవని బ్రహ్మవచించెను. బ్రహ్మయొక్క సనకసనందనాదికుమారు లందఱును విష్ణుపరాయణులె. అటువంటి బ్రహ్మకులోద్భవులైనబ్రాహ్మణులు హరి విముఖు లెట్లు కాగలరు? తలిదండ్రుల, గురువులసంపర్గదోషమున హరివిముఖులైనవారు జీవించియున్నను శవతుల్యులే.

స కిం గురుః, స కిం తాతః, స కిం పుత్రః, స కిం సఖా, ।
స కిం రాజా, స కిం బన్ధు ర్న దద్యాద్ యో హరౌ మతిమ్ ॥
అవైష్ణవాద్ ద్విజాద్ విప్రః చణ్డాలో వైష్ణవో వరః ।
సగణః శ్వపచో ముక్తో బ్రాహ్మణో నరకం వ్రజేత్ ॥

"శ్రీహరిసంకీర్తనము చేయుడని ప్రబోధింపని తలిదండ్రులు, గురువు, పుత్రుడు, సఖుడు, ప్రభువు మొదలగువారు శ్రేయోభిలాషులే కారు. అటువంటి వారే వాస్తవముగా బరమశత్రువులు. అవైష్ణవు లైనబ్రాహ్మణులకంటె వైష్ణవభక్తు డైనచండాలుడే శ్రేష్ఠుడు. ఎందుచేననగా ననన్యహరిభక్తు డైన చండాలుడు తా నుద్ధరింపబడి తనసమస్తబంధువర్గమునుగూడ నుద్ధరింపజేసి మహత్తరభక్తియోగమార్గమున వైకుంఠపరంధామమును జేరగలడు. హరి విముఖు డైనవాడు బ్రాహ్మణు డైనను నిశ్చయముగా నరకమును బొందగలడు".

మహానివర్యులారా! సంధ్యావందనమాచరింపక, విష్ణువిముఖులై జీవించువా రపవిత్రులు కాగలరు. విషహీన మైనసర్పమును వానపామునునట్లు భగవద్భక్తుడు కానిబ్రాహ్మణుడు నామమాత్రబ్రాహ్మణుడే. ఏవంశములో బరమభక్తు డైన వైష్ణవుడు జన్మించునో, యావంశములోని పెక్కుతరములవారు భవసాగరమును దరించి దివ్యవైకుంఠపరంధామమును జేరగలరు.

ధ్యాయన్తే వైష్ణవాః శశ్వద్ గోవిన్దపదపఙ్కజమ్ ।
ధ్యాయతే తాంశ్చ గోవిన్దః శశ్వత్ తేషాం చ సంనిధౌ ॥

"భక్తు లైనవైష్ణవులు సదా గోవిందునిచరణారవిందములనే ధ్యానించుచుందురు. అలాగుననే గోవిందుడుకూడ తనభక్తులవద్దనే యుండి వారినే స్మరించుచుండును". తనభక్తులను సంరక్షించుటకు శ్రీహరి 'సుదర్శనచక్రము'ను నియమించినను దృప్తిచెందక తానే స్వయముగా వారివద్దనే సదా 'విరాజమాను డై యుండును.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండములోని విష్ణువైష్ణవబ్రాహ్మణ
ప్రశంస యను పదునొకండవ
అధ్యాయము సంపూర్ణము.

# పండ్రెండవ అధ్యాయము

## బ్రహ్మయపూజ్యతకు గారణము; గంధర్వరాజు తపస్సునకు సంతుష్టుడై శంకరుడాతని కభీష్టవరముల నొసంగుట : నారదుడాతనికి పుత్రునిగా జన్మించి ఉపబర్హణు డనునామముతో బ్రసిద్ధిచెందుట.

**సౌతి పలికెను :**

మునిపుంగవులారా! హంస, యతి, అరణి, ఓఘు, పంచశిఖ, అపాంతరతమ, సనకసనందనాదులుదక్క నన్యబ్రహ్మపుత్రు లందఱు తండ్రియాజ్ఞచే సృష్టియందు నిమగ్నులైరి. ప్రజాపతిబ్రహ్మ తనపుత్రుడైననారదునిశాపవశమున నపూజ్యుడయ్యెను. అందువలననే విద్వాంసులైనపురుషులు బ్రహ్మమంత్రోపాసనము చేయరు. నారదుడు శాపగ్రస్తుడై 'ఉపబర్హణు' డనుగంధర్వుడై జన్మించెను. వారివృత్తాంతము నాకర్ణింపుడు.

గంధర్వరాజ్యమును శ్రేష్ఠుడైనగంధర్వరాజు పాలించుచుండెను. అతడత్యంతైశ్వర్యసంపన్నుడు. కాని కర్మవశమున నెంతకాలమునకు నతనికి బుత్రసంతానము కలుగలేదు. తనగురువైనవశిష్ఠమునియాదేశమున నాగంధర్వరాజు సంతానముకొఱకు బుష్కరతీర్థమందు దపమాచరించుట కరిగెను. కృపానిధానుడైనవశిష్ఠు డాగంధర్వునకు శివకవచము, స్తోత్రము, ద్వాదశాక్షరమంత్రము నుపదేశించెను. దీర్ఘకాలము నిరాహారుడై శివసాక్షాత్కారముకొఱకాగంధర్వరాజు తపమాచరించెను. ఆతనితపమునకు గరుణించి సదాశివుడు సాక్షాత్కరించెను.

నిత్యతేజస్స్వరూపుడు, సనాతనుడునైన యుమామహేశ్వరుడు శివతేజముతో జాజ్వల్యమానుడై దశదిశల బ్రకాశించుచుండెను. ఆయనప్రసన్నముఖమందుజిఱునవ్వు చిందులు త్రొక్కుచుండెను. భక్తానుగ్రహకారకుడైన యాపరమేశ్వరుడు తపోరూపుడు, తపోబీజుడు, తపఃఫలప్రదాత, స్వయంతపఃఫలరూపుడు, శరణాగతుడైనభక్తునకు సర్వసంపదలను బ్రసాదింపగలవాడు. ఆగంధర్వనృపతికి శివుడు దిగంబరుడై, వృషభారూఢుడై, త్రిశూలడమరుకధారియై దర్శనమొసంగెను. ఆమహాదేవుని యంగకాంతి శుద్ధస్ఫటికముకంటె నిర్మలమై భాసించుచుండెను. త్రినేత్రుడు చంద్రమకుటధారియై, సువర్ణప్రభాసదృశజటలుగలవాడై, నీలకంఠుడై, నాగయజ్ఞోపవీతధారియై శోభించుచుండెను. సదాశివుడు

సర్వజ్ఞుడు, సకలసంహారకర్త, మహాకాలుడు, మృత్యుంజయుడు. ఆకోటిసూర్య సమప్రభుని, శాంతస్వరూపుని, హరిభక్తిమోక్షప్రదాతను గన్నులగఱవు దీఱ నానందపులకితుడై దర్శించి, యాగంధర్వరాజు శివునకుసాష్టాంగదండప్రణామము లాచరించి, వశిష్ఠు డుపదేశించిన స్తోత్రముచే స్తుతించెను. అపుడు కృపానిధియైన శివుడు గంధర్వరాజు నభీష్టవరముకోరుకొను మనగా నారాజు హరిభక్తుడగు పరమవైష్ణవపుత్రుని నాకు బ్రసాదింపుడని యర్థించెను. గంధర్వరాజుకోర్కెను విని శివుడు సంతసించి చిఱునవ్వుతో నిట్లు పల్కెను.

"గంధర్వరాజా! నీవీవరము కోరి ధన్యుడవైతివి. దృఢహరిభక్తి కలిగిన వాడు లీలాపూర్వకముగా భవబంధములను ఛేదింపగలడు. హరిభక్తుడు తన వంశమును ధన్య మొనరించుటయేగాక యనేకతరములతనపూర్వీకులనుగూడ నుద్ధరించి గోలోకప్రాప్తి నందగలడు. హరినామసంకీర్తనముచే గోటానుకోటి జన్మార్జితపాపపుంజమును నశింపజేసికొని నిశ్చయముగ బుణ్యాత్ముడై శ్రీహరి సేవను బొందగలడు. శ్రీకృష్ణవిముఖుడై యున్నంతవఱకు మనుష్యుడు తన భార్యాపుత్రైశ్వర్యములయందు రాగాసక్తుడై భవబంధములజిక్కి సుఖదుఃఖము లనుభవింపగలడు. శ్రీకృష్ణునిదివ్యచరణారవిందములందు భక్తి యుద్భవించిన వెంటనే వైరాగ్య మనెడిఖడ్గము నూనవులకర్మస్వరూపవృక్షములమూలము లను ఛేదింపగలదు. హరిభక్తు డైనపుత్రుడు జన్మించగనే యాతరమువారు ధన్యు లగుటయేగాక, యావంశమునందు జన్మించినతరతరములవారుకూడ భవసాగరమును దరింపగలరు". గంధర్వుని బరీక్షింపదలచి సదాశివు డతనితో నిట్లనెను. "ఓగంధర్వరాజా! శ్రీకృష్ణానన్యభక్తిని, దాస్యసౌభాగ్యములను మేమన్యులకు బ్రసాదింపము. ఈవరములుదక్క నన్యముల గోరుకొనుము, ప్రసాదించెదను. ఇంద్రత్వమునుగాని, యమరత్వమునుగాని, బ్రహ్మపదమును గాని, లేక సకలసిద్ధులనుగాని కోరుకొనుము; నే ననుగ్రహింపగలను. కాని హరి భక్తినిమాత్రమర్థింపకు".

భగవానునియీవచనముల నాలకించి గంధర్వుడు కంపించెను. వాని గొంతు, పెదవులు భయతాపముచే నెండిపోయినవి. సకలసంపత్తిప్రదాత యైన యీశ్వరుని దీనాతిదీనుడై యత డిట్లు ప్రార్థించెను. "ప్రభూ! బ్రహ్మపదము పరమేశ్వరుని నిమేషకాలములోనే పతనమగును. అటువంటిబ్రహ్మపదముస్వప్న

సమానముగా మిథ్య, క్షణభంగురము. శ్రీకృష్ణభక్తులు బ్రహ్మపదమును వాంఛింపరు. శివా! ఇంద్రత్వము, అమరత్వము, సిద్ధయోగాదులు, మృత్యుంజయాదిజ్ఞానములుకూడ శ్రీకృష్ణభక్తుల కభీష్టములుకావు".

సాలోక్యసార్ష్టిసామీప్యసాయుజ్యం శ్రీహరేరపి ।
తత్ర నిర్వాణమోక్షం చ న హి వాంఛన్తి వైష్ణవాః ॥

"శ్రీహరితో సాలోక్య, సార్ష్టి, సామీప్య, సాయుజ్య, నిర్వాణమోక్షములనుగూడ హరిభక్తులైనవైష్ణవులు కాంక్షింపరు". నిద్రాజాగ్రదవస్థలయందుగూడ వారనన్యహరిభక్తిని, శ్రీహరిదాస్యసౌభాగ్యమునే మనఃపూర్వకముగా గాంక్షించెదరు. అందువలన నేను గోరినవరములే నాయభీష్టములు. కాన నోసదాశివా! నాకవిచలమైనహరిభక్తిని, బరమవైష్ణవుడైనపుత్రుని బ్రసాదింపవలసినదిగా బ్రార్థించుచున్నాను. ఈవరములుదక్క నాకన్యవరములు వలదు. ప్రభూ! నేనుగోరినవరములకు నేనుదగనని మీరుభావించి, నామనో వాంఛితములను బ్రసాదింపకున్న నేను నాశిరమును ఖండించి, హోమమొనరించెదను".

గంధర్వునియచంచలభక్తిని గాంచి సదాశివుడానందించి వానినిట్లనుగ్రహించెను. "గంధర్వరాజా! నీవు కోరినప్రకారము నీకు హరిదాస్యము, అనన్యభక్తి సిద్ధించుగాక. నీకు బరమవైష్ణవుడైనపుత్రుడు కూడయింపగలడు. ఆకుమారుడు దీర్ఘాయుష్కుడు, సద్గుణశీలుడు, నిత్యసుస్థిరయువకుడు, సంపన్నుడు, జ్ఞానియు, సుందరుడు, గురుభక్తుడు, జితేంద్రియుడు కాగలడు." ఈ ఈ విధముగా నభీష్ట వరములను గంధర్వరాజున కనుగ్రహించి పరమశివు డంతర్హితు డయ్యెను. గంధర్వరాజు పరమానందభరితుడై తనరాజ్యమునకు వెడలిపోయెను. ఆగంధర్వరాజునకు బ్రహ్మశాపగ్రస్తుడైననారదుడే కుమారుడుగా జన్మించెను. ఆగంధర్వరాజుభార్య గంధమాదనపర్వతశిఖరముపై నొకశుభముహూర్తమున దివ్యసుందరపుత్రుని బ్రసవించెను. ఆసమయమున నాప్రదేశముననే యుపస్థితులై యున్నవారిగురుదేవులైన వశిష్ఠమహర్షి యథోచితముగ బాలకునకు నామకరణసంస్కారములు జరిపించెను. 'ఉప'శబ్ద మధికార్థబోధకము. పుంలింగమైన 'బర్హణ' శబ్దము పూజ్యమనునర్థమున బ్రయుక్తము.

ఈబాలకుడు పూజ్యపురుషులయందు దధికుడుగాన నీతనినామము 'ఉపబర్హణు' డని వశిష్ఠమహర్షియే ధ్రువీకరించెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని నారదజన్మకథన మను
పండ్రెండవ అధ్యాయము
సంపూర్ణము.

---

## పదమూడవ అధ్యాయము

### బ్రహ్మశాపము ననుసరించి ఉపబర్హణుడు యోగధారణముద్వారా తన శరీరమును త్యజించుట; మాలావతీ విలాపము; దేవతలకు శాపమీయ నుద్యుక్తురాలగుట; కౌశికీనదీతటమున దేవతలు మాలావతికి దర్శన మొసంగుట.

**సౌతి పలికెను :**

శౌనకాదిమహర్షులారా! గంధర్వరాజు తనపుత్రునిజన్మదినోత్సవము నందు ప్రసన్నతాపూర్వకముగా బ్రాహ్మణులకనర్ఘానేకరత్నములను, ద్రవ్యము లను దానమొనరించెను. సమయానుసారముగా నుపబర్హణుడు యువకుడై వశిష్ఠమునీంద్రునినుండి హరిమంత్రోపదేశము పొంది దుష్కరతపము నారంభించెను. అతడు హరిభక్తుడై గండకీనదీతటమునందు తపస్సుజేయు చుండగా నేబదిమందిగంధర్వకాంతలాతనిగాంచి ప్రేమాసక్తలై యతనిని పతిగా బడయవలెనని సంకల్పించి యోగశక్తిచే దమ శరీరములను త్యజించి 'చిత్రరథు'డనుగంధర్వునియింట జన్మించిరి. వారు తమప్రేమశక్తిచే తండ్రి యాజ్ఞ గైకొని 'ఉపబర్హణు'ని పతిగా బొందిరి. 'ఉపబర్హణుడు' దీర్ఘకాలము తనభార్యలతో సుఖించుచు రాజ్యమును పాలించెను. ఒకనాడు బ్రహ్మలోక మున కరిగి హరియశోగాన మొనరించుసమయమున, రంభ నృత్యమును గాంచి

మోహితుడైన 'ఉపబర్హణు'ని మనసు చలించి యాతనికి వీర్యపతనమయ్యెను. అది గ్రహించిన బ్రహ్మ కుపితుడై యిట్లు శపించెను. "గంధర్వా! నీ వీదివ్య శరీరమునుండి పతితుడవై శూద్రుడవు కమ్ము; తరువాత సమయానుసారముగా వైష్ణవుల సేవచే బునఃపవిత్రుడవై నాపుత్రరూపమున బ్రతిష్ఠితుడ వవుదువుగాక! కుమారా! విపత్తుల నెదిరింపకున్న బురుషునిశక్తి ప్రకటితము కాదు. ఈ సంసారమునందు జీవులందఱు క్రమముగా సుఖదుఃఖముల ననుభవింపక తప్పదు". ఈవిధముగా ఉపబర్హణుని శపించి బ్రహ్మ పుష్కరధామమునకు వెడలిపోయెను. గంధర్వుడైన 'ఉపబర్హణుడు' వైరాగ్యము చెంది తత్కాలముననే తననశ్వర శరీరమును యోగముచే త్యజించుటకు సంసిద్ధుడయ్యెను. మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూర, అనాహత, విశుద్ధ, ఆజ్ఞానామములు గలషట్చక్రములను క్రమముగా భేదించి యతడు 'ఇడా' మొదలగునాడులను భేదింప నారంభించెను. ఇడా, సుషుమ్నా, మేధా, పింగళా, ప్రాణధారిణీ, సర్వజ్ఞానప్రదాయనీ,మనఃసంయమనీ,విశుద్ధా,నిరుద్ధా, వాయుసంచారిణీ, తేజఃశుష్కకరీ, బలపుష్టికరీ, బుద్ధిసంచారిణీ, జ్ఞానజృంభణకారిణీ, సర్వప్రాణహరా, పునర్జీవనకారిణీనామకము లగు నీ పదునాఱునాడులను భేదించి, మనస్సహితముగా జీవాత్మను బ్రహ్మరంధ్రమున కేంద్రీకరించి, యోగాసనాసీనుడై యాత్మనాత్మయం దేకాగ్ర మొనరించెను. తదనంతర మాజాతిస్మరుడైన (పూర్వజన్మజ్ఞానము కల్గిన) మహాయోగి 'ఉపబర్హణుడు' బ్రహ్మభావప్రాప్తి నొందెను. మూడుతారల నమర్చియున్న వీణను ఎడమభుజముపై నుంచుకొని దక్షిణహస్తమందు శుద్ధస్ఫటికమాలను ధరించి సర్వవేదములకు సారతత్త్వమైన, యాదిబీజస్వరూపమైన, పరాత్పరబ్రహ్మమైన 'కృష్ణ' యను ద్వ్యక్షరమహామంత్రమును జపింపదొడంగెను. ఆతడు కుశాసనముపై దూర్పువైపుగా శిరము నుంచి, పశ్చిమదిశయందు జరణములను జాచుకొని, తనప్రాణములనుత్యజించెను. ఆసమయమున 'ఉపబర్హణుడు' చూపరులకు నిద్రించుచున్న మహాపురుషునివలె గోచరించుచుండెను. తనపుత్రు డిట్లు దేహత్యాగ మొనరించుట గాంచి తల్లిదండ్రులగుగంధర్వరాజుదంపతులు యోగముచే శరీరములనుత్యజించి శ్రీకృష్ణస్మరణముచేయుచుపరబ్రహ్మమునందైక్యమైరి. ఆ సమయమం దుపబర్హణుని బంధువులు, భార్యలు పెద్దగానేడ్చుచునాతనిశరీరము చెంతనే యుండిరి. వారు విష్ణుమాయామోహితులై, శోకవశులైరి. గంధర్వుని పట్టమహిషి యైన'మాలావతి' తనప్రియుని మృతశరీరమును గౌగిలించుకొని యుచ్చైస్స్వరముతో విలపింపదొడంగెను.

అనేకవిధముల విలపించుచు 'మాలావతి' దేవతల నిట్లు ప్రార్థించెను. "ఓ దిక్పాలకులారా! ధర్మదేవతా! ఓ, ప్రజాపతీ! గిరిజాశంకరా! మీరు నాకు పతిభిక్ష ప్రసాదింపవలసినదిగా వేడుకొనుచున్నాను". ఈవిధముగా విలపించుచు భర్తృశరీరమును కౌగిలించుకొని యాచిత్రరథునికొమార్తె మూర్ఛిల్లెను. ఆమె మరల జేతనము పొంది శ్రీకృష్ణు నిట్లు ప్రార్థించెను. "శ్రీకృష్ణా! నీవు సంపూర్ణ జగములకు స్వామివి, సంరక్షకుడవు. జగన్నాథా! నేను నీజగము నందే యున్నానుకదా! జగత్పాలకుడ వైన ప్రభూ! న న్నేల పాలింపరావు? ఏల నామొఱయాలకింపవు? నేను, నాది యనుభావము జీవునియందు నీయొక్క మాయచేతనే యుద్భవించెను. నాకర్మలఫలస్వరూపముగా 'ఉపబర్హణుడు' నాప్రియపతి యైనాడు. కర్మవశమున నేనీయనకు 'పత్ని'నైతిని. మేము మా దివ్యకర్మలఫలము ననుభవించు నీతరుణములో నన్నీయవస్థయందు వీడి నా నాథు డెచ్చటకు జనెను? ఎవ రెవరికి పతి? ఎవ రెవరికి సతి? విధాత వారివారికర్మానుసారముగా జీవుల కొకరినుండి రెండవవారికి సంయోగమును, వియోగము కల్పించును. సంయోగముచే సుఖము, వియోగముచే దుఃఖము సంభవించును. ఆత్మారాము డైనవానికి సత్యముగా సంయోగ వియోగదుఃఖము లంటవు. విషయసుఖములు నశ్వరములు. ఇది సత్యము. ఈభూమియందు విషయభోగములే బంధనములు. మనః పూర్వకముగా విషయభోగములను త్యజించు వారి కవి సుఖకారణములు కాగలవు. కాని యితరు లెపుడు బలపూర్వకముగా వారిచేత విషయభోగసుఖ ములను త్యాగముచేయించెదరో, యాసమయమున నవి పరమ దుఃఖదాయక ములు కాగలవు. అందువలననే సాధుపురుషు లైశ్వర్యములను, కోరికలను త్యజించి నీచరణారవిందములనే సదా ధ్యానించెదరు. కృష్ణా! నీచరణాశ్రితుల చెంత కాపత్తి, విపత్తులు చేరజాలవు. సకలదేవతలారా! నేను జ్ఞానిని గాను, భక్తురాలను గాను. నాపతియందే యనురక్తనై యున్నసతిని, మూఢురాలను. నాకు నామనోవాంఛితు డైననాథర్తను బ్రసాదింపవలసి నదిగా బ్రార్థించుచున్నాను. నాకు స్వర్గముకాని, అమరత్వముగాని, మోక్షము గాని యవసరము లేదు. నాకు నాశ్రేష్ఠు డైన'పతి'నే ప్రసాదింపుడు. ఎందుచే ననగా ఆయనయే నాకుధర్మార్థకామమోక్షములనెడి చతుర్విధపురుషార్థములను బ్రసాదింపగలనాదైవము". ఈప్రకారముగా ననేకవిధముల బ్రార్థించినను దన మొఱ నాలకించుదేవతలను గానక కోపించి బ్రహ్మాదిసకలదేవతలను శపించుటకు

'మాలావతీదేవి'యుద్యుక్తురా లయ్యెను. దేవత లది గ్రహించి తమను ఆసతిశాపమునుండి రక్షింపవలసినదిగా క్షీరసాగరమున కరిగి 'నారాయణు'ని ప్రార్థించిరి. ఆసమయమున నశరీరవాణి దేవతల నిట్లాదేశించెను. "దేవత లారా ! మీరు నిశ్చింతులు కండు. యజ్ఞస్వరూపుడైనభగవానుడు విష్ణుమూర్తి బ్రాహ్మణరూపము ధరించి 'మాలావతీదేవి'ని శాంతింపజేసి మిమ్ములను శాపాగ్నినుండి కాపాడగలడు" ఈవిధముగా బలికినయశరీరవాణి నాలకించి దేవతలు సంతుష్టులై కౌశికీతటమున కరిగి యాప్రదేశమందు విలపించుచున్నమాలావతిని దర్శించిరి. పతిసేవ యనుమహాపవిత్రధర్మానుష్ఠానము చేత జిరకాల మార్జించుకొన్నదివ్యపుణ్యతేజముతో నగ్నియొక్క యుత్తమ ప్రజ్వలితశిఖవలె 'మాలావతీదేవి' ప్రజ్వరిల్లుచుండెను. ఆప్రదేశమున దేవత లదృశ్యరూపులై యేమిజరుగగలదో యని నిరీక్షింపదొడంగిరి.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమునందలి
బ్రహ్మఖండములోని మాలావతీ విలాప
మను పదమూడవ అధ్యాయము
సంపూర్ణము.

—♦—

## పదునాల్గవ అధ్యాయము

**విష్ణువు బ్రాహ్మణ బాలకరూపమున మాలావతితో సంభాషించుట; ఆయునకామె తనదుఃఖమును, ఇచ్ఛను వ్యక్తముచేయుట; విభిన్న దేవతా రాధనలవలనలభించు ఫలమును, శ్రీకృష్ణ భజన మహిమను వర్ణించుట.**

**సౌతి పలికెను :**

అదృశ్యులై వీక్షించుచున్నబ్రహ్మశివాది దేవత లాసతీసముఖమున బ్రకటితులైరి. సకలదేవతలను గాంచి'మాలావతి' వినమ్రమనై నమస్కరించెను.

వారు తనకు సంభవించినకష్టమును దొలగింపలేరని భావించి మరల దనపతి శరీరమును గౌగిలించుకొని దీనాతిదీనయై విలపింపసాగెను. ఆసమయమున దేవ సమూహమునుండి యొకబ్రాహ్మణబాలుడు 'మాలావతి' యెదుటకు ద్రోసికొని వచ్చెను. ఆబ్రాహ్మణకుమారు డత్యంతమనోహరాకృతికలవాడై దండ, చ్ఛత్ర, శ్వేతవస్త్రధారియై హస్తమునందు బుస్తకమును ధరించి చందనచర్చి తుడై ప్రచండబ్రహ్మతేజముతో బ్రకాశించుచుండెను. విష్ణుమాయామోహితులైన దేవతలయొక్క యనుమతిని బొంది యతడా దేవసభామధ్యమున నాసీను డయ్యెను. ఆబ్రాహ్మణకుమారుడు దేవసభామధ్యమున దారామండలములో బ్రకాశించుచంద్రునివలె భాసించుచుండెను. బ్రాహ్మణకుమారుడు ప్రసన్న వదనుడై యాప్రదేశమున సమావిష్టులైయున్న దేవతలను, మాలావతిని నీవిధముగా బ్రశ్నించెను. "ఈప్రదేశమునకు బ్రహ్మాదిదేవత లందఱును విచ్చేసి యున్నారు. జగత్సృష్టికర్త యగువిధాత, సంహారకర్త యగుశంకరుడు నేకారణమున నీప్రదేశమున సమావిష్టులైరి? మూడులోకములలోనికర్మలకు సాక్షి యగుధర్మదేవతకూడ నిచ్చటనే యున్నాడే! పరమాశ్చర్యముగా నున్నది. ఓమాలావతీ! నీయొడిలో నున్నమృతునివృత్తాంత మేమి?" అని ప్రశ్నించి సమాధానముకొఱకు వీక్షించుచున్న బ్రాహ్మణబాలకునకు 'మాలావతి' యీ విధముగా బ్రత్యుత్తరమొసంగెను.

**మాలావతి పలికెను :**

విష్ణుస్వరూపా! బ్రాహ్మణకుమారా! నీకివే నానమస్కారములు. నేను పరమదుఃఖితురాలను. నీవైనను నామొఱయాలకింపుము. ఎందుచేనన మహాత్ములైనవారు యోగ్యులను నయోగ్యులను సమముగా ననుగ్రహింతురు. విప్ర దేవతా! నేను 'ఉపబర్హణుని' సహధర్మచారిణిని; చిత్రరథునికొమార్తెను. నన్ను 'మాలావతి' యందురు. ఒకలక్షదివ్యవర్షములు నాస్వామితో సుఖముల ననుభవించితిని. సాధ్వియగుయువతి తనభర్తయం దెంతప్రేమ కలిగియుండునో, శాస్త్రపారంగతు డవైననీకు విదితమేగదా! బ్రహ్మశాపముచే నాపతి మరణించినాడు. నాపతిని పునర్జీవితుని గావింపవలసినదిగా సమస్తదేవతలను వేడుకొనుచున్నాను. సుఖదుఃఖములు, భయశోకములు, సంతానైశ్వర్యములు; నానందము, జన్మమృత్యువులు మోక్షములు జీవులకు వారివారికర్మానుసారముగానే ప్రాప్తించును. దేవత లందఱకు బూజ్యులు. వీరే కర్మఫలములను బ్రసాదింప

గలరు. ఆ దేవతలే కర్మవృక్షమూలములను ఛేదించుటలో సమర్థులు. దేవతలను మించినబలవంతులు, దాతలు, దయాపరులు మఱెవ్వరును లేరు. దేవతలు ధర్మార్థకామమోక్షఫలములను బ్రసాదింపగలకల్పవృక్షములు. అందువలననే నాపతిని బునర్జీవితుని జేయవలసినదిగా వారినిబ్రార్థించితిని. దేవతలు నాప్రార్థననంగీకరించిరా, సరియే లేదా స్త్రీహత్యాపాతకమును బొందగలరు. ఇంతియే కాదు నేను దారుణముగా వారిని శపింపగలను. సతీశాపమునుండి తప్పుకొనుట యెవరికైనను దుర్లభమే !"

శౌనకాదిమహర్షులారా ! ఇట్లు శోకమగ్నయై పలికినపతివ్రతయగు 'మాలావతిని'గాంచి యాదివ్యబ్రాహ్మణరూపధారి యిట్లువచింప నారంభించెను.

## బ్రాహ్మణుడు పలికెను :

సకలకర్మములకు ఫలప్రదాతలు దేవతలే ! అందు సంశయము లేదు. కాని యాదేవదత్తమగుఫలము వెంటనేగాక కొంత యాలస్యముగా లభింపగలదు. రైతు విత్తినవిత్తనములు వెంటనేగాక యాలస్యముగా బంటనువచ్చి, ఫలమునిచ్చునట్లు, యన్యవిషయములనుగూడ నర్థముచేసికొనవలెను. సన్మార్గుడై మానవుడీ పుణ్యభూమియం దాచరించిన తపమునకు ఫలదాతలు దేవతలే ! బ్రాహ్మణులకు భక్తిభావముతో నర్పించినది, సారవంత మగుభూమియందు నాటినది యవశ్యము ఫలములను బ్రసాదించును. బలము, సౌందర్యము, ఐశ్వర్యము, ధనము, సత్పుత్రుడు, గుణవతి యైనసతి, సద్గుణు డగుపతి తపమువలననే లభింపగలరు. భక్తిభావముతో ప్రకృతియైన 'దుర్గ'ను సేవించు వాడు మఱుజన్మములో సద్గుణవంతుడును, సుందరుడు నైనపురుషుని ప్రాణవల్లభుని రూపమున బొందగలరు. ప్రకృత్యనుగ్రహముననే భక్తపురుషు డవిచల మైనలక్ష్మిని, బుత్రపౌత్రులను, భూమిని, ధనమును సత్సంపదలను బొందగలడు.

భగవంతు డైనశివుడు కళ్యాణస్వరూపుడు, కళ్యాణదాత, కళ్యాణప్రాప్తికారణుడు, మహాత్ముడు, పరమేశ్వరుడు, మృత్యుంజయుడు, జ్ఞానానందస్వరూపుడు. భక్తిభావముతో నామహేశ్వరుని సేవించువారు పరజన్మములో సుందరి యగుసతిని బత్నిగా బడయగలరు. సదాశివుని సేవించినస్త్రీ యుత్తమపురుషుని బతిగా బడయగలదు. హరునికరుణవలన మనుష్యులకు ధనము, విద్య, కవిత్వము, బలము, పరాక్రమము మొదలగునవి లభింపగలవు. బ్రహ్మో

పాసనవలనగూడ పైనిజెర్కొనినవి లభింపగలవు. సూర్యోపాసనచే నానందము, ఆరోగ్యము, ధనము లభింపగలదు. ప్రప్రథమమున వినాయకుని భక్తిభావముతో బూజించువారికి నిశ్చయముగా జన్మజన్మములందు విఘ్నములు కలుగవు. లక్ష్మీపతియగు 'విష్ణువు'నుపాసించినవారికి గోరిక లన్నియు సఫలములు కాగలవు. నిశ్చయముగా వారికి భవసాగరమునుండి ముక్తి లభింపగలదు. శాంతస్వరూపుడు, జగత్పాలకుడు నైన శ్రీమహావిష్ణువును సేవించిన మాత్రముననే మనుష్యునకు సమస్తతపస్తేజము, సర్వధర్మాచరణఫలములు, ఉత్తమయశము, కీర్తి, యైశ్వర్యాదులు కోరకయే లభింపగలవు. జగన్నాథు నుపాసించి ప్రతిఫలముగా వరముల నర్థించువారు విధిచేతిలోనికీలుబొమ్మలై విష్ణుమాయవలన పతనము నొందెదరు. నారాయణి యైనవిష్ణుమాయ సర్వసమర్థురాలు; సర్వకారణురాలు, పరమేశ్వరి. ఆమె యెవరిని గరుణించునో వారికామెయే శ్రీహరిమంత్రమును బ్రసాదించును. ధర్మాత్ములై ధర్మము నారాధించి యాచరించినవారికి నిశ్చయముగా సర్వధర్మఫలము లభింపగలదు. వారిహలోకమందు సుఖముల ననుభవించి పరలోకమందు శ్రీమహావిష్ణువుయొక్క పరమపదమును బొందగలరు. ఏదేవతల నుపాసించినను వారివలన వరముల బడసి తుదకు హరిభక్తులై వైకుంఠము చేరగలరు.

భగవంతు డైన శ్రీకృష్ణుడు ప్రకృతికి, త్రిగుణములకు నతీతుడు, బ్రహ్మవిష్ణుశివాదిసకలదేవతావందితుడు, నిర్గుణుడు, ఆదికారణుడు, పరాత్పరుడు, అవినాశి, పరబ్రహ్మము, సనాతనుడు, భగవంతుడు, సాకారుడు, నిరాకారుడు, జ్యోతిస్స్వరూపుడు, పరమానందమయుడు, సర్వేశ్వరుడు, సర్వాధారుడు, స్వేచ్ఛామయుడు, సర్వవ్యాపి, యీశ్వరుడు, నిర్లిప్తుడు సకలసాక్షిస్వరూపుడు. ఆయన తనభక్తుల ననుగ్రహించుటకొరకు దివ్యమంగళస్వరూపుడైనాడు. ఆదివ్యమంగళస్వరూపుని భక్తిభావముతో నారాధించువారు నిశ్చయముగ జీవన్ముక్తులు కాగలరు. ఆయనయనన్యభక్తుడు స్వామినుండి యెట్టివరముల నాసింపడు. సాలోక్యాదిచతుర్విధమోక్షములనుగూడ నతడు హరిభక్తియొసుట దుచ్ఛములుగా భావించును. బ్రహ్మపదము, అమరత్వము, ఇంద్రపదము మొదలగు దివ్యపదములనుగూడ నీచముగా భావించును. అతనిదృష్టిలో సకలసంపదలు మట్టితో సమానములె. చిరంజీవిత్వమునుగూడ నతడు క్షణభంగురమైనదిగ భావించును. జాగ్రత్స్వప్న నిద్రావస్థలయందునుగూడ నతడు శ్రీకృష్ణునియెడల

సేవాభక్తులనే కాంక్షించుచుండును. హరిభక్తుడు హరిదాస్యపదముదక్క అన్యపదములను గాంక్షింపక శ్రీకృష్ణునిచరణారవిందములం దవిచల మైన భక్తిని బొంది పూర్ణకాముడు కాగలడు. తనవంశములోనితరతరములవారిని, 'శ్వశుర'వంశములోనివారినిగూడ దరింపజేసి స్వయముగా గోలోకధామమును బొందగలడు. ఇది నిశ్చయము, సత్యము. జీవుడు శ్రీకృష్ణభక్తిలభింపనంత వఱకు జననమరణయుక్త మైనమాతృగర్భమనునరకము ననుభవించుచు యమ యాతనలకు గుఱికాగలడు. గృహస్థు హరిభజనము చేయనంతకాలమే రాగా సక్తుడు కాగలడు. హరిభక్తుడై హరినామసంకీర్తనము నాశ్రయించినంత మాత్రముననే జీవుడు బహుబంధముక్తుడై సచ్చిదానందపరబ్రహ్మ మైన శ్రీకృష్ణుని బొందగలడు. హరిభక్తుని యముడుకూడ బాధింపజాలడు. కోటాను కోట్లజన్మలపాపములు హరిభక్తుని విడిచి గరుత్మంతుని గాంచినసర్పములవలె పాఱిపోగలవు. శ్రీకృష్ణభక్తుడీనశ్వరశరీరమును ద్యజించి దివ్యశరీరధారియై గోలోకమునకు జేరి సదా శ్రీకృష్ణుని సేవింపగలడు. ఆభక్తుడు నిత్యుడై శ్రీకృష్ణసేవకుడు కాగలడు. దేవీ ! మాలావతీ ! శ్రీకృష్ణదాసునకు బ్రహ్మ యుర్దాయము నిమేషకాలమే యనిగ్రహింపుము".

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని విష్ణు మాలావతీ
సంవాద మను పదునాల్గవ
అధ్యాయము
సంపూర్ణము.

—o—

# పదునైదవ అధ్యాయము

## బ్రాహ్మణుడు తన సామర్థ్యమును బరిచయముచేయుట; మాలావతి పతిమాహాత్మ్యమును జెప్పుట; బ్రాహ్మణుడు కాల, యమ, మృత్యుకన్యకల బిలిపించి యామెతో మాటలాడించుట; ఆమెను శ్రీకృష్ణ చింతనమునకై ప్రేరేపించుట.

**సూతుడు పలికెను :**

బ్రాహ్మణకుమారు డిట్లు తనప్రవచనము కొనసాగించెను. "పతివ్రతా! మాలావతీ! నీభర్త రోగగ్రస్తుడై మరణించినయెడల నేను చికిత్సచేయుదును. సమస్తరోగములను బాపుచికిత్స లన్నియు నాకు కరతలామలకములే. కాన నేరోగముచేమరణించినను వారము దాటనియెడల నాచికిత్సాజ్ఞానముచే వానిని బునర్జీవితుని చేయగలను. వేటగాడు పశువులను బంధించునట్లు నేను వృద్ధత్వమును, మృత్యువును, యముని, కాలమును, సకలవ్యాధులను బంధించి నీముందుంచగలను. సుందరీ! రోగకారణములను, రోగములు శరీరమందు వ్యాపించకుండ నిరోధించగలశాస్త్రమును నే నెఱుగుదును. నేను శాస్త్రజ్ఞానముచే నసలు వ్యాధ్యంకురములే శరీరమందు ప్రవేశించకుండ నివారింపగలను. యోగముచేతగాని, రోగముచేతగాని మరణించిన వారిని నిశ్చయముగా యోగప్రభావముచే బునర్జీవితులను జేయగలను".

ఆబ్రాహ్మణబాలకునియాశాజనకము లైనదివ్యవచనముల నాలకించి, హర్షించి, తనపతి పునర్జీవితుడు కాగలడనునాశతో 'మాలావతి' యావేశముగా బల్కెను. "ఆహా! ఏమివిచిత్రము! ఈబ్రాహ్మణబాలకునిముఖమునుండి యెంతయాశ్చర్యకరము లైనవిషయములను వింటిని? ఈబాలకుడు చూపులకు జిన్నవాడుగా నున్నను, ప్రజ్ఞలో మహాయోగులను మించినజ్ఞానసంపన్నునివలె నున్నాడు. బ్రాహ్మణకుమారా! నీవు నాపతిని బునర్జీవితుని జేయగలనని ప్రతిజ్ఞ చేసినావు. సత్పురుషులవచనము లెన్నటికి 'మిథ్య'లు కావు. అందువలననే నీనిర్ణయము వినినవెంటనే నా'పతి'జీవితుడైనట్లే భావించుచున్నాను. ఓబ్రాహ్మణదేవా! నీవు నామొఱనాలకించి, నాభర్తను బునర్జీవితునిగా నొనర్పుము. మొదట నాకోరికలను మన్నించి, నాసంశయములను దీర్పుము.

భర్తయే స్త్రీకి కర్త, శాసకుడు, పోషకుడు, రక్షకుడు, ఇష్టదైవము, పూజ్యుడు. నారికి 'పతి'ని మించినగురువు లేడు. ఉత్తమకులసంజాత యగుస్త్రీ యెల్లప్పుడు తనపతియాజ్ఞానువర్తినియై మెలగగలదు. పతియాజ్ఞను దిరస్కరించి స్వతంత్రించుస్త్రీ నిశ్చయముగ దుష్టురాలు 'కులట'యనబడును. నీచకులసంజాత లైన'కులటా' స్త్రీలుమాత్రమే తమ పతులను నిందించుచు గష్టము కల్గించెదరు. నే నుపబర్హణునిపత్నిని, చిత్రరథునికొమార్తెను, గంధర్వరాజు కోడలిని. నేను సదా నాప్రియభర్తను భక్తిభావముతో సేవించితిని. దివ్య బ్రాహ్మణా ! నీవు సర్వసమర్థుడవు. నాకోరిక మన్నించి కాలమును, మృత్యువును, యముని నాసముఖమునకురప్పింపుము". మాలావతికోర్కెలను మన్నించి దివ్యబ్రాహ్మణబాలకుడు సభలో నుపస్థితులై యున్నవారి నందఱిని మాలావతి కెదురుగ రావించెను. మాలావతీదేవి మృత్యుకన్యను, యమధర్మరాజును ఈభర్త యాయుర్దాయము నిండకముందే యౌవనమందే యేల హరించితిరని ప్రశ్నించెను. అందులకు వారు "మేము కాలమునకు బద్ధులము; కాలమాసన్నము కానిదే యెవరిని సమీపింపము, మేము భగవంతునియధీనులమై యుందుము. నీ వివిషయమును గాలపురుషునే ప్రశ్నింపు"మని యాదేశించిరి. తదనంతర మాపతివ్రత సకలమృత్యువులకు గారకు డైన'కాలపురుషు' నిట్లు ప్రశ్నించెను. "కాలపురుషా ! నీవు సర్వకర్మలకు సాక్షివి, కర్మస్వరూపుడవు; నారాయణుని సనాతనాంశజుడవు. పరమేశ్వరా ! నీకు నమస్కారము. ప్రభూ ! నేను జీవించి యుండగనే నాభర్తప్రాణము లెట్లు హరింపగల్గితివి ? దేవా ! నీవు సర్వజ్ఞుడవు, కాన నీకు సర్వప్రాణులసుఃఖములుకూడ దెలియును.". ఇదివిని 'కాలపురుషు' డిట్లు పల్కెను. "పతివ్రతా ! సాధ్వీలలామా ! నేనుగాని, యముడుగాని, మృత్యుదేవతగాని, వ్యాధిగణములుగాని లెక్కలోనివారము కాము. మేమందఱము పరమేశ్వరునాజ్ఞాబద్ధులము. ఎవడీప్రకృతిని సృష్టించెనో, ఎవని నుండి బ్రహ్మవిష్ణుశివాదులు ప్రాదుర్భవించిరో, మునీంద్రులు, మనువులు, సకల జీవజంతువులు, ఎవరినుండి జన్మించినవో, యోగిజను లెవ్వనిచరణారవిందము లను సదా స్మరించుచుందురో, బుద్ధిమంతు లైనమనుష్యులే దేవాదిదేవునిదివ్య నామములను స్మరించుచుందురో. యెవనియాజ్ఞచే వాయువుచలించుచుండునో, విష్ణువు పాలనముచేయుచుండునో, శివుడులయమొనరించుచుండునో, ధర్మదేవత పరిపాలించుచుండునో, సమస్తగ్రహములు నాకాశమందు భ్రమించుచుండునో, దిక్పాలకులెవనియాజ్ఞానుబద్ధులైయీజగత్తును బాలించుచుందురో,ఎవనియాజ్ఞచే

వృక్షము లాయాసమయములందు బుష్పించి, ఫలముల నొసంగుచున్నవో, యెవనిసంకల్పమాత్రముచే బృథ్వి, జలము సకలజీవులకు జీవనాధారములై యున్నవో, యెవనియాత్మ మాయవలన బ్రకృతిమాయసహితము మోహిత మై యుండునో, సర్వజ్ఞానములకు మూలములైనవేదములుకూడ నెవనిని గనుగొనజాలకున్నవో, సర్వపురాణములు నెవనిని స్తుతించుచున్నవో, సర్వేశ్వరుని పదునారవకళకు సమానులైనబ్రహ్మవిష్ణువిరాట్పురుషాదు లెవనిని సదా స్మరించుచుందురో యాయనయే యందఱికి సర్వేశ్వరుడు కాలమునకు గాలము, మృత్యువునకు మృత్యువు, పరాత్పరపరబ్రహ్మము; పరమాత్ముకుడగునాకృష్ణునే నీవు సదా యుపాసించుము. ఆకృపానిధానుడే నీయభీష్టములను దీర్పగలడు. నీపతిని బునర్జీవితుని జేయగలసమర్థుడు. సర్వదేవతలు నెవనియధీనులో యాదేవాదిదేవుడైనశ్రీకృష్ణుడే సంపూర్ణసంపదలను బ్రసాదింపగలవాడు'' ఇట్లుపదేశమొనరించి కాలపురుషుడు మిన్నకుండెను. తదనంతరము బ్రాహ్మణకుమారు డీవిధముగ బలుకదొడంగెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని మాలావతీ కాలపురుష
సంవాద మను పదునైదవ అధ్యాయము
సంపూర్ణము.

# పదునాఱవ అధ్యాయము

## మాలావతి యడుగగా బ్రహ్మరూపధారియగు శ్రీహరి వైద్యకసంహితను, ఆయుర్వేదాచార్యపరంపరను, జ్వరము మున్నగు నఱువదినాలుగు రోగములను, వానికి గారణములను, తన్నివారణోపాయములను వివరించుట.

**బ్రాహ్మణుడు పలికెను :**

శుభాంగీ! నీవు కాలమును, యముని, మృత్యుకన్యలను, వ్యాధిగణమును దర్శింపగల్గితివి. నీమనమున నేసందేహము గలదో ప్రశ్నింపుము. నేను నీసర్వ సందేహములను నివారింపగలను.

బ్రాహ్మణకుమారునిమధురతరము లైనపలుకులను విని మాలావతీదేవి ప్రహృష్టాంతరంగయై తనమనమునందు గలశంకల నాజగదీశ్వరుని యెదుట నిట్లు ప్రస్తావించెను.

**మాలావతి పలికెను :**

బ్రాహ్మణదైవమా! రోగములే ప్రాణములను హరించు గాలమున కుపకరణములని తెలిపియున్నావు. రోగములు సంభవించుటకు నానాప్రకారము లైనకారణములు కలవు. ఆకారణముల నన్నింటిని నాయుర్వేదమందు నిర్ణయించిరి. ఏరోగములు నివారణచేయుటకు సైతము కఠినములో, యారోగములు శరీరమందు వ్యాపించకుండ నివారించుట కుపాయములు కలవా? ఉన్నచో, దయతో నా కావిషయముల నన్నింటిని సవిస్తరముగా నుపదేశింపుము.

మాలావతీ! ప్రార్థన నాలకించి యాబ్రాహ్మణరూపధారి యైనవిష్ణువు వైద్యసంహితను వర్ణింప నారంభించెను.

**బ్రాహ్మణుడు పలికెను :**

దేవాదిదేవుడు, సర్వతత్త్వజ్ఞాతయు, సర్వకారణకారణుడు, వేదవేదాంగబీజము, పరమేశ్వరుడు నగుశ్రీకృష్ణునకు వందనము లర్పించెదను. దేవీ!

సమస్తమంగళములకుగూడ మంగళకరుడు, సనాతనుడగు నగుపరమేశ్వరుడే విజ్ఞానసర్వస్వము లైన ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, నథర్వణవేదము ననుచతుర్వేదములను బ్రకటించెను. ఆ వేదముల నధ్యయనముచేసి వేదసారమును గ్రహించి ప్రప్రథమమున బ్రజాపతి "ఆయుర్వేదమును" రూపొందించెను. ఈప్రకారముగ బంచమవేదమును నిర్మించి స్రష్ట దానిని సూర్యదేవున కుపదేశించెను. ఆయాయుర్వేదసారమునుండి సూర్యుడొకస్వతంత్రసంహితను సృష్టించి తనశిష్యుల కనుగ్రహించెను. తదనంతర మాశిష్యులుకూడ సూర్యప్రోక్తాయుర్వేదసంహిత ననేకోపసంహితల రూపమున నిర్మాణమొనరించిరి. పతివ్రతా ! ఆవిద్వాంసులనామధేయములను, వారు రచించినరోగవినాశకబీజరూపము లైనతంత్రములనామములను వివరించెద నవధరింపుము.

ధన్వంతరి, కాశీనృపాలుడు, దివోదాసుడు, అశ్వినీకుమారులు, నకులుడు, సహదేవుడు, సూర్యపుత్రు డైనయముడు, చ్యవనమహర్షి, జనకుడు, బుధుడు, జాబాలి, జాజలి, పైలుడు, కరథుడు, అగస్త్యుడు ఈపదునారుగురు వేదవేదాంగజ్ఞాతలు, రోగవినాశకు లగుచు వైద్యులు. మాలావతీదేవీ ! మొదట'ధన్వంతరి' చికిత్సాతత్త్వవిజ్ఞానమను మనోహరతంత్రమును నిర్మించెను. అనంతరము దివోదాసుడు చికిత్సాదర్పణము, కాశీరాజు దివ్యచికిత్సాకౌముది, అశ్వినీకుమారులు భ్రమము నివారింపగలయమోఘు వైద్యసంహితనైన చికిత్సాసారతంత్రము, నకులుడు వైద్యకసర్వస్వము, సహదేవుడు వ్యాధిసింధువిమర్దనము, యముడు జ్ఞానార్ణవము, చ్యవనమహర్షి జీవదానము, యోగియైనజనకుడు వైద్యసందేహభంజనము, చంద్రకుమారు డైనబుధుడు సర్వసారము, జాబాలుడు తంత్రసారము, జాజలి వేదాంగసారము, పైలఋషి నిదానతంత్రము, కరథుడు సత్తమమైన సర్వధరతంత్రము, అగస్త్యమహర్షి ద్వైధనిర్ణయము నను వైద్యగ్రంథములను నిర్మాణమొనరించిరి. ఈపదునారుగురు తంత్రచికిత్సాశాస్త్రమునకు బీజస్వరూపము లైన వైద్యగ్రంథములు. ఈగ్రంథములు రోగనాశకములు. ఇవి శరీరమున కపారబలమును బ్రసాదింపగలవి. ఆయుర్వేద మనుమహాసముద్రమును జ్ఞానమనెడి మంథరముతో మథించి విద్వాంసులు నవనీతస్వరూపము లైనయు వైద్యతంత్రగ్రంథములను సర్వసుఖసౌభాగ్యములకై నిర్మించిరి. సుందరీ ! ఈగ్రంథ

క్షేపణమువలన నీవు భాస్కరసంహితయైన, సర్వబీజస్వరూప మైనయాయుర్వే దముయొక్క పరిపూర్ణజ్ఞానమును బడయగలవు.

వ్యాధేస్తత్త్వ పరిజ్ఞానం వేదనాయాశ్చ నిగ్రహః ।
ఏతద్వైద్యస్య వైద్యత్వం నవైద్యః ప్రభురాయుషః ॥

"ఆయుర్వేదానుసారముగా రోగములయొక్క పరిజ్ఞానము కలిగి వేదన ననుభవించుచున్న జీవునిశరీరమం దున్నరోగమును నిర్ణయముచేసి, యారోగ బాధను నిరోధించి, దానిని నిర్మూలించుటయే వైద్యులయొక్క వైద్యత్వము. వైద్యు డాయుర్దాయమునకు స్వామికాడు. అత డాయుర్దాయమును పెంచను లేడు తగ్గించను లేడు".

ఆయుర్వేదస్య విజ్ఞాతా చికిత్సా సుయథార్థవిత్ ।
ధర్మిష్ఠశ్చ దయాలుశ్చ తేనవైద్యః ప్రకీర్తితః ॥

నిజమైనచికిత్సకు డాయుర్వేదజ్ఞాతయు, చికిత్సక్రియను యథార్థరూప ముగా దెలిసికొనువాడు, ధర్మనిష్ఠుడు, కరుణామయుడు నగుఅట్టివాడు వైద్యు డనబడును.

దారుణమైనజ్వరమే సకలరోగములకు మూలము. ఆ మహాజ్వరము నిరోధించుట యత్యంతకఠినము. అది శివునిభక్తుడైనయోగి. దాని స్వభావ మత్యంతనిష్ఠురము. దానియాకృతి వికృతము. ఆ భయంకరజ్వరము కాలము వలె, అనంతునివలె, యమునివలె వినాశకారి. భస్మములే దానియస్త్రములు. రుద్రుడే దైవము. మందాగ్నియే యాజ్వరమునకు దంష్ట్రి. మందాగ్నికి జన కులు ముగ్గురు. అవి వాత, పిత్త కఫములు. ఇవియే ప్రాణుల కనేకరోగముల ద్వారమున ననంతదుఃఖములను గలిగింపగలవు. 'త్రిదోషజ' మనెడు నాల్గవజ్వరముకూడ గలదు. పాండువు, కామెరలు, కుష్ఠము, శోఫ, ప్లీహము, శూల, జ్వరము, అతిసారము సంగ్రహణి, ఉబ్బసము, దగ్గు, వ్రణము, హలీ మకము, మూత్రకృచ్ఛ్రము, రక్తవికారము, రక్తదోషము, రక్తదోషమువలన నుత్పన్నము లగుగుల్మములు, విషమేహము, కుబ్జ, బోద, గవదబిళ్ళలు (గల గండ), భ్రమరి, సన్నిపాతము, విషూచి (కలరా) దారుణి మొదలగు **నలు** వదినాలుగు మహారోగములు కలవు. ఈరోగముల పరస్పరకలయికలచే ననేక రోగము లుద్భవింపగలవు. ఈ రోగములన్నియు మృత్యువునకు బుత్రులు. వృద్ధత్వము మృత్యువునకు కుమార్తె. వృద్ధత్వము తన సోదరులతో గలసి

యెల్లప్పుడు దేహధారులైన జీవుల నావహించుటకు భూమిపై భ్రమించు చుండును.

రోగ నివారణోపాయములను గ్రహించి యమనియమములతో జీవించుమానవునిదరికి రోగములు చేరవు. గరుడుని గాంచి పరు వెత్తుసర్పములవలె, సంయమనియమయుక్తుడైన మనుష్యుని గాంచి రోగ సమూహములు పాఱిపోగలవు. నేత్రములను బ్రతిదినము స్వచ్ఛమైనజలములతో శుద్ధమొనర్చుకొనుట, ప్రాతఃకాలమందు వ్యాయామమాచరించుట, రెండుపాదములయందు, మస్తకము (శిరము)పైన, శరీరమం దంతట నూనెతో మర్దించుకొనుట, చెవిలో నూనె వేసికొనుట మొదలగుప్రయోగములు జరా వ్యాధులను దూర మొనరింపగలవు. వసంతఋతువునందు బాగుగా భ్రమణము చేయుచు, స్వల్పమాత్రముగ నగ్ని సేవన మొనరించుచు, గామమును నిరో ధించి యథాసమయమున తరుణవయస్కురాలైనభార్యనుపభోగించువారి సమీపమునకు వృద్ధత్వము రాదు. గ్రీష్మఋతువున జలాశయములందుగాని, బావిలోనిశీతలజలములందుగాని స్నాన మొనరించుచు, నరగదీసినచందనమును శరీరమున కనులేపన మొనరించుకొనుచు, బరిశుద్ధమైనవాయువును సేవింతురో వారియొద్దకు జరావస్థచేరలేదు. వర్షఋతువునందు వేడినీటితో స్నానమాడుచు, వర్షించుచున్న జలములను సేవింపక, సమయము తప్పక మితముగ భుజించువారియొద్దకును వార్ధక్యముచేరదు. శరదృతువందు బ్రచండసూర్య రశ్మిని సేవింపరాదు. ఈఋతువునందు స్వచ్ఛమైనబావిజలములతో లేక జలా శయములలో స్నానమాచరించుచు సమయము తప్పక పరిమితముగ భుజించు వారిదరికిని ముసలితనము చేరదు. హేమంతఋతువునందు బ్రాతఃకాలముననే బావిజలములలో స్నానమొనరించి, స్వల్పాగ్ని సేవన మొనరించుచు, వేడివేడి పదార్థములను భుజించువారిచెంతకును వృద్ధావస్థ చేరదు. శిశిరఋతువునందు బ్రజ్వలితాగ్ని సేవన మాచరించుచు, [illegible]మైన వస్త్రములను ధరించుచు వేడి వేడిపదార్థములను భుజించుచు, వేడిజలములందు స్నాన మాచరించుచున్న వారిని వృద్ధత్వము తనవశము జేసికొనజాలదు.

వేడియాహారమును, బరువాన్నమును, [illegible] ([illegible]) సేవించుచు సమయానుసారముగ [illegible] జరాత్వము బాధింపలేదు. [illegible], దల్లన స్వచ్ఛ

జలములను సేవించువారు, ప్రతిదినము తాంబూలసేవన మొనరించువారు నగు మానవులయొద్దకు వృద్ధత్వము రాదు. ప్రతిదినము పగలు పెరుగును, అప్పు డప్పుడు చేసిన వెన్నను, బెల్లమును సేవించుచు, రాత్రియందు గోక్షీరములను ద్రాగుచు, సంయములై చరించు వారిని వృద్ధత్వము బాధింపలేదు.

మాంసమును, వయస్సుచే బెద్దదైనస్త్రీని, నైదుదినములు నిల్వయున్న పులిసినపెరుగును సేవించు వారిపైన జరావస్థ తనసోదరసహితముగ నాక్రమ ణము చేయగలదు. ఎవరురాత్రులయందు పెరుగును భుజించెదరో, కులటతోను రజస్వలాస్త్రీతోను సమాగమ మొనరించెదరో వారిని సోదరసహితమై వృద్ధా వస్థ యాహ్వానింపగలదు. రజస్వల, కులట, జారమాతి, ఋతుహీనయగుస్త్రీలచే నర్పింపబడినయాహారమును భుజించిన పాపము సంభవింపగలదు. ఆపాపముల తోనే జరావస్థకూడ దరిజేరగలదు. పాపములతో రోగముల కవినాభావ సంబంధము కలదు.

పాపేన జాయతే వ్యాధిః పాపేన జాయతే జరా ।
పాపేన జాయతే దైన్యం దుఃఖం శోకో భయంకరః॥
తస్మాత్ పాపం మహావైరం దోషబీజ మమంగళమ్ ।
భారతే సంతతం సన్తో నాచరన్తి భయాతురాః ॥

"పాపములే రోగములకు, వృద్ధావస్థకు, నానావిధవిఘ్నములకు బీజ ములు. పాపములవలననే దైన్యము, దుఃఖము, రోగములు, వార్ధక్యము, భయంకరశోకములు నుత్పన్నములు కాగలవు. అందువలననే భారతవర్షమందు వివేకవంతులైనమహాత్ములు భయముతో నెన్నడును పాపముల నాచరింపరు". ఎందువలననగా నాపాపములు మహావైరముల నుత్పన్నము చేయగలవు. పాపములే దోషములకు బీజములై, యమంగళకారకములు కాగలవు.

స్వధర్మాచరణమందు సంలగ్నులై యున్నవారు, భగవంతుని మంత్రదీక్ష వహించినవారు, శ్రీహరిసమారాధనమునందు సంలగ్నులై యున్న వారు, తలిదండ్రులను, గురువును, దైవమును, నతిథులను, భక్తితో సేవించు వారు, తపము నందాసక్తి కల్గియున్నవారు, వ్రతోపవాసముల నాచరించువారు, సదా తీర్థసేవన మొనరించువారు నగుమానవులను గాంచి గరుత్మంతునిభయము వలన పలాయనముచిత్తగించునురగములవలె రోగములు పాతిపోగలవు. అట్టి

పురుషులపై జరావస్థ తనయాధిపత్యమును జూపలేదు. దుర్జయము లైన రోగసమూహములుకూడ నట్టిసంయమశీలునిదరి జేరవు.

పతివ్రతా! మాలావతీ! వాతము, పిత్తము శ్లేష్మము (కఫము) ఈ మూడే జ్వరములకు మూలము. ఇవియే దేహధారులయందు స్వయముగ ప్రవేశించి సంచారమొనరించును. అందులకు గల వివిధకారణములను, వాని నివారణోపాయములను నుపదేశించెదను, అవధరింపుము. ఆకలిప్రజ్వలించు చున్నను నాహారము లభింపనప్పుడా యాప్రాణుల శరీరమందు మణిపూరకచక్రములో బిత్తము ప్రకోపించును. (తంత్రానుసారముగ మణిపూరక చక్రము షట్చక్రములలో మూడవదియై నాభివద్ద యుండును. ఈచక్రము విద్యుత్సమాన ప్రకాశవంతము, తేజోమయము. ఇదిపదిదళములుకలిగియుండును ఈదళములపై 'డ' నుండి 'ఫ' వఱకునుగల నక్షరము లంకితములై యుండును. ఈచక్రవర్ణము నీలము. ఈచక్రమే పరమశివునకు నివాసస్థానము, దీనిపై మనసు నేకాగ్ర మొనర్చి దేహధారి ధ్యానించినచో నతనికి సర్వజ్ఞత్వము లభింపగలదు.) పిత్తము ప్రకోపించిన సమయములో దాటిపండ్లుకాని లేక మారేడుమొద లగు పండ్లుకాని భుజించి, జలములు సేవించిన నాయాహారమే ప్రాణనాశక మైన పిత్తము కాగలదు. శరదృతువునందు వేడినీరు త్రాగుట, భాద్రపదమాసమందు జేదుపదార్థములను భుజించుట యింక ననేకాన్యకారణములవలన బిత్తము వృద్ధి చెందును. ధనియములను బాగుగా నూరి చక్కెరనుజేర్చి యాచూర్ణమును శీతలజలములలో గలిపి సేవించిన బిత్తము శాంతింపగలదు. అన్నివిధములైన సెనగలు, గవ్యపదార్థములు, వెన్నతీసినమజ్జిగ, పండినమాఱేడుపండ్లు, తాటి పండు, చెఱకురసముతో సిద్ధముచేయబడిన పదార్థములు, అల్లము, వేరుసెనగ పప్పుతో సిద్ధముచేసినరసము, చక్కెరకలిపినువ్వులపొడి మొదలగునవి పిత్తము నుపశమింపజేయు నౌషధములు. ఇవి తత్కాలములో బలమును, బుష్టిని బ్రసాదింపగలవు.

భోజన మొనరించిన వెంటనే స్నానమాచరించుట, దప్పికకాకపోయినను జలములను ద్రాగుట, చిక్కని యుసిరికరసమును ద్రాగుట, పాసిన లేక క్రుళ్ళిన యాహారపదార్థములను భుజించుట, పులిసినమజ్జిగను ద్రాగుట, రాత్రి భోజనమందు గడ్డపెరుగును భుజించుట, ధూమపానము, మాదకవస్తు సేవనము చేయుట, వర్షమందు దడియుట, చక్కెరతో జేసిన పానీయముల నధికముగ

సేవించుట, యపవిత్రజలముల ద్రాగుట, నిల్వయున్న నీటితో స్నానమొనరించుట, వర్షర్తువునందు జలాశయములలో స్నానమాచరించుట మొదలగుకర్మలు శరీరమునందు గఫమును వృద్ధిచేయును. కఫము బ్రహ్మరంధ్రమునం దుత్పన్నమై వీర్యనాశకము కాగలదు. గంధర్వనందినీ! బాగుగా మఱిగగాచిన నీటినుండి లేచిన యావిరిని బీల్చుచు శరీరమునకు జెమటను బట్టించుట, తిరుగుచు వ్యాయామమొనరించుట, ఎండినపదార్థములను భుజించుట, వండిన కరక్కాయను సేవించుట, కరబూజపండ్లను, నధికముగ బండిన దోసకాయలను పచ్చియరటిని భుజించుట, పచ్చిసింగారక సేవనము (సింగారక మనగ నొకవిధమైన ఫలశాకము), లవంగములను, మిరపకాయలను గలపి సిద్ధపఱచిన చూర్ణమును సేవించుట, సిందువార సేవనము, అనాహారము, అపానకము, ఘృతమిశ్రితరోచనాచూర్ణము (రుచికరమైన), నేతితో గలిపిన పంచదార, మిరియములు, పిప్పళ్ళు, మధువు మొదలగుద్రవ్యములు కఫమును నిరోధించి బలమును, బుష్టిని చేకూర్పగలవు.

వాతప్రకోపకారణములను వివరించెదను వినుము. భోజనమొనరించిన వెంటనే నడచుట, పరుగిడుట, నగ్నిసన్నిధిని వేడినిబొందుట, తిరుగుచుండుట, మైథునమొనరించుట, వృద్ధస్త్రీతో సహవాస మొనరించుట, మనమునందు నిరంతరము సంతాపము జెందుట, యెండినపదార్థములను భుజించుట, క్రమముగ ననేకోపవాసముల నొనరించుట, యితరులను బాధించుట, కలహించుట, యన్యుల మనములను గఠినవచనములతో నొప్పించుట, భయమునకు, శోకమునకు వశీభూతులగుట మొదలగు కారణములు కేవలము వాతోత్పత్తి నొనరింపగలవు. 'ఆజ్ఞ' యను చక్రమునందు బైనుదాహరింపబడిన యాచరణముల వలన వాయూత్పత్తి కాగలదు. దీనినే వాతప్రకోప మందురు. వాతప్రకోప నివారణౌషధములను వచించెద నవధరింపుము. పండినయరటిపండ్లను సేవించుట, నిమ్మకాయరసముతో పంచదారనుగాని (తేనె)నుగాని గలిపిసేవించుట, నారికేళజలమును, అప్పుడపుడు చిలికిన మజ్జిగను ద్రాగుట, శుద్ధమైన తినుబండారములను, దీపిపదార్థములను భుజించుట, యావుపెరుగులో జక్కెర కలిపి సేవించుట, యవధాన్యపుగంజిని ద్రాగుట, వండిన తైలము లేక నువ్వులనూనెను, కొబ్బరికాయను, ఖర్జూరఫలములను భుజించుట, ఉసిరికకాయతో జేయబడిన యుష్ణద్రవపదార్థమును సేవించుట, సుస్నిగ్ధచందనానులేపనము చేసికొనుట,

స్నిగ్ధవ్యంజనము (వండినకూర)ను భుజించుట మొదలగునవి వాయుదోష నాశకములు. మనుష్యులందు వాయుదోషములు మూడువిధములుగ నుండును. ఒకటి శారీరకక్లేశజనితము, రెండవది మానసికసంతాపజనితము, మూడవది కామజనితము. మాలావతీ ! నేనునీకు వివిధరోగములను ఆరోగముల నశింప జేయుటకై విద్వాంసులు వచించిన నానాప్రకారతంత్రముల నుపదేశించితిని. విద్వాంసులు సూచించిన రోగనివారణరసాయనములను, రోగవినాశకతంత్రములను నొకసంవత్సరపర్యంతము వర్ణించినను దరుగవు. అందువలననే నేను సంక్షేపముగ నీ కుపదేశించితిని. శోభనా ! నీభర్తకు మరణ మెట్లు సంభవించెనో తెలియజేయుము.

## సౌతి పలికెను :

బ్రాహ్మణకుమారుని వైద్యసంహితాప్రవచన మాలకించి, మాలావతి యత్యంతప్రసన్నురాలై యీవిధముగా బలికెను. "విప్రవరా ! నాప్రాణనాథుడు బ్రహ్మశాపమువలన, యోగబలముచే బ్రాణములనుబరిత్యజించెను. దేవా ! నేను నీదివ్యముఖారవిందమునుండి శుభకరములు, మనోహరములు నగు విషయములను బూర్ణరూపముగ నవధరింపగల్గితిని. నీ వొనరించినప్రతిజ్ఞానుసారముగ నాభర్తను బునర్జీవితునిగ నొనరింపుము". మాలావతీప్రార్థనల నాలకించి బ్రాహ్మణరూపధారి యైనవిష్ణువు దేవతల నుద్దేశించి పలుకదొడంగెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని చికిత్సాప్రణయన
మను పదునాఱవ అధ్యాయము
సంపూర్ణము.

—o—

# పదునేడవ అధ్యాయము

## బ్రాహ్మణబాలునితో బ్రహ్మ మహాదేవ ధర్మదేవతలు సంభాషించుట ; దేవతలు విష్ణుమాహాత్మ్యమును, బ్రాహ్మణుడు శ్రీకృష్ణునియుత్కృష్టతను ప్రతిపాదించుట

**సౌతి పలికెను :**

ఆబ్రాహ్మణకుమారుడే సాక్షాత్తుగ శ్రీమహావిష్ణు వని హరిమాయా మోహితులైనదేవతలు తెలిసికొనలేకపోయిరి. ఆసమయమున బ్రాహ్మణ కుమారుడు సకలదేవతల నుద్దేశించి యిట్లుపల్కెను. "దేవతలారా! ఈ మాలావతి పతిశోకపీడితయై తనప్రాణనాథునిప్రాణములకొఱకు మిమ్ము నర్థించుచున్నది. ఈమెకోరికను సఫలీకృతమొనరింపుడు. మాలావతి యత్యంత తేజస్వంతురాలైనపరమపతివ్రత. ఆమెకోరిక నెఱవేర్చనియెడల మీ రందఱు సాధ్వీశాపమునకు గురి కాగలరు. మీ కందఱకు శుభమొనరించుటకే నే నీప్రదేశమున కరుదెంచితిని. మీరు శ్వేతద్వీపమందు శ్రీహరిని ప్రార్థించితిరని వింటిని. శ్రీహరి మీవెంట నరుదెంచి మిమ్ముల ననుగ్రహింపగలడని, యశరీర వాణి పలికినపలుకులనుకూడ విన్నాడ. మఱి శ్రీహరి యైనవిష్ణువుజాడ లేదే? అశరీరవాణి పలుకు లసత్య మెట్లు కాగలవు ?".

బ్రాహ్మణుని వచనముల నాలకించి జగత్స్రష్ట యైనబ్రహ్మ యిట్లు పల్కెను.

**బ్రహ్మ పలికెను :**

నాకుమారుడైననారదుడే యీయుపబర్హణుడను గంధర్వుడై జన్మించి మరల నాశాపమువలననే యోగముద్వారమున శరీరము త్యజించెను. ఈభూమిపై నాగంధర్వున కాయుర్దాయ మొకలక్షయుగములని నేనే నిర్ణయించి తిని. గంధర్వజన్మము తర్వాత నతడు శూద్రస్త్రీపుత్రుడై పూర్వజ్ఞానము కల్గి జన్మించి హరిభక్తులసేవల నొనరించి ధన్యుడై నశ్వరమైనశరీరమును వీడి మరల నాకుమారుడైననారదుడు కాగలడు. నేను శ్రీమహావిష్ణువుకృపతో

నీగంధర్వుని బునర్జీవితునిజేయగలను. బ్రాహ్మణుడా! శ్రీమహావిష్ణువీప్రదేశమున కేల రాలేదని మీరు ప్రశ్నించియున్నారు. ఆప్రశ్న సరియైనది కాదు. హరి సర్వవ్యాపి, సర్వాత్మకుడు; ఆత్మలేనిదే శరీరము లెట్లుండగలవు? ఆస్వేచ్ఛామయపరబ్రహ్మ మైనపరమాత్మయే తనయనన్యభక్తుల ననుగ్రహించుటకొఱకే సచ్చిదానంద దివ్యదేహమును ధరించెను. ఆయన సనాతనుడు, సర్వవ్యాపి, సర్వజ్ఞుడు, సర్వసాక్షి; "విషల్ ధాతువు వ్యాప్తికి వాచకము. 'ణు' ధాతువునకు సర్వత్ర యనియర్థము. సమస్తవిశ్వములం దంతట వ్యాపించియున్నాడుకావున నాయనను విష్ణు వందురు.

అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాం గతోఽపి వా ।
యః స్మరేత్ పుణ్డరీకాక్షం స బాహ్యాభ్యన్తరశ్శుచిః॥
కర్మారమ్భే చ మధ్యే వా శేషే విష్ణుం చ యః స్మరేత్।
పరిపూర్ణం తస్య కర్మ వైదికం చ భవేద్ద్విజ ॥ (17-18)

"పవిత్రుడైనను, అపవిత్రుడైనను, ఏయవస్థయం దున్నను మానవుడు కమలనయను డైనశ్రీమహావిష్ణువునునిర్మల భక్తితో స్మరణముచేసినచోనతడు నిశ్చయముగ లోపల, బయట బరిపూర్ణముగ బవిత్రుడు కాగలడు".

"ఏకర్మనైన నాచరించుటకు బ్రథమమున, మధ్యమున, నంతమున శ్రీహరిని స్మరించిన నాకర్మ దివ్యవైదికకర్మయై నిర్విఘ్నముగ ఫలప్రదము కాగలదు".

జగత్సృష్టికర్త నైననేను, సంహారకర్త యైనయీశ్వరుడు సర్వకర్మలకు సాక్షి యైనధర్మదేవత మొదలగుమేమందఱము శ్రీహరియాజ్ఞాపాలకులమే. ఏదేవాదిదేవుని సంకల్పమాత్రముచేత గాలమే సమస్తలోకములను సంహరించుచున్నదో, యముడు పాపులను శిక్షించుచున్నాడో, మృత్యువు ప్రాణములను హరించుచున్నదో, సర్వేశ్వరి, సకలారాధ్య, సర్వజనని యైనప్రకృతి యెవనిని సదా యారాధించుచుండునో, ఎవని యాజ్ఞలనే పాలించుచుండునో, యాసర్వేశ్వరు డైనశ్రీమహావిష్ణువే సర్వులకు నాత్మయని గ్రహింపుము.

**మహేశ్వరుడు పలికెను :**

బ్రాహ్మణకుమారా! బ్రహ్మయొక్క ప్రసిద్ధకుమారులలో నెవనివంశమందు నీవు జన్మించితివి? వేదాధ్యయన మొనరించి నీవేతత్త్వమును

గ్రహింపగల్గితివి ? విప్రవరా! నీ వేమహర్షి శిష్యుడవు ? నీ నామధేయ మేమి ? నీవు బాలకుడవైనను సూర్యుని మించినయఖండ తేజముతో బ్రకా శించుచున్నావు. కాని సర్వులహృదయములయం దంతర్యామిగ నాత్మ రూపముతో విరాజమానుడై యున్నవాడు, మాకుప్రభువు, సర్వేశ్వరుడు, పర మాత్మయు నగుశ్రీమహావిష్ణువును దెలిసికొనలేకున్నావు. ఇది యెంతయాశ్చ ర్యకర మైనవిషయము. ఆపరమాత్మ త్యజించినచో దేహధారులయొక్క యీశరీరము నశించును. సర్వసూక్ష్మేంద్రియవర్గము; ప్రాణము లాయన నను సరించి "రాజువెంట వెడలిపోవు సేవకులవలె" శరీరమును వీడిపోగలవు. జీవుడు పరమాత్మయొక్క యంశాంశభాగము ప్రతిబింబము నని గ్రహింపుము. మనస్సు జ్ఞానము, చేతనత్వము, ప్రాణము, ఇంద్రియవర్గము, బుద్ధి, మేధస్సు, ధృతి, స్మృతి, నిద్ర, దయ, తంద్ర, క్షుధ, తృష్ణ, పుష్టి, శ్రద్ధ, సంతుష్టి, ఇచ్ఛ, క్షమ, లజ్జాదిభావములు నాపరమాత్మ ననుసరించునట్టివే. ఆపరమాత్మ దేహధారి యొక్క శరీరమును వీడి పోదలచిన శక్తియు, నుపర్యుక్తసర్వభావములు నాయ ననే యనుసరింపగలవు. దేహమునం దీశ్వరు డున్నంతవఱకే దేహధారియైన జీవుడు సర్వప్రకారము లైనకర్మల నొనరించుటకు సమర్థుడు కాగలడు. ఆ యీశ్వరుడు తదంశస్వరూపు డైనజీవుడు బయల్వెడలిపోగానే శరీరము శవమై యస్పృశ్యమై త్యాజ్యముకాగలదు. అట్టిసర్వేశ్వరు డగుశివు నేదేహధారి యంగీకరింపడు ? సర్వసృష్టికారకు డైన బ్రహ్మ నిరంతర మాభగవంతుని చరణారవిందములనే ధ్యానించుచుండియు నాయనను దర్శింపలేకున్నాడు. ఆ బ్రహ్మ శ్రీకృష్ణునిప్రసన్నతకొఱకై లక్షయుగములు తపమాచరించి తద్దివ్య జ్ఞానమును బొంది, యీసంసారసృష్టినిర్వహణమునందు సమర్థుడైనాడు. నేను గూడ సుదీర్ఘకాలము శ్రీహరి నారాధించినను, స్మరించినను నాకు దృష్టి కలుగదయ్యె. ఇపుడు నేను సమస్తకర్మలనుండి నిఃస్పృహుడనై నాపంచ ముఖములతో నాయనదివ్యనామగుణములను గీర్తనముచేయుచు సర్వత్ర చరించు చున్నాను. ఆశ్రీహరిగుణనామసంకీర్తనప్రభావమువలననే మృత్యువుసహితము నన్ను గాంచి పలాయనము చిత్తగించుచున్నది. చిరకాల మఖండతపస్సంకీర్తన ములను గావించుచున్నందుననే నేను సమస్తబ్రహ్మాండ సంహారకార్యమందు సమర్థుడను, మృత్యుంజయుడను నైయున్నాను. సమయ మాసన్నమైనపుడు నేనైన నాపరబ్రహ్మ మైన శ్రీహరిలో లీనమై మరల నాయనయందియే ప్రాదుర్భవించెదము. ఆయన యనన్యకృపాటాక్షవీక్షణములవలననే కాలము

సైతము నన్ను సంహరింపలేదు. మృత్యువు నన్ను గబళింపలేదు. బ్రాహ్మణుడా! గోలోకధామమందు విరాజిల్లు శ్రీకృష్ణుడె వైకుంఠమందును, శ్వేతద్వీపమందును విష్ణు నామధేయమున విరాజిల్లుచున్నాడు. అగ్నికి, నగ్నికణములకు భేదము లేనట్లు అంశికి అంశమునకు భేదము లేదు.

డెబ్బదియొక్క దివ్యయుగము లొకమన్వంతరము కాగలదు. (ఒకమన్వంతరమందు ఇర్వురు ఇంద్రులు ప్రాదుర్భవింతురు) ఇరువదియెనమండుగురింద్రులు పతనమైన బ్రహ్మకొకదినము కాగలదు. ఈసంఖ్యామానప్రకారము బ్రహ్మకు నూఱుసంవత్సరముల యాయుర్దాయము పూర్తియైన పిదప బరమాత్మ యైనశ్రీమహావిష్ణువున కొకకనురెప్పపాటుకాలము (నిమేషకాలము) కాగలదు. నేను పరమాత్మ యైనశ్రీకృష్ణునియొక్క యొకశ్రేష్ఠకళామాత్రుడనే. అట్టిపరమేశ్వరునిమహిమల నెవరు తెలిసికొనగలరు.

శౌనకాదిమహర్షులారా! శివు డీవిధముగ దివ్యసందేశ మందించిన తరువాత సర్వకర్మలకు సాక్షిభూతుడైన ధర్మదేవత తనప్రవచన మారంభించెను.

## ధర్మదేవత పలికెను :

ఎవనికరములు, పాదములు, సర్వమును గాంచగలనేత్రములు సర్వత్ర విద్యమానములో యేపరమాత్మ సర్వులయంతరాత్మలయందు ప్రత్యక్షరూపమున నున్నాడో, దురాత్ము లైనపురుషు లెవనిని దర్శింపలేరో, లేక తెలిసికొనలేరో యాసర్వవ్యాపి యైనప్రభువు సర్వదేశములయందు, గాలములయందు వస్తువులయందు నున్నాడు. ఆట్టి భగవంతు డీ సభకు రాలేదని, యీసభలో లేడని నీవు పల్కినమాటలు మునులకుగూడ మతిభ్రమను బుట్టింపగలవు. ఏప్రదేశమున నామహాపురుషుని నింద సంభవించునో, యాప్రదేశమం దున్నసాధుపురుషు లానిందలను వినలేరు. ఎందువలె ననగ నిందించినవారు, నిందలను శ్రవణముచేసినవారు కుంభీపాకనరకమం దొకయుగముపర్యంతము యమయాతనల ననుభవించెదరు. దైవవశమున మహాపురుషులయొక్క నిందాలాపములను వినవలసివచ్చినచో విద్వాంసు లైనపురుషులు శ్రీమహావిష్ణువును స్మరించి యాపాపములనుండి ముక్తులై పుణ్యమును గాంచగలరు. ఎవరిచ్ఛచేతగాని యనిచ్ఛచేతగాని భగవంతు డైనశ్రీమహావిష్ణువును నిందించెదరో యేనరాధములు సభామధ్యమున నాసీనులై యాహరి

నిందలు వినుచు పరిహసించెదరో వారి లందఱు బ్రహ్మాయుర్దాయపర్యంతము కుంభీపాకనరక మనుభవింపగలరు. ఏప్రదేశమున హరినింద జరుగునో యా స్థానము 'మదిరా' పాత్రవలె నపవిత్రము కాగలదు. అట్టి ప్రదేశమునందు భగవంతునినిందను శ్రవణ మొనరించినను నిశ్చయముగ నరకమును బొందెదరు. పూర్వకాలమందు బ్రహ్మ హరినిందకులు మూఁడురకములు లనివచించెను. ప్రథముడు పరోక్షమందు హరిని నిందించువాడు. ద్వితీయుడు శ్రీహరియస్తిత్వము నంగీకరింపనివాడు. అన్య దేవతలతో శ్రీకృష్ణుని సమానముగ నెంచువాడే జ్ఞానహీనుడు నరాధముడు నైనమూఁడవకోటికి జెందిన హరినిందకుడు. నూర్గురు బ్రహ్మలయొక్క యాయుఃపర్యంత మానిందకుడు నరక మనుభవించియు నుద్ధరింపబడడు.

గురోర్నిన్దాం యః కరోతి పితుర్నిన్దాం నరాధమః ।
స యాతి కాలసూత్రం చ యావచ్చన్ద్ర దివాకరౌ॥ (50)

"గురువును దలిదండ్రులను నిందించు వాడు సూర్యచంద్రు లున్నంత వఱకు గాలసూత్ర మను నరక మనుభవింపగలడు". విష్ణువు త్రిలోకములందు సర్వులకు గురువు, తండ్రి, జ్ఞానదాత, పోషకుడు, పాలకుడు, అభయప్రదాత; వరదాత యని గ్రహింపుడు.

బ్రహ్మమహేశ్వరధర్మ దేవతలయొక్క యీదివ్యోపదేశముల నాలకించి యాబ్రాహ్మణబాలకుడు చిఱునవ్వుతో సకల దేవతల నుద్దేశించి యిట్లు పలికెను.

## బ్రాహ్మణుడు పలికెను :

ధర్మశీలు రైన దేవతలారా ! నేను విష్ణుభగవాను నేమనినిందించితిని ? శ్రీహరి యీప్రదేశమునకు రాలేదుగాన నశరీరవాణి వ్యక్తముచేసినదియేకదా నేను వచించితిని ? దేవేశ్వరులారా ! ధర్మమునకు ననుకూలముగ వచింపుడు. సభామధ్యమున నాసీనులై పక్షపాత మొనరించు వారి తరు సహాయులతరముల వారినిగూడ బాపభాజనులుగ జేయగలరు. విష్ణువు సదా, సర్వత్ర వ్యాపకుడై యున్నచో భావుకులైనమీ రాయనను వర మర్థించుటకు శ్వేతద్వీపమున కేల వెడలినారు ? అంశమునందు నంశియందు భేదము లేదు. ఆత్మయందును భేదము లేదనికదా మీభావము ? ఐనచో శ్రేష్ఠపురుషులు కళాంశను దృజించి పూర్ణపురుషుడైన యంశి నేల యుపాసించెదరు ? పూర్ణతము డైన శ్రీకృష్ణుని గోటిజన్మలపర్యంత మారాధించినను నారాయణుని చెలిసి

కొనుట యత్యంతకఠినము. ఆసాధుపురుషుల కాయన సర్వదా యసాధ్యుడే. అందువలన జీవులయొక్క బలవత్తరాశ యాయనసేవల నొనరించుటయే; చిన్నవారైనను, పెద్దవారైనను నందఱు పరమపదమును బొందవలెనని యాకాంక్షించెదరు. మరుగుజ్జువాడు తనకరములతో జంద్రుని స్పృశింపదలచుట యెంత హాస్యాస్పదమో, యల్పసత్వులు పరిపూర్ణతము డైనయాపరమాత్మను బొందవలెనని భావించుటయును హాస్యాస్పదమే. విష్ణువు శ్వేతద్వీపమందు నివసించును. బ్రహ్మ, మహాదేవుడు, ధర్మదేవత దిక్పాలకులు మొదలగు వారందఱు నొకవిశ్వనివాసులే. బ్రహ్మవిష్ణుశివాదులు, దేవేశ్వరులు, దేవసమూహములు, సకలచరాచరప్రాణులు నందఱు, భిన్నభిన్నబ్రహ్మాండములం దనేకులుగనున్నారు. ఆబ్రహ్మాండములను, నాదేవతలనందఱిని గణించుటలో నెవరు సమర్థులు? వీరందఱకు నేకైకప్రభువు శ్రీకృష్ణుడే. ఆయన భక్తుల ననుగ్రహించుటకొఱకే సచ్చిదానందస్వరూపమును ధరించియున్నాడు. ఎవరి నందఱు పొందవలెనని భావించెదరో యాయన సమస్తబ్రహ్మాండములపై, సత్యలోకముపై, నిత్యము లైనవైకుంఠధామములపై స్వప్రాకృతాకాశస్థిత గోలోకధామములో విరాజమానుడై యున్నాడు. వైకుంఠధామమం దాయనయే చతుర్భుజధారియై, లక్ష్మీపతిరూపమున శ్రీహరియై, సునందనందకుముదాదిపార్షదులతో బరివేష్టితుడై యున్నాడు. గోలోకమం దాయనయే సనాతన భగవానుడు, ద్విభుజయుక్త రాధావల్లభుడు నగు శ్రీకృష్ణుడై విరాజిల్లుచున్నాడు. ఆలోకమం దెందఱెందఱో గోపగోపాంగనలు, ద్విభుజపార్షదులు, గోవులు నాదేవుని సేవలయం దుపస్థితులై యున్నారు. గోలోకాధిపతి యగుశ్రీకృష్ణుడే పరిపూర్ణతము డైనపరబ్రహ్మమని గ్రహింపుడు. ఆయనయే సమస్తదేహధారులయం దాత్మయైయున్నాడు. సర్వవ్యాపియై నిర్గుణు డైనబ్రహ్మము నారాధించుట యసంభవము. అందులకే యనన్యకృపామయు డైనయాసర్వేశ్వరేశ్వరుడు కేవలము తనభక్తు లైన యారాధకుల ననుగ్రహించుటకొఱకే, వారు ధ్యానించుటకొఱకే స్వేచ్ఛామయము దివ్యము నగుసచ్చిదానందవిగ్రహముతో దివ్యబృందావనాంతర్గ రాసమండలమధ్యమున విహరించుచున్నాడు. దివ్యానంతతేజమే యాయన యాకృతి. ఆయనకోటానుకోట్ల సూర్యులప్రకాశముకంటె నెన్నోరెట్లధిక కాంతియుక్తుడు. యోగులు, మహర్షులు మొదలగువా రానిరామయమైన, జ్యోతిర్మయ మైనపరబ్రహ్మమునే సదా ధ్యానించెదరు. కాని వారామహా

జ్యోతిమధ్యమున నాప్రకాశమునకు గారణమైన సర్వకారణకారణుని, సగుణ పరబ్రహ్మమును దర్శింపలేకున్నారు. కేవల మనన్యభక్తులకే యాదివ్యమంగళ మయసచ్చిదానందస్వరూపదర్శనము లభింపగలదు. ఆపరమాత్మను జ్ఞానచక్షువులద్వారమున సులభముగా దరించి దివ్యపరంధామమును బొంది శ్రీకృష్ణుని యవిచలదాస్యభావానందమును బొందగలరు. శ్రీకృష్ణునికాంతి నూతనజలధర సమాన మైనశ్యామలవర్ణము. ఆయన ద్విభుజుడు పీతాంబరధారి, యనంత కోటిమన్మథులను మించినలావణ్యసౌందర్యశాలి, యనంతలీలాధాముడు. కిశోరవయస్కుడు నైనయాయనదివ్యసుందరవిగ్రహ మత్యంతమనోహరము. ఆయననిత్యశాంతస్వరూపుడై, చిఱునవ్వులు చిందులుత్రొక్కునగుమోముతో దనభక్తుల ననుగ్రహించుటకు సర్వసిద్ధముగా నుండును. అనన్యులైనపరమ వైష్ణవభక్తులాసచ్చిదానందదివ్యశ్యామసుందరునే సదా భజించెదరు, ధ్యానించెదరు. మీరుకూడ బరమవైష్ణవులే. నే నెవరివంశజుడనో, యెవరి శిష్యుడనో పైనవర్ణించినవర్ణన మాయనననుగుఱించియే. దేవతలారా ! ఈ దివ్యజ్ఞానమును మీరర్థముచేసికొందురుగాక. సురేశ్వరులారా ! ఈగంధర్వుని శీఘ్రముగ బునర్జీవితుని గావింపుడు. విచారించి చూచిన మూర్ఖు డెవడో తెలియును. అనవసర మగువాగ్వివాద మేల ?

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమునందలి
బ్రహ్మఖండములోని విష్ణుసురసంఘ
సంవాదమున విష్ణుప్రశంస యను
పదునేడవ అధ్యాయము
సంపూర్ణము.

—♦—

# పదునెనిమిదవ అధ్యాయము

## బ్రహ్మాదిదేవతలు ఉపబర్హణుని జీవితునిగ జేయ బ్రయత్నించుట; మాలావతి శ్రీకృష్ణుని స్తుతించుట; శక్తితో భగవంతుడు గంధర్వశరీరమున బ్రవేశింపగా గంధర్వుడు పునర్జీవితుడగుట.

**సౌతి పలికెను :**

ఆ బ్రాహ్మణబాలకునాదేశము నాలకించి బ్రహ్మ 'ఉపబర్హణుని' మృత శరీరముపై మంత్రజలమును సంప్రోక్షించి దానియందు మనస్సును సంచార మొనరించి దానిని సుందర మొనర్చెను. జ్ఞానానందస్వరూపు డైనశివుడు జ్ఞానమును, ధర్మదేవత ధర్మజ్ఞానాదులను, బ్రాహ్మణరూపధారి యైనవిష్ణువు జీవమును బ్రసాదించెను. అగ్నిదృష్టివలన గంధర్వునిశరీర మందు జఠరాగ్ని యుత్పన్నమయ్యెను. మన్మథునిదృష్టివలన సంపూర్ణ కామ నలు సిద్ధించెను. జగమునకు బ్రాణస్వరూప మైనవాయు వధిష్ఠింప నుపబర్హ ణుని శరీరమందు శ్వాసలు బ్రారంభమై బ్రాణసంచారమ్ము సంభవించెను. సూర్యునికృపవలన గంధర్వరాజునేత్రములకు దర్శింపగలశక్తి, వాణికరుణవలన వాక్ఛక్తి, శ్రీ కటాక్షమునలన శోభ యాగంధర్వునకు లభించెను. ఇవి యన్నియు లభించినను నాశవము చేతనత్వమును బొందక జడమువలె బడి యుండెను. ఆత్మయొక్క యధిష్ఠానము కలుగనందున నాశరీరమునకు, శరీరగతజీవునకు విశిష్టమైన బోధత్వము బ్రాప్తింపలేదు. ఆ సమ యమున బ్రహ్మ పరంధాముడు, పరబ్రహ్మము, పరమాత్మ యగుశ్రీకృష్ణు నాశ్రయింపవలసినదిగ మాలావతి నాదేశించెను. మాలావతి బ్రహ్మాదేశాను సారముగ నదీజలములలో స్నానమాచరించి పవిత్రవస్త్రముల ధరించి, యోగా సనారూఢయై యత్యంతభక్తితో నాపరమేశ్వరుని స్తుతింపదొడంగెను.

## మాలావతీకృత మహాపురుష స్తోత్రమ్

**మాలావత్యువాచ :**

వన్దే తం పరమాత్మానం సర్వకారణకారణమ్।
వినా యేన శవాః సర్వే ప్రాణినో జగతీతలే॥

నిర్లిప్తం సాక్షిరూపం చ సర్వేషాం సర్వకర్మసు।
విద్యమానం న దృష్టం చ సర్వైః సర్వత్ర సర్వదా॥
యేన సృష్టా చ ప్రకృతిః సర్వాధారా పరాత్పరా।
బ్రహ్మవిష్ణు శివాదీనాం ప్రసూ ర్యా త్రిగుణాత్మికా॥
జగత్స్రష్టా స్వయం బ్రహ్మా నియతో యస్య సేవయా।
పాతా విష్ణుశ్చ జగతాం సంహర్తా శంకరః స్వయమ్॥
ధ్యాయన్తే యం సురాః సర్వే మునయో మనవస్తథా।
సిద్ధాశ్చ యోగినః సన్తః సన్తతం ప్రకృతేః పరమ్॥
సాకారం చ నిరాకారం పరం స్వేచ్ఛామయం విభుమ్।
వరం వరేణ్యం వరదం వరార్హం వరకారణమ్॥
తపఃఫలం తపోబీజం తపసాం చ ఫలప్రదమ్।
స్వయం తపఃస్వరూపం చ సర్వరూపం చ సర్వతః॥
సర్వాధారం సర్వబీజం కర్మ తత్కర్మణాం ఫలమ్।
తేషాం చ ఫలదాతారం తద్బీజక్షయకారణమ్॥
స్వయం తేజస్స్వరూపం చ భక్తానుగ్రహవిగ్రహమ్।
సేవా ధ్యానం న ఘటతే భక్తానాం విగ్రహం వినా॥
తత్తేజో మణ్డలాకారం సూర్యకోటిసమప్రభమ్।
అతీవ కమనీయం చ రూపం తత్ర మనోహరమ్॥
నవీననీరదశ్యామం శరత్పంకజలోచనమ్।
శరత్పార్వణచన్ద్రాస్య మీషద్ధాస్య సమన్వితమ్॥
కోటికన్దర్పలావణ్యం లీలాధామ మనోహరమ్।
చన్దనోక్షితసర్వాంగం రత్నభూషణభూషితమ్॥
ద్విభుజం మురళీహస్తం పీతకౌశేయవాససమ్।
కిశోరవయసం శాన్తం రాధాకాన్త మనన్తకమ్॥
గోపాంగనాపరివృతం కుత్రచి న్నిర్జనే వనే।
కుత్రచి ద్రాసమధ్యస్థం రాధయా పరిసేవితమ్॥
కుత్రచిద్ గోపవేషం చ వేష్టితం గోపబాలకైః।
శతశృంగాచలోత్కృష్టే రమ్యే బృన్దావనే వనే॥
నికరం కామధేనూనాం రక్షన్తం శిశురూపిణమ్।
గోలోకే విరజాతీరే పారిజాతవనే వనే॥
వేణుం క్వణన్తం మధురం గోపీసమ్మోహకారణమ్।
నిరామయే చ వైకుణ్ఠే కుత్రచిచ్చ చతుర్భుజమ్॥

లక్ష్మీకాన్తం పార్షదైశ్చ సేవితం చ చతుర్భుజైః।
కుత్రచిత్ స్వాంశరూపేణ జగతాం పాలనాయ చ॥
శ్వేతద్వీపే విష్ణురూపం పద్మయా పరిసేవితమ్।
కుత్రచిత్ స్వాంశకలయా బ్రహ్మాణ్డే బ్రహ్మరూపిణమ్॥
శివస్వరూపం శివదం స్వాంశేన శివరూపిణమ్।
స్వాత్మనః షోడశాంశేన సర్వాధారం పరాత్పరమ్॥
స్వయం మహద్విరాడ్రూపం విశ్వౌఘం యస్యలోమసు।
లీలయా స్వాంశకలయా జగతాం పాలనాయ చ।
నానావతారం బిభ్రన్తం బీజం తేషాం సనాతనమ్।
వసన్తం కుత్రచిత్ సన్తం యోగినాం హృదయే సతామ్
ప్రాణరూపం ప్రాణినాం చ పరమాత్మాన మీశ్వరమ్।
తం చ స్తోతు మశక్తాహ మబలా నిర్గుణం విభుమ్॥
నిర్లక్ష్యం చ నిరీహం చ సారం వాఙ్మనసోఃపరమ్।
యం స్తోతు ఋక్షమోఽనన్తః సహస్రవదనేన చ॥
పంచవక్త్రశ్చతుర్వక్త్రో గజవక్త్రః షడాననః।
యం స్తోతుం న క్షమా మాయా మోహితా యస్య మాయయా॥
యం స్తోతుం న క్షమా శ్రీశ్చ జడీభూతా సరస్వతీ।
వేదా న శక్తాయం స్తోతుం కో వా విద్వాంశ్చ వేదవిత్॥
కిం స్తౌమి తమనీహం చ శోకార్తా స్త్రీ పరాత్పరమ్।
ఇత్యుక్త్వా సా చ గాన్ధర్వీ విరరామ రురోద చ॥
కృపానిధిం ప్రణనామ భయార్తా చ పునః పునః।
కృష్ణశ్చ శక్తిభిః సార్ధ మధిష్ఠానం చకార హ॥
భర్తు రభ్యన్తరే తస్యాః పరమాత్మా నిరాకృతిః।
ఉత్థాయ శీఘ్రం వీణాం చ ధృత్వా స్నాత్వా చ వాససీ॥
ప్రణనామ దేవసంఘం బ్రాహ్మణం పురతః స్థితమ్।
నేదు ర్దున్దుభయో దేవాః పుష్పవృష్టిం చ చక్రిరే॥
దృష్ట్వా చోపరి దమ్పత్యోః ప్రదదుః పరమాశిషమ్।
గన్ధర్వో దేవపురతో ననర్త చ జగౌ క్షణమ్॥
జీవితం పురతః ప్రాప దేవానాం చ వరేణ చ।
జగామ పత్న్యా సార్ధం చ పితామాతా చ హర్షితః
ఉపబర్హణగన్ధర్వో గన్ధర్వనగరం పునః।
మాలావతీ రత్నకోటిం ధనాని వివిధాని చ॥

పరిదదౌ బ్రాహ్మణేభ్యశ్చ భోజయామాస తాన్ సతీ।
వేదాంశ్చ పాఠయామాస కారయామాస మంగలమ్॥
మహోత్సవం చ వివిధం హరే ర్నామైకమంగలమ్।
జగ్ము ర్దేవాశ్చ స్వస్థానం విప్రరూపీ హరిః స్వయమ్॥
ఏతత్తే కథితం సర్వం స్తవరాజం చ శౌనక।
ఇదం స్తోత్రం పుణ్యరూపం పూజాకాలే తు యః పఠేత్
హరిభక్తిం హరే ర్దాస్యం లభతే వైష్ణవో జనః।
వరార్థీ యః పఠేద్ భక్త్యా చాస్తికః పరమాస్థయా॥
ధర్మార్థకామమోక్షాణాం నిశ్చితం లభతే ఫలమ్।
విద్యార్థీ లభతే విద్యాం ధనార్థీ లభతే ధనమ్॥
భార్యార్థీ లభతే భార్యాం పుత్రార్థీ లభతే సుతమ్।
ధర్మార్థీ లభతే ధర్మం యశోఽర్థీ లభతే యశః॥
భ్రష్టరాజ్యో లభేద్ రాజ్యం ప్రజాభ్రష్టః ప్రజాం లభేత్।
రోగార్తో ముచ్యతే రోగాద్ బద్ధో ముచ్యేత బన్ధనాత్॥
భయాన్ముచ్యేత భీతస్తు ధనం నష్టధనో లభేత్।
దస్య్వగ్నిస్తో మహారణ్యే హింస్రజన్తుసమన్వితః॥
దావాగ్నిదగ్ధో ముచ్యేత నిమగ్నశ్చ జలార్ణవే॥ (9-49)

ఎవనిసన్నిధి లేకున్న జగతీతలమునందున్న సర్వప్రాణులు శవసమానులో, సమస్తకారణములకు గారణస్వరూపుడైన యాపరమాత్మకు నేను వందనము లర్పించెదను. ఆయన నిర్లిప్తుడు, సర్వసాక్షిస్వరూపుడు, సమస్తకర్మలయందు సర్వత్ర సర్వదా విద్యామానుడై యున్నాడు. ఐనను సర్వులకు దృష్టిగోచరుడు కాకున్నాడు. బ్రహవిష్ణుశివాదులకుగూడ జననియై, సర్వాధారభూతయై, త్రిగుణమయి యైనపరాత్పరప్రకృతిని సృష్టించినవాడు, ప్రత్యక్షముగ జగత్స్రష్ట యగుబ్రహ్మచే సేవింపబడువాడు, పాలకుడై విష్ణువుచేత జగత్సంహారకుడైన శివునిచేత నిరంతరము సేవింపబడువాడు, సర్వదేవతలు, మునులు, మనువులు, సిద్ధులు, యోగులు, మహాత్ములు మున్నగువారిచే సదా ధ్యానింపబడువాడు, ప్రకృతికంటె నతీతుడు, సాకారుడు, నిరాకారుడు, స్వేచ్ఛామయ రూపుడు, సర్వవ్యాపియు, వరుడు, వరేణ్యుడు, వరదాయకుడు, వరప్రదాయకుడు, వరదానకారణుడు, తపములకు ఫలరూపుడు, బీజస్వరూపుడు, ఫలప్రదాతయు, స్వయముగ తపస్స్వరూపుడు, సర్వరూపుడు, సర్వాధారుడు, సర్వకారణుడు, సంపూర్ణకర్మరూపుడు, ఆకర్మలయొక్క ఫలరూపుడు,

తత్ఫలప్రదాతయు, తత్కర్మబీజముల నశింపజేయగలవాడు నగుపరమేశ్వరున కనేక ప్రణామము లర్పించుచున్నాను. ఆయన స్వయముగ తేజస్స్వరూపుడై నను తనయనన్యభక్తుల ననుగ్రహించుటకొఱకే దివ్యమంగళవిగ్రహమును ధరించినాడు. ఎందువలననన స్వరూపము లేకున్న భక్తజను లెవనిని సేవించెదరు? ఎవనిని ధ్యానించెదరు? పరమేశ్వరునకు స్వరూపము లేనిచో భక్తులు సేవింపలేరు, ధ్యానింపలేరు. తేజస్సంపూర్ణమైనమహామండలమే యీయన యాకృతి. ఈయనంత తేజ మాదేవాదిదేవుని దివ్యవిగ్రహమునుండి ప్రకాశించుచున్నది. ఆయనరూప మత్యంతకమనీయము, పరమమనోహరము. నూతనమేఘము వంటిశ్యామలకాంతిగల్గి శరదృతువునందలి ప్రఫుల్లకమలములతో సమానములైన నేత్రములతో శరత్పూర్ణిమాచంద్రునిమించిన శోభాయుక్తమైనముఖమండలముపై చిఱునవ్వులు చిందులుత్రొక్కుచుండ శ్రీకృష్ణుడు కోటానుకోట్ల మన్మథులను సహితము తిరస్కరించులావణ్యమునే సహజవిశేషణముగ గల్గియున్నాడు. ఆయన మనోహరలీలాధాముడు. ఆయన సర్వాంగములు చందనచర్చితములై, రత్నమయాభరణములతో విభూషితములై ప్రకాశించుచున్నవి. రెండాజానుబాహువులను గల్గి, హస్తములందు మురళిని ధరించి, శరీరముపై పీతాంబరము శోభించుచుండ, కిశోరవయస్కుడై యున్నాడు. శ్రీకృష్ణుడు శాంతస్వరూపుడు, రాధాకాంతుడు, అనంతానందపరిపూర్ణుడు, అప్పుడప్పుడు నిర్జనవనములందు గోపాంగనాపరివేష్టితుడై యుండును. వేఱొకపుడు రాసమండలమధ్యమున విరాజమానుడై రాధాదేవితో సమారాధింపబడుచుండును. మఱొకసమయమున గోపవేషధారియై, గోగోపపరివేష్టితుడై, సుశోభితుడై యుండును. శతాధికశిఖరములు కల్గినగిరిరాజమైన గోవర్ధనపర్వతము నుద్ధరించిన కారణమున నుత్కృష్టశోభాయుక్తుడై రమణీయబృందావనమందు గామధేనువులను గాయుచు, గోపబాలకునిరూపమున దర్శనమిచ్చును. గోలోకమందు విరజానదీతటముపై పారిజాతవనమందు మధురవేణుగానమొనర్చుచు గోపాంగలను మోహింపజేయుచుండును. నిరామయవైకుంఠధామమందు జతుర్భుజుడై లక్ష్మీకాంతునిరూపమున నివసించుచు జతుర్భుజులైన పార్షదులతో సేవింపబడుచుండును. మఱియొకప్పుడు త్రిలోకములను పాలించుటకు తనయంశరూపమున శ్వేతద్వీపమందు విష్ణురూపమును ధరించియుండును. లక్ష్మీదేవి తత్సేవల నొనరించుచుండును. మఱొకచోట బ్రహ్మాండములందు దనయంశకళలద్వారమున ననేక బ్రహ్మరూపముల విరాజమానుడై ప్రకాశించును.

తనయంశముతోనే కళ్యాణదాయకమై మంగళస్వరూపమైన శివవిగ్రహమును ధారణచేసి, శివధామమందు నివసించును. తనపదునాఱవయంశముతో స్వయముగ సర్వాధారుడై పరాత్పరుడై తనరోమకూపములం దనంతబ్రహ్మాండములను ధారణచేసి మహావిరాట్‌స్వరూపముతో శోభిల్లుచుండును. తనకళలద్వారమున జగములను రచించుటకు లీలాపూర్వకముగ నానాప్రకారావతారములను ధరించుచుండును. ఆసర్వావతారముల కాయనయే స్వయముగ సనాతనబీజస్వరూపము. అక్కడక్కడ యోగులయొక్క మహాత్ములగు భక్తులయొక్క హృదయములయందు నివసించుచుండును. ఆయన ప్రాణములకే ప్రాణస్వరూపుడైనపరమాత్మ, పరమేశ్వరుడు. నేను మూఢురాలనైనయబలను. నిర్గుణుడైన, సర్వవ్యాపియైన యాభగవంతుని స్తుతించుటలో సర్వదా యసమర్థురాలనే. ఆయన యలక్ష్యుడు, అనీహుడు, సారభూతుడు, మనస్సునకు, వాణికి నందనివాడు. అనంతుడు దనసహస్రముఖముల మూలమున నాదేవాదిదేవుని స్తుతింపలేకున్నాడు. పంచముఖుడైనమహాదేవుడు, చతుర్ముఖుడైన బ్రహ్మ, గజాననుడైనగణేశ్వరుడు, షడాననుడైనకార్తికేయుడు మున్నగువారుగూడ ఆయనను స్తుతించుటలో నసమర్థులైరి. మాయకూడ ఆయనమాయవలన మోహింపబడినది, లక్ష్మికూడ ఆయనను స్తుతించుటలో సఫలీకృతురాలు కాలేదు, సరస్వతికూడ జడీభూతయైనది. వేదములుకూడ ఆయనను స్తుతించుటలో శక్తిహీనములైనవి. అట్టిపరమాత్మ నేవిద్వాంసులు స్తుతింపగలరు? నేను శోకాతురనైనయబలను. నిరీహుడైనయాపరాత్పరపరమేశ్వరు నేవిధముగ స్తుతింపగలను ?

ఇట్లు శ్రీకృష్ణుని ప్రార్థించి గంధర్వకుమారియైనమాలావతి మరల దుఃఖింపదొడంగెను. భయపీడితయైనయాసతి కృపానిధానుడైనశ్రీకృష్ణభగవానున కనేకప్రణామము లర్పించెను. అపుడు పరమాత్మయైన శ్రీకృష్ణుడు తనసర్వశక్తులతో మాలావతీపతియైన ఉపబర్హణుని శరీరమందాత్మరూపమున ప్రవేశించెను. వీణను ధరించి యున్న యాగంధర్వుడు వెంటనే నిద్రనుండి మేల్కొన్నవానివలె జేతనత్వమును బొంది, స్నానమాచరించి శుద్ధుడై నవీనవస్త్రములను ధరించి తనసమ్ముఖమున ప్రకాశించుచున్న దేవసమూహమునకు, దివ్యబ్రాహ్మణదైవమునకు ననేకప్రణామము లర్పించెను. దేవతలు దుందుభులు మ్రోగించిరి, పుష్పవృష్టి గావించిరి,

వారందఱు తమకరుణాకటాక్షవీక్షణములతో నాగంధర్వదంపతుల నాశీర్వదించిరి. గంధర్వుడైనయుపబర్హణుడు పరమానందభరితుడై పత్నీసహితముగా నృత్యమొనరించెను. దేవతల కరుణవలన బునర్జీవితుడై యతడు పత్నీసహితముగ గంధర్వనగరమునకు వెడలిపోయెను. దేవతలందఱు తమతమధామములకు వెడలిపోయిరి. ఈవిధముగ దివ్యలీలల నొనరించిన బ్రాహ్మణరూపధారి యైన విష్ణు వంతర్హితుడయ్యెను. గంధర్వరాజ్యమందు మాలావతి బ్రాహ్మణులకు గోటానుకోట్లరత్నములను నానాప్రకారము లైనధనములను, మధురమైన భోజనముల నర్పించి సేవించెను. బ్రాహ్మణులచే వేదపఠనమును, మంగళకృత్యములను నొనరించెను. గంధర్వరాజ్యమందు హరినామసంకీర్తనప్రధాన మైన మహోత్సవములను సకలగంధర్వులు జరుపుకొనిరి.

శౌనకాదిమహర్షులారా! ఈ విధముగా మీకు మాలావతీకృతమహాపురుష స్తవరాజమునుగూడ వినిపించితిని. పూజాకాల మందీ పుణ్యమయ స్తోత్రమును బఠించినవారు నిశ్చయముగ శ్రీహరిభక్తులై తద్దాస్యసౌభాగ్యమును బొందగల్గెదరు. వరమును గాంక్షించి భక్తిభావముతో నీస్తోత్రమును బఠించువానికి నిశ్చయముగ సకలధర్మార్థకామమోక్ష చతుర్విధపురుషార్థఫలములు లభింపగలవు. ఈస్తోత్రపఠనమువలన విద్యార్థులకు విద్య, ధనార్థులకు ధనము, భార్యార్థికి భార్య, పుత్రార్థికి బుత్రుడు లభింపగలరు. ధర్మమును గోరువారు ధర్మమును, యశమును గోరువారు యశమును బొందెదరు. రాజ్యభ్రష్టుడు రాజ్యమును, సంతానహీనుడు సంతానమును బొందగలరు. రోగి రోగమునుండి, బంధితుడు బంధమునుండి ముక్తులు కాగలరు. ధనమునష్టపోయినవారికి మరల ధనము ప్రాప్తింపగలదు. మహారణ్యముల మధ్యగాని, దారిదోపిడిగాండ్రనడుమగాని, క్రూరజంతువుల మధ్యగాని, దావానలము మధ్యగాని, మహాసాగరముమధ్యగాని విపత్తులపాలైనవా రీస్తోత్రమును బఠించిన నావిపత్తులనుండి ముక్తిబొందగలరు.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని గంధర్వ జీవదానమున
మహాపురుషస్తోత్రప్రణయన మను
పదునెనిమిదవ అధ్యాయము
సంపూర్ణము.

# పంచొన్మిదవ అధ్యాయము

## బ్రహ్మాండపావన మను శ్రీకృష్ణకవచము : సంసారపావన మను శ్రీశివకవచము : శివస్తవరాజము: వీని మహిమ:

**సౌతి పలికెను :**

ఈవిధముగ మాలావతి యనేకదానముల నొనరించి ప్రసన్నురాలై తనస్వామిని సేవించుచు నానందింపదొడగెను. ఉత్తమవ్రతపాలకురాలైన యా పతివ్రత స్వయముగ నేకాంతమందు తనభర్తకు మరల మహాపురుషస్తోత్రముడు, కవచమును, పూజావిధానమును, మంత్రమును బోధించెను. పూర్వకాలమునందు వసిష్ఠమహర్షి పుష్కరతీర్థముతో నీగంధర్వదంపతుల కీస్తోత్రాదులు నుపదేశించెను. వీనిని మఱచినట్లే భోగలాలసుడై యుపబర్హణుడు శంకరునిస్తోత్ర కవచాదులనుగూడ మఱచిపోయెను. మాలావతివలన మరల నాకవచస్తోత్రాదులను జ్ఞప్తికిదెచ్చుకొని భగవంతు నారాధించుచు దనరాణులతో సుఖముగనుండెను.

**శౌనకాదిమహర్షులు పలికిరి :**

సూతనందనా ! పూర్వకాలమం దాగంధర్వదంపతులకు వశిష్ఠ మహర్షి ప్రసాదించినవిష్ణుస్తోత్ర కవచ మంత్రపూజావిధానములను మాకు కృపతో నుపదేశింప బ్రార్థించుచున్నాము. అట్లే వశిష్ఠమహర్షి యుపదేశించిన శివద్వాదశాక్షరమంత్రమును, కవచాదులనుగూడ దయతో బ్రసాదింపుము. వీని నన్నింటిని వినుటకు మామనము లత్యంతాతురతజెందుచున్నవి. ఎందువలన నన శంకరునిస్తోత్రము, కవచము, మంత్రము దుర్గతులను నశింపజేయు నట్టివికదా !

**సౌతి పలికెను :**

మహర్షులారా ! మాలావతి యేస్తోత్రము మూలమున బరమేశ్వరుడైన శ్రీకృష్ణుని బ్రార్థించెనో యాస్తోత్రమునే వశిష్ఠమహర్షి గంధర్వదంపతుల కుపదేశించెను. ఇపు డాయన యుపదేశించిన మంత్రమును, కవచమును వర్ణించెద నవధరింపుడు.

"ఓం నమో భగవతే రాసమండలేశాయ స్వాహా"

ఈ షోడశాక్షరమంత్ర ముపాసకులకు గల్పవృక్షకల్పము. ఈ మంత్రోప దేశము వశిష్ఠమహర్షి గావించెను. పూర్వకాలమందు శ్రీహరియొక్క పుష్కరధామములో బ్రహ్మ సనత్కుమారున కీమంత్రమునే యుపదేశించెను. శ్రీకృష్ణుడు గోలోకమందు శంకరున కీమంత్రజ్ఞానమునే ప్రసాదించెను. సనాతనుడైన, సర్వులకు బరమదుర్లభుడైన శ్రీహరియొక్క వేదవర్ణితస్వరూప మును ధ్యానింపవలెను. పూర్వోక్తమూలమంత్రమును జపించి నైవేద్యసహిత ముగ షోడశోపచారములను సమర్పింపవలెను. భగవంతునికవచ మత్యంత నిగూఢము. విప్రవరులారా! నేనీకవచమును నాపితృదేవులనుండి తెలిసి కొంటిని. పూర్వకాలమందు త్రిశూలపాణి యైనశంకరుడే నాతండ్రికి గంగా తటమున నీకవచము నుపదేశించెను. శంకరునకు, బ్రహ్మకు, ధర్మదేవతకు గోలోకరాసమండలమధ్యమున గోపీవల్లభు డైనశ్రీకృష్ణుడే కృపాపూర్వకముగ నీపరమాద్భుతకవచమును బ్రసాదించెను.

## బ్రహ్మోవాచ :

రాధాకాన్త మహాభాగ కవచం యత్ ప్రకాశితమ్ ।
బ్రహ్మాణ్డపావనం నామ కృపయా కథయ ప్రభో ॥
మాం మహేశం చ ధర్మం చ భక్తం చ భక్తవత్సల।
త్వత్ప్రసాదేన పుత్రేభ్యో దాస్యామి భక్తిసంయుతః ॥

"మహాభాగా! రాధావల్లభా! ప్రభూ! బ్రహ్మాండపావన మను నీకవచ మును నీవు ప్రకాశితమొనరించితివి. దానిని గృపాపూర్వకముగ నాకు, మహాదేవునకు ధర్మదేవతకు నుపదేశింపుము. భక్తవత్సలా! మేము ముగ్వురము నీభక్తులము. నీకృపవలన నేను నాపుత్రులకు భక్తిపూర్వకముగ నీవు ప్రసా దించినకవచము నుపదేశించెదను".

## శ్రీకృష్ణఉవాచ :

శృణు వక్ష్యామి బ్రహ్మేశ ధర్మేదం కవచం పరమ్ ।
అహం దాస్యామి యుష్మభ్యం గోపనీయం సుదుర్లభమ్ ॥
యస్మై కస్మై న దాతవ్యం ప్రాణతుల్యం మమైవ హి ।
యత్తేజో మమ దేహేఽస్తి తత్తేజః కవచేఽపి చ ॥

"బ్రహ్మా! మహేశ్వరా! ధర్మదేవా! సావధానులరై యవధరింపుడు. నేనీపరమోత్తమకవచమును వర్ణించెదను. ఈకవచము పరమదుర్లభమైనను,

గోపనీయమైనను మీ కుపదేశించెదను. ధ్యానమునం దుంచుకొనుడు. ఎవరి కనిన వారి కీకవచము నుపదేశింపరాదు. ఏలయన నీకవచము నాకు ప్రాణసమానము. నాయందున్న తేజమే యీకవచమందును గలదు".

కురు సృష్టి మిమం ధృత్వా ధాతా త్రిజగతాం భవ ।
సంహర్తా భవ హే శమ్భో! మమ తుల్యో భవే భవ ॥
హే ధర్మ త్వ మిమం ధృత్వా భవ సాక్షీ చ కర్మణామ్ ।
తపసాం ఫలదాతా చ యూయం భవత మద్వరాత్ ॥

బ్రహ్మదేవా! నీ వీకవచమును ధారణచేసి సృష్టి నారంభించి త్రిలోకములకు విధాతగా ప్రతిష్ఠితుడవు గమ్ము. శంభో! నీ వీకవచమును ధారణచేసి, సంహారకార్యమును సంపన్నమొనరించుచు జగమునందు మత్సమానశక్తిమంతుడవై యుండగలవు. ధర్మదేవా! నీ వీకవచమును ధారణచేసి సర్వులకర్మలకు సాక్షివి గమ్ము. మీ రందఱు నావరప్రభావమున దపఃఫలప్రదాతలు గాగలరు.

బ్రహ్మాణ్డపావన స్యాస్య కవచస్య హరిః స్వయమ్ ।
ఋషి శ్ఛన్దశ్చ గాయత్రీ దేవోఽహం జగదీశ్వరః ॥
ధర్మార్థకామమోక్షేషు వినియోగః ప్రకీర్తితః ।
త్రిలక్షవారపఠనాత్ సిద్ధిదం కవచం విధే ॥

ఈబ్రహ్మాండపావనకవచమునకు స్వయముగ శ్రీహరియే ఋషి, గాయత్రియే ఛందము, జగదీశ్వరుడనైననేనే దీనికి దైవమును. ధర్మార్థకామ మోక్షసిద్ధికొఱ కీకవచమును వినియోగింపవలయును. విధాతా! మూడు లక్షలపర్యాయములు పఠించిన ఈకవచముసిద్ధిదాయకము గాగలదు.

ఓం అస్య శ్రీబ్రహ్మాణ్డపావనకవచస్య సాక్షాత్ శ్రీహరిః ఋషిః
గాయత్రీ ఛన్దః। స ఏవ జగదీశ్వరః శ్రీకృష్ణో దేవతా।
ధర్మార్థకామమోక్షేషు వినియోగః ।
యో భవేత్ సిద్ధకవచో మమ తుల్యో భవేత్తు సః ।
తేజసా సిద్ధియోగేన జ్ఞానేన విక్రమేణ చ ॥
ప్రణవో మే శిరః పాతు నమో రాసేశ్వరాయ చ ।
ఫాలం పాయా న్నేత్రయుగ్మం నమో రాధేశ్వరాయ చ ॥
కృష్ణః పాయాత్ శ్రోత్రయుగ్మం హే హరే ఘ్రాణమేవ చ ।
జిహ్వికాం వహ్నిజాయా తు కృష్ణాయేతి చ సర్వతః ॥

శ్రీకృష్ణాయ స్వాహేతి చ కణ్ఠం పాతు షడక్షరః ।
హ్రీం కృష్ణాయ నమో వక్త్రం క్లీం పూర్వశ్చ భుజద్వయమ్ ॥
నమో గోపాంగనేశాయ స్కన్ధా వష్టాక్షరోఽవతు ।
దన్తపంక్తి మోష్ఠయుగ్మం నమో గోపీశ్వరాయ చ ॥
"ఓం నమో భగవతే రాసమణ్డలేశాయ స్వాహా ।"
స్వయం వక్షఃస్థలం పాతు మన్త్రోఽయం షోడశాక్షరః ॥
ఐం కృష్ణాయ స్వాహేతి చ కర్ణయుగ్మం సదాఽవతు ।
ఓం విష్ణవే స్వాహేతి చ కంకాలం సర్వతోఽవతు ॥
ఓం హరయే నమ ఇతి పృష్ఠం పాదం సదాఽవతు ।
ఓం గోవర్ధనధారిణే స్వాహా సర్వశరీరకమ్ ॥
ప్రాచ్యాం మాం పాతు శ్రీకృష్ణ ఆగ్నేయ్యాం పాతు మాధవః ।
దక్షిణే పాతు గోపీశో నైరృత్యాం నన్దనన్దనః ॥
వారుణ్యాం పాతు గోవిన్దో వాయవ్యాం రాధికేశ్వరః ।
ఉత్తరే పాతు రాసేశ ఐశాన్యా మచ్యుతః స్వయమ్ ॥
సన్తతం సర్వతః పాతు పరో నారాయణః స్వయమ్ ।
ఇతి తే కథితం బ్రహ్మన్ కవచం పరమాద్భుతమ్ ॥
మమ జీవనతుల్యం చ యుష్మభ్యం దత్తమేవ చ । (25-35)

ఈకవచమును సిద్ధింపజేసికొనువారు తేజమందు, సిద్ధియోగమందు, జ్ఞానమందు, బలపరాక్రమములయందు నాసమానులు కాగలరు.

ప్రణవము (ఓంకారము) నామస్తకమును, "నమో రాసేశ్వరాయ" (రాసేశ్వరునకు నమస్కారము) ఈమంత్రము నాలలాటమును, నమో రాధేశ్వరాయ (రాధాపతికి నమస్కారము) ఈమంత్రము నారెండునేత్రములను, కృష్ణుడు నారెండు కర్ణములను నాశ్రీహరి నానాసికను, స్వాహామంత్రము జిహ్వాను గష్టములనుండి రక్షించుగాక. కృష్ణాయ స్వాహా ఈమంత్రమన్ని దిక్కులనుండి మమ్ము రక్షించుగాక. శ్రీకృష్ణాయ స్వాహా. ఈషడక్షర మంత్రము నాకంఠమును, హ్రీం కృష్ణాయ నమః ఈమంత్రము నాముఖమును, క్లీం కృష్ణాయ నమః ఈమంత్రము నారెండుభుజములను, నమో గోపాంగనేశాయ(గోపాంగనావల్లభా! శ్రీకృష్ణా! నీకు నమస్కారము)ఈయష్టాక్షరమంత్రము నారెండుభుజములను, నమో గోపీశ్వరాయ (గోపీశ్వరా! నీకు నమస్కారము) ఈమంత్రము దంతపంక్తిని నోష్ఠయుగ్మమును రక్షించుగాక. ఓం నమో భగవతే రాసమండలేశాయ స్వాహా (రాసమండలమునకు

స్వామియు సచ్చిదానందస్వరూపుడు నగు శ్రీకృష్ణభగవానునకు నానమస్కారములు, ఆయన ప్రసన్నతకొఱకు నేను నాసర్వస్వమునాహుతియొనర్చుచున్నాను అనగా త్యాగమొనరించుచున్నాను) ఈషోడశాక్షరమంత్రము నావక్షస్థలమును రక్షించుగాక! ఐంకృష్ణాయ స్వాహా ఈమంత్రము నా రెండుకర్ణములను, ఓంవిష్ణవే స్వాహా ఈమంత్రము సదా నాయస్థిపంజరము నన్నిదిక్కులనుండి రక్షించుగాక. ఓం హరయే నమః ఈమంత్రము సదా నాపృష్ఠభాగమును" పాదమును, ఓం గోవర్ధనధారిణే స్వాహా ఈమంత్రము నాసంపూర్ణశరీరమును రక్షించుగాక. పూర్వదిశయందు శ్రీకృష్ణుడు, అగ్నికోణమందు మాధవుడు, దక్షిణదిశయందు గోపీశ్వరుడు, నైరృతికోణమందు నందనందనుడు, పశ్చిమదిశయందు గోవిందుడు, వాయవ్యకోణమందు రాధికేశ్వరుడు, ఉత్తరదిశయందు రాసేశ్వరుడు, ఈశానకోణమందు స్వయముగ నచ్యుతుడు నన్ను సంరక్షింతురు గాక. పరమపురుషుడగు నారాయణు డెల్లపుడు నన్నిదిక్కులనుండి నన్ను పాలించుగాక! బ్రహ్మదేవా! ఈప్రకారముగ బరమాద్భుతకవచమును నేను మీకు బ్రసాదించితిని. ఈకవచము నాజీవనతుల్యము.

అశ్వమేధసహస్రాణి వాజపేయశతాని చ ।
కలాం నార్హన్తి తాన్యేవ కవచస్యైవ ధారణాత్ ॥
గురుమభ్యర్చ్య విధివ ద్వస్త్రాలంకారచన్దనైః ।
స్నాత్వా తం చ నమస్కృత్య కవచం ధారయేత్ సుధీః ॥
కవచస్య ప్రసాదేన జీవన్ముక్తో భవే న్నరః ।
యది స్యాత్ సిద్ధకవచో విష్ణురేవ భవేద్ ద్విజ ॥

సహస్రాశ్వమేధములయొక్కయు, బహుశతవాజపేయయజ్ఞములయొక్కయు ఫల మీకవచఫలములో పదునాఱవయంశమునకును సరిరావు. విద్వాంసులైనపురుషులు స్నానమొనరించి పరిశుద్ధులై, వస్త్రాలంకారచందనములతో గురువును విధిపూర్వకముగ బూజించి, నమస్కరించి తదుపరి యీకవచోపదేశమును బొందవలెను. ఈకవచప్రసాదమువలన మనుష్యుడు జీవన్ముక్తుడు కాగలడు. శౌనకాదిమహర్షులారా! ఈ కవచసిద్ధిని బొందువారు విష్ణుస్వరూపులయ్యెదరు.

**సౌతి పలికెను :**

శౌనకాదిమునులారా! ఇపుడు శివునికవచమును, స్తోత్రమును మీరవధరింపుడు. "ఓం నమో భగవతే శివాయ స్వాహా" ఇదియే పరమశివుని

ద్వాదశాక్షరమంత్రము. ఈమంత్రమును పూర్వకాలమున వశిష్ఠమహర్షి పుష్కరతీర్థమందు గంధర్వునకు ప్రసాదించెను. ప్రాచీనకాలమందు బ్రహ్మ రావణున కీమంత్రమునే యుపదేశించెను. ప్రప్రథమమున శంకరుడు బాణా సురునకు, దూర్వాసునకు నీమంత్రమునే ప్రసాదించెను. ఈమూలమంత్రమును జపించి యిష్టదైవమునకు నైవేద్యాదిసకలోపచారములను సమర్పింప వలెను.

ధ్యాయే న్నిత్యం మహేశం రజతగిరినిభం చారుచన్ద్రావతంసం ।
దివ్యాం కల్పోజ్జ్వలాంగం పరశుమృగవరాభీతిహస్తం ప్రసన్నమ్ ॥
రత్నాసీనం సమన్తాత్ స్తుత మమరగణై ర్వ్యాఘ్రకృత్తిం వసానం ।
విశ్వాద్యం విశ్వవన్ద్యం సకలభయహరం పంచవక్త్రం త్రినేత్రమ్॥

"వెండికొండతో సమాన మగుకాంతిగలవాడు, సుందరుడైనచంద్రుడు శిరోభూషణముగ గలవాడు, దివ్యములైననానాభూషణములచే శోభిల్లునవయవ ములు గలవాడు, గండ్రగొడ్డలిని మృగమును నభయముద్రను ధరించినహస్త ములు గలవాడు, ప్రసన్నుడైనవాడు, రత్నమయసింహాసనము నధిష్ఠించియున్న వాడు, దేవతలచే నంతట స్తుతింపబడువాడు, వ్యాఘ్రచర్మమును ధరించినవాడు, విశ్వమున కాద్యుడైనవాడు, విశ్వమునకు నమస్కరింపదగినవాడు, సర్వ ప్రాణులభయమును దొలగించువాడు, నైదుశిరములు మూడునేత్రములు గలవాడు నగుమహేశ్వరుని నిత్యము ధ్యానింపవలెను".

"ఓం నమో మహాదేవాయ"

సచ్చిదానందస్వరూపుడైనమహాదేవునకు నమస్కారము.

### బాణాసుర ఉవాచ:

మహేశ్వర మహాభాగ కవచం యత్ ప్రకాశితమ్ ।
సంసారపావనం నామ కృపయా కథయ ప్రభో ॥

**బాణాసురు డిట్లు ప్రార్థించెను :**

"మహాభాగా! మహేశ్వరా! ప్రభూ! నీవు సంసారపావన మనునేకవచ మును ప్రకాశితము జేసితివో యాకవచమును నాకు గృపాపూర్వకముగ బ్రసా దింపుము",

## మహేశ్వర ఉవాచ :

శృణు వక్ష్యామి హేవత్స కవచం పరమాద్భుతమ్ ।
అహం తుభ్యం ప్రదాస్యామి గోపనీయం సుదుర్లభమ్॥
పురా దూర్వాససే దత్తం త్రైలోక్యవిజయాయ చ ।
మమైవేదం చ కవచం భక్త్యా యో ధారయేత్ సుధీః॥
జేతుం శక్నోతి త్రైలోక్యం భగవానివ లీలయా ॥

"కుమారా! ఆపరమాద్భుతకవచమును వర్ణించెద నవధరింపుము. ఈ కవచము పరమదుర్లభమైనది, గోపనీయమైనది, ఐనను నీ కుపదేశించెదను. పూర్వకాలమందు త్రైలోక్యవిజయముకొఱ కీకవచమును నేను దూర్వాసునకు ప్రసాదించితిని. ఉత్తమబుద్ధియుక్తుడైనపురుషుడు భక్తిభావముతో నాయీ కవచమును ధారణచేసిన-చో యతడు భగవంతునివలె లీలాపూర్వకముగ త్రిలోకములపై విజయము పొందగలడు".

ఓం అస్య శ్రీసంసారపావననామధేయస్య శివకవచస్య
ప్రజాపతి ఋషి ర్గాయత్రీ ఛన్దో మహేశ్వరో దేవతా
ధర్మార్థకామమోక్షసిద్ధౌ వినియోగః ।
సంసారపావన స్యాస్య కవచస్య ప్రజాపతిః ।
ఋషి శ్ఛన్దశ్చ గాయత్రీ దేవోఽహం చ మహేశ్వరః
ధర్మార్థకామమోక్షేషు వినియోగః ప్రకీర్తితః ।
పంచలక్షజపేనైవ సిద్ధిదం కవచం భవేత్ ॥
యో భవేత్ సిద్ధకవచో మమ తుల్యో భవేద్ భువి ।
తేజసా సిద్ధియోగేన తపసా విక్రమేణ చ ॥
శమ్భుర్మే మస్తకం పాతు ముఖం పాతు మహేశ్వరః।
దన్తపంక్తిం నీలకణ్ఠోఽప్యధరోష్ఠం హరః స్వయమ్ ॥
చన్ద్రచూడో గళం పాతు స్కన్ధౌ వృషభవాహనః ।
వక్షఃస్థలం నీలకణ్ఠః పాతు పృష్ఠం దిగమ్బరః ॥
సర్వాంగం పాతు విశ్వేశః సర్వదిక్షు చ సర్వదా ।
స్వప్నే జాగరణే చైవ స్థాణు ర్మే పాతు సంతతమ్॥
ఇతి తే కథితం బాణ కవచం ః పరమాద్భుతమ్ ।
యస్మై కస్మై న దాతవ్యం గోపనీయం ప్రయత్నతః॥
యత్ ఫలం సర్వతీర్థానాం స్నానేన లభతే నరః ।
తత్ఫలం లభతే నూనం కవచస్యైవ ధారణాత్ ॥
ఇదం కవచ మజ్ఞాత్వా భజే న్మాం యః సుమన్ద ధీః ।
శతలక్షప్రజప్తోఽపి న మన్త్రః సిద్ధిదాయకః॥ (47-55)

"ఈసంసారపావన మనుశివకవచమునకు ప్రజాపతియే ఋషి, గాయత్రియే ఛన్దము, మహేశ్వరుడనైన నేనే దైవమును, ధర్మార్థ కామమోక్షములకొఱ కీకవచమును వినియోగింపవలెను.

ఐదులక్షలపర్యాయములు జపించిన నీకవచము సిద్ధిదాయకము గాగలదు. ఈకవచసిద్ధిని బొందువారు తేజస్సునందు, సిద్ధయోగమందు, దపమునందు బలపరాక్రమములయందు నీభూతలముపై నాసమానులు కాగలరు.

శంభువు నామస్తకమును, మహేశ్వరుడు నాముఖమును నీలకంఠుడు నాదంతములను, హరుడు స్వయముగ నాయధరోష్ఠములను,చంద్ర చూడుడు నాకంఠమును, వృషభవాహనుడు నారెండు భుజములను, నీల కంఠుడు నావక్షస్థలమును, దిగంబరుడు నాపృష్ఠభాగమును, విశ్వేశ్వరుడు సర్వదిశలయందు నాసంపూర్ణాంగములను రక్షించుగాక! నిద్రయందు, జాగ్ర దవస్థయందు స్థాణువు నిరంతరము నన్ను బాలించుగాక!

బాణుడా! ఈప్రకారముగ నేను నీకు బరమాద్భుతకవచము నుపదేశించి తిని. ఈకవచము నపాత్రుల కుపదేశింపరాదు. యత్నపూర్వకముగ గుప్త ముగ నుంచవలెను. మనుష్యుడు సర్వతీర్థములందు స్నానమాచరించి యే ఫలమును బొందునో యాఫలమునే యతడీకవచధారణమాత్రమునబొందగలడు. మందబుద్ధియైనమానవు డీకవచమును దెలిసికొనకయే నన్ను భజించుచు నామంత్రము నెన్నిమాఱులు జపించినను వాని కామంత్రము సిద్ధిదాయకము కాదు".

**సౌతి పలికెను:**

ఇదం చ కవచం ప్రోక్తం స్తోత్రం చ శృణు శౌనక ।
మన్త్రరాజః కల్పతరు ర్వసిష్ఠో దత్తవాన్ పురా ॥

"శౌనకాదిఋషులారా! మీ రాపవిత్రకవచమును శ్రవణమొనరించితిరి. ఇపుడు స్తోత్రము నవధరింపుడు. ఈమంత్రరాజము కల్పవృక్షస్వరూపము. దీనిని బూర్వకాలమందు వశిష్ఠమహర్షి ప్రసాదించెను".

"ఓం నమః శివాయ"

**బాణాసుర ఉవాచ:**

వన్దే సురాణాం సారం చ సురేశం నీలలోహితమ్ ।
యోగీశ్వరం యోగబీజం యోగినాం చ గురో ర్గురుమ్ ॥

జ్ఞానానన్దం జ్ఞానరూపం జ్ఞానబీజం సనాతనమ్ ।
తపసాం ఫలదాతారం దాతారం సర్వసమ్పదామ్ ॥
తపోరూపం తపోబీజం తపోధనధనం పరమ్।
వరం వరేణ్యం వరదమీడ్యం సిద్ధగణైర్వరైః ॥
కారణం భక్తిముక్తీనాం నరకార్ణవతారణమ్ ।
ఆశుతోషం ప్రసన్నాస్యం కరుణామయసాగరమ్ ॥
హిమచన్దనకున్దేన్దుకుముదామ్భోజసన్నిభమ్ ।
బ్రహ్మజ్యోతి స్స్వరూపం చ భక్తానుగ్రహవిగ్రహమ్ ।
విషయాణాం విభేదేన బిభ్రన్తం బహురూపకమ్ ।
జలరూప మగ్నిరూప మాకాశరూప మీశ్వరమ్ ॥
వాయురూపం చన్ద్రరూపం సూర్యరూపం మహత్ప్రభుమ్।
ఆత్మనః స్వపదం దాతుం సమర్థ మవలీలయా ॥
భక్తజీవన మీశం చ భక్తానుగ్రహకాతరమ్ ।
వేదా న శక్తా యం స్తోతుం కిమహం స్తౌమి తం ప్రభుమ్॥
అపరిచ్ఛిన్న మీశాన మహో వాఙ్మనసోః పరమ్ ।
వ్యాఘ్రచర్మామ్బరధరం వృషభస్థం దిగమ్బరమ్ ॥
త్రిశూలపట్టిశధరం సస్మితం చన్ద్రశేఖరమ్ ।
ఇత్యుక్త్వా స్తవరాజేన నిత్యం బాణః సుసంయతః।
ప్రణమచ్ఛంకరం భక్త్యా దుర్వాసాశ్చ మునీశ్వరః । (51-65)

## బాణాసురు డిట్లు శివుని ప్రార్థించెను :

"దేవతలయొక్క సారతత్త్వస్వరూపుడు, సమస్త దేవగణములకు స్వామియు, నీలలోహితవర్ణుడు, యోగీశ్వరుడు, యోగబీజుడు, యోగులగురు వులకే గురువు, జ్ఞానానందస్వరూపుడు, జ్ఞానబీజుడు, సనాతనుడు, తపఃఫల ప్రదాత, సర్వసంపత్ప్రదాత, తపస్స్వరూపుడు, తపోబీజుడు, తపోధనులకు శ్రేష్ఠ ధనరూపుడు, వరుడు, వరేణ్యుడు, వరదాయకులందు శ్రేష్ఠుడు, సిద్ధగణములచే స్తుతింపబడువాడు, ఈడ్యుడు, భక్తిముక్తులకు కారణుడు, నరకార్ణవతారకుడు, శీఘ్రముగ ప్రసన్నుడగువాడు, ప్రసన్నముఖముగల్గినవాడు, కరుణాసాగరుడు, హిమచందనకుందేందుకుముదాంభోజసన్నిభుడు, పరబ్రహ్మజ్యోతి స్వరూపుడు, భక్తానుగ్రహవిగ్రహుడు, విషయభేదములతో ననేకరూపములను ధరించియున్నవాడు, జలరూపుడు, అగ్నిరూపుడు, ఆకాశరూపుడు, ఈశ్వరుడు,

వాయురూపుడు, చంద్రరూపుడు, సూర్యరూపుడు, మహాత్ములకు ప్రభువు, తన స్వపదమును ప్రసాదించుశక్తిగలవాడు, భక్తజీవనుడు, ఈశ్వరుడు, భక్తానుగ్రహకాతరుడు నగునీశ్వరునకు నా నమస్కారములు. వేదములే ఆయనను స్తుతించుటలో నసమర్థములైనవి. ఆప్రభువును నే నేమనిస్తుతింపగలను? దేశకాలవస్తువులచే నపరిచ్ఛిన్నుడు అవాఙ్మానసగోచరుడు, వ్యాఘ్రచర్మాంబరధారి, వృషభవాహనుడు, దిగంబరుడు, త్రిశూలపట్టిసధారి, సస్మితుడు, చంద్రశేఖరుడు, సచ్చిదానందస్వరూపుడు నైనశివునకు నా నమస్కారములు. ఈస్తవ రాజముతోనే నిత్యము బాణాసురుడు శివుని స్తుతించుచు భక్తితో ప్రణామము లర్పించెను. దూర్వాసమహర్షి కూడ నిట్లే యొనరించెను".

## సౌతి రువాచ :

ఇదం దత్తం వసిష్ఠేన గన్ధర్వాయ పురా మునే ॥
కథితం చ మహాస్తోత్రం శూలినః పరమాద్భుతమ్ ।
ఇదంస్తోత్రం మహాపుణ్యం పఠేద్భక్త్యా చ యో నరః॥
స్నానస్య సర్వతీర్థానాం ఫల మాప్నోతి నిశ్చితమ్ ।
అపుత్రో లభతే పుత్రం వర్ష మేకం శృణోతి యః ॥
సంయతశ్చ హవిష్యాశీ ప్రణమ్య శంకరం గురుమ్ ॥
గలత్కుష్ఠీ మహాశూలీ వర్ష మేకం శృణోతి యః ।
అవశ్యం ముచ్యతే రోగాద్ వ్యాసవాక్యమితి శ్రుతమ్ ॥
కారాగారేఽపి బద్ధో యో నైవ ప్రాప్నోతి నిర్వృతిమ్।
స్తోత్రం శ్రుత్వా మాస మేకం ముచ్యతే బన్ధనాద్ధ్రువమ్॥
భ్రష్టరాజ్యోలభేద్ రాజ్యం భక్త్యా మాసం శృణోతి యః
మాసం శ్రుత్వా సంయతశ్చ లభేద్ భ్రష్టధనో ధనమ్ ॥
యక్ష్మగ్రస్తో వర్షమేక మాస్తికో యః శృణోతి చేత్ ।
నిశ్చితం ముచ్యతే రోగా చ్ఛంకరస్య ప్రసాదతః ॥
యః శృణోతి సదా భక్త్యా స్తవరాజ మిమం ద్విజః ।
తస్యాసాధ్యం త్రిభువనే నాస్తి కించిచ్చ శౌనకః ॥
కదాచిద్ బన్ధువిచ్ఛేదో న భవేత్ తస్య భారతే ।
అచలం పరమైశ్వర్యం లభతే నాత్ర సంశయః ॥
సుసంయతోఽతిభక్త్యా చ మాస మేకం శృణోతియః ।
అభార్యో లభతే భార్యాం సువినీతాం సతీం వరామ్ ॥
మహామూర్ఖశ్చ దుర్మేధా మాస మేకం శృణోతియః ।

బుద్ధిం విద్యాం చ లభతే గురూపదేశమాత్రతః ॥
కర్మదుఃఖీ దరిద్రశ్చ మాసం భక్త్యా శృణోతి యః ।
ధ్రువం విత్తం భవేత్తస్య శంకరస్య ప్రసాదతః ॥
ఇహలోకే సుఖం భుక్త్వా లబ్ధ్వా కీర్తిం సుదుర్లభామ్ ।
నానాప్రకారధర్మం చ యాత్యన్తే శంకరాలయమ్ ॥
పార్షదప్రవరో భూత్వా సేవతే తత్ర శంకరమ్ ।
యఃశృణోతి త్రిసంధ్యం చ నిత్యం స్తోత్ర మనుత్తమమ్॥ (66-80)

**సౌతి పలికెను :**

"మునీశ్వరులారా! వశిష్ఠమహర్షి పూర్వకాలమందు త్రిశూలధారి యైనశివుని యీపరమాద్భుతస్తోత్రమును గంధర్వదంపతుల కుపదేశించెను. భక్తిభావముతో నీపరమపుణ్యమయస్తోత్రమును బఠించువానికి నిశ్చయముగ సర్వతీర్థస్నానఫలము సంపూర్ణముగ లభింపగలదు. సంయమపూర్వకముగ హావిష్యాన్నమును భుజించుచు జగద్గురు వైనశంకరునకు నమస్కరించుచు నీ స్తోత్రమునొకవత్సరమువఱకు శ్రవణము చేయువారు పుత్రహీనులైనచో నవశ్యముగ వారికి బుత్రప్రాప్తి గల్గును. కుష్ఠువ్యాధిగాని, యుదరమందు భరింప రానిశూలకాని యున్నవారొకసంవత్సరపర్యంత మీ స్తోత్రమును శ్రవణము జేసినంతమాత్రమునసే తదోగవిముక్తులు కాగలరు. ఈవిషయము స్వయముగ వ్యాసమహర్షియే ధృవీకరించినాడు. బద్ధుడైనవా డీస్తోత్రము నొక మాసము స్తుతించినను లేక శ్రవణముచేసినను బంధవిముక్తుడు కాగలడు. రాజ్య భ్రష్టు డైనరా జొకమాసము భక్తిపూర్వకముగ నీ స్తోత్రశ్రవణము జేసిన నత నికి రాజ్యప్రాప్తి యగును. ఒకమాసము సంయమపూర్వకముగ నీస్తోత్రమును శ్రవణముచేసిన నిర్ధనునకు ధనము లభింపగలదు. రాచపుండుచే బాధపడు చున్న పురుషు డీస్తోత్రము నొకసంవత్సరము శ్రవణముచేసిన నిశ్చయముగ నాతడు శంకరభగవత్ప్రసాదమున రోగవిముక్తుడు కాగలడు. ద్విజోత్తమా! శౌనకా! సదా భక్తిభావముతో నీస్తోత్రరాజమును శ్రవణముచేయు వారికి మూడులోకములందు నేదియు నసాధ్యముకాదు. అట్టివానికి బంధు వియోగదుఃఖము సంభవింపదు. అత డవిచలుడై మహైశ్వర్యసంపన్నుడు కాగలడు. ఇందు సంశయము లేదు. పూర్ణసంయమముతో నివసించుచు నత్యంతభక్తిభావముతో నొకమాస మీస్తోత్రమును శ్రవణముచేయు నాతడు భార్యాహీనుడైన నత్యంత వినయశీలయు, సాధ్వియు, సుందరియునగు భార్యను

బొందగలడు. మహామూర్ఖుడైనను, జడస్వరూపు
మాసము శ్రవణముచేసిన నతనికి గురూపదేశమాత్రప
గలవు. ప్రారబ్ధకర్మమున దుఃఖితుడై దరిద్రుడైన
స్తోత్రశ్రవణముచేసిన నతడు నిశ్చయముగ శంకరుని
వంతుడు కాగలడు. ఎవరు ప్రతిదినము త్రిసంధ్య
బఠించెదరో లేక శ్రవణము చేసెదరో వారిహాలోక
వించుచు, బరమదుర్లభమైనకీర్తిని బొంది, నానా
నాచరించి, యంత్యకాలమందు శంకరుని దివ్యధామ
దులై ఆయనను సేవింపగలరు.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహా
బ్రహ్మఖండములోని విష్ణుశంకరస
మను పందొమ్మిదవ అధ్యాయ
సంపూర్ణము.

## ఇరువదియవ అధ్యాయ

### గోపపత్ని యగుగళావతికి ఉపబర్హణుడ జన్మించుట.

**సౌతి పలికెను :**

ఉపబర్హణు డనుగంధర్వరాజు తన పట్టమహి
పత్నులతోను నిర్జనవనమున నానందపూర్వకముగ
యాయుర్దాయములో జివరిభాగమునుసానందముగ
దండ్రి యగుగంధర్వరాజుగూడ భార్యాపుత్రులతో

సాగెను. అతడు నానావిధము లగునుత్తమకర్మలను, గొప్పగొప్ప పుణ్యకర్మలను జేసెను. అతడు కుబేరభవనమువంటి వైభవశాలి యగుగృహమున రాజై రాజసుఖముల ననుభవించుచుండెను. అతడు సుస్థిర మగుయౌవనము గలిగినదియు, సుశీలయు నగుభార్యతో నొలదికాలము విహరించెను. సమయము రాగా గంగానది యొడ్డున పత్నీసహితు డైయతడు ప్రాణముల బరిత్యజించి సానందముగ వైకుంఠధామమునకు వెడలెను. శైవుడగుటవలన ఆయనకు శివకృప గలిగినది. ఆయన పుత్రుడు విష్ణువును సేవించెను. అందువలన వానిపై విష్ణుభగవానుని కృపాదృష్టి ప్రసరించినది. దానిచే నతడు వైకుంఠమున విష్ణుదేవునకు శ్యామవర్ణ చతుర్భుజరూపధారి యగుపార్షదు డయ్యెను. తల్లిదండ్రులకు సంస్కార మొనరించి యుపబర్హణుడు బ్రాహ్మణులకు నానావిధము లగుధనములను దానముచేసెను.

శౌనకా! అంత్యకాలము రాగా బ్రహ్మదేవుని శాపముచే ప్రాణముల బరిత్యజించి విద్వాంసు డగునా గంధర్వుడు బ్రాహ్మణుని వీర్యమువలన శూద్రస్త్రీకి జన్మించెను. మనస్సున నుత్తమసంకల్పముల నుంచుకొని మాలావతి పుష్కరతీర్థమున నగ్నికుండమున దన ప్రాణములను బరిత్యజించెను. ఆమె మనువంశ రా జగుసృంజయునకు బుత్రికగా జన్మించెను. పూర్వజన్మస్మృతి యుండుటచే ఉపబర్హణునే వివాహమాడవలయుననియామె సంకల్పించియుండెను.

**శౌనకుడు పలికెను :**

సూతనందనా ! ఉపబర్హణగంధర్వుడు బ్రాహ్మణవీర్యమువలన శూద్రస్త్రీగర్భమున యేల జన్మించెను ? దయయుంచి యీ విషయమును జెప్పుడు.

శౌనకుని ప్రశ్న నాలకించి సూతుడు "గోపరా జగుద్రుమిళుని భార్య యగుకళావతి మునిశ్రేష్ఠు డగుకశ్యపుని నుండి స్ఖలితమైన శుక్రమును గ్రహించినది, దానివలన నామెకు బుత్రుడు జన్మించె"నని యుపబర్హణుని జన్మవృత్తాంతము వినిపించి యిట్లు పలికెను.- "గోపరాజు బదరికాశ్రమమునకు వెడలి యోగబలముతో శరీరమును ద్యజించెను, పిమ్మట విమానముద్వారా వైకుంఠధామమునకు వెడలెను. అనంతరము శోకవిహ్వల యగుకళావతిని తన తల్లిగా భావించి యొక దయాళు వగుబ్రాహ్మణుడు తన గృహమునకు దీసి

కొని వెడలెను. సాధ్వి యగుకళావతి బ్రాహ్మణుని గృహమందే యుండి యొక యుత్తమపుత్రుని గనెను. వాని యవయవకాంతి తప్తకాంచనమువలె ప్రకాశించుచుండెను. అతడు బ్రహ్మతేజస్సుతో ప్రజ్వరిల్లుచుండెను. ఆ యింటిలో నుండుస్త్రీలంద ఱాసుందరబాలుని జూచిరి. అతడు తన బ్రహ్మతేజస్సుతో గ్రీష్మఋతువునందలి మధ్యాహ్నకాలికప్రచండసూర్యుని ప్రభను దిరస్కరించుచుండెను. వాని రూపము మన్మథునికంటెను మిగుల సుందరముగను, ముఖము చంద్రునికంటెను నధికమనోహరముగను నుండెను. ఆ ముఖశోభకు శరత్పూర్ణిమాచంద్రుడు లజ్జితు డగుచుండెను. వాని నేత్రములు శరదృతువులో వికసించిన కమలములశోభను హరించుచుండెను. హస్తపాదములు లలితముగను, కపోలములు సుందరముగను, ఆకృతి మనోహరముగ నుండెను. పద్మచక్రచిహ్నములచే జిహ్నితములైన వాని చరణారవిందము లనుపమపరమోజ్జ్వలములుగ గన్పట్టుచుండెను. వాని రెండుచేతులతో బోల్చదగిన వేమియు లేవు. అతడు స్తన్యమును ద్రావ రోదించుచుండెను. స్త్రీ లాబాలుని జూచి మిగులప్రసన్నలై తమతమ యాశ్రమములకు వెడలిరి. పత్నీపుత్రులతో బ్రాహ్మణుడుగూడ మిగుల ప్రసన్నుడై నృత్యముచేయసాగెను. ఆబాలుడు శుక్లపక్షచంద్రునివలె దినదినప్రవర్ధమాను డగుచుండెను. బ్రాహ్మణుడు పుత్రసహిత యగుగళావతిని దన పుత్రికవలె బోషింపసాగెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని యుపబర్హణజనన
మను నిరువదియవ అధ్యాయము
సంపూర్ణము.

—o—

# ఇరువదియొకటవ అధ్యాయము

## శూద్రస్త్రీకి జన్మించిన బాలుడగువారదుని దినచర్య; నామ వ్యుత్పత్తి; అతడు సత్పురుషులకు సేవచేయుట; సనత్కుమారుల యుపదేశమును బొందుట; శ్రీహరిస్వరూపమును ధ్యానించుట; దేహమును త్యజించుట.

**సౌతి పలికెను :**

శౌనకాదిమహాత్ములారా ! సమయానుసారముగ నాబాలకుడు పంచ వర్షములవాడయ్యెను. అతడు పూర్వజన్మస్మరణము కల్గి జ్ఞానసంపన్నుడై శ్రీకృష్ణునిదివ్యమంత్రమును జపించుచుండెను. ఆబాలుడు పులకితశరీరుడై శ్రీకృష్ణుని నామయశోగుణాదులను సంకీర్తనచేయుచు, నొకప్పుడానంద బాష్పముల రాల్చుచు, మఱియొకప్పుడు నృత్యమొనరించుచు, మధురభక్తి భావము ననుభవించుచుండెను. హరికీర్తన మొనరింపబడు ప్రదేశముననే యాబాలకుడు నిలిచిపోవును. ఆతడాటపాటలను నిద్రాహారములనుగూడ మఱచి శ్రీకృష్ణునిసేవయందే నిమగ్నుడై యుండును.

సూతనందనా! ఈబాలకుని నామధేయమేమి? దాని వ్యుత్పత్తి నిగూడ వివరింపుడని శౌనకుడు ప్రశ్నించెను.

**సౌతి పలికెను :**

మునీశ్వరులారా! అనావృష్ట్యంత్యకాలమందీబాలకుడు జన్మించెను. ఇతడు జన్మకాలమందే జగమునకు నారమును (నీరు) బ్రసాదించెను. అందు వలన వీనినామధేయము నారదుడయ్యెను. పూర్వజన్మస్మృతి కల్గి మహాజ్ఞాని యైనయీబాలకుడితరబాలకులకు నారమును (అనగా జ్ఞానమును) బ్రసాదించెను. దేవర్షి నారదుడే యీబాలకునిరూపమున జన్మించెను. కావున వీనినామధేయము నారదుడయ్యెను. ధర్మపుత్రుడైనసనరమహార్షి పుత్రహీనుడైనకశ్యపునకు బుత్రుని బ్రసాదించెను. వరప్రదత్తుడైన కారణమున నాబాల కునినామము నారదుడయ్యెను.

సూతనందనా! ఈ శిశువుయొక్క—నారదనామ వ్యుత్పత్తిని వింటిమి. శూద్రయోనియందును, బ్రహ్మపుత్రావస్థయందును ఆయనకు నారదుడను నామమెట్లుకలిగెనని శౌనకుడు మరల ప్రశ్నించెను.

## సౌతి పలికెను :

మునీంద్రులారా! కల్పాంతరమందు బ్రహ్మదేవునికంఠమునుండి యసంఖ్యాకనరు లుత్పన్నులైరి. ఆయన కంఠమునుండి యీ నరు డుద్భవించెను. నరదుడనగా గంఠమునుండి యుత్పన్నుడైనవాడని యర్థము. కావుననే బ్రహ్మ యీబాలకునకు నారదుడని నామకరణ మొనరించెను. ఇపుడు శిశువు వృత్తాంతము వినిపించెదను, సావధానులై యవధరింపుడు. ఆగోపికాబాలకుడు బ్రాహ్మణుని గృహమందు సుఖముగ దినదినాభివృద్ధి గాంచదొడంగెను. ఆ బ్రాహ్మణుడుకూడ నారదుని దనపుత్రులతో సమానముగా నాదరించు చుండెను. ఆసమయమున పంచవర్షములు గల్గిన నల్వురు దివ్యకుమారు లత్యంత తేజముతో బ్రకాశించుచు బ్రాహ్మణగృహమున కరుదెంచిరి. గృహస్థ బ్రాహ్మణుడు వారికి మధుపర్కముల నొసంగి గౌరవించెను. భోజనసమయమం దానల్వురు బ్రాహ్మణకుమారులు బ్రాహ్మణు డర్పించిన ఫలమూలముల నాహారముగా భుజించిరి. వారియెంగిలిని నారదశిశువు భుజించెను. వారిలో నాల్గవవాడైనముని యీనారదబాలునకు బ్రసన్నతాపూర్వకముగా శ్రీకృష్ణ మహామంత్రము నుపదేశించెను. నారదు డానల్వురు మహాత్ములకు దాసుడై వారిసేవల నొనరింప దొడంగెను. ఒకదినమున నారదునితల్లి సర్పముకాటు వలన మరణించి శ్రీహరిధామము జేరెను. ఆసమయముననే నారదు డాముని పుంగవులతో బయలుదేరి వెడలెను. ఆనల్వురు బ్రాహ్మణులు నారదునకు దత్త్వజ్ఞానము నుపదేశించి యదృశ్యులైరి. వెంటనే యతడు గంగా నదీతటమున కేగి రావిచెట్టుక్రింద యోగాసనాసీనుడై దీర్ఘకాలము క్షుత్పిపాసారోగశోకాదులను హరింపగల శ్రీకృష్ణమంత్రమును జపింప సాగెను.

## శౌనక ఉవాచ :

కం మన్త్రం బాలకః ప్రాప కుమారేణ చ ధీమతా ।
దత్తం వరం శ్రీహరేశ్చ తద్భవాన్ వక్తు మర్హతి ॥

## సౌతి ఉవాచ :

కృష్ణేన దత్తో గోలోకే కృపయా బ్రహ్మణే పురా ।
ద్వావింశత్యక్షరో మన్త్రో వేదేషు చ సుదుర్లభః ॥
తం చ బ్రహ్మా దదౌ భక్త్యా కుమారాయ చ ధీమతే ।
కుమారేణ స దత్తశ్చ మన్త్రశ్చ శివవే ద్విజః ॥
ఓం శ్రీ నమో భగవతే రాసమణ్డలేశ్వరాయ ।
శ్రీకృష్ణాయ స్వాహేతి చ మన్త్రోఽయం కల్పపాదపః ॥
మహాపురుషస్తోత్రం చ పూర్వోక్తం కవచం చ యత్।
ధ్యానమ్ :-
అస్యాపయౌగికం ధ్యానం సామవేదోక్తమేవ చ ॥
తేజోమణ్డలరూపే చ సూర్యకోటిసమప్రభే ।
యోగిభిర్వాంఛితం ధ్యానే యోగైః సిద్ధగణైస్సురైః ॥
ధ్యాయన్తే వైష్ణవా రూపం తదభ్యన్తరసంనిభౌ ।
అతీవ కమనీయానిర్వచనీయం మనోహరమ్ ॥
నవీనజలదశ్యామం శరత్పఙ్కజలోచనమ్ ।
శరత్పార్వణచన్ద్రాస్యం పక్వబిమ్బాధికాధరమ్ ॥
ముక్తాపంక్తి వినిన్దైకదన్తపంక్తి మనోహరమ్ ।
సస్మితం మురళీన్యస్తహస్తా లప్పమేవ చ ॥
కోటికన్దర్పలావణ్యలీలాధామ మనోహరమ్ ।
చన్ద్రిలక్షప్రభాజుష్టం పుష్టశ్రీయుక్తవిగ్రహమ్ ॥
త్రిభంగభంగిమాయుక్తం ద్విభుజం పీతవాససమ్ ।
రత్నకేయూరవలయరత్ననూపురభూషితమ్ ॥
రత్నకుణ్డలయుగ్మేన గణ్డస్థలవిరాజితమ్ ।
మయూరపుచ్ఛచూడం చ రత్నమాలావిభూషితమ్ ॥
శోభితం జానుపర్యన్తం మాలతీవనమాలయా ।
చన్దనోక్షితసర్వాంగం భక్తానుగ్రహకారకమ్ ॥
మణినా కౌస్తుభేన్ద్రేణ వక్షఃస్థలసముజ్జ్వలమ్ ।
వీక్షితం గోపికాభిశ్చ శశ్వద్వ్రీడితలోచనైః ॥
స్థిరయౌవనయుక్తాభి ర్వేష్టితాభిశ్చ సంతతమ్ ।
భూషణై ర్భూషితాభిశ్చ రాధావక్షఃస్థలస్థితమ్ ॥

బ్రహ్మవిష్ణుశివాద్యైశ్చ పూజితం వన్దితం స్తుతమ్ ।
కిశోరం రాధికాకాన్తం శాన్తరూపం పరాత్పరమ్ ॥
నిర్లిప్తం సాక్షిరూపం చ నిర్గుణం ప్రకృతేః పరమ్ ।
ధ్యాయేత్ సర్వేశ్వరం తం చ పరమాత్మాన మీశ్వరమ్ ॥
ఇదం తే కథితం ధ్యానం స్తోత్రం చ కవచం మునే ।
మన్త్రోపయోగికం సత్యం మన్త్రశ్చ కల్పపాదపః ॥ (27-44)

**శౌనకుడు పలికెను :**

సూతనందనా! ఆబాలకు డేమంత్రమును బొందెను? బుద్ధిమంతుడైన సనత్కుమారుడు ప్రసాదించిన శ్రీహరియొక్క యాయుత్తమమంత్రమును మాకుపదేశింపవలసినదిగ బ్రార్థించుచున్నాము.

294.5925 Hcc.no. SIV 3750
శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణము - శివసుబ్బరాయగుప్త, ముట్లపల్లి

**సౌతి పలికెను :**

శౌనకాదిమునులారా! పూర్వకాలమందు శ్రీకృష్ణుడు గోలోకధామములో బ్రహ్మకు గృపాపూర్వకముగా నీయిరువదిరెండక్షరములు గల్గినమహామంత్రము నుపదేశించెను. బ్రహ్మ సనత్కుమారున కామంత్రమునే ప్రసాదించెను. సనత్కుమారు డామంత్రమునే గోపీబాలకుడైననారదునకు నుపదేశించెను.

"ఓం శ్రీం నమో భగవతే రాసమణ్డలేశ్వరాయ శ్రీకృష్ణాయ స్వాహా"

ఈమహామంత్రము కల్పవృక్షస్వరూపము. ఈమంత్రజపమున కుపయోగింపబడు సామవేదోక్తధ్యానమును సనత్కుమారుడు నారదబాలకున కుపదేశించెను. "కోటానుకోట్ల సూర్యులప్రకాశమును మించి ప్రకాశించుచు, ననిర్వచనీయమై, చిన్మయతేజోమండలస్వరూప ప్రకాశమునే ధ్యానించుచు యోగులు, సిద్ధగణములు, దేవతలు మనోవాంఛితదివ్య స్వరూపమును సాక్షాత్కరించుకొందురు. వైష్ణవజను లాజ్యోతిఃపుంజమధ్యమున దర్శించి ధ్యానించు నాదివ్యరూప మత్యంతకమనీయము, అనిర్వచనీయము, పరమమనోహరము. నూతనజలధరసమానముగా శ్యామలకాంతి గల్గి, యావిగ్రహము ప్రకాశించుచుండును. ఆయన నేత్రములు శరత్కాలప్రఫుల్లపంకజములవలె సువిశాలములు, ముఖమండలము శరత్పూర్ణిమాచంద్రునివలె పరమాహ్లాదజనకము, అధరములు ఖండించిన బింబఫలముకంటె నధికారుణవర్ణ

ములు, దంతపంక్తి ముత్యములశోభను దిరస్కరించునట్టివి, ఆయన లావణ్యము కోటానుకోట్ల మన్మథులలావణ్యమును మించియున్నది. ఆయన శ్రీవిగ్రహ మనేకచంద్రప్రభాయుక్తమైయున్నది. ఆయన ప్రత్యేకాంగములు పరిపుష్ట ములు, శ్రీసంపన్నములు నైయున్నవి. త్రిభంగిభంగికాయుక్తుడు, ద్విభు జుడు, పీతాంబరధారియు నై భుజములయందు భుజకీర్తులను, హస్తములయందు గంకణములను, చరణములయందు నూపురములను, వివిధాంగములయం దనేక రత్నమయభూషణములను ధరించి శోభించుచుండెను. కర్ణములయందు రత్న మయకుండలములు మెఱయుచున్నవి, శిరమునై నెమలిపింఛకిరీటము శోభించు చున్నది. రత్నమయమాలలు కంఠప్రదేశమున నలంకరింపబడియున్నవి. మాలతీవనమాల పాదములవఱకు వ్యాపించి శోభించుచున్నది. కౌస్తుభమణి ప్రకాశముతో నాయన వక్షస్థలము ప్రకాశించుచున్నది. నందనవనమునందైన యాయనయే భక్తానుగ్రహవిగ్రహుడు. సుస్థిరయువతు లైన గోపికలన్నియై పుల బరివేష్టించి యాయనదివ్యసౌందర్యమునే నిరంతరము పానము చేయుచుందురు. ఆసచ్చిదానందవిగ్రహుడు శ్రీరాధావక్షస్థలమందు విరాజమానుడైయున్నాడు. బ్రహ్మవిష్ణుశివాది దేవతలు నిత్యము నిరంతర మాయనను బూజించుచు, స్తుతిం చుచు వందనము లర్పించుచుందురు. ఆదివ్యసుందరవిగ్రహుడు కిశోరవయ స్కుడు. ఆయనయే శ్రీరాధాప్రాణనాథుడు, శాంతస్వరూపుడు, పరాత్ప రుడు, నిర్లిప్తుడు, సాక్షిస్వరూపుడు, నిర్గుణుడు, దివ్యగుణసంయుక్తుడు, ప్రకృతి కతీతుడు, సర్వేశ్వరుడు, పరమాత్మయు, అనంత [illegible] శ్రీకృష్ణుని ధ్యానింపవలెను.

శౌనకాదిఋషులారా! ఆసమయమున నాగరబాలుడు [illegible] దివ్య వర్షములు నిరాహారుడై శ్రీకృష్ణుని ధ్యానించెను. [illegible] దివ్యమంత్రప్రభా వమున బరిపుష్టుడై యుండగల్గెను. అతడు ధ్యానమందు గోలోకధామమున దివ్యరత్నసింహాసనాసీనుడై యున్న శ్రీకృష్ణపరమాత్మను దర్శించెను. పిదప నాబాలకునకు ధ్యానము భంగమైనది. బాలుడు సచ్చిదానందవిగ్రహుని సుందరస్వరూపమును గాంచలేక విలపింపసాగెను. ఆసమయమున నొక "నశ్వర శరీరమును త్యజించినపిమ్మట బరమాత్మదర్శనము లభింపగలదని" యశరీరవాణి యాబాలకునితో బలికెను. అశరీరవాణి నాలకించి బాలుడు నిశ్చింతుడై కొంత కాలము జీవించెను. అంత్యకాలము సంభవింపగా [illegible] మనమునందు

శ్రీకృష్ణుని స్మరించుచు తీర్థభూమియందు నశ్వరశరీరమును త్యజించెను. ఆసమయమున స్వర్గమునందు దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి వర్షించినది. ఈ ప్రకారముగా దేవర్షియైననారదుడు శాపవిముక్తుడయ్యెను. ఆ గోపీబాలశరీరము త్యజించి యాజీవుడు బ్రహ్మవిగ్రహమునందు లీనమయ్యెను. అతడు నిత్యస్వరూపుడే. పూర్వకాలమందావిర్భవించి భిన్నకాలమందు దిరోగమించెను. నిత్యరూపధారు లైనభక్తజనులు తమయిచ్ఛానుసారముగ నావిర్భవించి దిరోగమింపగలరు. వారిని జన్మమృత్యుజరావ్యాధులు స్పృశింపలేవు.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని నారదశాపవిమోచన
మను ఇరువదియొకటవ అధ్యాయము
సంపూర్ణము.

—♦—

## ఇరువదిరెండవ అధ్యాయము

## బ్రహ్మపుత్రనామముల వ్యుత్పత్తి

**సౌతి పలికెను :**

శౌనకాదిమహర్షులారా! కొన్నికల్పములు గతించినతరువాత బ్రహ్మ మరల సృష్టికార్యమున సంలగ్నుడయ్యెను. ఆసమయమున నరదమను ఆయన కంఠప్రదేశమునుండి మరీచి మొదలగు మునులతోపాటు శాపవిముక్తుడైన మహర్షి యుద్భవించెను. అందువలననే యామహర్షి నారదు డనునామమున విఖ్యాతిగాంచెను. తనచిత్తమునుండి యావిర్భవించిన కుమారునకు ప్రచేతసుడని బ్రహ్మనామకరణ మొనరించెను. బ్రహ్మదక్షిణభాగమునుండి యుద్భవించిన పురుషుడు సర్వకార్యములందు దక్షుడు కావున వానిని దక్షుడనిరి. వేదములందు కర్దమ శబ్దమునకు ఛాయ (నీడ) యనునర్థము కలదు. బ్రహ్మ యొక్క కర్దమమునుండి యనగా ఛాయనుండి యావిర్భవించిన బాలుని కర్దము

డనిరి. వేదములందు మరీచశబ్దమునకు తేజమని యర్థము కలదు. అత్యంత తేజోయుక్తుడై జన్మించినవానిని మరీచి యనిరి. ఆబాలుడే జన్మాంతరమం దెన్నియో క్రతువుల నాచరించెను. అతడే తనవర్తమానజన్మయందు బ్రహ్మకు మరల జన్మించి క్రతు వనునామమున బ్రసిద్ధిగాంచెను. బ్రహ్మకు ముఖము ప్రధానాంగము. ఆముఖమునుండి జన్మించిన బాలకుకు ఇర యనగా తేజస్వి, అందువలన ఆతడు అంగిరసు డనునామమున ప్రసిద్ధిగాంచెను. భృగు శబ్దమునకుగూడ నత్యంత తేజస్వి యనియే యర్థము. బ్రహ్మపుత్రులలో నమిత తేజస్వియై ప్రకాశించుచున్నకుమారుని నామధేయమే భృగు వయ్యెను. ఆవిర్భ వింపగనే యత్యంత తేజోయుక్తుడై యరుణవర్ణము కల్గి ఘోరతప మాచరించి తపస్తేజముతో బ్రజ్వరిల్లుచున్నబ్రహ్మపుత్రుడు అరుణ యనునామమున విఖ్యాతి గాంచెను. ఏయోగికి యోగబలమువలన హంస (శ్వాసలు) యాతని యధీనమై యుండునో, యాపరమయోగీంద్రుడైన బ్రహ్మసంభవుడైనబాలకుడు హంసి యనునామమున విఖ్యాతిగాంచెను. తత్కాలమున బ్రహ్మకు సంభవించిన బాలకుడు వశీభూతుడై, శిష్యుడై విధాత కత్యంతప్రీతిపాత్రుడై నశిష్ఠు డను నామమున గణుతికెక్కెను. ఏబాలకుడు తపమందే సదా సంలగ్నుడై, సర్వ కర్మములందు సంయతుడైయుండునో యతనియొక్క యాగుణములవలన యతి యనబడెను. వేదములందు పుల యను శబ్దమునకు దపమని యర్థము. 'హ' యనగా స్ఫుట మని యర్థము. ఏబాలకునందు స్ఫుటరూపముతో దపస్సమూ హములు లక్షితములై యున్నవో యాలక్షణములవలననే యాబాలకుని పులహు డనిరి. (పుల యనగా నర్థము తపస్సమూహము, స్త్యయనగా నర్థము ఆస్తి) ఏబాలకుడు పూర్వజన్మమందు తపస్సమూహ యుక్తుడో యాకారణము వలననే తపస్సంఘస్వరూపుడైనబ్రహ్మపుత్రుడు పులస్త్యుడనునామమున విఖ్యాతిగాంచెను. త్రి శబ్దమునకు త్రిగుణమయమైనప్రకృతి యని యర్థము. 'అ' శబ్దమునకు విష్ణు వని యర్థము. ఎవనికి వీ రిద్దరియందు సమానభక్తి గలదో యాబ్రహ్మకుమారునే 'అత్రి' యనిరి. ఎవనిమస్తకముపై దపస్తేజ మున బ్రకటితములైనయగ్నిశిఖలవంటి పైడుజటలు కలవో యాబ్రహ్మసంభ వునినామము పంచశిఖ యయ్యెను. ఏపుత్రుడు రెండవజన్మమం దాన్తరికాంధ కారరహితప్రదేశములో దపమొనర్చెనో యాబ్రహ్మకుమారునినామము 'అపాన్తరతమ' యనబడెను. ఏపుత్రుడు తాను దపమొనర్చుచు నితరులకు గూడ దపశ్శక్తిని బ్రసాదించుచు దపముయొక్క భారమును భరించుటలో

బూర్ణసమర్థుడైయున్నందున నాతని 'ఓఘు' డనిరి. మునీశ్వరులారా! ఏ బాలకుడు తపస్తేజముతో దీప్తిమంతుడై తపమునందే రుచి గల్గియుండెనో వానిని 'రుచి' యనిరి. ఎవరు బ్రహ్మయొక్క క్రోధసమయమున బ్రాదుర్భవించి రోదింప దొడంగిరో వారు రోదనకారణమున 'రుద్రు' లనబడిరి. వారి సంఖ్య పదునొకండు.

ఎవనియందు సత్త్వగుణప్రధానత కలదో యాభగవంతుడు విష్ణువు, సర్వపాలకుడు. రజోగుణప్రధానత గలవాడే బ్రహ్మ, అతడే సృష్టికర్త, ఎవరియందు దమోగుణ ప్రధానతగలదో వారినే రుద్రులనిరి. వారివేగమును శాంతింపజేయుట యసాధ్యము. వారు మహాభయంకరులు. వారియం దొకని నామధేయమే కాలాగ్నిరుద్రుడు. అతడు శంకరుని యంశము. కాలాగ్నిరుద్రుడే జగత్సంహారకుడు. శుద్ధసత్త్వస్వరూపు డైన శివుడుమాత్రము సత్పురుషులకు గళ్యాణప్రదాత యని, రజోగుణయుక్తుడు గాడని గ్రహింపుడు. ఏకాదశ రుద్రులుమాత్రమే తమోగుణసంపన్నులు. కాలాగ్నిరుద్రుడుతప్ప మిగిలిన రుద్రులు శ్రీకృష్ణుని కళాంశములే. కేవలము విష్ణువు, శంకరుడు పరిపూర్ణతము డైనశ్రీకృష్ణభగవానునియొక్క రెండుప్రధానాంశములు. వీరిర్వురు సమానసత్త్వస్వరూపులు. సనకుడు బ్రహ్మకు బ్రథమపుత్రుడు, సనందనుడు ద్వితీయుడు, సనాతనుడు తృతీయుడు. సనత్కుమారుడు చతుర్థపుత్రుడు. బ్రహ్మ వీరిని సృష్టింపవలసినదిగ నాదేశించినను వీరు బ్రహ్మయాజ్ఞను సరకుగొనక శ్రీకృష్ణునిచరణారవిందముల నాశ్రయించి తపోధనులైరి. ఆసమయమున బ్రహ్మ కోపింపగ ఆయన లలాటమునుండి యేకాదశరుద్రు లుత్పన్నులైరి. సనక, సనందన శబ్దము లానందమునకు వాచకములు. ఆయిర్వురు బాలకులు భక్తిభావముతో బరిపూర్ణులై సదా యానందించుచుండెదరు. అందువలననే వారినామధేయములు సనకసనందను లయ్యెను. నిత్యపరిపూర్ణతము డైనశ్రీకృష్ణభగవానుడే సనాతనపురుషుడు. ఆయన భక్తుడాయనతో సమానుడే. అందువలన గృష్ణభక్తు డైనమూడవబాలకుడు సనాతనుడని విఖ్యాతిగాంచెను. 'సనత్' అనగా నిత్యము, 'కుమార' అనగా శిశువు. నిత్యము శైశవావస్థతో నుండుటవలన నానాల్గవకుమారునకు సనత్కుమారుడని బ్రహ్మ నామకరణముచేసెను. మునీశ్వరులారా! మీకు నేను

బ్రహ్మకుమారుల నామములయొక్క వ్యుత్పత్తులను వివరించితిని. ఇపుడు క్రమముగ నారదోపాఖ్యానము నవధరింపుడు.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండములోని బ్రహ్మపుత్రవ్యుత్పత్తి
కథన మను ఇరువదిరెండవ
అ ధ్యా య ము
సంపూర్ణము.

—♦—

## ఇరువదిమూడవ అధ్యాయము

### సృష్టికై బ్రహ్మవలన దారపరిగ్రహప్రేరణను బొంది భయబడిననారదుడు స్త్రీసంగ్రహణము దోష మనిచెప్పి తపముచేయ వర ము డు గు ట.

**సౌతి పలికెను :**

సృష్టికర్త యైనబ్రహ్మ తనకుమారుల నందఱను సృష్టికార్యమందు విని యోగించి వేదవేదాంగపారంగతుడు, విద్వాంసుడు నగునారదుని గాంచి మధుర వచనములతో నిట్లుపల్కెను.

**బ్రహ్మ పలికెను :**

బ్రహ్మకుల శ్రేష్ఠుడా! కుమారా! నారదా! రమ్ము, నీవు జ్ఞానదీపశిఖతో నజ్ఞానాంధకారమును నివారింపగల సమర్థుడవు. జన్మదాత యైనతండ్రియే పరమగురువని నీకు దెలియనిది కాదు. వందనీయపురుషులందు దండ్రిశ్రేష్ఠుడు. విద్యాదాతయు, మంత్రదాతయు నిర్వురు సమానులని గ్రహింపుము. వీరు తండ్రికంటె నధికవందనీయులు. కుమారా! నేనే నీతండ్రిని, పాలకుడను,

విద్యాదాతను, మంత్రదాతను. కావున నీవు నాయాజ్ఞను పాలించి నన్ను సంతోష పెట్టుటకు వివాహమాడుము.

బ్రహ్మదేవుని యాదేశము నాలకించి నారదుడు భయభీతుడై తండ్రితో నీవిధముగా బల్కెను.

## నారదుడు పలికెను :

స పితా స గురు ర్బన్ధుః స పుత్రః స మదీశ్వరః ।
యః శ్రీకృష్ణపాదపద్మే ధృఢాం భక్తిం చ కారయేత్ ॥

"తండ్రీ! ఎవరు శ్రీకృష్ణభగవానుని చరణారవిందములయందు సుదృఢ భక్తిని గలిగింతురో వారే తండ్రి, గురువు, బంధువు, పుత్రులు. వారే యీశ్వరసములు." బాలకు డజ్ఞానవశమున కుమార్గగామియైనచో వాని నామార్గము నుండి తప్పించి సన్మార్గమున ప్రవేశపెట్టువాడే కరుణానిధియైనతండ్రి. శ్రీకృష్ణునిచరణారవిందములయందు లగ్నమైన భక్తిని త్యాగమొనరింపజేసి కుమారుని ప్రాపంచికవిషయములయందు ప్రవృత్తునిగావించువాడు తండ్రియైనను నాదరణీయుడు గాడు. అట్టివాడు తండ్రి యెట్లుకాగలడు? స్త్రీసాంగత్యము కేవలము దుఃఖములకు మూలకారణము. స్త్రీనుండి నిజమైనసుఖము లభింపదు. అట్టి స్త్రీసాంగత్యము తపమునకు, నుత్తమలోకములకు, భక్తికి, ముక్తికి, సత్కర్మలకు విఘ్నములను గలుగజేయును. బ్రహ్మదేవా! మూఢచిత్తులైన గృహస్థుల గృహములందు త్రివిధ స్త్రీలు కలరు. వారినే సాధ్వి, భోగ్య, కులట యందురు. వీ రందఱు నిశ్చయముగ స్వార్థపరాయణలే. సాధ్వియైన స్త్రీ పరలోకవాంఛవలన నిహలోకమం దపకీర్తిభయముచే నిరంతరముభక్తితో భర్తను సేవించును. భోగ్యయైనస్త్రీ భోగముల నభిలషించుచు కేవలము కామాసక్తితోనే తనప్రియతము డైన పతిని సేవించును. భోగములు లేనిదే భోగ్యస్త్రీ గుణమైనను భర్తను సేవింపదు. తానుగోరిన వస్త్రములు, భూషణములు, ఉత్తమపదార్థములు సంభోగసంతృప్తి లభించునంతవఱకే భోగ్యస్త్రీ భర్తకు వశమై యాతని ప్రేమించి సేవింపగలదు. కులటయైనస్త్రీ కులమున కంతకు ప్రమాదమొనరింపగల యగ్నికణమువంటిది. కులనాశకురాలైన కులటాస్త్రీ కపటముతోనే భర్తను సేవించునుగాని భక్తితో గాదు. ఆమె కేవలము స్వార్థసిద్ధికొఱకుమాత్రమే సాధువువలె నటించుచు మధురవచనములను

బలుకుచుండును. క్రోధించినపు డామె సహజగుణము బయల్పడగలదు. ఆమె విషతుల్యము లైన దుస్సహముల్లైన కటువచనములతో భర్త మొదలైనబంధు వర్గమును దీవ్రముగ బాధింపగలదు. అట్టిస్త్రీ మధురవచనములను విశ్వసించిన పురుషుడు సర్వనాశనము నొందగలడు. కులటాస్త్రీల యభిప్రాయముల నర్థము జేసికొను టత్యంతకఠినము. వారి కుకర్మము లన్నియు బరమగూఢములు. సర్వజ్ఞా! నీ కంతయు విదితమే! ఎందువలన ననగ నీవాత్మారాము లైన పురుషులకీశ్వరుడవు. ప్రభూ! ఈదీను ననుగ్రహించి భవబంధనముల బడదోయకుము. నీవు కల్పవృక్షముకంటె శ్రేష్ఠుడవు. నేను నీనుండి కేవలము శ్రీకృష్ణుని యెడల ననన్యభక్తినే యాచించుచున్నాను, దయతో నా కావరమునే యనుగ్రహింపుము.

ఇట్లు నారదుడు తండ్రిచరణారవిందములపై బడి సాష్టాంగప్రణామము లర్పించి మంగళకర మైనతపమాచరించుట కనుజ్ఞ నొసంగుమని ప్రార్థించెను. తదనంతరము నారదుడు బ్రహ్మలోకమును వీడిపోవుట కుద్యుక్తుడయ్యెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణములోని
బ్రహ్మఖండమందలి బ్రహ్మనారద సంవాద
మను ఇరువదిమూడవ
అ ధ్యా య ము
సంపూర్ణము.

——♦——

# ఇరువదినాలుగవ అధ్యాయము

## బ్రహ్మ నారదునకు గృహస్థధర్మ మహత్త్వమును జెప్పి వివాహమునకై యొప్పించుట; నారదుడు తండ్రియాజ్ఞను స్వీకరించి శివలోకమునకు వెడలుట.

**సౌతి పలికెను :**

శౌనకాదిమహర్షులారా! నారదు డాప్రకారముగ దనయభీష్టమును దెలియజేయగా బ్రహ్మ నిరుత్సాహము జెంది కుమారుని గాంచి పల్కెను. "వత్సా! నీయభీష్టానుసారముగ దపమాచరించుటకు వెడలుము. నాకు బ్రేమపాత్రుడ వై ననీసహకారము లేక యీసంసారమును సృష్టించుటవలన నా కేమి ప్రయోజనము ? నేనుగూడ సర్వేశ్వరేశ్వరు డైన శ్రీకృష్ణపరమాత్మ నాశ్రయించుటకు గోలోకమున కేగెదను. సనక, సనందన, సనాతన, సనత్కుమారులు ప్రప్రథమముననే విరాగులైరి. యతి, హంస, ఆరుణి, ఓఢుడు, పంచశిఖుడు మొదలగువారు తపోధను లైరి. మరీచి, అంగిరసుడు, భృగువు, రుచి, అత్రి, కర్దముడు, ప్రచేతసుడు, మనువుమున్నగువారు మాత్రమే నాయాజ్ఞాను వర్తులై సృష్టికార్యమందు సంలగ్నులైరి. నాసర్వకుమారులయందు కేవలము వశిష్ఠుడే నాయాజ్ఞానువర్తియై యుండును. పై నుదహరించిన పుత్రులుతప్ప మిగిలినవా రందఱు నవివేకు లైరి. కుమారా! ధర్మార్థకామమోక్షము లనెడి, చతుర్విధపురుషార్థములను బ్రసాదించు దివ్యజ్ఞానమును వచించెద శ్రద్ధతో శ్రవణమొనర్చుము.

"వేదప్రణిహితో ధర్మో హ్యధర్మస్తద్విపర్యయః"

"ఏవిధానములు వేదమునందు నిర్ణయింపబడినవో యవియే యాచరణయోగ్యము లైనపరమధర్మములనియు, నిషేధింపబడినవి యధర్మములనియు గ్రహింపవలెను". బ్రాహ్మణు డై జన్మించినవాడు మొదట నుపనయన మొనరించుకొని, యఖండబ్రహ్మచర్యయుక్తుడై వేదాధ్యయన మొనరింపవలెను. అధ్యయనము సాంగోపాంగముగ సమాప్త మైనపిదప నత డాచార్యున కుత్తమదక్షిణ నొసంగవలెను. తదనంతరము సత్కులోత్పన్నయై పరమవినీతస్వభావయై, సుగుణశీల యైనకన్యను సహధర్మచారిణిగ జేసికొనవలెను.

ఉత్తమకులోత్పన్నమైన స్త్రీమాత్రమే పరమసాధ్వియై సదా పతిసేవాతత్పర యైయుండగలదు. సన్మార్గులైనజననీజనకులశిక్షణయం దభివృద్ధిగాంచిన స్త్రీ లుద్దండలు కాబోరు. పద్మరాగమణులు లభించుగనిలో గాజుముక్క లెట్లుద్భవింపగలవు ? నారదా! పాపాచారపరాయణు లైనతలిదండ్రులకు జన్మించినస్త్రీలు వారిదోషములవలనే యుద్దండలు కాగలరు. అట్టి దుష్టస్త్రీలు సర్వకర్మములయందు స్వతంత్రలై చరించెదరు. వత్సా! నీవు భావించినట్లు స్త్రీ లందఱు స్వార్థపరాయణలు దుష్టస్వభావయుక్తలు కారు. ఏలయన నుత్తమ స్త్రీలు శ్రీమహాలక్ష్మియొక్క యంశోత్పన్నలు. అప్సరసలయంశతో జన్మించు స్త్రీలే కులటలు కాగలరు. సద్గుణవతి యైనసాధ్వీలలామ గుణహీనుడైనను దనభర్తను భక్తితో సేవించుచు బ్రశంసించుచుండును, కాని కులటాస్త్రీ తన భర్త సద్గుణసంపన్నుడైనను వానిని సేవింపదుసరికదా యతనిని సదా నిందించుచు బాధించుచుండును. అందువలననే సాధుపురుషుడు సుగుణవతి యైనసుశీలనే పరిణయమాడవలెను. తదనంతరము తనయర్ధాంగివలన వంశమును ధన్య మొనరింపజేయగల సత్సంతానమును బడసి విధ్యుక్తధర్మముల నాచరించుచు వృద్ధావస్థయందు దపమునకు వెడలిపోవలెను. అగ్నియందుగాని సర్పముఖము నందుగాని కంటకములపైనగాని నివసింపవచ్చునుగాని దుర్వచనముల బలుకుచు భర్తహృదయమును గాయపఱచుస్త్రీతో నివసించుట యెంతమాత్రము తగదు. అట్టిస్త్రీ అగ్నికంటె, సర్పముకంటె, కంటకములకంటె నధికదుఃఖప్రదాయిని గాగలదు; కుమారా! నేను నీకు వేదముల నుపదేశించి యాచార్యుడనైతిని. ఈసమయమున నీవు నాకు గురుదక్షిణగా వివాహమాడుము. వత్సా! పూర్వ జన్మమున నీ భార్య మాలావతి యిపు డత్యుత్తమకులములో మరల నుత్పన్న యైనది. ఆసాధ్వి నిన్నే భర్తగా బొందవలెనని నిశ్చయించుకొని భారతవర్ష మందు మనువంశోత్పన్ననృపతి యైనసృంజయుని కొమార్తెగా జన్మించి నీ కొఱకే ఘోరతపమాచరించుచున్నది. సాక్షాచ్ఛ్రీమహాలక్ష్మీకళోద్భవయైన యామె పేరే రత్నమాల. ఒక శుభముహూర్తమున నీ వామెను బాణిగ్రహణ మొనరింపుము. దేహధారి యైనవాడు బ్రహ్మచర్యాశ్రమము పూర్తిగావించిన పిదప గృహస్థాశ్రమము స్వీకరింపవలెను. తదనంతరమే పత్నీయుక్తుడై వాన ప్రస్థాశ్రమమును స్వీకరించి యంత్యకాలమున మోక్షముకొఱకు దపోమయమైన సన్న్యాసాశ్రమమును స్వీకరింపవలెను. వేదములయందు దేహధారికీక్రమమే నిర్దేశింపబడెను. వైష్ణవులకు శ్రీహరి యారాధనమే యఖండతపమని శ్రుతులు

వర్ణించినవి. వత్సా! నీవు పరమవైష్ణవుడవు. అందువలన గృహస్థాశ్రమ
మ్మును స్వీకరించి గృహమునం దుండి శ్రీకృష్ణునిచరణకమలములను సదా
యర్చింపుము. నాయనా! ఎవనిలోపల బయట శ్రీహరి విద్యమానుడై
యుండునో అట్టివానికి దపమువలన నేమిప్రయోజనము సిద్ధింపగలదు? లోపల
బయటనంతట వ్యాప్తుడై యున్న శ్రీహరినిగాంచనివానికిగూడ తపస్సువలన నేమి
ప్రయోజనముండును? సర్వత్ర శ్రీహరిని గాంచి, యారాధించు వా రరణ్యముల
కరిగి తపమాచరింప నవసరము లేదు. ఎందువలననగా నఖండతపోముఖ
మునగూడ శ్రీహర్యారాధనయే గావింపబడును. పరమపురుషుడైన శ్రీహరి
దక్క మఱెవ్వరును జీవుల కారాధ్యులు కారు. ఎక్కడనున్న, నేపరిస్థితుల
యందున్నను గేవలము శ్రీహరిసేవయే సర్వోత్తమ మైనతపమని గ్రహిం
పుము. నారదా! అందువలన నీవు నాయాదేశానుసారము గృహస్థువై
స్వధర్మాచరణ మొనరించుచు సదా శ్రీహరిని భజించి సేవింపుము. హరి
భక్తుడైనగృహస్థునకు సర్వదా యనన్యలభ్యసుఖములు ప్రాప్తింపగలవు.
ధర్మపత్నీపరిగ్రహణము హరిభక్తియుత సత్సంతానప్రాప్తికొఱకే. ఎందువలన
ననగ నుత్తమగుణసంపన్నమైన సంతానము శతాధికప్రియపత్నులకంటె జనకున
కధికప్రియము. సర్వులను జయింపవలెనని ప్రగాఢాకాంక్ష కల్గియున్నను
దండ్రులు తమసంతానమువలన బరాజయమునే కాంక్షించెదరు. జనకు
లేప్రియపదార్థములనైన దమకొఱకుగాక తమ సంతానముకొఱకే సంగ్రహిం
తురు. అందువలననే సత్పుత్రుడు జనకున కత్యంతప్రియుడు. తండ్రి ప్రియ
తముడైనతనకుమారునకు దాను సంగ్రహించిన శ్రేష్ఠధనమును, జ్ఞానమును
నర్పించును.

శౌనకాదిమహర్షులారా! ఈవిధముగా నుపదేశమొనరించి బ్రహ్మ నార
దుని గృహస్థాశ్రమమును స్వీకరింపవలసినదిగా నాదేశించెను. జ్ఞానులయందు
శిరోమణియైననారదుడు తండ్రి కిట్లు ప్రత్యుత్తరమొసంగెను. "పితృదేవా!
సర్వజ్ఞుడైన దనకుమారునకు గుమార్గమును బ్రదర్శించు నట్టితండ్రిని గరుణాంత
రంగుడని యెట్లనగలము? బ్రహ్మదేవా! సమస్తసంసారములు బుద్బుదములవలె
నశ్వరములు. జలములపై జిత్రింపబడిన రేఖలవలె సర్వలోకములు మిథ్యలు,
నశాశ్వతములు. శ్రీహరిదాస్యమును విడచి సాంసారికవిషయములకొఱకు
జంచలమగు దుర్లభమైనమానవ జన్మము వ్యర్థమైనట్లే భావింపవలెను.
తండ్రీ! ఈభవసాగరమం దెవ రెవరికి బ్రియతములు? ఎవ రెవరికి బంధువులు?

కర్మమయము లైనతరంగము లుద్భవింపగనే పరస్పరసంయోగము లభింప గలదు. ఆకర్మతరంగములు శాంతింపగనే యొకరినుండి మఱియొకరు విడిపో గలరు. ఎవడు సత్కర్మములను మనచే జేయించునో యతడే నిజమైన మిత్రుడు, తండ్రి, గురువు. మనయందు దుర్బుద్ధుల నుత్పన్న మొనరించువారే మనకు బరమశత్రువులు. అట్టివారు తండ్రియైనను వారిని దండ్రియని యెట్లన గలము ? తండ్రీ! మీయాజ్ఞను బాలించుటయే పరమధర్మము. అదియే సత్యము, మాన్యా! ప్రథమమున నేను నారాయణయతీంద్రునాశ్రమమునకు జని, యామహర్షి దివ్యోపదేశములను బొందిన యనంతరమే మీయాజ్ఞాను సారము పత్నిని బరిగ్రహించెదను.

తండ్రీ! మొదట నాకు నామనోభీష్ట మైనశ్రీకృష్ణమహామంత్రమును, శ్రీకృష్ణతత్త్వజ్ఞానమును, శ్రీకృష్ణగుణనామసంకీర్తనములను బ్రసాదింపుము. తదనంతరము కేవలము మీప్రసన్నతకొఱకే నేను దారను బరిగ్రహించెదను. ఏలయన మనోవాంఛితములు పరిపూర్ణము లైనయనంతరమే యెవరికైనను గర్మాచరణములయందు సుఖము లభింపగలదు.

నారదుని యంగీకారవచనములను విని జ్ఞానవేత్తలయందు శ్రేష్ఠుడైన కమలోద్భవు డత్యంతప్రసన్నుడై నారదకుమారు నీవిధముగ నాదేశించెను. "వత్సా! శంకరభగవానుడే పూర్వజన్మమందు నీకును, నాకును సనాతను డైనగురుబ్రహ్మము. అందువలన సుజ్ఞానుల కాచార్యుడు, కళ్యాణప్రదాతయు, యత్యంతశాంతస్వరూపుడు నగుహరు నాశ్రయించి శ్రీకృష్ణపరమాత్మమంత్ర తత్త్వజ్ఞానములను, శ్రీమన్నారాయణ దివ్యకథాసుధను గ్రహించి బ్రహ్మలోకమునకు దిరిగి రమ్ము".

శౌనకాదిమహర్షులారా! నారదమునీంద్రుడు బ్రహ్మదేవున కనేకప్రణామము లాచరించి శ్రీకృష్ణతత్త్వజ్ఞానార్థియై శివు నాశ్రయించుటకు గైలాసమునకు బయలుదేరెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని బ్రహ్మనారదోక్త
సంసారసుఖాసుఖవర్ణన మను
ఇరువదినాల్గవ అధ్యాయము
సంపూర్ణము.

# ఇరువదియైదవ అధ్యాయము

## నారదునకు పరమేశ్వరుడు దర్శన మిచ్చి వానిని సత్కరించుట; వాని మనో వాంఛాపూర్తికై ధైర్యము చెప్పుట.

**సౌతి పలికెను :**

శౌనకాదిమహర్షులారా! తదనంతరము విప్రవరుడైన నారదు డత్యంత ప్రసన్నచిత్తముతో క్షణములో శివునిమనోహరదివ్యధామమును జేరెను. శివుని కభీష్టమైన యాలోకము ధ్రువలోకమునకుపైన లక్షయోజనముల దూరమున నున్నది. త్రిశూలధారి యైనపరమేశ్వరు డాధారశూన్యమైన యాకాశమందు దనయోగబలముతో, దివ్యరత్నసారముతో నామహాలోకమును నిర్మించెను. ఆలోకము స్వయంప్రకాశమై సదా ప్రకాశించుచుండును. పవిత్రాంతఃకరణులు శ్రేష్ఠసాధకులు, మానివరేణ్యులు నగుమహాత్ములే యాలోకమును దర్శింపగలరు. ఆశ్రేష్ఠధామమునైశాల్య మొకలక్షయోజనములు. విశ్వకర్మసహిత మాశివ లోకమును దనస్వప్నమందుగూడ గాంచియుండడు. కేవలము శివసేవకులైనమహాత్ములు మాత్రమే నిరంతర మాలోకమున నివసించుచుందురు. శివలోకము కోటానుకోట్లసిద్ధులతో, శివపార్షదులతో నిండియుండును. ఆలోకమందు లక్షలకొలదిగ భైరవులు, క్షేత్రపాలకులు నివసించుచుందురు. అసంఖ్యాకనక్షత్రము లాకాశమున ప్రకాశించుచున్నట్లు సుందరములైన కామధేనువు లాలోకమునందు భాసించుచున్నవి. ఈలోకము ప్రాకృతాకాశమునకావల జిన్మయాకాశమునందున్నది. అచట భయమునకు, మృత్యువునకు వార్ధక్యమునకు, రోగములకు, దుఃఖములకు స్థానములేదు.

దూరే సభామణ్డలమధ్యగం శివం దదర్శ శాన్తం శివదం మనోహరమ్ ।
పద్మత్రినేత్రం విధుపంచవక్త్రకం గఙ్గాధరం నిర్మలచన్ద్రశేఖరమ్ ॥

ప్రతప్తహేమాభజటాధరం విభుం దిగమ్బరం శుభ్రమనన్తమక్షరమ్ ।
మందాకినీ పుష్కరబీజమాలయా కృష్ణేతి నామైవముదా జపన్తమ్ ॥

సునీలకణ్ఠం భుజగేన్ద్రమణ్డితం యోగీన్ద్రసిద్ధేన్ద్ర మునీన్ద్రవన్దితమ్ ।
సిద్ధేశ్వరం సిద్ధివిధానకారణం మృత్యుఞ్జయం కాలయమాన్తకారకమ్ ॥

ప్రసన్నహాస్యాస్యమనోహరం పరం విశ్వాశ్రయాణాం శివదం వరప్రదమ్।
సదాఽఽశుతోషం భవరోగవర్జితం భక్తప్రియం భక్తజనైకబంధుమ్ ॥
గత్వాసమీపం మునిరేషశూలినం ననామ మూర్ధ్నా పులకాఙ్కవిగ్రహః ।
వీణాం త్రితన్త్రీం క్వణయన్పునర్జగౌ కృష్ణం స తుష్టావ కలం సుకణ్ఠః ॥

"సభామండలమధ్యభాగమున శాంతస్వరూపుడు, కళ్యాణప్రదాత, మనోహరుడు, పద్మములవంటి నేత్రత్రయముగలవాడు, చంద్రునివంటి ధైదుముఖములుగలవాడు, గంగను ధరించినవాడు, నిర్మలుడైనచంద్రుడు కిరీటముగ గలవాడు, ప్రతప్తమైనసువర్ణమువలె ప్రకాశించు జడలను ధరించినవాడు, విభుడైనవాడు, దిగంబరుడు, శుభ్రుడు, అనంతుడు, అక్షరుడు, ఆకాశగంగలోని పద్మబీజములతో నిర్మితమైనమాలతో శ్రీకృష్ణనామమును నిరంతరము జపించుచున్నవాడు, నీలమైనకంఠముగలవాడు, సర్పహారములచే నలంకృతుడు, యోగీంద్రులచేత, సిద్ధేంద్రులచేత, మునీంద్రులచేత వందితుడు, సిద్ధేశ్వరుడు, సిద్ధవిధానకారణుడు, మృత్యువును జయించినవాడు, కాలాంతకుడు, యమాంతకుడు, ప్రసన్నమగు చిఱునవ్వుచే మనోహరమైనముఖముగలవాడు, శ్రేష్ఠమైనవాడు, ఆశ్రితులకు శుభములను నభీష్టవరములను బ్రసాదించువాడు, శీఘ్రముగ సంతుష్టిచెందువాడు, భవరోగరహితుడు, భక్తప్రియుడు, భక్తులకేకైకబంధువునైన శూలిని దర్శించి పులకాంకితగాత్రుడై నారదమహర్షి సమీపమునకు వెడలి తలవంచి నమస్కరించెను. మూడుతంత్రులు గల్గిన వీణనుమ్రోగించుచు సుమధుర కంఠముతో శ్రీకృష్ణగుణనామసంకీర్తన మొనరింపదొడంగెను".

బ్రహ్మపుత్రుడు, వేదవేత్తలందు శ్రేష్ఠుడు, మానిశిరోమణియు నగునారదముని ఆగమనమునుగాంచి శంకరభగవానుడు యోగీంద్రులతో, సిద్ధేంద్రులతో, మహర్షులతోగూడి నవ్వుచు సింహాసనమునుండి లేచి వేగముగ నారదుని గౌగలించుకొని యాశీర్వదించి ఆసనము నొసంగెను, కుశలములను బ్రశ్నించెను.

తదనంతర మాసదాశివుడు దివ్యరత్నసింహాసనము నలంకరించెను. కాని బ్రహ్మపుత్రుడైననారదు డాసనము నలంకరింపక వినీతుడై నిలువబడి యుండెను. ఆయన భక్తిభావముతో భవున కనేకప్రణామము లర్పించి ముకుళితహస్తుడై స్తుతించెను. గంధర్వరాజు ద్వారమున నొనరింపబడిన శుభప్రదము, వేదోక్తమునైనస్తోత్రముచే స్తుతించి మఱల బ్రణామము లర్పించి

తదుపరి శివుని యాజ్ఞ గైకొని నారదుడు స్వామివామపార్శ్వమున రత్నసింహాసనము నలంకరించెను. జగద్వాంఛలను పూర్ణమొనరించు శివునకు నారదుడు తన మనోభీష్టములను విన్నవించెను. మౌనివర్యుని వచనముల నాలకించి కృపానిధి యైనశంకరుడు కుమారా! నీ కభీష్టసిద్ధి కల్గుగాక! యని పల్కెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములో కైలాసమునకు నారదుడువచ్చుట
యను యిరువదియైదవ అధ్యాయము
సంపూర్ణము.

—♦—

## ఇరువదియాఱవ అధ్యాయము

### బ్రాహ్మణుల యాహ్నికాచార నిరూపణము; భగవత్పూజావిధి వర్ణనము.

**సౌతి పలికెను :**

శౌనకా! దేవర్షి యగునారదుడు శంకరుని శ్రీహరిస్తోత్రకవచమంత్ర పూజావిధానములగూర్చియు, ధ్యానమునుగూర్చియు, తత్త్వజ్ఞానమును గూర్చియు నడిగెను. మహేశ్వరు డాయనకు స్తోత్రకవచమంత్రధ్యానపూజావిధులను, వాని పూర్వజన్మసంబంధజ్ఞానమును నుపదేశించెను. వాని నన్నింటిని బొంది మునిశ్రేష్ఠు డగునారదుడు పూర్ణమనోరథుడయ్యెను. ఆయన శరణాగతవత్సలుడును, తనకు గురువు నగుమహాదేవునకు భక్తిభావముతో బ్రణమిల్లి యిట్లుప్రార్థించెను.

**నారదుడు పలికెను :**

దేవతాశ్రేష్ఠుడ వగుమహాదేవా! నీవు బ్రాహ్మణుల యాహ్నికాచారము (నిత్యకర్మ)లను వివరింపుము, దానివలన ప్రతిదినము స్వధర్మపాలనము నెఱవేరగలదు.

**మహేశ్వరుడు పలికెను :**

ప్రతిదినము బ్రాహ్మముహూర్తమున మేల్కాంచి రాత్రియందు ధరించిన వస్త్రములను త్యజించి శుద్ధవస్త్రములను ధరించి, తన బ్రహ్మరంధ్రమున నున్న సూక్ష్మము, నిర్మలము, గ్లానిరహితము నగుసహస్రదళకమలముపై విరాజిల్లు గురుదేవుని ధ్యానింపవలెను. ధ్యానమున బ్రహ్మరంధ్రస్థిత మగుసహస్రదళ కమలమున గురువు ప్రసన్నముగ నాసీనుడై యున్నట్లుగను, మందహాసముచేయు చున్నట్లుగను, వ్యాఖ్యానముద్రలో నాయన హస్తమున్నట్లును, శిష్యునిపట్ల ఆయన హృదయమున ప్రేమ యున్నట్లుగను, ముఖముపై ప్రసన్నత వ్యాపించి యున్నట్లుగను, శాంతముగ, నిత్యసంతుష్టుడుగనున్నట్లును, పరబ్రహ్మస్వరూపుని గను భావింపవలెను. ఎల్లపుడు నిట్లే ఆయనను ధ్యానింపవలెను, ఆరాధింప వలెను. అనంతరము నిర్మలము, శ్వేతము, సహస్రదళవిభూషితము, విస్తృతము నగుహృదయకమలముపై విరాజిల్లు నిష్టదేవతను ధ్యానింపవలెను. ఏ దేవత కెట్టి ధ్యానము, రూపము చెప్పబడినదో ఆవిధముగనే ధ్యానింప వలెను. గురువు ననుజ్ఞ బొంది సమయోచితము లగుకర్తవ్యముల నాచరింప వలెను. మొదట గురుధ్యానముచేసి నమస్కరింపవలెను, అనంతరము విధ్యుక్తముగ నాయనను బూజింపవలెను. అనంతర మాయన యనుజ్ఞగొని యిష్టదేవతను ధ్యానమొనరింపవలెను, బూజింపవలెను. గురువే దేవతాస్వరూపమును దర్శింపజేయును. ఆయనయే ఇష్టదేవతామంత్రమును, బూజావిధానమును, జపమును నుపదేశించును. గురువు ఇష్టదేవతను దర్శించినాడు, కాని యిష్టదేవత గురువును జూడలేదు. అందువలన గురువు ఇష్టదేవత కంటెను గొప్పవాడు. గురువె బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు, ఆద్యప్రకృతియు (దుర్గాదేవి) చంద్రుడు, అగ్ని, సూర్యుడు, వాయువు, వరుణు, తల్లియు, తండ్రియు, బంధువు, పరబ్రహ్మపరమాత్మయు నై యున్నాడు. గురువుకంటె బూజనీయుడు మఱియెవ్వడును లేడు.

అభీష్టదేవే రుష్టే చ సమర్థో రక్షణే గురుః ।
న సమర్థా గురౌ రుష్టే రక్షణే సర్వదేవతాః ॥ (14)

"ఇష్టదేవత కోపించినచో శిష్యుని లేదా సాధకుని గురువురక్షింపగలడు. కాని గురుదేవుడు కోపించిన సర్వదేవతలు గలసినను ఆసాధకుని రక్షింప జాలరు."

యస్య తుష్టో గురుః శశ్వజ్జయస్తస్య పదేపదే ।
యస్య రుష్టో గురుస్తస్య సర్వనాశశ్చ సర్వదా ॥ (15)

"ఎవనిపై గురు వెల్లపుడు సంతుష్టుడై యుండునో వానికి అడుగడుగున విజయముకలుగును. ఎవనిపై గురుదేవుడు కోపించునో వానికి సర్వనాశము కలుగును".

న సంపూజ్య గురుం దేవం యోమూఢః పూజయేద్భ్రిమాత్ ।
బ్రహ్మహత్యాశతం పాపీ లభతే నాత్ర సంశయః ॥ (16)

"ఏమూఢుడు భ్రమవలన గురువును బూజింపక యిష్టదేవతను బూజించునో వాడు వందలకొలదిబ్రహ్మహత్యాపాపములను బొందును, దీనిలో నెట్టి సంశయమును లేదు".

సామవేదమున భగవానుడగు శ్రీహరిగూడ నిట్లే చెప్పినాడు. అందు వలన గురువు యిష్టదేవతకంటెను మిన్నగ బూజనీయుడై యున్నాడు.

మహామునీ! ఇట్లు గురుదేవుని, ఇష్టదేవతను ధ్యానించి, స్తుతించి సాధకుడు వేదములలో జెప్పబడిన ప్రదేశమునకు వెడలి ప్రసన్నముగ మల మూత్రములను విడువవలెను. జలమును, జలసమీపప్రదేశమును, బిలయుక్తమగుభూమిని, ప్రాణులనివాససమీపభూమిని, దేవాలయప్రాంతమును, వృక్షమూలమును, త్రోవను, నాగటిచే దున్నబడినపొలమును, పంటతోనిండినపొలమును, గోశాలను, నదులను, గుహలోపలిభాగమును, పూలతోటను, బురదతోగూడినభూమిని, గ్రామాదులలోపలిభాగమును, జనులగృహములకు జుట్టుప్రక్కల నున్నప్రదేశమును, శంకువును, సేతువును, రెల్లును, శ్మశానమును, అగ్నిసమీపమును, క్రీడాస్థలమును, మహారణ్యమును, మంచమొక్కక్రిందిభాగమును, వృక్షచ్ఛాయాయుక్తమగుప్రదేశమును, ఆకులు కుప్పలుకుప్పలుగ నున్నభూమిని, పచ్చికబయలును, దర్భపెరిగిన ప్రదేశమును, పుట్టను, చెట్లను

నాటినప్రాంతమును, విశేషకార్యములకై నలంకృతమైయున్న భూమిని విడచి సూర్యుని యొండతగులని ప్రదేశమున గుంటత్రవ్వి దానియందు మలమూత్రములను విడువవలయును.

పగటియం దుత్తరాభిముఖుడై మలమూత్రములను విడువవలెను; రాత్రి వేళ పశ్చిమాభిముఖముగను, సంధ్యాకాలమున దక్షిణాభిముఖముగను గూర్చుండి మౌనియై, పెద్దగశ్వాసతీసికొనకుండగ మలమును విడువవలెను. దానివలన దుర్గంధము ముక్కునకు దగులదు. మలత్యాగానంతరము ఆమలమును మట్టితో గప్పివేయవలెను. తరువాత బుద్ధిమంతుడగువాడు గుదాదులైనయంగములను శుద్ధిచేసికొనవలెను. మొదట మట్టితోను, పిమ్మట జలముతోను మలద్వారమును శుభ్రముచేసికొనవలెను. మృత్తికాయుక్తమగునేజలముపయోగమునకువచ్చునో దానిపరిమాణమును వినుము. మూత్రమును విడచిన పిమ్మట లింగమున కొకమారు మట్టినిపూయవలెను, తరువాతకడుగుకొనవలెను. అనంతరము ఎడమచేతిని నాలుగుమారులు మట్టితో రుద్ది కడుగుకొనవలెను. అటుతరువాత రెండుచేతులను మట్టితో రుద్ది కడుగవలెను. ఇదిమూత్రశౌచమనిచెప్పబడినది. మైథునానంతరము మూత్రమును విడచినచో నాశౌచమును రెండురెట్లుచేయవలెను. మైథునానంతరశౌచము మూత్రశౌచముకంటె నాలుగు రెట్లుండవలెను. మలత్యాగానంతరము లింగమున నొక్కమారు, గుదమున ముమ్మారు, ఎడమచేతియందు పదిమారులు, రెండుచేతులలో నేడు మారులు మట్టిని పూయవలెను. ఆఱవసారి మట్టిని పూసి కడిగినచో పాదశుద్ధియగును. గృహస్థబ్రాహ్మణులు మలత్యాగానంతర మీశౌచము చేయవలెను. యతులు, వైష్ణవులు, బ్రహ్మర్షులు, బ్రహ్మచారులు, గృహస్థులకంటె నాలుగురెట్లు శౌచముచేయవలెను. విధవల కీశౌచము రెండురెట్లే విధింపబడినది. ఉపనయనరహితు డగుద్విజుడు, శూద్రుడు, స్త్రీ తమతమయంగములయం దున్నదుర్గంధము తొలగుటకు వీలైనంతగ శౌచము నాచరింపవలెను. క్షత్రియులకు, వైశ్యులకుకూడ గృహస్థబ్రాహ్మణులతో సమానముగ శౌచము చెప్పబడినది. వైష్ణవాదిమునులకు రెండురెట్లుశౌచము విధింపబడినది. శుద్ధిని గోరువాడు పైనియమములలో దక్కువగగాని

యొక్కవగగావి చేయరాదు. ఏలయన విహితనియమముల నుల్లఘించిన ప్రాయశ్చిత్తమునకు బాత్రులగుదురు.

నారదా! శౌచమునుగూర్చియు, దాని నియమములగూర్చియు జెప్పెదను శ్రద్ధగ వినవలసినది. మట్టితో శుద్ధిచేసినపిమ్మటనే నిజ మగుశుద్ధి యగును. బ్రాహ్మణుడైనను ఈనియమము నుల్లంఘించిన నశుద్ధుడగును. పుట్టమట్టిగాని, ఎలుకలు త్రవ్వినమట్టిగాని, నీటిలోనున్నమట్టిగాని శౌచమున కుపయోగింపరాదు. శౌచక్రియ యైనతరువాత మిగిలినమట్టి, యింటిగోడ నుండి తీసికొనినమట్టి, అలుకుటకు దెచ్చినమట్టిగాని శౌచమునకు బనికిరాదు. దేనిలోబ్రాణులు నివసించుచుండునో ఆమట్టిగాని, చెట్లనుండిపడిన ఆకుల కుప్పలుగల మట్టిగాని, నాగటిచేదున్నబడినప్రదేశములోని మట్టిగాని, కుశ దూర్వాంకురములమూలమునుండి తీయబడినమట్టిగాని, రావిచెట్టుమొదలునుండి తీయబడినదిగాని, శయనవేదినుండి తీయబడినమట్టిగాని పనికిరాదు. నాలుగు త్రోవలుకలియుప్రదేశమునందలి, గోశాలలోని, గోష్పాదమందలి, సస్యస్థలము నందలి, పొలమునందలి, ఉద్యానవనమందలి మట్టిగాని శౌచక్రియకు దగదు.

బ్రాహ్మణుడు స్నానముచేసినను, చేయకపోయినను పైనచెప్పబడిన శౌచాచారమును బాటించినచో శుద్ధుడగును. శౌచహీనుడైనవాడు నిత్యమపవిత్రుడు, సమస్తకర్మల కయోగ్యుడునగును. విద్వాంసుడైన బ్రాహ్మణుడీశౌచాచారమును నిర్వర్తించి ముఖమును శుభ్రముచేసికొనవలెను. మొదట పదునాలుపర్యాయములు పుక్కిలించి ముఖమును శుద్ధమొనరించుకొని తదుపరి దంతకాష్ఠముతో (పండ్లుతోము పుల్ల) దంతములను శుభ్రమొనరించుకొనవలెను. తదనంతరము మఱల పదునాలు పర్యాయములు పుక్కిలించి నోటిని శుద్ధమొనరించుకొనవలెను. నారదా! దంతములను శుభ్రమొనరించుకొనుట కేయేకాష్ఠముల నుపయోగింపవలెనో ప్రవచించెద నవధరింపుము.

సామవేదములోని ఆహ్నికప్రకరణములో శ్రీహరియే స్వయముగ నీకాష్ఠములను వర్ణించెను. ఉత్తరేణు, సింధువారము (వావిలిచెట్టు), మామిడి, కరవీరము (గన్నేరు లేక మద్ది), జాజికాయచెట్టు, దిరిశినచెట్టు, టేకిచెట్టు, జామచెట్టు, పున్నాగము, అశోకము, అర్జునము, క్షీరయుక్తవృక్షము, కదంబము (కడిమిచెట్టు), మాలసిరివృక్షము, పలాశవృక్షము, వేపచెట్టు- వీనికాష్ఠ

ములు దంతధావనమునకు శ్రేష్ఠము లని జెప్పబడెను. రేగిచెట్టు, దేవదారువృక్షము, మందారవృక్షము, బూరుగచెట్టు, కంటకయుక్తము లైన వృక్షము, లతాదులు దంతధావనమునకు నిషిద్ధము లనిజెప్పబడెను. రావి చెటు, ప్రియాలవృక్షము, చింతచెటు, తాటిచెటు, ఖర్జూరచెట్టు, కొబ్బరిచెట్టు మొదలగు వృక్షముల కాష్ఠములను దంతధావనమున కుపయోగింపరాదు. దంతములను నిత్యము శుభ్ర మొనరించు నని మానవుడు సకలశౌచరహితుడు కాగలడు. శౌచహీనుడు సదా యపవిత్రుడై యుండును. అతడు సమస్తకర్మలకు నయోగ్యుడగును. ఇట్లు శౌచాచార పాలన మొనరించి శుద్ధుడైన బ్రాహ్మ ణుడు స్నాన మొనరించి ఉతికిన వస్త్రములను ధరించి పాదప్రక్షాళన మొన రించుకొని, ఆచమన మొనరించి తదుపరి ప్రాతఃకాల సంధ్యావందన మొన రింపవలెను.

త్రిసంధ్యలందు సంధ్యావందన మొనరించు బ్రాహ్మణుడు సకల తీర్థస్నాన పుణ్యమును బొందగలడు. త్రికాలసంధ్య యొనరింపని బ్రాహ్మణు డపవిత్రుడై సకలకర్మల కయోగ్యుడు కాగలడు, దినములో దా నొనరించిన కర్మఫలములను బొందలేడు.

నోపతిష్ఠతి యః పూర్వాం నోపాస్తే యస్తు పశ్చిమామ్ ।
స శూద్రవద్బహిః కార్య సర్వస్మాద్ ద్విజకర్మణః ॥ (౯౩)

ప్రాతస్సాయంసమయములందు సంధ్యావందనము ననుష్ఠింపనివారు శూద్రసములు కాగలరు. వారిని బ్రాహ్మణోచిత కర్మములనుండి వెలివేయ వలెను.

ప్రాతఃకాల మధ్యాహ్న సాయంసంధ్యల బరిత్యజించు ద్విజుడు బ్రహ్మహత్యాపాతకమును, ఆత్మహత్యాపాతకమును బొందగలడు. ఏకా దశీవ్రత మొనరింపనివాడు, సంధ్యోపాసనారహితుడు, శూద్రస్త్రీగామియు నగు బ్రాహ్మణుడు కల్పపర్యంతము కాలసూత్ర మనునరకము ననుభవింప గలడు.

ప్రాతఃకాల సంధ్యోపాసన మొనరించి సాధకుడు గురువునకు, నిష్టదైవము నకు, సూర్యునకు, బ్రహ్మదేవునకు, మహాదేవునకు, విష్ణుదేవునకు, భగవతీ మాయకు, శ్రీమహాలక్ష్మికి, సరస్వతికి ప్రణామము లర్పింపవలెను. తదుపరి

గుడము (బెల్లము)ను, ఘృతము (నెయ్యి)ను, దర్పణమును, మధువు (తేనె)ను సువర్ణమును స్పృశించి సమయానుసారముగ స్నానాదులను నిర్వర్తించు కొనవలెను.

జలాశయములలోను, పుష్కరిణులలోను స్నానమొనరింపవలెను. ఆ సమయమున ధర్మాత్ముడు, విద్వాంసుడు నైనపురుషుడు వానినుండి యైదు పిండముల మట్టిని దీసి వెలుపల వేయవలెను. నదులలో, నదము లలో, తీర్థములలో స్నానమాచరించుట శ్రేష్ఠము. మొదట జలములలో మునిగి లేచి పిమ్మట స్నానార్థమై సంకల్ప మొరింపవలెను. మహాత్ము లైనవైష్ణవులు స్నానవిషయక సంకల్పమును శ్రీకృష్ణప్రీత్యర్థముగ నొనరించు దురు. ఆసంకల్పము సకలపాపములను నశింపజేయు నుద్దేశ్యముతో నొనరింప వలెను. బ్రాహ్మణుడు సంకల్ప మొనరించి తనశరీరముపై మృత్తికను లేపన మొనరించుకొనవలెను. శరీర శుద్ధికొఱకే మృత్తికనలందుకొనవలెను. తదనం తర మీవేదమంత్రమును బఠింపవలెను.

మృత్తికాలేపనమంత్రము :-

అశ్వక్రాన్తే రథక్రాన్తే విష్ణుక్రాన్తే వసున్ధరే ।
మృత్తికే హర మే పాపం యన్మయా దుష్కృతం కృతమ్ ॥

"వసుంధరా! నీపై నశ్వములు నడచుచున్నవి, రథములు పరుగిడు చున్నవి. శ్రీమహావిష్ణువు తనచరణారవిందములతో నిన్నాక్రాంతమొన రించెను (లేదా అవతారకాలమున నీపై ననేక లీలావిహారములనొనర్చెను). మృత్తికామయాదేవీ! నే నొనరించిన దుష్కర్మములవలన గలిగిన పాపమును హరింపుము".

ఉద్ధృతాసి వరాహేణ కృష్ణేన శతబాహునా ।
ఆరుహ్య మమ గాత్రాణి సర్వం పాపం ప్రమోచయ ।
పుణ్యం దేహి మహాభాగే స్నానానుజ్ఞాం కురుష్వ మామ్ ॥

"వందలకొలదిభుజములతో శోభించుచున్న వరహారూపధారి యైన శ్రీకృష్ణు డేకార్ణవజలములనుండి నిన్నుద్ధరించెను. నీవు నా యంగము లపై నారూఢవై నా సమస్తపాపములను దొలగింపుము. జననీ! పుణ్యమును బ్రసాదింపుము. స్నాన మొనరించుటకు నా కనుజ్ఞ నిమ్ము."

తపోధనా! ఇట్లు వేదమంత్రముల నుచ్చరించి నాభివఱకు జలములలో ప్రవేశించి మంత్రోచ్చారణపూర్వకముగా నాలుగుబారలపొడవు వెడల్పుగ మండల మొనరించి దానియందు హస్తమునుంచి తీర్థముల ని ట్లావాహనమొన రింపవలెను.

గఙ్గే చ యమునే చైవ గోదావరి సరస్వతి ।
నర్మదే సిన్ధు కావేరి జలేస్మిన్ సంనిధిం కురు ॥

"ఓ గంగా! యమునా! గోదావరీ! సరస్వతీ! నర్మదా! సింధూ! కావేరీ! మీా రందఱు నీ జలములందు సన్నిధిచేయుడు".

తదనంతరము బుద్ధిమంతుడైనపురుషుడు నలిని, నందిని, సీత, మాలిని, మహాపథ, విష్ణుభగవానుని పాదార్ఘ్యమునుండి ప్రాదుర్భవించిన త్రిపథగామిని యగుగంగ, పద్మావతి, భోగవతి, స్వర్ణరేఖ, కౌశికి, దక్ష, పృథ్వీ, శుభగ, విశ్వకాయ, శివామృత, విద్యాధరి, సుప్రసన్న, లోకప్రసాధిని, క్షేమ, వైష్ణవి, శాంత, శాంతిద, గోమతి, సతి, సావిత్రి, తులసి, దుర్గ, మహాలక్ష్మి, సరస్వతి, శ్రీకృష్ణప్రాణాధికయగురాధిక, లోపాముద్ర, దితి, రతి, అహల్య, అదితి, సంజ్ఞ, స్వధ, స్వాహా, అరుంధతి, శతరూప, దేవహూతిమొదలగు నారీ మణులను స్మరింపవలెను. వీరిని స్మరించినమానవుడు స్నాన మొనరింపక పోయినను పవిత్రుడు కాగలడు. తదుపరి రెండుభుజములమూలభాగమందు లలాటముపైన, కంఠముప్రదేశమున, వక్షస్థలముపైన దిలకమును దిద్దుకొన వలెను.

స్నానం దానం తపో హోమో దేవతాపితృకర్మ చ ।
తత్సర్వం నిష్ఫలం యాతి లలాటే తిలకం వినా ॥

"లలాటమందు దిలకమును ధరింపకున్న వాని స్నానదాన తపో హోమ దేవయజ్ఞ పితృయజ్ఞాది సర్వకర్మములు నిష్ఫలములే కాగలవు".

బ్రాహ్మణుడు స్నానానంతరము తిలకమును బెట్టుకొని, సంధ్యావందన తర్పణాదులను నిర్వర్తింపవలెను. తదుపరి భక్తిభావముతో దేవతలకు నమ స్కరింపవలెను. ఉతికిన వస్త్రములను ధరించి దేవాలయమునకు బోవలెను. సాక్షాత్తుగ శ్రీహరి ప్రవచించిన విషయమునే వర్ణించుచుంటిని. స్నానశుద్ధిలేక, పాదప్రక్షాళన మొనరింపక దేవాలయమును బ్రవేశించువానిజపహోమ తపాదులన్నియు నశించును. జలములలోదడిసినవస్త్రములతోను లేదా

నూనెలోదడిసిన వస్త్రములతోను గృహమును బ్రవేశించు గృహస్థుపై లక్ష్మి కోపించి భయంకరశాప మొసంగి యాగృహమును వీడి వెడలిపోవును. మోకాళ్ళపై వలువ గడుగుకొన్న బ్రాహ్మణుడు గంగాదర్శనపర్యంతము చండాలుడై యుండగలడు.

బ్రాహ్మణోత్తమా! పవిత్రుడై నసాధకు డాసనముపై గూర్చుండి ఆచమన మొనరింపవలెను. పిమ్మట సంయమపూర్వకముగ భక్తిభావముతో వేదోక్త విధితో నిష్టదైవమును బూజింపవలెను. సాలగ్రామములోను మణిలోను, మంత్రములోను, ప్రతిమలోను, జలములలోను, స్థలములోను, గోపృష్ఠభాగము పైన, గురువులోను, సద్బ్రాహ్మణునిలోను శ్రీహరిని బూజించుట శ్రేష్ఠము. శిరముపై సాలగ్రామోదకమును సంప్రోక్షణ మొనరించుకొనువారికి సర్వతీర్థ స్నానయజ్ఞదీక్షాగ్రహణాది ఫలములు లభించును. ప్రతిదినము భక్తిభావ ముతో సాలగ్రామోదకమును పాన మొనరించు మానవుడు జీవన్ముక్తుడై యంత్యకాలములో శ్రీకృష్ణధామమును జేరగలడు.

నారదా! సాలగ్రామశిలాచక్రమువిరాజిల్లు ప్రదేశములో నిశ్చయముగ సర్వతీర్థపరివేష్టితుడై సుదర్శనచక్రమును ధరించి శ్రీవిష్ణుభగవానుడు విరా జిల్లును. సాలగ్రామము విరాజిల్లు ప్రదేశములో దెలిసికాని, తెలియకగాని, భాగ్యవశమున మరణించుదేహధారి దివ్యరత్ననిర్మితవిమానము నధిరోహించి శ్రీహరిధామమును జేరును. సాలగ్రామశిలను వీడి అన్యములతో శ్రీహరిని యుపాసించు సాధుపురుషు డెవడుండును ? ఎందువలన ననగ, సాలగ్రామ మున శ్రీహరిని బూజించిన సకల ఫలములు ప్రాప్తించును.

ఇపుడు పూజావిధానము నవధరింపుము. శ్రీహరిపూజ సజ్జనులచే నెల్ల ప్పుడు ప్రశంసింపబడును. ప్రతిదినము వైష్ణవపురుషులు శ్రీహరికి షోడశోప చారముల నర్పించి భక్తిభావముతో నారాధింపవలెను. లేనిచో ద్వాదశోప చారములనైన లేదా పంచోపచారములనైననవిధిగ సాధకుడు శక్త్యనుసారముగ నొనరింపవలెను. పూజకు మూలము భగవద్భక్తి యనియెఱుంగుము. ఆసనము, వస్త్రము, పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, పుష్పము, చంద నము, ధూపము, దీపము, నైవేద్యము, గంధము, మాల్యము, శయ్య, జలము, అన్నము (మహానైవేద్యము), తాంబూలము:– ఇవియే సామాన్యముగ

నర్పింపబడుషోడశోపచారములు. గంధము, మహానైవేద్యము (అన్నము), శయ్య, తాంబూలము నను నీ నాల్గింటిని నొలగించిన ద్వాదశోపచారములు శేషించును. పాద్యము, అర్ఘ్యము, ఆచమనీయము, పుష్పము, నైవేద్యము నివియే పంచోపచారము లనబడినవి. సాధకుడు మూలమంత్రోచ్చారణ మొనరించుచు బైనుదహరింపబడిన ఉపచారములను శక్త్యానుసారముగ నర్పింపవలెను. గురూపదేశముచే బ్రాప్తించిన మూలమంత్రము యొక్క జపము సమస్తకర్మలలో నుత్తమకర్మ యనియెఱుంగుము.

మొదట సాధకుడు భూతశుద్ధిచేసి ప్రాణాయామ మొనరింపవలెను. తదుపరి అంగన్యాసమును, ప్రత్యంగన్యాసమును, మంత్రిన్యాసమును, వర్ణన్యాసమునునొనరించి అర్ఘ్యపాత్రి నుంచవలెను. మొదట త్రికోణాకారమండలమును నిర్మించి దానిలో గూర్మభగవాను నావాహన మొనరించి పూజింపవలెను. తదనంతరము శంఖమును బవిత్రిజలములతో నింపి యాప్రదేశములోనే స్థాపింపవలెను. శంఖమందలి జలములలోనికి బుణ్యతీర్థముల నావాహన మొనరించి పూజింపవలెను. ఆజలములను సకల పూజోపచారద్రవ్యములపై సంప్రోక్షణ మొనరింపవలెను. అనంతరము పుష్పములను గొనికొని సాధకుడు యోగాసనముతో గూర్చుండి గురునుపదేశించినధ్యానానుసారముగ ననన్యభావముతో శ్రీకృష్ణభగవానుని జింతింపవలెను. ఇట్లు ధ్యానించి మూలమంత్రోచ్చారణ మొనరించుచు నారాధ్యదైవమునకు షోడశోపచారములను సమర్పింపవలెను.

తంత్రిశాస్త్రములో నిర్దేశింపబడినట్లు అజ్గ ప్రత్యంగములతో నిరాజిల్లు దేవతలను, శ్రీహరిని బూజింపవలెను. మూలమంత్రిమును యథాశక్తిగ జపించి యిష్టదేవతామంత్రివిసర్జన మొనరింపవలెను. పిమ్మట వివిధములగు నుపహారాదులను నివేదించి స్తుతించి కవచములను బఠింపవలెను. తదనంతరము పృథ్విపై శిరమునుంచి బ్రణామ మొనరింపవలెను. ఇట్లు దేవపూజ సంపన్న మొనరించి బుద్ధిమంతుడు, విద్వాంసుడ నైనబ్రాహ్మణుడు శ్రౌత స్మార్తాగ్నియుక్తమగు యజ్ఞముల ననుష్ఠింపవలెను. మునీశ్వరా! యజ్ఞానంతరము దిక్పాలాదులకు బలి నొసంగవలెను. తరువాత యథాశక్తిగ దాన

మొనరింపవలెను. నే నుదహరించిన యీకార్యక్రమము నంతటిని ముగించిన యనంతరమే పుణ్యాత్ము డైనసాధకు డాహారవిహారవ్యవహారములందు బ్రవృత్తుడు కావలెను. నారదా! ఇట్లు నేను వేదోక్త సూత్రమును, బ్రాహ్మణుల యాహ్నిక కర్మలను నీకు వివరించితిని.

ఇది శ్రీమదాంధ్రబ్రహ్మవైవర్తమహాపురాణమందలి
బ్రహ్మఖండమందలి శివనారదసంవాదములోని
ఆహ్నికనిరూపణ మనునిరువదియాఱవ
అధ్యాయము
సంపూర్ణము.

---

## ఇరువదియేడవ అధ్యాయము

### బ్రాహ్మణుల భక్ష్యాభక్ష్య కర్తవ్యాకర్తవ్య కర్మల నిరూపణము.

**నారదుడు పలికెను :**

దేవా! నీవు సర్వజ్ఞుడవు, సర్వేశ్వరుడవు, సర్వకారణుడవు, కావున గృహస్థబ్రాహ్మణులకు, యతులకు, వైష్ణవులకు, విధవలకు, బ్రహ్మచారులకు నేపదార్థములు భక్ష్యములో, యేవి యభక్ష్యములో, యేవి కర్తవ్యములో, యేవి యకర్తవ్యములో, యేవి భోగ్యములో, యేవి యభోగ్యములో వివరింపవలసినదిగా బ్రార్థించుచున్నాను.

**మహాదేవుడు పలికెను :**

మునీశ్వరా! తాపసు లైనకొందఱు బ్రాహ్మణు లాహారములేకయే చిరకాలము మౌనముగ నుండెదరు. కొందఱు వాయుభక్షణ మొనరించెదరు, మరికొందఱు ఫలాహారమును స్వీకరించెదరు, కొందఱు గృహస్థు లైన బ్రాహ్మణు లర్ధాంగితోగూడి జీవించుచు యథోచితసమయమున నన్నమును

భుజించెదరు. బ్రాహ్మణోత్తమా! రుచుల స్వరూపములు భిన్నభిన్నములుగ నుండును గనుక వారివారి యిచ్ఛానుసారముగ నాహారమును భుజింతురు. గృహస్థులైన బ్రాహ్మణుల కెల్లప్పుడు హవిష్యాన్నమును భుజించుట యుత్తమము. శ్రీమన్నారాయణభగవానుని దివ్యప్రసాదమే వారి కభీష్టభోజనము. భగవంతునకు నివేదింపనిపదార్థ మభక్షణీయములగును. శ్రీవిష్ణుభగవానున కర్పింపని యన్నము మలముతో సమానము, జలము మూత్రముతో సమము నని గ్రహింపుము. ఏకాదశీ దినమున నన్నపానీయములను స్వీకరింపరాదు. ఏకాదశీదినమున స్వేచ్ఛాచారియై నన్నమును భుజించు బ్రాహ్మణుడు పాపమును బొందగలడనుటలో సంశయములేదు. నారదా! ఏకాదశీదినమున గృహస్థుడైన బ్రాహ్మణు డన్నమును భుజింపరాదు, భుజింపరాదు, భుజింపరాదు. శ్రీకృష్ణజన్మాష్టమీదినమున, శ్రీరామనవమీదినమున, శివరాత్రిదినమున నన్నమును భుజించు మానవుడు ఘోరపాపమునకు గుఱికాగలడు.

ఉపవాసాసమర్థశ్చ ఫలమూలజలం పిబేత్ ।
నష్టే శరీరే న భవేదన్యథా చాత్మఘాతకః ॥
సకృద్ భుక్త్వా హవిష్యాన్నం విష్ణోర్నైవేద్యమేవ చ ।
న భవేత్ ప్రత్యవాయీ స చోపవాసఫలం లభేత్ ॥

ఉపవాస మొనరించుటలో నసమర్థుడైనవాడు ఫలమూలములను, జలమును గ్రహింపవచ్చును. అట్లుగ్రహింపక యుపవాసకారణమున శరీరమునష్టము కాగా మనుష్యు డాత్మహత్యాపాపమునకు గుఱికాగలడు. వ్రతదినమున నొక పర్యాయము హవిష్యాన్నమును భుజించినను లేదా శ్రీవిష్ణుభగవానుని నైవేద్యమును భక్షించినను వ్రతికి అన్నము భుజించిన పాపము కలుగదు. ఆతడు సమస్తోపవాసఫలమును బొందును.

నిత్యనైవేద్యభోజీ యః శ్రీకృష్ణోః స హి వైష్ణవః ।
నిత్యం శతోపవాసానాం జీవన్ముక్తఫలం లభేత్ ॥ (16)

"శ్రీకృష్ణభగవానుని నైవేద్యమునే నిత్యము భుజించు వైష్ణవపురుషునకు నిత్యము నూఱు ఉపవాసవ్రతము లొనరించిన ఫలము సంప్రాప్తించును. అతడు జీవన్ముక్తుడు కాగలడు".

సర్వతీర్థములు, దేవతలు, నామహాత్ముని యంగములను స్పృశింపవలెనని యభిలషించుచుందురు. ఆయన దర్శనము, ఆయనతోడివార్తాలాపము మాన

వుల సమస్తపాపములను నశింపజేయగలవు. నారదా! గృహస్థులకు, వైష్ణవులకు, శైవులకు, శాక్తేయులకు, యతులకు, బ్రహ్మచారులకు శ్రీకృష్ణభగవానుని నైవేద్యమే భోజనమైయున్నది. యతులు, విధవలు, బ్రహ్మచారులు తాంబూలమును సేవింపరాదు.

నారదా! సమస్త బ్రాహ్మణుల కేపదార్థము లభక్ష్యములో వర్ణించెద నవధరింపుము. రాగిపాత్రలో పాలుద్రాగుట, యెంగిలిపాత్రలలోను లేదా యెంగిలియన్నములోను నేతిని గలిపి భుజించుట, ఉప్పును గలిపి పాలుద్రాగుట గోమాంసభక్షణముతో సమమని చెప్పబడెను. కంచుపాత్రలోని జలములను ద్రాగువాడు, నిలువబడి యెడమచేతితో జలమును ద్రాగువాడు సురాపానము జేసినవా డగును. అట్టివానిని సకలధర్మములనుండి బహిష్కృతునిగ నొనరింపవలెను. మునీశ్వరా! శ్రీహరికి నివేదింపని యన్నము, భుజింపగా మిగిలిన యన్నము, త్రాగగా మిగిలిన నీరు సర్వథా నిషిద్ధములు. కార్తికమాసములో వంకాయలు, మాఘమాసములో దుంపకూరలు, శ్రీహరి శయనకాలమున (నాలుగు మాసములలో) తీగబచ్చలిని బూర్తిగవిడువవలెను. శ్వేతవర్ణతాలము, మసూరము (ఒకవిధ మగుపప్పుదినుసు), మత్స్యము సర్వదేశములలోను బ్రాహ్మణులకు త్యాజ్యములు. పాడ్యమినాడు కూష్మాండమును భుజింపరాదు, ఏలయన ఆదినమున నది యర్థమును నాశనముచేయును. విదియనాడు బృహతిని (వాకుడుకాయను లేదా ములగకాయను) భుజించినచో దానిదోషమునుండి ముక్తుడగుటకు శ్రీహరిని స్మరింపవలెను. తదియనాడు పటోలము (దొండకాయవంటి కాయకూర) శత్రువులను వృద్ధిచేయును. అందువలన దానిని తినరాదు. చవితినాడు భుజించిన ముల్లంగి ధననాశముచేయును. పంచమినాడు బిల్వమును (మారేడును) దినిన కళంకము కలుగును. షష్ఠినాడు వేపాకును నమలినను, వేపపండును దినినను, లేదా వేపపుల్లను నోటిలో బెట్టుకొనినను ఆపాపమువలన మనుష్యుడు పశుపక్షులలో జన్మింపవలసివచ్చును. సప్తమినాడు తాటిపండును దినిన నది రోగమును వృద్ధిచేయును, శరీరమును నాశముచేయును. అష్టమినాడు కొబ్బరికాయను దినిన బుద్ధినాశనమగును. నవమినాడు సొరకాయ, దశమినాడు తీగబచ్చలి పూర్తిగ విడువదగినది. ఏకాదశినాడు తంబతీగ, ద్వాదశినాడు పూతిక (కొమ్మనగొట్టెపిండిచెట్టు)ను, త్రయోదశినాడు వంకాయను దినినచో బుత్రనాశనము కలుగును. మాంసమందలకును వర్జితమే.

పార్వణశ్రాద్ధమునందు, వ్రతమునాడు ప్రాతఃకాలిక స్నానసమయమున ఆవనూనెను, కాగబెట్టిననూనెను ఉపయోగించినచో మిగులయుత్తమము. అమావాస్య, పూర్ణిమ, సంక్రాంతి, చతుర్దశి, అష్టమి తిథులలోను, ఆదివారము నాడు, శ్రాద్ధవ్రతాదులలోను స్త్రీసాంగత్యము, నువ్వులనూనె పనికిరాదు. సర్వవర్ణములవారికి పగటియందు తనభార్యతోగూడ సంభోగముకూడదు. రాత్రియందు పెరుగుభుజించుట, పగటియందు రెండుసంధ్యలలోను నిద్రించుట, రజస్వలస్త్రీని సంభోగించుట అనునవి నరకమును బొందించును. రజస్వల, కులట పెట్టునన్నమును భుజింపరాదు.

బ్రహ్మర్షీ! శూద్రస్త్రీతో సంబంధముగల బ్రాహ్మణుని యన్నమును గాని, వడ్డీవ్యాపారియొక్క, గణకునియొక్క అన్నమునుగాని తినరాదు. అగ్రదానియైనబ్రాహ్మణునియొక్క, చికిత్సకునియొక్క అన్నమును దినరాదు. అమావాస్యనాడు,కృత్తికానక్షత్రకాలమున బ్రాహ్మణులకు క్షురకర్మనిషిద్ధము. మైథునముచేసి దేవతలకు, పితృదేవతలకు దర్పణముచేసినచో నాజలము రక్తమువంటిదగును. అట్లు తర్పణ మొనరించిన బ్రాహ్మణుడు నరకమును బొందును. నారదా! కర్తవ్యాకర్తవ్యములనుగూర్చియు, భక్ష్యాభక్ష్యములను గూర్చియు నీకు వివరించితిని.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని భక్ష్యాభక్ష్యాదివివరణ
మను నిఱువదియేడవ అధ్యాయము
సంపూర్ణము.

# ఇరువదియొనిమిదవ అధ్యాయము

## పరబ్రహ్మపరమాత్మస్వరూప నిరూపణము.

**నారదుడు పలికెను :**

జగన్నాథా! జగద్గురూ! నీకృపవలన సర్వమును శ్రవణము జేసితిని. దేవా! నీవు పరబ్రహ్మ స్వరూపమును బ్రహ్మతత్త్వమును నిరూపింపవలసిదిగ బ్రార్థించుచున్నాను.

సర్వేశ్వరా! బ్రహ్మము సాకారమా? నిరాకారమా? ఆయనకు విశేషణములు కలవా? లేక యాయన నిర్విశేషుడ? బ్రహ్మమును నేత్రములతో దర్శింపగలమా? దర్శింపలేమా? బ్రహ్మము సమస్తదేహధారులయందు లిప్తుడా? లేక నిర్లిప్తుడా? ఆయన సర్వలక్షణములను వర్ణింపుము. వేదములందు బ్రహ్మ మేప్రకారముగ నిరూపింపబడెను? ప్రకృతి బ్రహ్మమున కతిరిక్తయా? లేక బ్రహ్మస్వరూపిణియా? శ్రుతులయందు బ్రకృతిలక్షణము లేప్రకారముగ వర్ణింపబడినవి? సృష్టికార్యమున బ్రహ్మ, ప్రకృతులిర్వురిలో నెవరు బ్రధానులు? సర్వజ్ఞా! ఈవిషయము లన్నింటిని నా కవశ్యముగ నుపదేశింప బ్రార్థించుచున్నాను.

**సౌతి పలికెను :**

శౌనకాదిఋషులారా! నారదుని యీపరమాద్భుతప్రశ్నముల నాలకించి పంచముఖుడైనమహాదేవుడు అట్టహాసముచేసి పరబ్రహ్మతత్త్వనిరూపణ ప్రకరణమును బ్రవచింప నారంభించెను.

**మహాదేవుడు పలికెను :**

వత్సా! నారదా! నీ వేయేప్రశ్నములను బ్రశ్నించితివో యవియన్నియు నుత్తమగూఢజ్ఞానవిషయములు. వేదములందుగూడ నీగూఢజ్ఞానము పరమదుర్లభము. నేను, బ్రహ్మ, విష్ణువు, ఆదిశేషుడు, ధర్మదేవత, మహావిరాట్పురుషుడు, శ్రుతులు–నీవిషయములను నిరూపణము జేసితిమి. సవిశేష ప్రత్యక్షదృశ్యతత్త్వములను గూడ మేము వేదములందు నిరూపణ మొనరించితిమి. ప్రాచీనకాలమందు వైకుంఠములో నేను, బ్రహ్మ, ధర్మదేవత, శ్రీహరిసమక్షమున నీప్రశ్నలనే బ్రశ్నించితిమి. శ్రీహరి మా కేసమాధానములను బ్రసా

దించెనో వానిని వర్ణించెద నవధరింపుము. శ్రీహరి మాకు బ్రసాదించిన పరమజ్ఞానము, సర్వజ్ఞానతత్త్వములకు సారభూతము, అజ్ఞానాంధకారముతో నంధులైనవారికి జ్ఞాననేత్రరూపము. సనాతన పరబ్రహ్మము పరమాత్మ స్వరూపము. ఆయన దేహధారుల కర్మములకు సాక్షిరూపమున సమస్తశరీరములయందు విరాజమానుడై యుండును. ప్రతిదేహమునందు బంచప్రాణములరూపములో భగవానుడైన విష్ణువు విద్యమానుడై యుండును. మనోరూపమున బ్రజాపతియగుబ్రహ్మ యున్నాడు. సంపూర్ణజ్ఞాన (బుద్ధి) రూపమున స్వయముగ నే నున్నాను. శక్తిరూపమున నీశ్వరీ ప్రకృతియున్నది. మేమందఱము పరమాత్మకు నధీనులమే. శరీరమందాయన యున్నంతకాలము మే ముండెదము. ఆయన వెడలిపోయిన, రాజు ననుసరించు సేవకులవలె మే మందఱము దేహములను వీడి వెడలిపోయెదము. జీవుడు పరమాత్మయొక్క భాగము, ప్రతిబింబమ్మునై యున్నాడు. అతడే కర్మఫలముల ననుభవించును. జలపూర్ణములగు బాత్రలయందు భిన్నరూపములుగ బ్రతిబింబించు సూర్యచంద్రులు ఆ పాత్రలు పగిలిపోయిన నా ప్రతిబింబము లన్నియు సూర్యచంద్రులయందు లీనమగును. అట్లే సృష్టికాలమందు బరమాత్మయొక్క ప్రతిబింబస్వరూపమగు జీవు డుద్భవించును. సృష్టిమయమైన యుపాధి నశించిన ప్రతిబింబస్వరూపమైనజీవుడు మరల సర్వవ్యాపి యైన ఆ పరమాత్మయందు లీనముకాగలడు.

కుమారా! సంసారములు నశించినపిదప నేకమాత్రపరబ్రహ్మమైనపరమాత్మయే శేషింపగలడు. మాతోగూడ నీసర్వచరాచరజగము లాయనయందే లీనములు కాగలవు. ఆపరబ్రహము మండలాకారజ్యోతిఃపుంజ స్వరూపము. గ్రీష్మఋతువునందు మధ్యాహ్నసమయమున బ్రకాశించు కోటానుకోట్ల సూర్యులప్రకాశమును మించి యాజ్యోతిఃపుంజము ప్రకాశించుచుండును. ఆ జ్యోతి యాకాశముకంటె మహావిస్తృతము, సర్వత్రవ్యాపకము, నిత్యము. యోగిజనుల కా తేజము చంద్రునివెన్నెలవలె సుఖపూర్వకముగ దర్శనమును బ్రసాదించును. మహాయోగు లాపరిపూర్ణతేజస్స్వరూపమునే సనాతన పరబ్రహ్మ మందురు. వా రహర్నిశ మాసర్వమంగళమయమైన, సత్యస్వరూప మైన పరమాత్మనే ధ్యానించెదరు. ఆపరమాత్మ నిరీహుడు, నిరాకారుడు, సర్వేశ్వరుడు. ఆయనరూప మాయనయిచ్ఛానుసారము సంభవించును. ఆయన సర్వ

స్వతంత్రుడు, సర్వకారణకారణుడు, పరమానందస్వరూపుడు, పరమానందమున కేకైకప్రాప్తిహేతువు, సర్వోత్కృష్టుడు. ప్రధానపురుషుడు, పురుషోత్తముడు, ప్రాకృతగుణరహితుడు, ప్రకృతికి సహిత మతీతుడు. ప్రళయసమయమందు సర్వబీజస్వరూపిణి యైనప్రకృతి యాయనయందే లీనమగును. అగ్నియందు దాహశక్తి, సూర్యునందు ప్రభ, క్షీరములందు ధావళ్యము, జలములందు శైత్యము లీనమైయుండునట్లు ప్రకృతి పురుషునియందు లీనమైయుండును. ఆకాశమందు శబ్దము, పృథ్వియందు గంధము నున్నట్లు నిర్గుణమైన ప్రకృతి యున్నది. పరబ్రహ్మము సృష్టికొఱకున్ముఖమైనపు డాయన తనయంశచే బురుషు డనబడును. వత్సా! ఆయనయే గుణములతో, విషయములతో సంబంధ మేర్పఱచుకొని ప్రాకృతుడు, విషమయు డనబడును. త్రిగుణ ప్రకృతి యీ పరమాత్మయందే యుత్కృష్టఛాయారూపిణిగ నంగీకరింపబడి యున్నది. మునీశ్వరా! కుమ్మరి మట్టితో గుండలను నిర్మించుటయందు సమర్థుడైనట్లు ఆబ్రహ్మము ప్రకృతితోనే సృష్టినిర్మాణ మొనరించుటలో సమర్థుడు కాగలడు. స్వర్ణకారుడు సువర్ణముతో నాభరణములను జేయు సామర్థ్యము కల్గియుండు నట్లు పరమేశ్వరు డుపాదానభూత మైనప్రకృతితో సదా సృష్టి యొనరించుటలో సమర్థుడు కాగలడు. ఏవిధముగ కుమ్మరి మట్టిని నిర్మింపడో మట్టి యతనికి నిత్యసనాతనపదార్థమో, యేవిధముగ స్వర్ణకారుడు సువర్ణమును సృష్టింపడో, సువర్ణ మాతనికి నిత్యవస్తువో యాప్రకారముగనే యాపరబ్రహ్మము, ఆప్రకృతియు నిత్యమే యనబడును. అందువలననే సృష్టియందు వా రిద్దరకు సమానరూపమున ప్రధానత కలదు. కుమ్మరి, స్వర్ణకారుడు స్వయముగ మట్టిని, సువర్ణమును నుత్పన్నముచేయజాలనట్లు మట్టి సువర్ణములు కూడ కుమ్మరిని, స్వర్ణకారుని దీసికొని రాజాలవు.

నారదా! ఈవివేచనమువలన బ్రహ్మము ప్రకృతి కతీతుడని స్థిరీకరింప వచ్చును. ఈ విషయమునే దృష్టియం దుంచుకొని ప్రకృతి, బ్రహ్మము వీ రిద్దరు నిశ్చితరూపముగ నిత్యములని ప్రతిపాదింపబడెను. కొందఱు విద్వాంసులు స్వయముగ బరబ్రహ్మమే ప్రకృతిపురుషరూపముల ప్రాదుర్భవించెనని నిర్ణయించిరి. కొందఱు ప్రకృతి బ్రహ్మముకంటె భిన్నమందురు. ఆబ్రహ్మము పరంధామస్వరూపము, సర్వకారణ కారణము. ఆబ్రహ్మ లక్షణములు శ్రుతులయం దిట్లువర్ణింపబడెను. బ్రహ్మమే సర్వులయొక్క యాత్మయు,

నిర్లిప్తము, సర్వసాక్షియు, సర్వవ్యాపకము, సర్వమునకు నాదికారణము
నై యున్నది. సర్వబీజస్వరూపిణి యైనప్రకృతి యాబ్రహ్మముయొక్క శక్తియే.
ఆమె వలననే యాయన శక్తిమంతు డైనాడు. అందువలన శక్తి, శక్తి
మంతుడు వీరిద్దరు నభిన్నులే. యోగిజను లెల్లపుడు తేజస్స్వరూపమైన నా
పరబ్రహ్మమునే ధ్యానించెదరు, కాని సూక్ష్మబుద్ధియుక్తు లైననా వైష్ణవ
భక్తులాయారాధనము నంగీకరింపరు. ఆవైష్ణవజను లాశ్చర్యమయాఖండ తేజో
మండలమధ్యమున సాకారుడు, సర్వాత్మకుడు, స్వేచ్ఛామయుడు నగుపరమ
పురుషుని మనోహరదివ్యరూపమును దర్శించి, ధ్యానింతురు. కోటానుకోట్ల
సూర్యప్రచండప్రకాశమును మించి యామండలాకార తేజఃపుంజము ప్రకాశించు
చుండును. ఆదివ్య తేజోమధ్యమున నిత్యగోలోకధామము కలదు. ఆమనో
హరలోకము నాల్గువైపులనుండి లక్షకోటియోజనముల విస్తృతమైయుండును.
సర్వశ్రేష్ఠ దివ్యరత్నసారతత్త్వముచే నాలోకము నిర్మింపబడెను. అనేక దివ్య
భవనములతో, గోపాంగనలతో నాలోకము నిండియుండును. పరమభక్తు
లైనవా రాలోకమును సుఖపూర్వకముగ దర్శింపగలరు. చంద్రమండలము
వలె నాలోకమును గోళాకారముగ నుండును. దివ్యరత్నేంద్రసారముచే నిర్మిత
మైనయాధామము పరమాత్మయిచ్ఛానుసారముగ నేయాధారమును లేక
యుండును. ఆనిత్యలోకము వైకుంఠధామమున కూర్ధ్వభాగములో నేబదికోట్ల
యోజనముల దూరములో నుండును. ఆపరంధామములో గోవులు, గోప
కుమారులు, గోపికలు నివసించెదరు. అక్కడ కల్పవృక్షములు కలవు. గోలో
కము రాసమండలముచే మండితమై కామధేనువులచే నిండియుండును. మునీ
శ్వరా! ఆలోకము బృందావనముచే నాచ్ఛన్నమై, విరజానదిచే నావేష్టితమై
యుండును. అచ్చట శతసహస్రశిఖరయుక్త మగుగిరిరాజము గలదు. సువర్ణ
నిర్మితము లైనలక్షకోటిమనోహరాశ్రమములు కలవు. ఎల్లపుడు నాయభీష్ట
ధామ మత్యంతదీప్తిమంతమై, శ్రీసంపన్నమై విరాజిల్లుచుండును. ఆదివ్యలోక
మధ్యభాగములో సహస్రాది చింతామణినిర్మితమందిరసంయుక్త మైనయొక
పరమమనోహరాశ్రమము కలదు. పారిజాతవనము లాయాశ్రమమును బరివే
ష్టించి శోభించుచుండును కౌస్తుభమణిచే నిర్మింబడిన మంగళకలశములచే నా
యాశ్రమము ప్రకాశించుచుండును. ఆ భవనములోని సోపానములు దివ్యవజ్ర
సారతత్త్వనిర్మితములు. మణీంద్ర సారముచే నిర్మితము లైనద్వారబంధము
లపై దర్పణములు దాపడముచేయబడి యుండును. నానావిధము లైనచిత్ర

విచిత్రోపకరణములచే నాయాశ్రమ మలంకృతమైయుండును. ఆదివ్యాశ్రమము నకు బదునాలుసింహద్వారములు కలవు.

ఆదివ్యాశ్రమములో దివ్యరత్ననిర్మితమై, నానావిధవిచిత్రచిత్రములతో జిత్రితమై యున్నరమణీయరత్నసింహాసనముపై సర్వేశ్వరేశ్వరుడైన శ్రీకృష్ణుడు విరాజమానుడై యుండును.

నవీన నీరదశ్యామం కిశోరవయసం శిశుమ్ ।
శరన్మధ్యాహ్నమార్తాణ్డ ప్రభామోచకలోచనమ్ ॥
శరత్పార్వణపూర్ణేన్దు శుభదీప్తిమదాననమ్ ।
కోటికన్దర్పలావణ్య లీలానిన్దితమన్మథమ్ ॥
కోటిచన్ద్రప్రభాజుష్టం పుష్టం శ్రీయుక్తవిగ్రహమ్ ।
సస్మితం మురలీహస్తం సుప్రశస్తం సుమఙ్గలమ్ ॥
పరమోత్తమ పీతాంశుకయుగేన సముజ్జ్వలమ్ ।
చన్దనోక్షిత సర్వాఙ్గం కౌస్తుభేన విరాజితమ్ ॥
ఆజానుమాలతీమాలావనమాలా విభూషితమ్ ।
త్రిభఙ్గభఙ్గ్యసంయుక్తం మణిమాణిక్యభూషితమ్ ॥
మయూరపుచ్ఛచూడం చ సద్రత్నముకుటోజ్జ్వలమ్ ।
రత్నకేయూరవలయ రత్నమంజీరరంజితమ్ ॥
రత్నకుండలయుగ్మేన గణ్డస్థలసుశోభితమ్ ।
ముక్తాపఙ్క్తిసదృశాభదశనం సుమనోహరమ్ ॥
పక్వబిమ్బాధరోష్ఠం చ నాశికోన్నతిశోభనమ్ ।
వీక్షితం గోపికాభిశ్చ వేష్టితాభిః సమన్తతః ॥
స్థిరయౌవనయుక్తాభిః సస్మితాభిశ్చ సాదరమ్ ।
భూషితాభిశ్చ సద్రత్ననిర్మితైర్భూషణైః పరమ్ ॥
సురేన్ద్రైశ్చ మునీన్ద్రైశ్చ మునిభిర్మానవేన్ద్రకైః ।
బ్రహ్మవిష్ణుశివానన్తధర్మాద్యైర్వన్దితం ముదా ॥
భక్తప్రియం భక్తనాథం భక్తానుగ్రహకారకమ్ ।
రాసేశ్వరం సురశికం రాధావక్షస్స్థలస్థితమ్ ॥
ఏవం రూపమరూపం తం మునే ధ్యాయన్తి వైష్ణవాః ।
సతతం ధ్యేయమస్మాకం పరమాత్మానమీశ్వరమ్ ॥
అక్షరం పరమం బ్రహ్మ భగవన్తం సనాతనమ్ ।
స్వేచ్ఛామయం నిర్గుణం చ నిరీహం ప్రకృతేః పరమ్॥

సర్వాధారం సర్వబీజం సర్వజ్ఞం సర్వమేవ చ ।
సర్వేశ్వరం సర్వపూజ్యం సర్వసిద్ధికరం పరమ్ ॥
స ఏవ భగవానాదిర్గోలోకే ద్విభుజః స్వయమ్ ।
గోపవేషశ్చ గోపాలైః పార్షదైః పరివేష్టితః ॥
పరిపూర్ణతమః శ్రీమాన్ శ్రీకృష్ణో రాధికేశ్వరః ।
సర్వాన్తరాత్మా సర్వత్ర ప్రత్యక్షః సర్వగః స్మృతః ॥ (62-65)

నూతనమేఘమువలె శ్యామలవర్ణముకలవాడును, కిశోరావస్థలో నున్న బాలుడును, శరత్కాలమధ్యాహ్నసూర్యుని ప్రభను తిరస్కరించు నేత్రములు గలవాడును, శరత్కాలపూర్ణిమాచంద్రుని శోభను తిరస్కరించుముఖముగల వాడును, కోట్లకొలది మన్మథుల లావణ్యమును తిరస్కరించుసౌందర్యము గల వాడును, కోట్లకొలది చంద్రులశోభతో నొప్పుచున్న శ్రీవిగ్రహము గలవాడును, మందస్మితముఖారవిందుడును, మనోహరుడును, సుప్రశస్తుడును, పరమమంగళ మయుడును, పరమోత్తమమగు పీతాంబరద్వయముచే శోభిల్లువాడును, చందన చర్చితము లైనసవయవములుకలవాడును, రత్నభూషణములచే విరాజిల్లువాడును, ఆజానులంబిత మగువనమాలచేత మాలతీమాలచేత విభూషితుడైనవాడును, త్రిభంగభంగ్యసంయుక్తుడును (మూడువంపులుగలవాడు), మణిమాణిక్యములచే విభూషితుడును మయూరపుచ్ఛము కిరీటమునందుగలవాడును, శ్రేష్ఠము లైన రత్నములచే శోభిల్లుకిరీటముగలవాడును, రత్నమయము లైనభుజకీర్తులచేత కంకణములచేత, నూపురములచేత శోభిల్లువాడును, రత్నకుండలములచే శోభిల్లుచెక్కిళ్ళుగలవాడును, ముత్యములను తిరస్కరించు మనోహరమైన దంతపంక్తిగలవాడును, పండినదొండపండువంటి అధరోష్ఠముకలవాడును, ఉన్నతమైనసాసికగలవాడును, స్థిరమైనయౌవనముకలవాడును, మందస్మితముఖార వింద ముకలవాడును, ఉత్తమరత్నాభరణభూషితలు నగుగోపికలచే బరివేష్టితుడై సాదరముగ వీక్షింపబడువాడును, దేవేంద్రులచేత, మునీంద్రులచేత, నరేశ్వరుల చేత, బ్రహ్మవిష్ణుశివానంతధర్మాదులచేత సానందముగ నమస్కరింపబడు వాడును, భక్తప్రియుడును, భక్తనాథుడును, భక్తానుగ్రహకారకుడును, రాసేశ్వ రుడును, సురసికుడును, రాధావక్షస్థలమునందున్నవాడును, రూపుడును, అరూపు డును నగునాపరమాత్మను వైష్ణవు లీరూపమున ధ్యానింతురు. పరమాత్ముడు, నీశ్వరుడు, అక్షరుడు, పరబ్రహ్మము, సనాతనుడు, భగవంతుడు, స్వేచ్ఛా మయుడు, నిర్గుణుడు, నిరీహుడు, ప్రకృతికతీతుడు, సర్వాధారుడు, సర్వబీజుడు,

సర్వజ్ఞుడు, సర్వరూపుడు, సర్వేశ్వరుడు, సర్వపూజ్యుడు, సర్వసిద్ధిప్రదాతయును నాపరమపురుషుడే మన కందఱకు నిత్యము ధ్యానింపదగినవాడై యున్నాడు. ఆదిపురుషుడగునాభగవానుడే గోలోకమున ద్విభుజరూపమున విరాజిల్లుచుండును. ఆయన గోపవేషమును ధరించి గోపాలపార్షదులచే బరివేష్టితుడై యుండును. పరిపూర్ణతముడు, శ్రీనివాసుడు, శ్రీరాధాప్రాణేశ్వరుడు, సర్వాంతరాత్ముడు, నంతటప్రత్యక్షముగ నుండువాడు, సర్వవ్యాపకుడు నగునాభగవంతుడే శ్రీకృష్ణుడుగా గీర్తింపబడుచున్నాడు.

కృషిశ్చ సర్వవచనో నకారశ్చాఽఽత్మవాచకః ।
సర్వాత్మా చ పరం బ్రహ్మ తేన కృష్ణః ప్రకీర్తితః ॥
కృషిశ్చ సర్వవచనో నకారశ్చాఽఽదివాచకః ।
సర్వాదిపురుషో వ్యాపీ తేన కృష్ణః ప్రకీర్తితః ॥ (65, 66)

"కృష్" అనగా సర్వులు, "ణ" యనగా నాత్మ. ఆపరమాత్మ సర్వచరాచరప్రాణికోటులకు నాత్మయై యున్నాడు. అందువలననే విద్వాంసులాయనను కృష్ణుడని కీర్తించిరి. "కృష్"శబ్దము సర్వమునకు వాచకము, "ణ"శబ్ద మాదివాచకము. ఆసర్వవ్యాపి యైనపరమేశ్వరుడు సర్వులకు నాదిపురుషుడు. అందువలననే పరమభక్తజను లాయనను గృష్ణుడందురు". ఆయనయె తనయొక్క-యంశముతో వైకుంఠమునందు చతుర్భుజధారియైన లక్ష్మీపతిరూపమున విరాజిల్లుచు చతుర్భుజపార్షదులతో బరివేష్టితుడై యుండును. ఆజగత్పాలకుడైన శ్రీమహావిష్ణువే తనకళాంశముచేత శ్వేతద్వీపమందు జతుర్భుజరూపమున రమాపతియై నివసించును. క్షీరసాగరతనయ యైనరమయే విష్ణుదేవుని ప్రియపత్ని. ఈప్రకారముగ నేను నీకు బరబ్రహ్మనిరూపకము లైనసర్వతత్త్వములను బ్రవచించితిని. శ్రీకృష్ణపరమాత్మయే మన కందఱకు బ్రియతముడు, వందనీయుడు, సేవ్యుడు, సర్వదా స్మరణీయుడునై యున్నాడు.

శౌనకాదిమహర్షులారా! ఈవిధముగ శంకరభగవానుడు నారదునకు బరబ్రహ్మతత్త్వజ్ఞానము నుపదేశించెను. తదనంతరము నారదమహర్షి సంతుష్టాంతరంగుడై యనేకస్తోత్రములతో నామహాదేవుని స్తుతించెను. నారదుని ప్రార్థనలవలన సంతుష్టుడైనశివుడు నారదునకు బరిపూర్ణజ్ఞానమును, నభీష్టవరములను బ్రసాదించెను. మహాదేవుని వరమును బొందిన నారదుని ముఖము, నేత్ర

ములు, ప్రసన్నములై వికసించినవి. నారదుడు హరున కనేకప్రణామము లర్పించి యాయన యాజ్ఞ గైకొని పుణ్యమయ మగునారాయణాశ్రమమునకు బయలుదేరెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని పరబ్రహ్మస్వరూపనిరూపణము;
గోలోకవర్ణనము నారదప్రస్థానవర్ణనము
గల ఇరువదియెనిమిదవ
అధ్యాయము
సంపూర్ణము.

—♦—

# ఇరువదితొమ్మిదవ అధ్యాయము

## బదరికాశ్రమమున నారాయణుని నారదుడు ప్రశ్నించుట.

**సౌతి పలికెను :**

బ్రాహ్మణశ్రేష్ఠులారా! మనోవేగముతో దేవర్షియగునారదుడు నారాయణఋషీంద్రుని దివ్యాశ్రమము జేరెను. అనేకమహావృక్షములతోను,మధుర ఫలవృక్షములతోనుగూడి అయ్యాశ్రమముగండుకోయిలల మధురగానములతో బ్రతిధ్వనించుచుండెను. అందు నారాయణఋషీంద్రుని ప్రభావమున క్రూర జంతువులుగూడ సాధువులై చరించును. నారాయణాశ్రమము స్వర్గాదిదివ్య లోకములకంటె నధికమనోహరముగ నుండెను. ఆయాశ్రమమందు యోగులకు సైతము గురుదేవు డైననారాయణఋషీంద్రుడు దివ్యాసన మధిష్ఠించి శ్రీకృష్ణు డైనపరమేశ్వరపరబ్రహ్మమును ధ్యానించుచుండెను. నారదుడు దివ్యతేజస్స్వరూపు డైననారాయణఋషీంద్రునకు సాష్టాంగదండప్రణామము లాచరించి యనేకవిధముల స్తుతించెను. నారాయణఋషి నారదు నాశీర్వ

దించి యాలింగనమొనరించి, కుశలసమాచారములను బ్రశ్నించి యుత్తమాసన మొసంగెను. ఆసనమందు సుఖాసీనుడైన నారదమహర్షి నారాయణఋషి పుంగవు నిట్లు బ్రశ్నించెను.

**నారదుడు పలికెను :**

ప్రభూ! యోగేశ్వరేశ్వరు డైనశంకరభగవానుడు నాకు దివ్యతత్త్వజ్ఞానమును, శ్రీకృష్ణమహామంత్రము నుపదేశించెను. అయినను నామనము తృప్తి చెందకున్నది. ఏదియో యసంతృప్తి నాహృదయము నావహించి నన్ను బాధించుచున్నది. దేవా! నేను జన్మమృత్యుజరావ్యాధులను నాశనమొన రింపగల శ్రీకృష్ణదివ్యగుణమధురలీలాచరితములను వీనులవిందుగ నీనుండి విన గోరుచున్నాను. పవిత్రదివ్యహరికథాశ్రవణము మాత్రమే నాహృదయమునకు, మనమునకు నఖండానందమును బ్రసాదించి పరిపూర్ణ తృప్తి చేకూర్పగలదు. ఋషిపుంగవా! ఈసకలసృష్టి యెవరినుండి యుద్భవించును? అంత్యకాలమం దెవనియందు లయించును? సమస్తకారణములకు గారణభూతు డైనసర్వేశ్వరే శ్వరు డైనశ్రీమహావిష్ణువెవరు? జగత్పతీ! ఆశ్రీహరిరూపము, కర్మములు మొదలగున వెట్లుండును? ఈవిషయముల నన్నింటిని గృపతో నా కుపదేశింప వలసినదిగ నిన్ను వినీతభావముతో బ్రార్థించుచున్నాను.

నారదుని సకలమంగళకరము లైన నీప్రశ్నముల నాలకించి భగవంతుని దివ్యగుణకథావిశేషములను నారాయణఋషీంద్రు డీవిధముగ బ్రవచింప నారంభించెను.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణమందలి
బ్రహ్మఖండములోని నారాయణుని నారదుడు
ప్రశ్నించుట యనునిరువదితొమ్మిదవ అధ్యాయము
సంపూర్ణము.

# ముప్పదియవ అధ్యాయము

## శ్రీమన్నారాయణఋషీంద్రుడు పరమపురుషుడు పరమాత్ముడును నగుశ్రీకృష్ణభగవానుని మహిమను, ప్రకృతిదేవి మహిమను వర్ణించుట.

### శ్రీనారాయణ ఉవాచ :

లమ్బోదరో హరిరుమాపతిరీశశేషా బ్రహ్మాదయః సురగణా మనవో మునీన్ద్రాః ।
వాణీ శివా త్రిపథగా కమలాదికా యా సంచిన్తయేద్భగవతశ్చరణారవిన్దమ్ ॥

శ్రీగణేశ్వరుడు, శివుడు, విష్ణువు, రుద్రుడు, ఆదిశేషుడు, బ్రహ్మాది దేవతలు, మనువులు, మునీంద్రులు, వాణి, పార్వతి, గంగ, లక్ష్మి మొదలగు వారిచే సేవింపబడువాడు భగవంతుడు నగుగోవిందుని దివ్యచరణారవిందములనే చింతింపవలెను.

సంసారసాగర మతీవ గభీర ఘోరం దావాగ్నిసర్పపరివేష్టితచేష్టితాఙ్గమ్ ।
సంలఙ్ఘ్య గన్తుమభివాఞ్ఛతి యో హి దాస్యం సంచిన్తయేద్భగవతశ్చరణారవిన్దమ్ ॥

అత్యంతగంభీరము, భయంకరము నగుదావాగ్నివంటిసర్పములచే బరివేష్టితమై గిలగిలకొట్టుకొను నవయవములుగలవాడు, సంసారసాగరమును దరింప దలచినవాడు, శ్రీహరిదాస్యసుఖమును బొందగోరువాడు నగుమానవుడు శ్రీకృష్ణుని చరణారవిందములను జింతింపవలెను.

గోవర్ధనోద్ధరణకీర్తిరతీవఖిన్నా భూర్ధారితా చ దశనాగ్రకరేణ క్లిన్నా ।
విశ్వాని లోమవివరేషు బిభర్తురాదేః సంచిన్తయేద్భగవతశ్చరణారవిన్దమ్ ॥

గోవర్ధనపర్వతమును జిటికెనవ్రేలిపై నెత్తి వ్రజభూమిని ఇంద్రుని యాగ్రహమునుండి రక్షించి కీర్తివహించినవాడు, వరాహావతారసమయమున నేకార్ణవజలమందు మునిగిపోవుచున్నపృథ్విని దన దంతాగ్రభాగముతో నుద్ధరించి జలములపై స్థాపించినవాడు, తన రోమకూపములయందసంఖ్యవిశ్వబ్రహ్మాండములను ధరించియున్నవాడు, ఆదిపురుషుడు నగుగోవిందుని చరణారవిందములను జింతింపవలెను,

గోపాఙ్గనావదనపఙ్కజషట్పదస్య రాసేశ్వరస్య రసికారమణస్య పుంసః ।
బృన్దావనే విహరతో వ్రజవేషవిష్ణోః సంచిన్తయేత్భగవతశ్చరణారవిన్దమ్ ॥

గోపాంగనాముఖారవిందమకరందమును గ్రోలుటకు రసికభ్రమరమై బృందావనమందు విహరించువాడు, వ్రజగోపవేషధారియు, శ్రీమహావిష్ణు స్వరూపుడు, పరమపురుషుడు, రసికరమణుడు, రాసేశ్వరుడు నగుశ్రీకృష్ణుని చరణారవిందములను జింతింపవలెను.

చక్షుర్నిమేషపతితో జగతాం విధాత తత్కర్మ వత్స కథితుం భువి కః సమర్థః ।
త్వం చాపి నారదమునే పరమాదరేణ సంచిన్తితం కురు హరేశ్చరణారవిన్దమ్ ॥

వత్సా! నారదా! ఆ దేవాదిదేవుని రెప్పపాటుకాలములో జగత్స్రష్ట యగుబ్రహ్మయొక్క ఆయుర్దాయము పరిపూర్ణమగును. అట్టి భగవానుని దివ్యకర్మలను వర్ణించుట కెవరు సమర్థులు? అందువలన నీవుకూడ నాశ్రీహరి దివ్యచరణారవిందములనే పరమాదరముతో భక్తియుక్తుడవై చింతింపుము.

యూయం వయం తస్య కలాకలాంశాః కలాకలాంశా మనవో మునీన్ద్రాః ।
కలావిశేషా భవపారముఖ్యా మహాన్విరాడ్యస్య కలావిశేషః ॥

నీవు, మేము తత్కళాకళాంశమాత్రులమే. మనువులు, మునీంద్రులు కూడ నాభగవంతుని కళాకళాంశలై యున్నారు. మహాదేవుడు, బ్రహ్మయు ఆయన కళావిశేషములే. మహావిరాట్పురుషుడుకూడ ఆయన విశిష్టకళా మాత్రమే యని తెలిసికొనుము.

సహస్రశీర్షా శిరసః ప్రదేశే బిభర్తి సిద్ధార్థసమం చ విశ్వమ్ ।
కూర్మే చ శేషో మశకో గజే యథా కూర్మశ్చ కృష్ణస్య కలాకలాంశః ॥

సహస్రశీర్షుడగునాదిశేషువు ఆవగింజవలె సమస్తవిశ్వమును దనశిరములనై నిలుపుకొనియున్నాడు, కాని యతడు మహాకూర్మముయొక్క పృష్ఠభాగమున నేనుగుపై నున్నదోమవలె నున్నాడు. ఆకూర్మభగవానుడుగూడ శ్రీకృష్ణుని కళాకళాంశమాత్రుడే.

గోలోకనాథస్య విభోర్యశోఽమలం శ్రుతౌ పురాణే న హి కించనస్ఫుటమ్ ।
న పాద్మముఖ్యాః కథితుం సమర్థాః సర్వేశ్వరం తం భజ పాద్మముఖ్యమ్ ॥

నారదా! గోలోకనాథుడైన శ్రీకృష్ణభగవానుని నిర్మలయశస్సు వేదములలోను, బురాణములలోను కించిన్మాత్రమైనను స్ఫుటముగ వర్ణింపబడ

లేదు. బ్రహ్మాదిదేవతలుగూడ నయ్యాద్యపురుషుడైనభగవంతుని వర్ణించుటకు సమర్థులు కారు. నీ వాసర్వేశ్వరేశ్వరుడైనశ్రీకృష్ణునె ముఖ్యముగ భజింపుము.

విశ్వేషు సర్వేషు చ విశ్వధామ్నః సన్త్యేవ శశ్వద్విధివిష్ణురుద్రాః ।
తేషాం చ సంఖ్యాః శ్రుతయశ్చ దేవాః పరం న జానన్తి తమీశ్వరం భజ ॥

సకలవిశ్వాధారుడైనపరమేశ్వరుని సర్వలోకములలో నెందఱో బ్రహ్మలు, విష్ణువులు, రుద్రులు నివసించుచున్నారు. శ్రుతులు, దేవతలుగూడ వారి సంఖ్యను లెక్కింపజాలరు. అట్టి పరమేశ్వరుడైనశ్రీకృష్ణుని నీ వారాధింపుము.

కరోతి సృష్టిం స విధేర్విధాతా
విధాయ నిత్యాం ప్రకృతిం జగత్ప్రసూమ్ ।
బ్రహ్మాదయః ప్రాకృతికాశ్చ సర్వే
భక్తిప్రదాం శ్రీం ప్రకృతిం భజన్తి ॥

విధాతలకే విధాతయైన యీ పరమేశ్వరుడు జగత్ప్రసవినియు, నిత్యస్వరూపిణియు నగుప్రకృతిని బ్రకటించి యసంఖ్యజగములను సృష్టించెను. బ్రహ్మాదిదేవత లందఱు నా ప్రకృతినుండి పుట్టినవారే. వారు భక్తిప్రదాయిని యగు శ్రీప్రకృతిని సేవించుచుందురు.

బ్రహ్మస్వరూపా ప్రకృతిర్నభిన్నా
యయా చ సృష్టిం కురుతే సనాతనః ।
స్త్రియశ్చ సర్వాః కలయా జగత్సు
మాయా చ సర్వే చ తయా విమోహితాః ॥

ప్రకృతి బ్రహ్మస్వరూపమే, అది బ్రహ్మముకంటె భిన్నముకాదు. ఆ శక్తిమూలమున సనాతనపురుషుడైనపరమాత్మ యీ జగములను సృష్టించుచున్నాడు. ప్రకృతికళలనుండియె ప్రాపంచికస్త్రీ లందఱు ప్రకటులైరి. ప్రకృతియె మాయ. దానిచే సర్వజీవులు మోహితు లగుచున్నారు.

నారాయణీ సా పరమా సనాతనీ
శక్తిశ్చ పుంసః పరమాత్మనశ్చ
ఆత్మేశ్వరశ్చాపి యయా చ శక్తిమాం-
స్త్వయా వినా స్రష్టుమశక్త ఏవ ॥

సనాతని యగునా పరాప్రకృతి నారాయణి యనిచెప్పబడినది. ఏలయన అది పరమపురుషు డగునారాయణుని శక్తి. సర్వాత్ము డగునీశ్వరుడుగూడ దానిచేతనే శక్తిమంతు డగుచున్నాడు. ఆ శక్తి లేనిదె అతడు సృష్టిచేయ జాలడు.

వత్సా! నీ వీసమయమున బ్రహ్మలోకమునకు జని వివాహమాడుము. నీతండ్రియొక్క యాదేశమును పాలింపవలసినదిగ నిన్నాజ్ఞాపించుచున్నాను. ఏపురుషుడు ప్రేమతో, వస్త్రములతో, నలంకారములతో, జందనాదిసుగంధ ద్రవ్యములతో దనభార్యను సత్కరించునో, యతనియందు బ్రకృతి సంతుష్టురాలు కాగలదు. ప్రకృతియే సర్వలోకములయందు దనకళలచే స్త్రీరూపమున బ్రాదుర్భవించెను. "యోషితేమపమానేన ప్రకృతేశ్చ పరాభవః ॥" అందువలన మహిళలను నిరాదరించి యవమానించిన సాక్షాత్ప్రకృతి దేవియే యవమానింపబడగలదు. పతిపుత్రయుక్త యైన, సాధ్వియైన స్త్రీని బూజించిన నాపూజలవలన సర్వమంగళప్రదాయని యైన ప్రకృతియొక్క పూజ సంపన్నము కాగలదు. ఆప్రకృతియే పూర్ణబ్రహ్మస్వరూపిణి. ఆదేవినే సనాతనియగువిష్ణుమాయయని భక్తులు కీర్తింతురు. ఆమె సృష్ట్యాదియం దైదురూపముల బ్రాదుర్భవించెను. ఏదేవి పరమాత్ము డగు శ్రీకృష్ణుని ప్రాణముల కధిష్ఠాత్రియో, సమస్తప్రకృతులయం దందఱికంటె నాయన కధికప్రియురాలో యయ్యాదిప్రకృతినామధేయమే శ్రీరాధాదేవి. రెండవప్రకృతి సర్వసంపత్స్వరూపిణి. శ్రీమన్నారాయణప్రియ శ్రీమహాలక్ష్మి. మూడవప్రకృతి సదా సర్వులచే బూజనీయురాలైన వాణి కధిష్ఠాత్రి సరస్వతి. నాల్గవప్రకృతి బ్రహ్మప్రియపత్నియైన, సర్వవందితురాలై నసావిత్రి. ఐదవప్రకృతి హరిమాయాస్వరూపిణి యైనమహాదేవుని ప్రియార్ధాంగి, జగన్మాత యగుదుర్గ. దుర్గాదేవియందు శ్రీకృష్ణాంశసంభూతు డై నకుమారుడే సకలారాధ్యు డై నగణేశ్వరుడు.

ఇది శ్రీమదాంధ్ర బ్రహ్మవైవర్త మహాపురాణములోని
బ్రహ్మఖండములో సౌతిశౌనక సంవాదమున
పరమాత్మస్తుతి – తత్స్వరూపమాయా
స్వరూపవర్ణన మను ముప్పదియవ
అధ్యాయము సర్వము
సంపూర్ణము.

ఇది శ్రీకృష్ణపరమాత్మ చరణారవింద మిళిందాయమాన మానసత్వ
మహావైభవసంపన్నులు, పారాశర్యగోత్రికులు, వైశ్యశ్రేష్ఠులు,
గర్తపురీనివాసులు నగు శ్రీమట్టుపల్లి వేంకటమహాలక్ష్మి
జగన్నాథుల తనూభవుడు, భక్తజనదాసానుదాసుడు,
సుజనవిధేయుడు నగుశివసుబ్బరాయగుప్త
నామధేయప్రణీతంబైన శ్రీమదాంధ్ర
బ్రహ్మవైవర్త మహాపురాణము
లోని బ్రహ్మఖండము
సర్వము
సంపూర్ణము.

—♦—